ఆంధ్రప్రదేశ్

సెప్టెంబరు 1971

50 పైసలు



ఆంధ్రప్రదేశ్ గురించి

* 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2,75,109 చ.కి. మీటర్లు.

* 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా, 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

* 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1971 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 29.35. 1961 లో 24.03 శాతం.

* మనరాష్ట్రంలో జనాభా సాంద్రత చ.కి.మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ.కి.మీ. 1కి, 362. అన్నిజిల్లాలకంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది అన్నింటి కంటె యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281 లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ.306లు మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటున ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నులబొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారత దేశంలో, బారైట్స్ వుత్పత్తిలో ఆంధ్ర ప్రదేశ్ దే అగ్రస్థానం. దేశంలో వుత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో వుత్పత్తి అవుతున్నది.

* అభ్రకం వుత్పత్తిలో బీహారు, రాజస్తాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్ ది.

ఆంధ్రప్రదేశ్

సెప్టెంబరు, 1971

(భాద్రపద–ఆశ్వీయుజ 1893 శా. శ)

సచిత్ర మాస పత్రిక

సంపుటి: 15 సంచిక: 8

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి

ముఖచిత్రం:
బిద్రీ కళా కౌశలం

మూడో అట్ట:
ఉదయకాల నదీయాత్ర

చివరి అట్ట:
సర్వోదయ సాధుమూర్తి

త్వరలో
[ఆ నాటి తెలుగు ప్రజల ఐక్యతాగాథ]
ఓరుగల్లు పునరాక్రమణ
చారిత్రిక నవల
* క్రొత్త సీరియల్ *

వెల : 50 పైసలు

సాలు చందా: 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 133

ఈ సంచికలో

పేజీ

ఆ మహాపురుషుల అడుగుజాడల్లో......

దశాబ్దాలపాటు ఆంధ్ర రాజకీయ రంగాన్ని ప్రభావితం చేసిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారి శతజయంతి యీ యేడు ఆగస్టు 23వ తేదీన ప్రారంభమైంది. తమ ప్రియ నాయకుడుగా ప్రజలు ఆయనపట్ల ప్రదర్శించిన గౌరవాభిమానాలు సాటిలేనివి. ప్రజలు ఆయనను ఆరాధ్య దైవంగా ప్రేమించారు ; ఆయన చేసిన పొరపాట్లను సైతం పట్టించుకోలేదు; ధైర్య సాహసాలు మూర్తీభవించిన దేవతా పురుషునిగా ఆయన్ను ఆదరించారు. ఆయన ఏ ఒక్క దానికీ కట్టుబడి వుండని స్వతంత్రతా మూర్తి. నిజంగానే ప్రకాశంగారిలో సింహగాంభీర్యం వుండేది. ఆ రాజఠీవి ప్రదర్శించేవాడు. " ఆంధ్ర కేసరి '' అనే బిరుదు ఆయనకు అక్షరాలా వర్తిస్తుంది.

మద్రాసుకు సైమన్ కమిషన్ వచ్చిన సందర్భంగా. తత్ప్రతిఘటనోద్యమంలో బ్రిటిష్‌వారి తుపాకీ గుండ్లకు ఎదురొడ్డి నిలిచిన నాటి నుండి ఆయన పేరు ధైర్యానికి పర్యాయపదంగా ప్రజల మనస్సుల్లో నిలిచిపోయింది. ఆయన కేవల మానవుడు కాడు ; మహాపురుషుడు. ఎవరి అడుగులకు మడుగు లొ_ స్వభావం కాదు. అందుకే పెద్ద పెద్ద వారితో తలపడవలసి వచ్చింది. ఆయన ధైర్యశాలి మాత్రమే కాదు ; ఔదార్య మూర్తి కూడా. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పరిపాలనలో కొత్త కొత్త మెళకువలు ఆయన చూపించాడు. అలాగే ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా. ఆరంభంలోనే ఒక కొత్త రాష్ట్రం అందరి దృష్టిని ఎలా ఆకర్షించాలో ఆయన చూపించాడు.

భయమనే మాట ఆయన నిఘంటువులోనే లేదు ; ఆయన దృష్టిలో జీవితమంటే, కష్టనష్టాలను లక్ష్యపెట్ట కుండా, పదవులకు ప్రాకులాడకుండా ప్రజాసేవ చేయడం. అటువంటి నాయకుడి ఆదర్శాల అధ్యయనం ద్వారా యువ తరం ఉత్సాహం పొందాలి. ఆ మహాపురుషుని శతజయంతి ఉత్సవాల నిర్వహణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సంఘాన్ని ఏర్పాటుచేసి ఒక లక్ష రూపాయలు మంజూరుచేసింది. రాష్ట్ర శాసనసభా భవనం సమీపంలోగల ప్రకాశంగారి నిలువెత్తు విగ్రహాన్ని ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి పుష్పమాలాలంకృతం చేయడంతో ఆంధ్రకేసరి శతజయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చిన్నతనం నుంచీ కూడా ప్రకాశంగారి చేత బాగా ప్రభావితుడైనట్టి వారు మన ముఖ్యమంత్రి. ఉభయులూ, దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గార్ల వంటి ఉద్దండ నాయకుల జన్మస్థానమైన గుంటూరు సీమకు చెందినవారే

ఈ యేడు మనదేశంలో మరొక మహాదేశభక్తుడు, మహర్షి అయిన శ్రీ అరవిందుల శతజయంత్యుత్సవాలు కూడా జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో వీటి నిర్వహణకు కూడా ఒక సంఘం ఏర్పాటు చేయబడుతున్నది. శ్రీఅరవిందులు 1872 ఆగస్టు 15వ తేదీన జన్మించారు. ఆయన ఎంత పండితుడో అంత విప్లవ మూర్తి. చైతన్యవంతమైన రాజకీయ జీవితం వదలివేసి శ్రీ అరవిందులు పాండిచెరిలో ఆశ్రమం స్థాపించుకుని, ఆధ్యాత్మిక రంగంలో ప్రపంచస్థాయి మహాపురుషుడైనాడు. శ్రీ అరవిందులు భారత జాతీయ మహోద్యమ సమ్యక్‌ద్రష్ట. భారతదేశ లక్ష్యం సంపూర్ణ స్వాతంత్ర్యమేనని నిర్భయంగా ప్రకటించిన ప్రథమ రాజకీయ నాయకుడు ఆయనే. "ఒక జాతికి రాజకీయ స్వాతంత్ర్యం ప్రాణం వంటిది" అని ఉద్ఘాటించారు శ్రీ అరవిందులు. రాజకీయ రంగంలో పనిచేస్తున్నప్పుడు కూడా ఆయన "యోగాభ్యాసం చేస్తుండేవారు; తనదైన ఒక ఆధ్యాత్మిక జీవితం గడుపుతుండేవారు. అయినప్పటికీ ఆయన బహిర్జీవితంతో యీ అంతర్మథన వేరుపడి వుండేది కాదు. నిజానికి ఆ రెండూ ఒకటే. భవిష్యత్తులో, భారత దేశానికీ, మానవ జాతికీ ఆధ్యాత్మిక ఔన్నత్యం కల్పించడానికై ఆయన చేయబూనిన మహాకృషికి ఆ రెండూ అంగాలే"

1910 నుండి భౌతికకాయం చాలించే వరకు శ్రీ అరవిందులు తమ ఆశ్రమ భూమిగా చేసుకున్న పాండిచెరి, మాతృశ్రీ ఆధ్వర్యంలో నేడొక మహోన్నతమైన అధ్యాత్మిక కేంద్రంగా రూపొందింది. ప్రపంచం నాలుగుమూలల నుండి సత్యాన్వేషకులు ఆ ప్రశాంత ప్రదేశానికి నేడు తీర్థప్రజగా వచ్చి పోతున్నారు. అక్కడ " ఆరోవిలీ " అనే అంతర్జాతీయ నగరం నిర్మిత మవుతున్నది. అదే యావత్ ప్రపంచానికి శాంతి జ్ఞానకాంతి ప్రదాతగా, ఆధ్యాత్మిక విజ్ఞానం వెదజల్లే వెలుగు స్తంభంగా రాబోయే తరతరాల మానవాళికి దర్శనమిస్తుంది.

శ్రీ అరవిందులు, శ్రీ ప్రకాశం అపూర్వ ధైర్య సాహసాలనే సమాన లక్షణం కల మహావ్యక్తులు. ఈ శత జయంత్యుత్సవాల సందర్భంగా, ఆ దేశభక్తులను స్మరించుకుంటూ, వారు విశ్వసించిన ఆదర్శాలను విస్తృతంగా వ్యాపింపజేస్తూ, వారి అడుగుజాడల్లో నడుద్దాం.


—పి. వి. ఆర్.

మన రాష్ట్రపతి
శ్రీ వి. వి. గిరి

"మార్గబంధు"

ఆరంభింపరు నీచ మానవులు
విఘ్నాయాస సంతప్తులై
ఆరంభించి పరిత్యజింతురు
విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్న నిహన్యమానులగుచున్.
ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమా
ప్రజ్ఞానిధుల్ కావునన్ ॥

—భర్తృహరి.



ఈ ప్రజ్ఞానిధుల కోవలోనికి చెందిన ధీరుడు శ్రీ వరాహగిరి వెంకటగిరి. అందుచేతనే ఎన్ని కష్టనష్టాలను ఎదుర్కొన వలసి వచ్చినా, వెనుకంజ వేయని ప్రజ్ఞానిధి. ఇతడు పెద్ద అంతస్తులో మనిషి—ఇతడు సామాన్యుడు అనే భేదం ఈయన పాటించరు. ఒక వ్యక్తికి అన్యాయం జరిగినప్పుడు, ఆ అన్యాయాన్ని తొలగించడం, కష్టాలలో వున్న వ్యక్తిని ఆదుకొనడం ఆయనకు చిన్నప్పటినుంచి వచ్చిన సహజ లక్షణాలు. అందుకనే ఆయన ప్రజల మనిషి—న్యాయశాస్త్రరంగంలో దిగ్గంతులవంటి మేధావుల ప్రశంసల నందుకొని, తన న్యాయశాస్త్ర పరిజ్ఞానమును, మహాత్ముని అడుగు జాడలలో సామాన్యుల సేవకు వినియోగించిన మహోన్నత వ్యక్తి శ్రీ గిరి. అందుచేతనే ఆయన వ్యక్తిత్వముపై ఎవ్వరికీ రెండు అభిప్రాయాలు లేవు. భారత ప్రజానీకపు భవితవ్యాన్ని తీర్చి దిద్దుటలో అహోరాత్రములు నిర్విరామముగా కృషిచేసిన దేశ భక్తుడు శ్రీ గిరి. హరిజనులయెడ ఆయనకు వుండే ఆప్యాయతకు గుర్తుగా ఇక్కడ ఒక చిన్నసంఘటన చెప్పవలసివుంది. అవి స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా సాగే రోజులు. అమలాపురంలో ఒక సంపన్న గృహస్థు కాంగ్రెసు పెద్దలతో గిరిగారిని విందుకు పిలిచాడు. విందు ప్రారంభం కావడానికి అట్టే వ్యవధి లేదు. కాని, ఆ విందులో పాల్గొనడానికి ఆయనతోనే వున్న ఒక హరిజన నాయకుని (ఈనాడుఈయన కేంద్ర ప్రభుత్వములోముఖ్యమైన శాఖకు మంత్రిగా వున్నారు) పిలువలేదు. వెంటనే శ్రీ గిరి ఆయననుకూడా విందుకు ఆహ్వానించితేనే ఆవిందులో పాల్గొంటాననీ, లేకుంటే తాను పాల్గొనజాలననీ నిర్మొహమాటంగా చెప్పారు. వెంటనే ఆ హరిజన నాయకుని వద్దకు ఆ గృహస్థు వెళ్ళడం, సాదరముగా ఆయనను ఆహ్వానించడం, శ్రీ గిరి ఆ విందులో పాల్గొనడం జరిగింది. (ఈ విషయాన్ని ఇటీవల నాకు శ్రీ గిరి బాల్య స్నేహితుడైన శ్రీ నాభి రామకృష్ణరావుగారు బరంపురంలో చెప్పడం జరిగింది.) స్వాతంత్ర్య సమరపు తొలిరోజులలో జరిగిన ఈ సంఘటన హరిజనుల యెడ ఆయనకుండే ప్రేమకు మచ్చుతునక ! బహుశా ఈ విషయం, (మహాత్ముని వారసులమనుకునే) అనేకమంది పెద్దలకు తెలిసివుండదు! హరిజనుల హక్కుల పరిరక్షణకై అనేక చట్టాలను చేయడం మనందరికీ తెలిసినదే. అది ఈ సంఘటన జరిగిన ఎన్నో సంవత్సరాల తరువాతనే జరిగినది. అందుకనే ఆయిన ఆనాటి నుంచి దళితవర్గాల ప్రతినిధిగా అందరి ఆదరాభిమానాలనూ పొందగలిగారు.

వరాహగిరి వెంకటగిరి 1894 ఆగస్టు 10 తేదీన బరంపురంలో జన్మించారు. తండ్రి జోగయ్య పంతులుగారు పేరు మోసిన లాయరు. ఈయన క్రీ. శ. 1900 నుంచీ కాంగ్రెసు సమావేశాలకు హాజరవుతూ, (స్వరాజ్య పార్టీలో ప్రముఖ సభ్యులుగా వుంటూండే వారు ఆయన) స్వరాజ్య పార్టీలో ప్రముఖ సభ్యులుగా వుంటూ 1927 నుండి 1930 వరకూ పండిత్ మోతీలాల్ నెహ్రూ నాయకత్వమున సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు కాంగ్రెసు పార్టీ తరఫున సభ్యులుగా ఎన్నుకొనబడినారు. అదే సమయములో, శ్రీ గిరి మద్రాస్ లేజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యులై, మంత్రిగా ఎన్నుకోబడినారు.

మేనమామ శ్రీ డి. విశ్వనాథరావు గారి నాయకత్వమున తన 12వ యేటనే యువజన గ్రంథాలయ సమితిని స్థాపించి, మన

దేశములో గ్రంథాలయోద్యమ నాయకులలో ఒకరైనారు అదే విధముగా శ్రీ తిలక్ 'పైసానిధి' ని ఆదర్శముగా తీసుకొని బీదల సహాయమునకు 'ఛారిటీ ఫండ్ అసోసియేషన్' నెలకొల్పారు.

సీనియర్ కేంబ్రిడ్జి పరీక్షలో ఉత్తీర్ణులైన తరువాత 1913లో న్యాయ శాస్త్రాధ్యయనమునకు యునైటెడ్ కింగ్‌డమ్ వెళ్లారు. ఐర్లెండులోని నేషనల్ యూనివర్సిటీలో చేరి న్యాయశాస్త్రములో ఉత్తీర్ణులైనారు. డబ్లిన్‌లో శ్రీ గిరి భారతీయ విద్యార్థి సంఘమును స్థాపించి సమర్థతతో నిర్వహించారు. ఆ రోజులలో 'దక్షిణాఫ్రికా దురంతములు' అనే కరపత్రమును తయారుచేసినందుకు ఇండియన్ పీనల్ కోడ్ 124-ఎ, 153 ల ప్రకారము శ్రీ గిరిని ప్రాసిక్యూట్ చేయుటకు బ్రిటిషు ప్రభుత్వము ఆ కరపత్రమును ప్రచురించిన ప్రచురణకర్తపై ఒత్తిడి తీసుకువచ్చింది. కాని, దేశభక్తుడైన ఆ ప్రచురణకర్త ముందుగానే శ్రీ గిరిని హెచ్చరించుటచే అప్రమత్తతతో శ్రీ గిరి తగు జాగ్రత్త వహించ గలిగారు. తన 19వ ఏటనే ఆయన భారత స్వాతంత్ర్య పోరాటములో బ్రిటిషు ప్రభుత్వపు దమననీతిని ఎదుర్కొనవలసి వచ్చింది.

బహిష్కరణ

ఐర్లెండులో 1916లో ఈస్టర్ విప్లవము ప్రారంభమైనప్పుడు మిలటరీ వారంటు శ్రీ గిరిపై జారీచేయబడి ఆయన నివాస గృహము పోలీసులచే శోధించబడినది. కాని, అభ్యంతరకరమైన వేవీ పట్టుబడక పోవుటచే ఆయనను జైలులో పెట్టలేక 1916 జూలై 1 నాటికి యునైటెడ్ కింగ్‌డమ్‌ను వదిలి వెళ్ళిపోవలసినదిగా ఆదేశించారు. అందుచేతనే ఆయన అమెరికాలోని ఫిలడెల్ఫియాలో న్యాయశాస్త్రములో డాక్టరేటు పట్టా పొందవలెననే ప్రయత్నమును విరమించుకొనవలసి వచ్చినది.

శ్రీ గిరి 1916 లో భారతదేశమునకు తిరిగివచ్చి మద్రాసు హైకోర్టులో శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి క్రింద జూనియర్‌గా పనిచేయ నారంభించారు. ప్రకాశం పంతులుగారు శ్రీ గిరి తండ్రిగారైన జోగయ్య పంతులుగారి సహాధ్యాయులు. ఆ నాటి మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ గిరికి న్యాయస్థానములో ఒక ఉన్నత పదవిని ఇవ్వగా ఆయనకు తన కృతజ్ఞతను తెలియజేస్తూ "భారత దేశము పరాయి ప్రభుత్వము క్రింద వుండగా తాను బ్రిటిషు ప్రభుత్వము క్రింద ఎట్టి పదవినీ అంగీకరించనని" శపథముచేసి, ఆ ఉద్యోగము తనకు వద్దని నిరాకరించారు. లాయరుగా మంచి పేరు ప్రఖ్యాతులు ధనము ఆర్జించే సమయములో ఆయన స్వాతంత్ర్య సమరములో పాల్గొనుటకై న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పారు.

1918 లో ఆయన వ్యక్తి సత్యాగ్రహములో పాల్గొన్నారు. 1917 నుండి 1922 వరకు శ్రీ గిరి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులు. అటు తరువాత ఆయన కార్మికోద్యమములో అహోరాత్రములు కృషి చేయనారంభించారు. అసహాయోద్యమమునకై గాంధీజీ పిలుపు ఇచ్చినపుడు ఆయన అడుగుజాడలలో నడచిన మొట్టమొదటి వ్యక్తులలో శ్రీ గిరి ఒకరు. తల్లిదండ్రులతోను, సోదర సోదరీ మణులతోను 1922 లో శ్రీ గిరి బరంపురంలోని కల్లు దుకాణాలను పికెట్ చేశారు. ఆ విధముగా శ్రీ గిరి కుటుంబములోని వారందరూ స్వాతంత్ర్య సమరములో పాల్గొన్నారు. 1922 లోను అటు తరువాత మహాత్మా గాంధీ నడిపిన జాతీయోద్యమములన్నిటిలోనూ వరాహగిరి కుటుంబమువారు ప్రముఖమైన పాత్ర వహించారు.

ట్రేడ్‌యూనియన్ నాయకుడు

ఆయన జైలునుండి విడుదలకాగానే జైలుగేటువద్ద బెంగాల్, నాగపూర్ రైల్వే కార్మికులు వారికై వేచియుండి ఘనమైన స్వాగతమిచ్చి తమ ఆర్థిక సమస్యల పరిష్కారమునకు నాయకత్వము వహించవలసినదిగా ఆయనను కోరారు. జాతీయోద్యమములో ఒక భాగముగా కార్మికోద్యమమును నడిపించవలెనని ఒక నిశ్చయమునకువచ్చి 1922 లో శ్రీ గిరి బి. ఎన్ రైల్వే భారత లేబర్ యూనియన్‌కి అధ్యక్షులైనారు. అటు తరువాత ఈస్ట్ ఇండియా రైల్వే, యమ్ యస్ యమ్. రైల్వే, నైజామ్ స్టేట్ రైల్వే, మైసూర్ స్టేట్ రైల్వే పనివారల సంఘములను సంఘటితపరచి వాటికి అధ్యక్షులుగా ఎన్నుకొనబడినారు. ఆ విధముగా ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ 1924 లో అవతరించింది.

భారత దేశములోని రైల్వే పనివారలందరికీ శక్తివంతమైన ఒక యూనియన్ యేర్పడింది. ఆ విధముగా భారత దేశములో ట్రేడ్ యూనియన్ ఉద్యమము ప్రారంభమయింది. గాంధీజీ మూల సిద్ధాంతములైన సత్యాహింసలు ప్రాతిపదికగా శ్రీ గిరి మార్గదర్శకత్వమున భారత దేశములోని రైల్వే పనివారలకు ధ్రువతారగా మహత్తరమైన జాతీయోద్యమము శక్తిని పుంజుకొన్నది.

1926 లో శ్రీ గిరి ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మద్రాస్ సమావేశములో ఎన్నుకోబడినారు.

అనేక ఇబ్బందులకు, బెదిరింపులకు గురికావలసివచ్చినా శ్రీ గిరి కార్మికుల సంక్షేమం ఎడల పట్టుదలతో, అచంచల విశ్వాసముతో పోరాడి విజయమును సాధించారు. ఎవరికి అన్యాయము జరిగినా న్యాయమును సమకూర్చేవరకు విశ్రమించని మహోన్నత వ్యక్తి శ్రీ గిరి.

భారత దేశములోని శ్రామికుల ప్రతినిధిగా 1927లో జెనీవాలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక మహాసభలో పాల్గొని వారి హక్కుల రక్షణకై ప్రతిభావంతముగా వాదించి విజయము సాధించారు.

తొలి రౌండ్ టేబుల్ సమావేశములో పాల్గొనుటకు శ్రీ గిరికి ఆహ్వానమువచ్చినా గాంధీజీ దానిలో పాల్గొన నిరాకరించుటచే ఆయనకూడా పాల్గొనలేదు. రెండవ రౌండ్ టేబుల్ సమావేశమునకు గాంధీజీ పాల్గొనినప్పుడే తాము కూడా పాల్గొనుటకు అంగీకరించారు.

1935 లో రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీ గిరి, ధనవంతుడు, బలవంతుడు అయిన జస్టిస్ పార్టీ అభ్యర్థి శ్రీ బొబ్బిలి రాజాను 6,666 వోట్ల మెజారిటీతో ఓడించారు.

మద్రాస్ రాష్ట్రములో రాజాజీ మంత్రి వర్గములో శ్రీ గిరి కార్మిక, పారిశ్రామిక, సహకార, హరిజనోద్ధరణ శాఖల మంత్రిగా అతి సమర్థతతో తమ విధిని నిర్వహించారు. పరిపాలనా దక్షుడుగా

పక్షపాతరహితముగా వ్యవహరించి శ్రీ గిరి అన్ని వర్గముల వారి మన్ననలను అందుకోగలిగారు.

కారాగార శిక్ష

1939 లో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతను నెలకొల్పబడిన నేషనల్ ప్లానింగ్ కమిటీకి కన్వీనరుగా శ్రీ గిరి వ్యవహరించారు. 1940 జనవరిలో ఆయన అరెస్టు చేయబడి 15 నెలల కారాగార శిక్ష అనుభవించారు 1941 మార్చిలో విడుదల కాబడి తిరిగి 'క్విట్' ఇండియా ఉద్యమములో పాల్గొని 1942 ఆగస్టు 17 వ తేదీన తిరిగి నిర్బంధించబడినారు. పెరంబూరుకోని రైల్వే కార్మికులను ఉద్దేశించి బ్రిటిషు ప్రభుత్వముతో సహకరించవద్దని చెప్పుతూ వుండగా ఆగస్టు 17 వ తేదీ ఉదయం తిరిగి అరెస్టు చేయబడినారు.

1946_47 లో శ్రీ గిరి తిరిగి మద్రాస్ రాష్ట్రపు మంత్రి అయ్యారు. కాని ప్రకాశం మంత్రి వర్గముతో పాటు శ్రీ గిరి కూడా రాజీనామా యిచ్చారు. మద్రాస్ రాష్ట్రపు కాంగ్రెస్ పార్టీకి శ్రీ ప్రకాశం రాజాజీలు, పోటీ పడినప్పుడు రాజీ అభ్యర్థిగా శ్రీ గిరిని నిలువ వలసినదిగా కోరగా, ప్రకాశం గారిని సమర్థిస్తూ శ్రీ గిరి దానికి అంగీకరించలేదు శ్రీ ప్రకాశం గారి యెడల ఆయనకుండే గౌరవము అటువంటిది. పార్టీఎన్నికల నిర్వాహకులుగా తన నిష్పాక్షికదృష్టితో శ్రీగిరి ప్రతికక్షుల మన్ననలనుకూడా అందుకోగలిగారు.

మనకు స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత శ్రీ గిరి సిలోన్‌కు మొదటి హైకమిషనర్‌గా నియమించబడినారు. సిలోన్ లోని భారతీయుల సమస్యల పరిష్కారమునకు ఆయన ఎనలేని సేవ చేసినారు 1951 లో హైకమిషనర్ పదవి విరమణ చేయునప్పుడు శ్రీ నెహ్రూ "తాను విశ్వసించిన దానిని సమర్థవంతముగా కొనసాగించగల దిట్ట. ఎదుటివారి అభిప్రాయములను సహృదయముతో అర్థము చేసుకొనే సరసుడు", అని శ్రీ గిరిని అభినందించారు. అటు తరువాత 'బ్యాంకు అవార్డు' విషయములో కేంద్ర కార్మికమంత్రి పదవిని తృణ ప్రాయముగా త్యాగముచేసిన ధీరోదాత్తుడు శ్రీ గిరి.

"గిరిగారు వెళ్లితే అరి దొరుకుతుందా"

1957లో శ్రీ గిరి ఉత్తరప్రదేశ్ గవర్నరుగా నియుక్తులయ్యారు. "రాజ్యాంగమునకు లోబడి గవర్నరు రాష్ట్ర పరిపాలన సమర్థవంతముగా కొనసాగుటకు ఎంతగానో తోడ్పడవచ్చును." అని నొక్కి వక్కాణించారు. అటుతరువాత ఒక దశాబ్దము పాటు ఆయన ఉత్తరప్రదేశ్, కేరళ, మైసూరు రాష్ట్రములకు గవర్నరుగా వున్నప్పుడు ఈ మాటలను తు. చ. తప్పకుండా పాటించి ఆయా రాష్ట్ర ప్రజల మన్ననలను, ఆదరాభిమానములను చూరగొన్నారు. కేరళ గవర్నరుగా శ్రీ గిరి పదవీ విరమణచేసి వెళ్లబోయేముందు చెప్పులు కుట్టే ఒక బీద వ్యక్తి "గిరిగారు వెళ్లుతున్నారు-మరినాకు అరి-అంటే మళయాళం భాషలో బియ్యం అని అర్థం- దొరుకుతుందా ?" అని వాపోయాడు ! శ్రీ గిరి వ్యక్తిత్వమునకు, పేద ప్రజలపై ఆయన అనురాగమునకు ఇది మచ్చు తునక !!!

1967 లో నాల్గవ సామాన్య ఎన్నికల తరువాత భారత దేశపు ఉపరాష్ట్రపతిగా శ్రీ గిరి ఎన్నుకోబడినారు. రాజ్యసభ సభాపతిగా అతి సమర్థతతో, సద్భావముతో, అన్ని పక్షములవారి ఆదరాభిమానములను ఆయన అందుకో గలిగినారు.

రాజనీతిజ్ఞుడు, మేధావి, దేశభక్తుడు అయిన శ్రీ తెన్నేటి విశ్వనాథం చెప్పినట్లు "శ్రీ గిరి స్నేహ సంపద, సౌజన్యత మూర్తీభవించిన వ్యక్తి- హుందాగా వ్యవహరించదగిన కొద్ది మందిలో ఆయన ఒకరు."

భారత రాష్ట్రపతిగా పనిచేసి, అదే పదవికి సర్వపక్షముల సహకారముతో అభ్యర్థిగా నిలిచిన శ్రీ గిరికి యావద్భారత ప్రజానీకపు శుభాకాంక్షలు వుండగలవని నిస్సందేహముగా చెప్పవచ్చును.

నిరంతర అన్వేషణ

చారిత్రిక ప్రథమ ప్రభాత వేళ భారత దేశం తన అనంతాన్వేషణకు ఉపక్రమించింది. ఈ చిరాన్వేషణలో మన దేశం చేసిన మహత్తర కృషితోనూ, పొందిన ఘన విజయాలతోనూ పరాజయాలతోనూ అసంఖ్యాక శతాబ్దాల చరిత్ర నిండి పోయింది. అదృష్టం ఆకాశాని కెత్తిననాడూ, దురదృష్టం పాతాళానికి పడ ద్రోసిననాడూ, ఎన్నడూ మన దేశం అన్వేషణను గానీ, తనకు శక్తిని ప్రసాదించే ఉన్నతా దర్శాలను గానీ మరచి పోలేదు.

—నెహ్రూ

జిల్లా కలెక్టర్ల సమావేశం


ముఖ్యమంత్రి ప్రసంగం

జిల్లా కలెక్టర్లు, జిల్లా రెవిన్యూ అధికారుల సమావేశం హైదరాబాదులో జూలై 9 నుంచి మూడు రోజులపాటు జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిపాలనను మెరుగుపరచడానికి, అభివృద్ధిని త్వరితం చేయడానికి తీసుకోవలసిన వివిధ చర్యలను గురించి చర్చించారు. ఎక్కువగా, బలహీనవర్గాల అభ్యుదయానికి సంబంధించిన పథకాలను అమలు చేసే విషయం గురించే చర్చలు కొనసాగాయి. గ్రామీణ నిర్మాణ కార్యక్రమాలను కంట్రాక్టర్ల ద్వారాకాక నిరుద్యోగులైన యింజనీర్ల ద్వారా జరిపించాలనీ, పరిపాలనా వ్యవహారాలలో జాప్యం తగ్గించేందుకై అధికార వికేంద్రీకరణ వంటి చర్యలు గైకొనాలనీ నిర్ణయించబడింది. 1969 నవంబరు నుండి యిప్పటివరకు 10లక్షల ఎకరాలకు పైగా బంజర్లు బీదవారికి యివ్వబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని 1972 మార్చి వరకు పొడిగించాలని నిశ్చయించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభ్యుదయం సాధించడానికీ, పారిశ్రామిక వాడలను ఎక్కువగా వినియోగించుకునే ఏర్పాట్లు చేయడానికీ సంబంధించి తగు నిర్ణయాలు తీసుకున్నారు.

"మనం సాధించాల్సిన సమస్యలు ఎన్నో వున్నాయి. ఎన్నోగురుతర బాధ్యతలను మనం నిర్వర్తించాల్సివుంది. ఇవి ఎంతో కష్టసాధ్యమైనవీ, అశేషమైన శ్రమవ్యయాదులకోర్చి చేయవలసినవీనూ. ఈ బృహత్తర కార్యాలను చేపట్టడానికి మన కున్న వ్యవధి చాలా పరిమితమైనది. రోజులు గడచేకొద్దీ మనకున్న వ్యవధి కూడా తరిగిపోతున్నది" అన్నారు ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి జూలై 9 న కలెక్టర్ల సమావేశంలో ప్రసంగిస్తూ. ఆయన తమ ప్రసంగంలో యింకా యిలా అన్నారు.

"అనేక రంగాలలో మనం చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించామనడంలో ఎలాటి సందేహమూలేదు. వ్యవసాయరంగంలో సస్య విప్లవాన్ని ప్రారంభించడంతోనూ, రాష్ట్రాన్ని క్రమక్రమంగా పారిశ్రామికీకరణ చేయడంతోనూ మన పల్లెలు, పట్టణాలు నిస్సందేహంగా సౌభాగ్యవంతము, ఐశ్వర్యవంతమూ అయ్యాయని చెప్పవచ్చు. అయితే మనం సాధిస్తున్న యీ ప్రగతి ఫలితాలు సమానంగా పంపిణీ కావడంలేదు. ఈ విషయం యిప్పుడు బాగా గుర్తింపబడింది. స్వాతంత్ర్యం వచ్చిన పాతికేళ్ళ తర్వాత కూడా మన దేశంలో ఈ ఐశ్వర్య ఫలాలను అందుకోలేని అట్టడుగు ప్రజలు అనేక వర్గాల వారెందరో వున్నారు.

గిరిజనులనే తీసుకోండి. శతాబ్దాల తరబడి వారిని అలక్ష్యం చేయడంవల్ల వాళ్ళ ఆర్థిక స్థితిగతులు అంతంతమాత్రంగానే వుండిపోయాయి. సాంఘికంగా వెనుకబడిపోయారు. స్వాతంత్ర్యం



జిల్లా కలెక్టర్ల, రెవిన్యూ అధికారుల సమావేశాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నరు

వచ్చిన తర్వాత వీరి అభ్యుదయానికి కొంత కృషి జరగడమైతే జరిగింది గాని అది సరిపోలేదు. ఆర్థికంగానూ, సాంఘికంగానూ వీరి వెనుకబడిన తనం వల్లనే వీరివల్ల శాంతి భద్రతలకు కొంత అంతరాయం కలిగింది. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి పరచవలసిన అవసరం, షెడ్యూలు జాతుల సంక్షేమాన్ని మెరుగుపరచవలసిన అవసరం యిటీవలి కాలంలోనే సరిగా గుర్తించబడింది. గతంలో మనం వ్యర్థపుచ్చిన కాలాన్ని యిప్పుడు భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. గతంలో యీ రంగానికి చేసిన బడ్జెటు కేటాయింపుకన్న 1970–71 సం లో చేసిన కేటాయింపు వెయ్యి శాతం ఎక్కువ. ఇంత ఎక్కువ శాతం, దేశంలో మరెక్కడా చేయలేదు. ఈ ఏడాదేకాదు రానున్న సంవత్సరాలలో కూడా యీ స్థాయిని యిలాగే కొనసాగించాలని భావిస్తున్నాం. అంతేగాని మందకొడితనానికి ఏ మాత్రం తావులేదు.

మన జనాభాలో హరిజనులు పదిహేను శాతం వున్నారు. మన జాతిపితకు వారు అనుంగు పుత్రులు. హరిజనుల అభ్యుదయానికి అనేక చర్యలను తీసుకోవడం జరిగింది వీరిలో కొందరు అభ్యుదయ పథంలో పురోగమించారనడానికి ఎలాటి సందేహమూ లేదు. అయితే ఐశ్వర్యవంతులయిన తోటి సోదరులకన్నా అతి తక్కువ జీవనస్థాయిలో బ్రతుకుతున్న హరిజనులనేకమంది యీనాటికీ గ్రామాలలో వున్నారు. పట్టణాలలోనూ, టౌనులలోనూ బీద ప్రజానీకం చాలా మంది మనకు కనిపిస్తారు. గ్రామాలలో కూడా భూముల్లేని బీదవారు, తగినంత భూవసతిలేని బీద రైతులు అసంఖ్యాకంగా వున్నారు.

గిరిజనులతో మన అనుభవం మనకు ఒక గుణపాఠాన్ని నేర్పింది. ప్రజలలో కొన్ని వర్గాలవారి ఆర్థిక, సాంఘిక అవసరాలను అలక్ష్యంచేస్తే ఆర్థిక, సాంఘిక వ్యత్యాసాల అగాధాలు ఏర్పడి శాంతి భద్రతల విషయంలో యావత్ దేశానికి ముప్పు వాటిల్లవచ్చు. అందువల్ల బలహీనవర్గాలవారి సంక్షేమాన్ని, అభ్యున్నతిని సాధించడం, సాంఘిక, ఆర్థిక వ్యత్యాసాల్ని తొలగించడం, ఇవి కేవలం సామాజిక చైతన్యానికి సంబంధించిన లక్ష్యాలు కావు, అవి జాతీయ ప్రయోజనాలకోసం తప్పని సరిగా అనుసరించవలసిన బాధ్యతలు—ఈ విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి.

మన సమాజంలోని బలహీన వర్గాలవారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను రూపొందించి, అమలు పరచడం ప్రారంభించాం. సన్నకారు రైతులు, చాలీ చాలని భూవసతిగల రైతుల నిమిత్తం ప్రత్యేక పథకాలను కూడా మనం అమలు పరుస్తున్నాం. భూములులేనివారికి భూవసతి కల్పించే విస్తృత కార్యక్రమం ఎంతగానో ముందడుగు వేసింది. 1969 నుంచి దాదాపు 10 వేల ఎకరాలు యీ విధంగా పంపిణీ చేయడం జరిగింది. బలహీన వర్గాలవారి కొరకై సహకార సంఘాలను నిర్వహించే ప్రయత్నం కూడా జరిగింది.

సరియైన గృహవసతివుంటే జీవన ప్రమాణం, స్థితిగతులు మెరుగుపడడమేగాక సాంఘికంగా గౌరవ ప్రతిపత్తికూడా పెరుగుతుంది. అందువల్ల షెడ్యూలు కులాలవారికి, షెడ్యూలు జాతుల వారికి ఇళ్ళు నిర్మించుకునేందుకు స్థలాలను మంజూరుచేసే కార్యక్రమాన్ని యీ ఏడాది విస్తృతపరచి శీఘ్రంగా అమలు జరిగేట్టు చేయాలని ప్రభుత్వం భావించింది. అంతేకాక వీరి నిమిత్తం బృహత్తర గృహనిర్మాణ కార్యక్రమాన్ని కూడా అమలుపరచాలని ప్రభుత్వం ఉద్దేశించింది. దీని ప్రకారం ప్రత్యేక సహకార సంఘాలద్వారా ఋణాలు యివ్వడం జరుగుతుంది. ప్రభుత్వశాఖ ద్వారా యిళ్ళను నిర్మించేపని చేపట్టబడుతుంది.


గరిష్టకమతాలకు సంబంధించిన చట్టం విషయంలో సాధించిన అభివృద్ధి నిరుత్సాహంగానే వుంది. చాలావరకు రాయితీలను తగ్గిస్తూ యిటీవలే ఈ చట్టం సవరించబడింది. దీనివల్ల యింకా ఎక్కువ మొత్తంలో భూమి ప్రభుత్వం అధీనంలోకి రావడానికి వీలవుతుంది. భూములులేని బీదవారికి పంపిణీ చేయడానికి వీలుగా ఆయా వ్యక్తుల దగ్గర ఎక్కువగావున్న భూమిని స్వాధీనం చేసుకోవడానికి తీసుకునే చర్యలను త్వరితం చేయవలసి వుంటుంది.

వ్యవసాయ భూములపై పరిమితిని విధించడంవల్ల గ్రామీణ ప్రాంతాలలో ఆస్తుల మధ్య వ్యత్యాసాన్ని తొలగించడానికి వీలవుతుంది. దీనిని పట్టణ ప్రాంతాలకు కూడా వర్తింపజేయడం అవసరం. పట్టణ ఆస్తులమీద ఏ స్థాయికో పరిమితి విధించాలో ప్రభుత్వానికి సలహాయిచ్చే నిమిత్తం మన రాష్ట్రంలో ఒక కమిటీ కూడా ఏర్పాటు అయింది సెప్టెంబరు మాసాంతంలోగా యీ కమిటీ నివేదిక అందగలదని ఆశిస్తున్నాం. నివేదిక అందడంతోనే వెంటనే పట్టణ ఆస్తుల పరిమితికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించడం జరుగుతుంది.

శాసనసభ ఏ చట్టాలను చేసినా, ప్రభుత్వం ఏ విధానాలను రూపొందించినా అవి ఎంత శక్తివంతంగా, ఎంత విజయవంతంగా అమలుపరచబడుతున్నాయో దాన్నిబట్టే వాటి ఫలితాలు ప్రజా జీవితంలో ప్రతిబింబిస్తాయి

వ్యక్తిగతంగా అధికారులు ఎంతో ఉత్సాహాన్ని, శ్రద్ధను ప్రదర్శించి పనిచేస్తున్నప్పటికీ మొత్తంమీద ప్రభుత్వ కార్యాలయాల పని తీరు యింకా ప్రజలలో విశ్వాసాన్ని చూరగొనాల్సి వుంది. ప్రజల యిబ్బందులను పరిష్కరించే విషయంలో త్వరగానూ, శ్రద్ధతోనూ ప్రభుత్వోద్యోగులు చర్యలు తీసుకుంటారనే విశ్వాసాన్ని ప్రజలలో కలిగించవలసివుంది. అన్ని స్థాయిలలోనూ పని పెరిగినమాట నిజమే. ప్రస్తుత కాలానికి వీలుగా పరిపాలనా విధానాన్ని పునర్వ్యవస్థీకరించవలసిన అవసరం కూడా వుంది. దొరవ, ముందుచూపు, పరిశీలనాత్మకదృష్టి యివన్నీవున్న పరిపాలనా దక్షతగలవారి నేతృత్వంలో పరిపాలనావ్యవస్థ స్థాయిని పెంచవచ్చు.

అభ్యుదయాన్ని, సంక్షేమాన్ని సాధించాలని లక్షించాం. ఇందుకుగాను ఆర్థిక వనరులను సమీకరించే శక్తి మనకు బహు పరిమితంగావుంది. అందువల్ల మనం చేసే ఖర్చులలో జాగ్రత్త వహించడం అవసరం. ఉత్పత్తికి దోహదం చేయనివాటిపై ఖర్చులను తగ్గించి, ఆ మిగులు నిధులను ప్రజల సంక్షేమానికి తోడ్పడే వాటిపై వెచ్చించడం మంచిది."



1971-72 బడ్జెట్

"ప్రజలు సామ్యవాదంలో తమ విశ్వాసాన్ని పూర్వం కన్న భారీయెత్తున ప్రకటించారు పెద్దయెత్తున తమ మద్దతును పార్లమెంటు ఎన్నికల్లో అందించారు. ఆర్థిక రంగంలోని ప్రధాన విభాగాల్లో అప్పుడే కేంద్ర ప్రభుత్వం విధానాలను ఇందుకనుగుణంగా తీర్చిదిద్దుతోంది_బ్యాంకింగ్. సామాన్య భీమా వగైరా ముఖ్యసంస్థల్లో మార్పులు తెస్తోంది మన ప్రజానీకపు ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవహరించాలి కాబట్టి ఇటీవల సంవత్సరాల్లో ప్రభుత్వ కార్యకలాపాల్లో వస్తున్న కొన్ని మార్పులను ముందుగా ప్రస్తావించటం అవసరమనకుంటాను" అని ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, శాసనమండలిలో 1971-72 సంవత్సరపు బడ్జెటును సమర్పిస్తూ, 1971 జులై 30వ తేదీన ఆర్థికమంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డిగారు అన్నారు,

మంత్రిగారు తమ ప్రసంగం కొనసాగిస్తూ:

"ప్రధాన జీవితపు అవసరాల విషయంలో జాతీయ కనీస స్థాయికి కూడా నోచుకోని వర్గాలు సమాజంలో ఉన్నాయి ప్రభుత్వం సాధించే సత్వర ఆర్థికాభివృద్ధి ముఖ్యంగా ఈ వర్గాలకు దోహదపడే విధంగా రూపొందించబడుతోంది అసమానతలున్న మనలాంటి సమాజంలో ఇంతవరకూ బాగా అభివృద్ధి చెందని వర్గా లున్నాయని గుర్తించాలి అలాగే కొన్ని ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. వాటిని గుర్తించాలి ఈ విషయాలదృష్ట్యా. వ్యవస్థల నిర్మాణంలో మార్పులు అవసరం. ఈ విధంగా కనుక చూస్తే, వివిధ కార్యక్రమాలు వాటికవి ప్రత్యేకంగా, విశిష్టంగా కనబడి నప్పటికీ, వాటి లక్ష్యాలు విడివిడిగా కనబడినప్పటికీ మొత్తంమీద మన సమగ్ర దృక్పథంలో అవన్నీ అంతర్భాగాలే ఆ విధంగా ఈ కార్యక్రమాలన్నీకూడా ముఖ్యమైనట్టివి. మనసమాజ లక్ష్యాన్ని సాధించటానికి అనువైన సాధనాలు, అనుబంధ సాధనాలు

బంజర్ల పంపిణీ

"మన ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యావసాయికమైనట్టిది ఎక్కువమంది ప్రజలకు వ్యవసాయం బ్రతుకుబాట కాబట్టి ఏ పెద్ద మార్పును తేవాలన్నప్పటికీ, భూముల పంపకంలో కచ్చితమైన విధానాలను అవలంబిస్తేగాని వీలులేదు. భూమి పంపకాన్ని తీవ్రతరంచేసే పథకం గురించి గౌరవ సభ్యులకు తెలుసు. 1969 నవంబర్ నుంచి పదిలక్షల ఎకరాలకుపైగా భూమి పంపిణీ జరిగింది. ఇందుమూలంగా భూమిలేని పేదలు_ముఖ్యంగా హరిజనులు, గిరిజనులు ఎంతో ప్రయోజనాన్ని పొందారు భూమి పంపిణీకి సంబంధించిన శాసనంక్రింద, విస్తారంగా లభించిన భూమిని ప్రభుత్వం తీసుకొని, పొలాలులేని పేదలకు సమకూరుస్తోంది ఇలాగే ఇటీవల హరిజనుల ఇళ్ళస్థలాల విషయంలోకూడా తీవ్ర పథకం ప్రారంభించబడింది ఇందు నిమిత్తం షెడ్యూల్డు కులాల

జాతుల గృహనిర్మాణం త్వరలో ప్రారంభం కానున్నది." అన్నారు మంత్రిగారు.

అభివృద్ధితోపాటు సాంఘికన్యాయం

"ఇక కొన్ని పథకాలగురించి ఈ సందర్భంలో ప్రస్తావిస్తాను. గత సంవత్సరంనుంచి వీటిని అమలుజరిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేవలం అభివృద్ధిమాత్రమే చాలదు, దానితోపాటు సాంఘిక న్యాయం కూడా సమకూరాలి. అనే కొత్త భావన ప్రారంభం ఈ కార్యక్రమాల వ్యూహరచనలో మనకు కనబడుతుంది. గ్రామీణ కార్యక్రమాల పథకం ఉంది. భూమిలేని వ్యావసాయిక శ్రామికులకు పనిపాటలు కల్పించటం ఈ పథకపు లక్ష్యం, రాష్ట్రంలోని అనావృష్టి ప్రాంతాల్లో ఉపయోగపడే పనులను నెలకొల్పటంతోపాటు, గ్రామసీమల్లో భూమిలేని శ్రామికుల నిరుద్యోగ సమస్యపైకూడా దీని ప్రభావం ఉంటుంది ఇక చిన్నకారు రైతాంగం కొంత వెనుకబడుతూ వచ్చారు. వారి సహాయార్థం పరపతి సౌకర్యాలు కల్పించటానికి, వ్యవసాయంలో అభివృద్ధిని సాధించటానికి చిన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ ఒకటి రూపొందించబడింది. మరొక పథకం—ఇంతకన్నకూడా, అంటే చాలీచాలని పొలంవున్న రైతాంగానికి, వ్యావసాయిక శ్రామికులకు సహాయపడే పథకం మరొకటి వుంది. వీరికి పరపతి సౌకర్యాలను, ఇతర ప్రోత్సాహాలను, పనిపాటలను కల్పించటం దీని లక్ష్యం. ఈ వివిధ కార్యక్రమాలు వేటికవి, ఒకదానితో ఒకటి సంబంధం లేనట్టివికావు. సమ సమాజ దర్శనంలో ఒకభాగం సమాజంలోని దుర్బలవర్గాల సమగ్ర అభ్యుదయం. ఇదే ప్రభుత్వ లక్ష్యం. వివిధ కార్యక్రమాలన్నీ ఈ సమగ్ర లక్ష్యసాధనకు అనువుగా పూన్చబడినై. నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా, సాంఘికమైన, ఆర్థికమైన మార్పులను తెచ్చేందుకై ఇంకా మరికొన్ని కార్యక్రమాలు రూపొందించబడినై. వాటినికూడా సభవారి దృష్టికి తెస్తాను. భూమి గరిష్ఠపరిమితి చట్టాన్ని మరింత పటిష్ఠం చేసేందుకై, ఇటీవల చేసిన సవరణలు గౌరవ సభ్యులకు తెలుసు. గ్రామసీమలోని అధిక ఆర్థిక వ్యత్యాసాలను చక్కబరచటానికి ఈ చట్టం నిర్దేశించబడింది. అయితే పట్టణప్రాంతాలకు కూడా తగువిధానం రూపొందించబడుతోంది. పట్టణప్రాంతాల్లో ఆస్తులపై గరిష్ఠ ప్రమాణాన్ని సూచించవలసిందిగా ఒక సంఘం ఏర్పాటు చేయబడింది. నివేదిక అందిన వెంటనే తుదినిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది". అనివివరించారు ఆర్థికమంత్రి.

రాజభరణాల రద్దు

"మాజీ సంస్థానాధీశుల రాజభరణాలను, ప్రత్యేక సదుపాయాలను తొలగించటానికి రాజ్యాంగాన్ని సవరించవలసివుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు కావలసిన మార్పులకోసం, ఆస్తులు, హక్కులు వగైరాలను ప్రభుత్వం స్వాధీన పరచుకొనటం కోసం ఉద్దేశింపబడే చట్టాలకు పూర్తి అధికారం ఉండేట్టుగాకూడా రాజ్యాంగాన్ని సవరించవలసి వుంటుంది.

ఇక ఇతర విషయాల్లోకి వెళ్ళేముందు ఒక మాట, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిపాలనా వ్యవస్థనుకూడా తీర్చిదిద్దాలని సంకల్పించు కున్నాం. అభివృద్ధికి అనువుగానూ, విస్తృతమైన సాంఘిక లక్ష్యానికి అనుగుణంగానూ పాలనా వ్యవస్థను మార్పుచేయకపోతే, ఏ ప్రభుత్వంకూడా తన విధానాలను సరిగా నిర్వహించజాలదు. నిజమైన బాధ్యత, నిర్ణయాలు తీసుకొనే అధికారం, అలాగే అమలు జరిపే విషయంలో అధికారం, వీటిని ఇంకెక్కువగా వికేంద్రీకరించాలి. నిర్వహించగల పనులను బట్టి ఆర్థికమైన అదుపు ఉండాలి. సాంకేతిక సిబ్బందిని సరిగా వినియోగించుకోవాలి. సామాన్య ప్రజల సమస్యలపట్ల ఇంకెక్కువ సానుభూతి, గ్రహింపు ఉండాలి. ఈ లక్ష్యాలకనుగుణంగా, పాలనా వ్యవస్థను త్వరలో తీర్చిదిద్దగలమని ఆశిస్తున్నాం. జాప్యాలను తొలగించి, అధికారాలను ఇంకెక్కువగా వికేంద్రీకరించే పథకాలను రూపొందించటానికి ఆగస్టునెల మధ్యలోపుగా తగుచర్యలు తీసుకోవలసిందిగా వివిధ శాఖలకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వబడినాయి".

వివిధశాఖల ముఖ్యపథకాల సంగ్రహణ వివరణ

వివిధశాఖలు నిర్వహిస్తున్న పథకాలను వివరిస్తూ ఆర్థిక మంత్రి చేసిన ప్రసంగ భాగంలోని ప్రధానాంశాలు.

వ్యవసాయం

వ్యవసాయిక పథకాల ముఖ్య దృక్పథం ఏమిటంటే ముఖ్యమైన పంటల ఎకరా దిగుబడిని అధికంచేసే కార్యక్రమాలపై కృషిని తీవ్రతరం చేయటం. ఆహారపు పంటలు, తదితరాలు వీటి విషయంలో ఎక్కువ దిగుబడినిచ్చే రకాలు, హైబ్రిడ్ రకాలు, ఈ పంటల ప్రాంతాలనుకూడా విస్తరించటం క్రితం సంవత్సరంలో యీ కార్యక్రమం 16.51 లక్షల ఎకరాల్లో అమలుజరిగితే 1971—72 లో 30.25 లక్షల ఎకరాల ప్రాంతంలో అమలుజరపాలని అనుకుంటున్నాం. ఏడాది తర్వాత ఏడాది కొత్త కొత్త రకాలు రూపొందించబడుతున్నాయి. కాబట్టి సాగుప్రాంతంకూడా విస్తరిల్లే అవకాశం ఎక్కువ అవుతోంది. ఇందుకు నిజంగా, మనం మన రైతులను మెచ్చుకోవాలి. ఎంతో ఉత్సాహంతో కొత్త భావాలను వారు అనుసరించారు. వారికి మన అభినందనలు.

ఆంధ్రప్రదేశ్‌లో పత్తికూడా ఒక ముఖ్యమైన పైరు. నీటిసాగు క్రిందవున్న పత్తి ఆయకట్టును అధికం చేయటానికి, తగు కార్యక్రమాలు రూపొందించబడుతున్నాయి. అలాగే, వర్షంపై ఆధారపడే ప్రాంతాల్లో, ఎరువులు, మొక్కల రక్షణ చర్యలద్వారా దిగుబడిని అధికం చేయటానికి కూడా, రాష్ట్ర పథకాలద్వారా, కేంద్రం ప్రతిపాదించే పథకాలద్వారా నీటిసాగు కింద పండే అమెరికన్ లాంగ్ స్టేపుల్, ఎక్స్‌ట్రా లాంగ్ స్టేపుల్ పత్తిరకాలు అభివృద్ధి చేయబడుతున్నాయి.

మత్స్య పరిశ్రమ

మత్స్య పరిశ్రమాభివృద్ధికి రాష్ట్రంలోని జలాశయాల్లో చేపలను. విత్తనాలుగా ఉపయోగపడే చేపలను నిలవచేయటం అవసరం. అలాగే కోస్తా ప్రాంతాల్లో యంత్రాల పడవలను వినియోగించాలి. మత్స్యశాఖ నిర్వహిస్తున్న క్షేత్రాల్లో ఇప్పటి ఉత్పత్తి రెండు కోట్లు మాత్రమే ఉంది. దీనిని అభివృద్ధిపరచేందుకై, రైతులకు, చిన్నతరహా పారిశ్రామికులకు ప్రభుత్వం సహాయపడుతోంది. రెండుమూడేళ్ల వ్యవధిలో చిరుచేపలను జలాశయాల్లో పూర్తిగా నిలవచేయటానికి తొలిసారిగా ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్ని ఇస్తోంది.

పశు పోషణ

అధికోత్పత్తికి అనువుగా, పశుపోషణశాఖ కార్యక్రమాలు రూపొందించబడినాయి. అదనంగా నాలుగు కీలక గ్రామ మండలాలు ఏర్పాటు చేయబడినాయి — మెట్‌పల్లి (కరీంనగర్ జిల్లా); మైదుకూరు (కడపజిల్లా); ఆళ్లగడ్డ (కర్నూలు జిల్లా); పాకాల (చిత్తూరు జిల్లా); ఇవన్నీ పాల ఉత్పత్తికి అవకాశంగల ప్రాంతాల్లో ఏర్పాటుచేయబడినై. తర్వాత వీటినికూడా మిగతా బ్లాకుల్లాగా, తీవ్ర పశుగణాభివృద్ధి బ్లాకులుగా పెంపొందించవచ్చు

ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్లు అదనపు షిఫ్టులతో పూర్తిగా పనిచేస్తున్నాయి కాగా పశుగ్రాసపు అభివృద్ధి కార్యక్రమం మరింత చురుగ్గా పురోగమిస్తోంది. అదనంగా సుమారు 7,000 ఎకరాల మేరలో పశుగ్రాసపు పంటలు పండించబడుతున్నాయి.

పాడి, పాల పరిశ్రమ

తెలంగాణా ప్రాంతంలో భువనగిరిలోని శీతల కేంద్రం పూర్తి చేయబడింది. పనిచేయటం ప్రారంభించింది. నిజామాబాద్, కరీంనగర్, చిట్యాల్‌లోని పాలను చల్లపరచే కేంద్రాలుకూడా పనిచేయటం ప్రారంభించినై. కత్తల్, నిజామాబాద్, సూర్యాపేట, గజ్వేల్, జహీరాబాదుల్లోని శీతలకేంద్రాల నిర్మాణపు పని చురుగ్గా సాగుతోంది. మహబూబ్‌నగర్, కల్వకుర్తి, పర్గి, నిజామాబాద్ ఆలేరు, ములుగు, వరంగల్‌లలో పాలను చల్లపరచే కేంద్రాల పని, పూర్తవుతోంది. ఈ చెప్పిన వివిధ కేంద్రాలనుంచి లభించే పాల దృష్ట్యా హైదరాబాదులోని కేంద్ర పాడి క్షేత్రంలో అదనంగా నిల్వటాంకులు, సీసాలునింపే ఏర్పాటు (మరొకటి), రోడ్ టాంకర్స్ వగైరా సమకూర్చబడినై.

ఆంధ్ర ప్రాంతంలో, 1970–71లో, అంగలకుదురు, కొల్లూరు, రేటూరులో శీతల కేంద్రాలు పనిచేయటం ప్రారంభించినాయి. తిరువూరు, భీమవరం, నరసరావుపేట, చిల్లకల్లు శీతల కేంద్రాల నిర్మాణపు పని చురుగ్గా సాగుతోంది. రామభద్రాపురం, శ్రీకాకుళంలో పాలను చల్లపరచే కేంద్రాలుకూడా పనిచేయటం ప్రారంభించినై. రాయలసీమ ప్రాంతంలో కడప జిల్లాలోని మైదుకూరు కూలింగ్ కేంద్రం పనిచేయటం మొదలైంది. కర్నూలు పాడిక్షేత్రం, అనంతపురం కూలింగ్ కేంద్రాల నిర్మాణపు పని తృప్తికరంగానే జరుగుతోంది.

నీటి సాగు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో కుడి పెద్ద కాలవ మొదటి 57 మైళ్ల ప్రాంతంలోనూ. 1 నుంచి 10 వ బ్లాకు పంట కాల్వలకు, 11 వ బ్లాకులో కొంత భాగానికి నీటిని అందించటానికి చేయవలసిన పనులన్నీ ముగించబడినై. కుడి కాలువకింద 1971లో, అదనంగా 23 వేల ఎకరాలకు నీటి సాగును సమకూర్చగల అవకాశాలను కల్పించాలని సంకల్పించబడింది. అంటె అంచనావేసిన 11.74 లక్షల ఎకరాల ఆయకట్టులో మొత్తం 7.38 లక్షల ఎకరాలకు నీటి సాగు లభిస్తుంది. ఎడమ పెద్దకాల్వవైపున, మొదటి 72 మైళ్ల ప్రాంతానికి, 1 నుంచి 12 వ బ్లాకు పంటకాల్వలకు. 13 వ బ్లాకులో కొంత భాగానికి నీళ్లు వదలటానికి కావలసిన పనులన్నీ పూర్తయినాయి. 1971 ఏడాదిలో అదనంగా 32 వేల ఎకరాల మేరకు నీటి సాగు లభించేవిధంగా కార్యక్రమాలు చేయబడినై అంటె దీనితో మొత్తం 2.83 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిసాగు లభిస్తుంది. ఎడమ కాల్వక్రింద సంకల్పించిన మొత్తం ఆయకట్టు 8.8 లక్షల ఎకరాలు ప్రాజెక్టు ప్రారంభమైనప్పటినుంచి ఇంతవరకూ అయిన ఖర్చు రూ. 170.66 కోట్లు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 1971–72 బడ్జెట్ కేటాయింపు రూ. 10.62 కోట్లు; ఆనకట్టకు రూ 87 లక్షలు; కుడి కాల్వకు రూ. 475 లక్షలు; ఎడమ కాల్వకు రూ. 500 లక్షలు.

పోచంపాడు ప్రాజెక్టు పని చురుగ్గా సాగుతోంది. పెద్ద కాలవవైపున, మొదటి 22 మైళ్ళ మేరలో త్రవ్వకపు పని పూర్తి అయింది. ఈ ప్రాజెక్టుకై ప్రపంచ బ్యాంకునుంచి సహాయంకోసం కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 1971 మే నెలలో వాషింగ్టన్‌లో ఐ. డి. ఎ. తో సంప్రదింపులు జరిగినై. ఈ సహాయం నిశ్చయమై ముసాయిదా ఒడంబడిక తయారవుతోంది. 1971 మార్చి ఆఖరి వరకు ఖర్చు రూ. 26.90 కోట్లు. 1971–72 కేటాయింపు రూ 9.32 కోట్లు మామూలు ప్రణాళికనుంచి రూ 6 కోట్లు; కేంద్ర ప్రభుత్వపు అదనపు సహాయం ద్వారానూ. తెలంగాణా మిగుళ్ళనుంచి మరొక రూ. 3.32 కోట్లు

విద్యుచ్ఛక్తి

రాష్ట్రంలో స్థాపిత విద్యుచ్ఛక్తి ప్రస్తుతం సుమారు 610MW. అయితే అధికం అవుతున్న విద్యుచ్ఛక్తి అవసరాల దృష్ట్యా కొత్త యూనిట్లను సాధ్యమైనంత త్వరలో అమలులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి 62.5MW. శక్తివున్న రామగుండం 'బి' స్టేషన్‌ను వినియోగంలోకి ఆగస్టు, సెప్టెంబరు 1971 లో తేవాలని ప్రతిపాదించబడింది. ఇందువలన రాష్ట్రంలోని స్థాపిత విద్యుచ్ఛక్తి 672.5MW.కు పెరుగుతుంది. నాల్గవ పంచవర్ష ప్రణాళిక చివరకు, విద్యుచ్ఛక్తి అవసరాల గరిష్ఠస్థాయి 1,087MW.ను చేరవచ్చునని అంచనా వేయబడింది. అయితే స్థాపిత శక్తి 958MW. మాత్రమే ఉండగలదు. అంటె నాల్గవ ప్రణాళిక చివర్లో విద్యుచ్ఛక్తి కొరత ఏర్పడుతుంది. సోమశిల వద్ద న్యూక్లియర్ పవర్ స్టేషన్‌ను ఏర్పరచవలసిన అవసరం

ఉందని, తమిళనాడులోని నైవేలీ, కల్పకంలాంటి కేంద్ర ఉత్పాదన స్టేషన్లనుంచి కొంత భాగాన్ని మనకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి తెలియజేసింది. కల్పకం ఎటామిక్ స్టేషన్ రెండవ యూనిట్ ఉత్పత్తిలో 50 శాతాన్ని ఆంధ్రప్రదేశ్, కేరళ, మైసూరు రాష్ట్రాలకు పంపిణీచేయటానికి కేంద్రప్రభుత్వం నిశ్చయించింది.

పరిశ్రమలు

విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారపు పనిని ఈ ఏడాది ప్రారంభంలో ప్రధానమంత్రి ప్రారంభించటం గౌరవ సభ్యులకు తెలుసు రాష్ట్ర ప్రజలు కన్న కలల సాఫల్యానికి ఈ ఉక్కు కర్మాగార స్థాపన నిదర్శనం. మొత్తం రాష్ట్రపు ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం విస్తారంగా వుంటుంది. కేంద్ర రంగపు ప్రాజెక్టు మరొకటి వుంది_కరీంనగర్ జిల్లాలో రామగుండంవద్ద బొగ్గు ఆధారంగా ఎరువుల ఉత్పత్తి కేంద్రం. దీని విషయంలో, తొలి పనులు ప్రారంభించబడినై. హిందూస్తాన్ కేబిల్స్ సంస్థ హైదరాబాద్‌లో ఒక టెలీ కమ్యూనికేషన్ కేబిల్ కర్మాగారాన్ని ఏర్పాటుచేస్తోంది. ఖర్చు సుమారు రూ. 10 కోట్లు. విశాఖపట్నంలో జింక్ స్మెల్టర్ ప్లాంటుకుకూడా కేంద్ర ప్రభుత్వం తన ఆమోదాన్ని తెలిపింది. ఖర్చు సుమారు రూ. 22 కోట్లు. భారత్ డైనమిక్సు అను మరొక కేంద్ర రంగపు ప్రాజెక్టు హైదరాబాద్‌లో ఏర్పాటు కానున్నది. విశాఖపట్నంలో ఒక ఔటర్ హార్బరును కూడా కేంద్రం నెలకొల్పవలసివున్నది. దీని ఖర్చు రూ. 37 కోట్లు నెల్లూరు జిల్లాలోని శ్రీహరి కోటవద్ద రాకెట్ ప్రయోగ కేంద్రపు పని ఈ ఏడాది ఇంకొంత కొనసాగింది ఈ ప్రాంత పరిసరాల్లో ఉద్యోగావకాశాలు ఇందువలన అధికం కాగలవని ఆశించుదాం. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర రంగపు ప్రాజెక్టులను ఇంకా చాలా వాటిని నెలకొల్పేందుకై రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను కొనసాగిస్తూనేవుంది.

ఇతర పారిశ్రామిక సంస్థలను పునరుద్ధరించి, వాటిని పటిష్ఠంగా నడిపేందుకు తగిన చర్యలు తీసుకొనబడుతున్నాయి. హైదరాబాద్ ఆల్విన్ మెటల్ వర్క్స్ యాజమాన్యాన్ని ప్రభుత్వం 1969 ఆగస్టులో తీసుకున్నది. ఇప్పుడు ఈ సంస్థ సరిగా పని చేస్తోంది. పటిష్ఠంగా కూడా. అలాగే నిజాం పంచదార ఫ్యాక్టరీ బాగా పని చేస్తూనే వుంది. కాబట్టి పబ్లిక్ రంగపు శక్తి సామర్థ్యాలు ఇందువలన రుజువవుతున్నాయి. హైదరాబాద్ కెమికల్స్ ఫెర్టిలైజర్సు, సింగరేణి కాలియరీస్, సిర్పూర్ సంస్థలను అభివృద్ధిపరచటానికి తగు చర్యలు తీసుకొనబడుతున్నాయి. మచిలీపట్నంలోని ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీని కేంద్ర ప్రభుత్వం, తన యాజమాన్యంలోకి తీసుకుంటుందని భావిస్తున్నాం.

విద్య

1971_72 విద్యా సంవత్సరంనుంచి డిగ్రీ కోర్సులకు తెలుగు బోధనా భాషగా వుండాలని నిర్ణయించబడింది. కావాలనుకున్నవారు ఆంగ్లాన్ని బోధనా భాషగా ఎంచుకోవచ్చును. ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంతంలో, హిందీ, ఉర్దూలు బోధనా భాషలుగా డిగ్రీస్థాయిలో ఉంటూనే ఉంటాయి. తెలుగు బోధనాభాషగా చదువుకొనేవారికి ఉద్యోగాల్లో ఎక్కువ వసతులను కల్పించాలని కూడా ప్రభుత్వం కొన్ని విధానాల గురించి ఆలోచిస్తోంది. తెలుగు డిగ్రీ కోర్సులకు కావలసిన రిఫరెన్సు గ్రంథాలను తెలుగు అకాడమీ తయారుచేస్తోంది.

దుర్బలవర్గాల సంక్షేమం

షెడ్యూల్డు జాతులు, కులాలు సంఘంలోని ఇతర దుర్బల వర్గాల అభ్యుదయాన్ని పెంపొందించేందుకై ప్రభుత్వం చేపట్టుతున్న కార్యక్రమాలు, వాటికి చూపుతున్న ప్రాముఖ్యం గౌరవ సభ్యులకు తెలుసు.

షెడ్యూల్డు కులాల, జాతుల సంక్షేమం కోసం 1970_71లో బడ్జెటు కేటాయింపులు అధికం చేయబడినై. గిరిజనుల ప్రత్యేక పథకం ప్రారంభమైంది ఈ సంవత్సరంలోనే. నాలుగేళ్ళ వ్యవధిలో అమలుజరిగే ఈ కార్యక్రమపు ఖర్చు రూ. 10 కోట్లు. ఇందులోంచి రూ. 1.60 కోట్లు 1970_71లో కేటాయించ బడినై. ఈ సమగ్ర అభివృద్ధి కార్యక్రమంలో ఎన్నో అంశాలున్నాయి—వ్యవసాయాన్ని తీవ్రంగా అభివృద్ధిచేయటం, విద్యుచ్ఛక్తిని విస్తరింపచటం, రోడ్డు రవాణా సౌకర్యాలను అభివృద్ధిపరచటం, సంచార వైద్య దళాలను ఏర్పాటుచేయటం, నివాస వసతివున్న పాఠశాలలను ఏర్పాటు చేయటం వగైరా. ఈ సమగ్ర పథకాన్ని ప్రారంభించిన సంవత్సరం అని గుర్తుంచుకుంటే, 1970_71లో సాధించిన కృషి ప్రశంసనీయంగావుంది. ఇంకెక్కువ ప్రాముఖ్యంతో ప్రత్యేక పథకం ఈ ఏడాది అమలుజరుపబడుతోంది. కాగా, శ్రీకాకుళం జిల్లాకు రు 1 50 కోట్ల ఖర్చుతో ఒక సమగ్ర గిరిజన అభివృద్ధి పథకం రూపొందించబడి, ఆర్థిక సహాయంకోసం కేంద్ర ప్రభుత్వానికి పంపబడింది.

షెడ్యూలు ప్రాంతాల రక్షణవిషయంలో చట్టబద్ధ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలుజరపడం చెప్పుకోదగ్గ మరొక విషయం. ఇందుకోసం ప్రత్యేకసిబ్బంది పనిచేస్తోంది. వీరి సహాయంతో అమలు జరుగుతున్న కార్యక్రమాలు_భూమి మార్పిడి నిబంధన, గిరిజనుల భూమిని గిరిజనులు కాని ఇతరులకు అన్యాక్రాంతం కాకుండా ఇది నివారిస్తుంది. ఋణాల తగ్గింపు నిబంధన, దీనికింద ఇప్పటి ఋణాలు మొదట్లో తీసుకొన్న మొత్తాలకు తగ్గించ బడినై; వడ్డీని పూర్తిగా లేకుండా చేయటంద్వారాగాని, లేక తగ్గించిన ఋణాల తిరిగి చెల్లింపులపై రెడ్డేళ్ళపాటు 'మారటోరియమ్'; ముఠాదారీ విధానపు రద్దు; గిరిజన ప్రాంతాల్లో అప్పులిచ్చే విధానాన్ని క్రమబద్ధంచేయటం; వగైరా కార్యక్రమాలు అమలు జరుపబడుతున్నాయి ఢేబర్ సంఘ సిఫార్సుల కనుగుణంగా, షెడ్యూల్డు ప్రాంతాలు కానిచోట్ల వుండే గిరిజనుల రక్షణకై ఇలాంటి చట్టాల గురించి ప్రభుత్వము ఆలోచిస్తోంది భూములను సహకార సంఘాలకు, వ్యాపార బ్యాంకులకు తనఖాపెట్టుకొనటాన్ని అనుమతించే సవరణ, లాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్‌కు సవరణ రాష్ట్రపతి ఆమోదాన్ని పొందవల్సి వున్నవి.

హరిజనుల, గిరిజనుల కోసం భారీ యెత్తున ఉద్దేశించిన గృహనిర్మాణ కార్యక్రమం గౌరవ సభ్యులకు ఇదివరకే తెలుసు. హరిజన, గిరిజన గృహనిర్మాణ కార్పొరేషనుకు ప్రభుత్వం ఇదివరకే రూ 93 లక్షలను కేటాయించింది. జీవిత భీమా సంస్థనుంచి ఆర్థిక సహాయాన్ని కోరటమైంది. ముఖ్యమంత్రి స్వయంగా చేసిన కృషి ఫలితంగా, జీవితభీమా సంస్థ ఇందు నిమిత్తమై రూ. 10 కోట్లు మంజూరు చేయటానికి అంగీకరించింది.

ప్రభుత్వ భూములను, భూమి చట్టాల కింద లభించే మిగులు భూములను ఖచ్చితమైన కార్యక్రమం ప్రకారం పంచితే తప్ప, హరిజన గిరిజన సంక్షేమ పథకం ఏదీ కూడా ఈనాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితిలో దానికదిచాలదు. భూమి కేటాయింపు తీవ్రపథకం కింద 24 లక్షల ఎకరాలకు పైగా భూమి, పొలంలేని పేదలకు, హరిజనులు, గిరిజనులతో సహా పంపిణీ చేయబడింది. ఇంకా అదనపు భూములను సమకూర్చటానికిగాను, 1.28 లక్షల ఎకరాల అడవి ప్రాంతాలనుకూడా ఇటీవల ఇందుకై కేటాయించటం జరిగింది. ప్రభుత్వ భూములను అక్రమించిన ధనిక భూస్వాములను ఆ భూముల్లోంచి వెళ్లగొట్టి, వాటిని పొలాలులేని పేదలకు కేటాయించటం తీవ్ర కార్యక్రమంలో ఒక భాగమని చెప్పవచ్చు. భూమి పరిమితి చట్టం కింద లభించే మిగులు భూమి, అనధికారంగా ఆక్రమించిన ప్రభుత్వ భూమి—ఈ విషయంలో త్వరితంగా చర్యలు తీసుకోవాలని 1972 మార్చిలోపుగా పొలాలులేని వారికి పొలాలను పంచే కార్యక్రమం పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించింది.

చిన్నతరహా రైతులకు, చాలీచాలని పొలమున్న రైతులకు, అనావృష్టి ప్రాంతాలకు ప్రత్యేక పథకాలు

చిన్నరైతాంగానికి ప్రస్తుతం లభిస్తున్న పరపతి తగినంతగా లేదు. పరపతి సంఘాలు వీరికింకెక్కువ తోడ్పడాలి. ఈ ఉద్దేశంతో చిన్న తరహా రైతుల అభివృద్ధి సంస్థ పథకం ఒకటి శ్రీకాకుళం, కడప, నల్గొండ జిల్లాల్లో ప్రవేశపెట్టబడింది. ఆయా ప్రాంతాల్లో ఈ సంస్థలు సుమారు 50 వేల మంది రైతులకు పరపతి సౌకర్యాన్ని సమకూర్చగలుగుతాయి. ఇందు మూలంగా ఈ రైతులు అభివృద్ధికి తీవ్రంగా పాటుపడగలుగుతారు. కేంద్ర ప్రభుత్వం మొదటి దఫా మొత్తాన్ని మంజూరుచేసింది. ఈ జిల్లాల్లోని సహకార వ్యవస్థను దృఢపరచటానికి ప్రభుత్వం తగుచర్యలు తీసుకున్నది. ఈ ప్రాజెక్టులు ప్రారంభదశలో ఉన్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాల పురోభివృద్ధిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులు జయప్రదంగా నిర్వహించబడినందువలన, ఆర్థిక సంస్థల సహాయం రైతాంగంలో నిజంగా అర్హులైన వారికి, ఇంతకాలంగా అశ్రద్ధకు లోనైన వారికి లభించగలదు.

ఇక చాలీచాలని పొలాలున్నవారున్నారు. భూమిలేని వ్యవసాయదార్లు సరే. వారికోసం మార్జినల్ ఫార్మర్స్, అగ్రికల్చరల్ లేబరర్స్ పథకం ఒకటి నల్గొండ, విశాఖపట్నం జిల్లాల్లో అమలు జరుపబడుతోంది. ఒక్కొక్క ప్రాంతంలోనూ ఈ ఉభయ వర్గాల వారికి, సుమారు 20 వేల మందికి ఈ పథకం వర్తిస్తుంది. పరపతి సౌకర్యం, సదుపాయాలు పనిపాటలు లభిస్తాయి. గ్రామసీమలోని వృత్తి పనివారల కోసం కూడా ఈ పథకాల్లో కేటాయింపులు చేయబడినాయి.

ప్రధాన మంత్రి సమీక్షా సంఘపు సమావేశం దృష్ట్యానూ ఆ తర్వాత కేంద్ర ప్రణాళికా మంత్రితో సంప్రదింపుల దృష్ట్యానూ 1971–72 సంవత్సరానికి తెలంగాణా ప్రాంతానికి ప్రణాళికా నిధులను కేటాయించటానికి స్థూలంగా కొన్ని సూత్రాలు రూపొందించబడినాయి. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక కేటాయింపు మొత్తం రూ. 105.08 కోట్లు. ఇందులకు 1971–72 ప్రణాళిక కేటాయింపు రూ 10 కోట్లు. ఈ మొత్తం తెలంగాణా, రాయలసీమ, కోస్తా ఆంధ్ర మధ్య ఈవిధంగా, అంటె 5 : 3 : 2. ప్రకారం విభజింపబడింది. ప్రణాళికా వినియోగంలో మిగిలిన మొత్తం 1971 జనాభా లెక్కలకు అనుగుణంగా ఆ యా ప్రాంతాల జనాభా ప్రకారం ఈ మూడు ప్రాంతాలమధ్య విభజింపబడింది. మొత్తం ప్రణాళిక ప్రాంతంవారీ కేటాయింపు: కోస్తా ఆంధ్రకు రూ. 43.60 కోట్లు; రాయలసీమకు రూ. 22.25 కోట్లు; తెలంగాణాకు రూ. 39.23 కోట్లు.

ప్రతి జిల్లాలోనూ వెయ్యి మందికి తక్కువ కాకుండా ఏడాది పొడుగునా ఉద్యోగావకాశాలకు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక తీవ్ర కార్యక్రమాన్ని ప్రతిపాదించింది. దీని ఖర్చు రూ. 12.5 లక్షలు అని అంచనా. ఇది త్వరలో అమలులోకి తేబడుతోంది. వ్యవసాయిక–పారిశ్రామిక కార్పొరేషన్ ఉద్యోగాలు లేని విద్యావంతులకు ఉద్యోగావకాశాలను కల్పించటానికి ఒక పథకాన్ని రూపొందించింది. విద్యావంతులకు ఉద్యోగాలకోసం కేంద్రప్రభుత్వం రూ. 25 కోట్ల పథకాన్ని రూపొందించింది. దీనిని వెంటనే అమలుజరపటానికి తగు చర్యలు తీసుకొనబడుతున్నాయి. ఉద్యోగావకాశాలను అధికం చేయటంతో పాటు, ఉన్న అవకాశాలను కూడా ఇప్పటికన్న ఇంకెక్కువ బాగా, న్యాయంగా వినియోగించేందుకై హైదరాబాదు నగరంలో "కుటుంబానికి కనీసం ఒక ఉద్యోగం" అనే పథకం ఇటీవల ప్రవేశపెట్టబడింది. కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్ రంగాల్లో నిరుద్యోగ సాంకేతిక నిపుణులను చాలామందిని వినియోగించడం; నిరుద్యోగ ఇంజనీర్లను సంఘటితపరచటం, అలాగే వివిధ జిల్లాల్లో గ్రామీణ నిరుద్యోగులను వివిధ కార్యక్రమాల నిర్వహణకు సంఘటితపరచటం వగైరా వివిధ కార్యక్రమాలు పరిశీలనలో ఉన్నాయి. మన రాష్ట్రంలోని ప్రజలకు ఉద్యోగావకాశాలను, పనిపాటలను సమకూర్చటంలో ప్రభుత్వం వెనుకాడదని గౌరవ సభలో హామీ నిస్తున్నాను.

1971–72 బడ్జెటు అంచనాలు

ఈ ఏడాది ఆర్థిక వ్యవహారాల గురించి ప్రస్తావించే ముందు ఒక సంగతి పేర్కొనాలి. తాత్కాలిక బడ్జెటులో పేర్కొన్నట్లు,

రాష్ట్రపతి ఉత్తర్వు ప్రకారం, భార్గవ సంఘం సూచించిన కేటాయింపుల సూత్రాల కనుగుణంగా, ఆదాయ వ్యయాల వివరాలను తెలంగాణాకు, మిగతా ప్రాంతానికి విడివిడిగా చూపించాం.

1969–70, 1970–71 ఆర్థిక ఫలితాలు ఇదివరకే తాత్కాలిక బడ్జెటులో సూచించబడినాయి. కాబట్టి వాటిని పునశ్చరణచేయను. 1971–72 ఆర్థిక వ్యవహారాల గురించి క్లుప్తంగా ప్రస్తావిస్తాను.

రివిన్యూ జమలు రూ. 319.65 కోట్లు అని నిర్దేశింపబడింది. అంటే, ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెటులోకన్న రూ. 9.61 కోట్ల పెరుగుదల. రివిన్యూ ఖర్చు ఇప్పుడు రూ. 305.87 కోట్లు అంటే రూ. 5.73 కోట్ల పెరుగుదల అన్నమాట. కాబట్టి రివిన్యూ ఖాతాన మొత్తం మిగులు రూ. 13.78 కోట్లు.

పెట్టుబడి ఖాతాన, ఖర్చు రూ. 52.28 కోట్లు ఉండవచ్చు. పబ్లిక్ డెట్, ఋణాలు, అడ్వాన్సులు, పబ్లిక్ అక్కౌంట్, వీటన్నిటిని లెక్కలోకి తీసుకుంటే, ఈ ఏడాది వ్యవహారాల ఫలితంగా మొత్తం తరుగు రూ. 9.59 కోట్లు ఉండవచ్చు.

1971–72 సంవత్సరం రూ. 47.34 కోట్ల ఓవర్ డ్రాఫ్టుతో ప్రారంభమైంది. ఈ ఏడాది ఆర్థిక వ్యవహారాల ఫలితంగా ఏర్పడిన తరుగు దృష్ట్యా, ఈ ఏడాది మొత్తం రూ. 56.93 కోట్ల తరుగుతో ముగియవచ్చు.

అయితే ఈ తరుగు రొక్కపు నిల్వలో చాలా భాగం గడచిన సంవత్సరాలనుంచి సంక్రమిస్తున్న తరుగుకు ఫలితం. అదనపు రివిన్యూకై ప్రతిపాదించాలనుకుంటున్న చర్యల ద్వారా ఓవర్ డ్రాఫ్టు కొంతవరకు తగ్గవచ్చు.

అదనపు వసతుల సమీకరణ

బడ్జెటు చాలా పెద్ద తరుగును చూపుతోంది. కాబట్టి ఇందులో కొంత భాగాన్ని భర్తీ చేసుకోవాలన్నప్పటికి అదనపు వసతులను సమీకరించవలసిన బాధ్యత మనపై ఉంది. ఇందు మూలంగా వచ్చే సంవత్సరాలకు కూడా ఒక ఆధారం ఏర్పడుతుంది వసతుల విషయంలో. కాబట్టి కొన్ని అదనపు ఆదాయములు కల్గించే కార్యక్రమములను చేపట్టదలచాం. వీటిలో కొన్ని ఇదివరలో అమలు జరుపబడినై, మరికొన్ని ఇంకా చేపట్టవలసి వుంది.

గౌరవ సభ్యులకు తెలుసు—ఆంధ్రప్రదేశ్ మోటార్ వెహికిల్స్ టేక్సేషన్ ఆక్టు 1963 క్రింద కాంట్రాక్టు క్యారేజెస్‌పై నాలుగు సార్లు విధించే పన్నును ఇప్పటి రూ. 20 నుంచి రూ. 60కు పెంచుతూ ఇటీవల ఒక ప్రకటన జారీచేయబడింది. ఇందుమూలంగా పూర్తి ఏడాదికి అదనంగా రూ. 55 లక్షలు, ఇప్పటి ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ. 42 లక్షలు ఆదాయం లభించవచ్చు.

రాష్ట్రంలోని అమ్మకపుపన్ను వ్యవస్థను పరిశీలించవలసిందిగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రిసర్చ్ సంస్థను కోరాం. ఆ సంగతి కూడా సభ్యులకు తెలుసు. ఆ సంస్థ అధ్యక్షులు శ్రీ యస్. భూతలింగం. ఆ నివేదిక ఇటీవలే మాకు అందింది. అమ్మకపు పన్ను విధానంలో తగు మార్పులు తేవాలని అనుకుంటున్నాం. హేతుబద్ధమైన మార్పుల ఫలితంగా అదనపు ఆదాయం లభించగలదని ఆశిస్తున్నాం.

మరొక విధానం ఏమిటంటే, స్టాంపు డ్యూటీకి సంబంధించినట్టిది. స్టాంపు డ్యూటీని తప్పించుకునే మామూలు మార్గాల్లో ఒకటి అమ్మకపు ఆస్తిని తక్కువ ధరలో చూపటం. ఈ దురాచారాన్ని తొలగించి, ఇప్పటి స్టాంపు డ్యూటీ రేట్ల ప్రకారం తగిన ఆదాయాన్ని చేకూర్చగల ఏ విధానానైనా గౌరవసభ ఆమోదిస్తుందని నమ్ముతున్నాను. ఆయా వ్యక్తులు తమ తమ పత్రాల్లో ఎలా పేర్కొన్నప్పటికి, స్టాంపు డ్యూటీ రేటును ఆస్తి మార్కెటు విలువకు సమన్వయం చేయాలని అనుకుంటున్నాం. ఇందునిమిత్తం ఇదివరకే ఒక బిల్లు ప్రవేశపెట్టబడింది—స్టాంపు ఆక్టును సవరించేందుకై. ఇందుమూలంగా ఏడాదికి అదనంగా సుమారు కోటిన్నర రూపాయల ఆదాయం లభించవచ్చు.

మోటారు బండ్లు ఎక్కువగా వున్నవారి విషయంలో, మోటారు వెహికల్ టాక్స్‌పై సర్ చార్జి విధించడానికి గాను, మోటారు వెహికల్ టేక్సేషన్ ఆక్టుకు ఒక సవరణ గడచిన ఏప్రిల్‌లో ప్రవేశపెట్టబడింది. కావలసిన ప్రకటనలు ఇటీవల జారీచేయబడినై. మన ఆదాయం ఇందువల్ల ఏడాదికి సుమారు రూ. 75 లక్షల మేరకు పెరుగగలదని అనుకుంటున్నాం.

నా ప్రసంగాన్ని ముగించే ముందు ఒక ముఖ్య విషయం గురించి ప్రస్తావిస్తాను. ఇది ప్రభుత్వాన్ని, ఉద్యోగులను ఆందోళన పరుస్తోంది. గౌరవ సభ్యులకు తెలుసు—ఈ ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నాన్ గెజిటెడ్ అధికార్లు, ఉపాధ్యాయులు, జిల్లాపరిషత్తులు, పంచాయతీ సమితులు వగైరాల ఉద్యోగులు 56 రోజులపాటు సమ్మెచేశారు. ఈ సమ్మె వ్యవధిని ప్రభుత్వం 'డయస్‌నాన్'గా పరిగణించటానికి నిశ్చయించింది. తదనుగుణంగా సమ్మెకాలానికి జీతానికి ఉద్యోగులు అర్హులుకారని ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. అయితే మామూలు పరిస్థితులు మళ్లీ నెలకొన్న సందర్భంగా, ఈ విషయాన్ని గురించి ప్రభుత్వం పునరాలోచన చేసింది. సమ్మెకాలాన్ని శెలవుగా పరిగణించాలని నిశ్చయించింది. ఎంత శెలవుకాలం ఉద్యోగులకు ఉన్నదో, దాన్ని బట్టి, సమ్మెకాలాన్ని వారి శెలవుగానూ. శెలవు సరిపడగాలేని సందర్భాల్లో, భవిష్యత్తులో పొందగలిగిన శెలవుగానూ, పరిగణించటానికి ప్రభుత్వం నిశ్చయించింది. ప్రభుత్వపు ఈ ఔదార్యాన్ని ఉద్యోగులు గుర్తిస్తారని, దుర్బల వర్గాల జీవన పరిస్థితులను మెరుగుపరచే విధానాలను పటిష్ఠంగా అమలు జరుపగలరని ఆశిస్తున్నాను.

★

1971-1972
బడ్జెట్ పై పత్రికల వ్యాఖ్యలు

ఆంధ్ర పత్రిక: ఆగస్టు 1, 1971

బడ్జెట్‌లో ఇప్పుడు కొత్త పన్నులంటూ లేవని ఎవరు విని సంతోషించి ప్రయోజనం లేదు. అవి ఎట్లా ఉంటాయో మాత్రం ఇప్పుడు ఎవరూ చెప్పలేరు. కాని రాష్ట్ర ఆర్థిక మంత్రి చెప్పిన దాన్ని బట్టి అమ్మకాల పన్ను విషయంలో ఏవో మార్పులు జరుగుతా ? మాత్రం ప్రస్తుతానికి ఒప్పుకోవచ్చు.

అయితే ఈ సందర్భంలో మెచ్చుకోవలసిన విషయం ఒకటి ఉంది. అది విద్యుచ్ఛక్తికి ఎక్కువ మొత్తాన్ని వార్షిక ప్రణాళిక కేటాయించడం. 1971–72 బడ్జెట్ అంచనాలలో విద్యుదుత్పాదనకుగాను 42 కోట్ల 64 లక్షలదాకా రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు సమకూర్చుకోవలసి ఉంటుంది. ఇక ఇంకొక విశేషం ఏమిటంటే, అటు వ్యవసాయరంగంలోని కార్యక్రమాలకు, ఇరిగేషన్‌కు కలిసి ఎంత మొత్తాన్ని వార్షిక ప్రణాళికకు కేటాయించారో, విద్యుదుత్పత్తికి దాదాపు అంత మొత్తాన్ని కేటాయించారు. అయితే ఇచ్చట విద్యుచ్ఛక్తికి ఇంకా ఎక్కువ మొత్తాన్ని కేటాయించవలసిన స్థితి ఉంది.

ఆంధ్ర ప్రభ: జూలై 31, 1971

పరిపాలనా యంత్రాంగంలో ప్రభుత్వ లక్ష్య సాధనకు, ప్రజాభిమతాలను తీర్చడానికి తగ్గట్టుగా చేయనున్న మార్పులను గురించి అర్థిక మంత్రి వెల్లడించిన విషయాలపై వెంటనే వ్యాఖ్యానించడంకంటే ఆ మార్పులవల్ల పరిస్థితులలో రాగల మార్పులను గమనించేవరకు వేచి వుండటం మంచిది. చాలా కాలంగా ఈ సంస్కరణలు జరుగుతూనే వున్నవి. అయినా పరిస్థితులలో మార్పులు మాత్రం రాలేదు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యల ఫలితాలు ఇంకా ప్రజల అనుభవానికి రాలేదు. కేంద్ర ప్రభుత్వంనుంచి ఈ కార్యక్రమాలకు అధిక నిధులను పొందడానికి ప్రయత్నింపవలసి వుంటుంది.

ఆంధ్ర జనత : జూలై 31, 1971

అదనపు వనరుల కల్పన విషయంలో సామాన్య ప్రజానీకంపై ఏ మాత్రం భారంపడకుండా రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త తీసుకొనడం ముదావహం. ప్రజలకు ఎట్టి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త వహించిన ప్రభుత్వాన్ని అభినందించవలసి ఉన్నది.

ప్రణాళికా పెట్టుబడులు $\frac{2}{3}$ వంతులు ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి రంగాలకు కేటాయించడం మన రాష్ట్ర అభివృద్ధి సక్రమంగా జరగడానికి దోహదం చేయగలదు. మనకు ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఇరిగేషన్ ప్రాజెక్టులు, పరిశ్రమలు అభివృద్ధికి విద్యుచ్ఛక్తి ఉత్పాదన అత్యవసరమనే విషయం తెలిసినదే. కొత్తగూడెం థర్మల్ కేంద్రం మూడవ దశకు 12.82 కోట్ల రూపాయలు అత్యధిక మొత్తం కేటాయించడం విద్యుచ్ఛక్తి ఉత్పాదనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను సూచిస్తున్నది. విద్యుచ్ఛక్తి ఉత్పాదన విషయంలో మనం శీఘ్రతర చర్యలను తీసుకొనవలసిన దృష్ట్యా కొత్తగూడెం థర్మల్ కేంద్రానికి ఈ కేటాయింపు సముచితంగా ఉన్నది.

రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత జాగ్రత్తగా బడ్జెటును రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా అభినందించవలసి ఉన్నది. కాగా సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు జీతం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం ఉద్యోగులపట్ల ప్రభుత్వ ఉదారతను సూచిస్తున్నది. ఉద్యోగులు ఈ విషయము గమనించగలరని ఆశిస్తాము.

ఆంధ్ర జ్యోతి: జూలై 31

కొత్త పన్నులు లేకుండా మిగులు బడ్జెట్‌ను ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి సమర్పించడం విశేషమే. రెవిన్యూ అకౌంట్‌లో 13 కోట్ల 78 లక్షల మిగులును ఆయన చూపించారు.

విద్యుచ్ఛక్తి విషయంలో ఇప్పటికీ రాష్ట్రంలో కొరత వున్నది. చతుర్థ ప్రణాళిక అంతం నాటికి కూడా ఈ కొరత తీరబోవడం లేదు. రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక పురోగతి విద్యుచ్ఛక్తి మీదనే ఆధారపడి వున్నది. 1971–72 వార్షిక ప్రణాళికలో మూడింట రెండువంతుల వరకు ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి పద్దులకు కేటాయించడం సమర్థించదగిందే.

ఆర్థికమంత్రి తమ సుదీర్ఘ ప్రసంగానికి కొసమెరుపుగా ప్రభుత్వోద్యోగులకు ఇటీవలి సమ్మెకాలపు జీతం కూడ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. దాన్ని ఇంతకాలం ఎందుకు నిలిపి వేసినట్టో, ఇపుడు ఎందుకు ఇవ్వదలచినట్టో తెలియదు. ఏమైనా ఈ ప్రకటన ప్రభుత్వోద్యోగులకు సంతోషం కలిగిస్తుంది.

రాష్ట్రంలో ధరలు, ముఖ్యంగా ధాన్యం ధరలు పెరుగుతున్నాయి. వీటిని అదుపుచేయడానికి ప్రభుత్వం కొన్నిచర్యలు గైకొన్నట్టు ఆర్థికమంత్రి ప్రకటించారు. కాని, వాటి ప్రభావం ధరలపై ఏమాత్రం పడుతుందన్నది అనుమానం. చౌక ధరల దుకాణాలను ప్రారంభించడం వంటి చర్యలు గైకొనడం అవసరం కావచ్చు.

విశాలాంధ్ర: ఆగస్టు 1

1971–72 ఆంధ్రప్రభుత్వ బడ్జెట్‌లో, రెవిన్యూఖాతాలో 13 కోట్ల 78 లక్షల మిగులు చూపించారు. ఇదే ప్రధానమైన అంశమైనట్లు, ఆర్థిక సౌష్ఠవానికిది చిహ్నమైనట్లు మంత్రులు, వారి అనుయాయులు చిత్రిస్తున్నారు.

రెవిన్యూఖాతా, పెట్టుబడిఖాతా కలుపుకుంటే గాని మొత్తం స్వరూపం రాదు. అందులో 9 కోట్ల 59 లక్షలు లోటు వుండనేవుంది.

నిజానికిది సమగ్ర చిత్రణ కాదు. రిజర్వు బ్యాంకు వద్ద రాష్ట్ర ప్రభుత్వం తెచ్చుకున్న ఓవర్ డ్రాఫ్టులు కూడా కలుపుకోవాలి. ఆ బాకీ ఎప్పటికైనా చెల్లించ వలసిందే కనుక. అప్పుడు లోటు 56 కోట్ల 93 లక్షలౌతుంది.

మూడు నెలల క్రితం ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు తాత్కాలిక సహాయం కోసం సమ్మె ప్రారంభించినపుడు ప్రభుత్వమూ, ముఖ్యమంత్రి ఓవర్ డ్రాఫ్టులను గురించి రోజు చెప్పేవారు. ఇప్పటికే ఇంత బాకీ వున్నాము. ఇక దమ్మిడి కూడా రిజర్వు బ్యాంకు ఇవ్వనంటున్నది. అదనపుభారం ఎలా మోయగలం అని ఆ నాటి వాదన.

ఈ నాడేమో, అంతా సవ్యంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నాడు మొండిగా నిరాకరించిన సమ్మె కాలం వేతనాన్ని ఇవ్వటానికి ప్రభుత్వం ఈ నాడు అంగీకరించింది.

ఇంత ఆలస్యంగానైనా ప్రభుత్వం యీ నిర్ణయం చేసినందుకు హర్షించ వలసిందే. మూడు నెలలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాష్ట్రంలోని ప్రజాతంత్ర వాదులు, ప్రతిపక్షాలు సాగించిన అందోళన కిదొక విజయం.

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయిక రాష్ట్రం. సక్రమ భూసంస్కరణలు అమలు జరిగి, మిగులు భూమి పేద ప్రజానీకానికి లభించిన నాడే, గ్రామ సీమలలో నిజమైన వ్యవసాయిక విప్లవం ప్రారంభం కాగలదు. రైతాంగం, పేద ప్రజల కొనుగోలు పెరిగి, పరిశ్రమాభివృద్ధికి భౌతిక పరిస్థితులు ఏర్పడి రాష్ట్రాదాయం పెరుగుతుంది. లోటు బడ్జెటులు, ఓవర్ డ్రాఫ్టుల బాధ అప్పుడు మాత్రమే పరిష్కారమౌతుంది.

ఆంధ్ర భూమి : జులై 31

తక్కిన విషయాల ప్రస్తావనకు ముందుగా, ఆర్థిక మంత్రి ప్రకటించిన ఒక నిర్ణయాన్ని నిండుగా అభినందిచాలి. నాలుగున్నర లక్షల నాన్-గజిటెడ్ ఉద్యోగులకు నిన్న శుభదినం;- "చెల్లయో చెల్లకో"- ప్రభుత్వోద్యోగులు యిటీవల సమ్మెచేశారు. చివరివరకూ సాగదీసి, 56 రోజుల వేతనాన్ని కోల్పోయారు. సమ్మెకాలాన్ని సెలవు దినాలుగా పరిగణించి వేతనాలు ఇచ్చివేస్తున్నట్టు ఆర్థిక మంత్రి తెలియజేయడం నాలుగున్నర లక్షల కుటుంబాల సభ్యులందరి హృదయాలలోనూ దీపకళికలు వెలిగిస్తుంది; పూర్తిగా వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తుందనే సూచనలు ముందుగానే తెలిశాయి;- ఐనా అధికారిక ప్రకటన సంతోషదాయకం కదా?

చెల్లిస్తేనే సాంఘిక న్యాయాన్ని పాటించినట్లవుతుంది; నిరాకరించిడం సమర్థనీయం కాదు; సముచిత నిర్ణయానికి వచ్చినందుకు ప్రభుత్వాన్ని అభినందించాలి.

స్వాతంత్ర్య యోధుల వీరభూమి

బంగారు బంగ్లాదేశ్

వావిలాల గోపాలకృష్ణయ్య

"సోనార్ బంగ్లా" 'బంగారు బంగ్లా నా దేశం' అని రవీంద్ర కవీంద్రుని వాణి పలికింది. అది యేనాడో కొన్ని దశాబ్దాల క్రింద ధ్వనించితే ఈనాడు అదే జాతీయ గీతంగా నూతన స్వతంత్ర ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రభవించింది. బంగ్లా బంధు శ్రీ ముజిబుర్ రహమాన్ బంగ్లా దేశ్ స్వతంత్ర రిపబ్లిక్‌గా 17–4–71న ప్రకటించారు. ఎరుపు, ఆకుపచ్చ, బంగారు రంగుల స్వతంత్ర జండా ఎగుర వేశారు. 'బంగారు బంగ్లా నా దేశం' అని జాతీయ గీతం పాడారు.

వంగదేశ ప్రజలు వీర యోధులు వంగదేశ చరిత్ర విప్లవ చరిత్ర. బ్రిటిషు ప్రభుత్వం ప్లాసీ యుద్ధం నుండి మీర్‌జాఫర్ చరిత్ర నుండి, బంగ్లా విభజన నుండి, వందేమాతరం ఉద్యమం నుండి, విప్లవ యోధుల సాహస చర్యల నుండి మత ప్రాతిపదికతో యేర్పడిన పాకిస్థానీ మిలిటరీ పరిపాలన నుండి, భాషా ప్రాతిపదికతో యేర్పడిన జాతీయ స్వాతంత్ర్య సమరం వరకు వంగ ప్రజలు వీర యోధులుగానే నిల్చారు, నడుస్తున్నారు. ఈస్టిండియా కంపెనీ బంగ్లా దేశాన్ని కబళించి రాజధాని నిర్మించుకుంది. సోనారు బంగ్లాను బ్రిటిషు ప్రభుత్వం రెండు రాష్ట్రాలుగా 1905లో విభజించింది. దేశ భక్తిమయ బెంగాలీలను కలసి ఒకటిగా వుంచటం యిష్టం లేక చీల్చింది. సింహగర్జన చేసి త్రిప్పి కొట్టి 1906లో మత పరమైన విభజనను సహించజాలమని ప్రతిఘటించి విభజనను రద్దు చేసుకొనడంతో భారత స్వాతంత్రోద్యమంలో జాతీయోద్యమంలో పునాదులు వేసింది. ఆ స్వాతంత్ర్యోద్యమ పరిణామంలో జాతీయ సిద్ధాంతానికి విరుగుడగనే యేర్పడిన విజాతీయ సిద్ధాంతంలో 1906లో విఫలం అయిన బెంగాలీ విభజనను 1947లో ఇండియా, పాకిస్థాన్ అంటూ రెండు దేశాలుగా చీల్చి, హిందూ ముస్లింల పై పరస్పర మతోన్మాదాన్ని అగ్ని జ్వాలగా తయారు చేసి, భారత దేశాన్ని విడిచి వెళ్లుతున్నాం అని ప్రకటించి ప్రక్కకు తొలగింది బ్రిటిషు కుటిల నీతి.



తూర్పు బెంగాల్ నుంచి వచ్చిన కొంతమంది స్త్రీ శరణార్థుల్ని కలకత్తా డమ్‌డమ్ విమానాశ్రయంనుంచి విమానంలో దేశంలోని యితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలిస్తున్నదృశ్యం


పాకిస్థాన్ పదంలో నిజంగా బెంగాలు లేదు. (పి) పంజాబు, (ఎ) ఆఫ్ఘనిస్థాన్, (కె) కాశ్మీర్ (ఐ) ఇరాన్‌లతో ఉన్న ముస్లిం–ముస్లింయేతర ద్విజాతి సిద్ధాంతంలో జన సంఖ్య ప్రాతి పదిక పై విభజించి ఒక 'స్థాన్' ఏర్పరచ వలెనని సాగిన ఆలోచన నన్వయించుకొని అధిక సంఖ్యాకులుగా వున్న బెంగాలీలను అధిక ముస్లింలు–హిందూ జన సంఖ్య ప్రాతి పదిక పై తూర్పు బెంగాలు, తూర్పు పాకిస్థాన్‌గా పంజాబు నుండి సింధు–బెలూచిస్థాన్ సరిహద్దు రాష్ట్రాలు కలిసి పశ్చిమ పాకిస్థాన్‌గా భారతదేశం రెండు ప్రాంతీయ ప్రాదేశిక రాజ్యాలుగా–ఇండియా, పాకిస్థాన్‌ల పేరుతో ఒక దానికి మరొక దానికి 900 మైళ్ళ దూరంలో ఉన్నా 1947 లో పాకిస్థాన్ ఒక దేశంగా, ఇండియా మరొక దేశంగా ఆవిర్భవించినవి.

అనాడే 1947 మార్చి 22 వ తేదీ బెంగాలులోని ముస్లిం నాయకులలో ముఖ్యులు శ్రీసుహ్రావర్ది, కాంగ్రెసు నాయకులలో ముఖ్యులు శరచ్చంద్రబోసులు సంయుక్త ప్రకటన చేస్తూ హిందువులైనా, ముస్లింలైనా బెంగాలీలుగనే వుండడం తమకోర్కెయని, పాకిస్థాన్‌సమస్యలో బెంగాలును కలుప నీయకుండా వదలి వేయవలెనని కోరారు. దానిని వెంటనే మహమ్మదాలి జిన్నా ఖండించి ముస్లింలు అధిక సంఖ్యగా వున్న ప్రాంతం పాకిస్థాన్ రాజ్యభాగంగాక తప్పదన్నారు. లార్డుమౌంటు బాటన్ అంతేనన్నారు. కాంగ్రెస్ నాయకత్వం అందుకు సమ్మతించింది.

దేశ విభజన

దేశ విభజనతో ఆవేదనతో నైతేనేమి, ఆవేశంతో నైతేనేమి మతా వేశానికి గురియై ఒకరి నొకరు పొడుచుకొని చంపుకోవడంవల్లనేమి, చంప బడడం వల్లనేమి 80 లక్షల మంది జనం అటు ఇటు హిందూ, ముస్లింలు బలైపోయారు. 1947 ఆగస్టు 14న పాకిస్థాన్, 1947 ఆగస్టు 15న భారతదేశ్ రెండు దేశాలుగా బయట పడిపోయినవి.

ఇండియా రాజకీయ రంగంలో వయోజన ఓటింగుతో పార్లమెంటుకు యింత వరకు అయిదు మారులు ఎన్నికలు జరిగినవి. భారత దేశంలో 1953–1956లో భాషా రాష్ట్రాలుగా దేశాన్ని భాగించి, ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, రాజస్థాన్ గుజరాత్, జమ్మ కాశ్మీర్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, మైసూరు, ఒరిస్సా, పంజాబు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మేఘాలయ రాష్ట్రాలుగాను, అండమాన్, హిమాచల ప్రదేశ్, లక్కదీవులు, మణిపూర్, త్రిపుర, దాద్రా, గోవా, నాగాలాండు, నీఫా, పుదుచ్చేరి చండిఘర్‌లు కేంద్ర పాలిత ప్రాంతాలుగను, 29 ప్రాంతాలుగ పరిపాలన సాగుచున్నది ఈ రాష్ట్రాలకు ఎన్నికలు జరగడం, ఎన్ని



ఒక శరణార్థుల శిబిరంలో వారి కష్టనిష్ఠురాల్ని సానుభూతితో వింటోన్న ప్రధానమంత్రి


కలలో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవడం జరుగుతున్నది. ప్రజా ప్రతినిధి పాలన సాగుతున్నది.

పాకిస్తాన్ యేర్పడినప్పుడు విడివడిన తూర్పు బెంగాల్ ఒకే ఒక రాష్ట్రం తూర్పు పాకిస్తాన్ క్రింద వుంది. పశ్చిమ పాకిస్తాన్‌లో సింధు, పంజాబు, సరిహద్దు రాష్ట్రం బెలూచిస్తాన్ చిత్రాలు భాగల్పూర్ సంస్థానాలుగను వుండి అప్పటికున్న శాసన సభలతో సాగి పోతున్నవి. ఇంగ్లాండు ప్రభుత్వం భాషా రాష్ట్ర ప్రాతిపదిక మీద విభజించిన సింధు పాకిస్తాన్‌లో వుంది. ఒరిస్సా ఇండియాలో వుంది. అటు తరువాత 1954లో పాకిస్తాన్‌లో ఎన్నికలు జరిగాయి. భాషా రాష్ట్ర సిద్ధాంతం మీద సింధు రాష్ట్రం యేర్పడినా సింధు, బెలూచిస్థాన్, పంజాబు, పుస్తు, బెంగాలీ ఉర్దూ భాషలు మాట్లాడబడుతున్నా ఉర్దూ భాషను అన్ని రాష్ట్రాలలో అధికార భాషగా చేయవలెననే తలంపు కలిగింది. అధికారపార్టీ యైన ముస్లిం లీగకు. బెంగాలీ భాషనే అధికార భాష చేయవలెననే అవామీ లీగును అధిక సంఖ్యలో గెలిపించి వంగీయులు తమ బంగారు బెంగాలుపై కలిగి వున్న ప్రేమాదరాలు వెలిబుచ్చారు జాతికిమతం కన్నా భాషయే ఆధారం అని తేల్చి చెప్పారు.

చరిత్ర తలచుకున్నకొద్దీ, పాత సంఘటనలు జ్ఞప్తికి వస్తున్నవి. ఈ అవామీలీగ్ బెంగాల్ భాషా ప్రాతిపదికతో ఎన్నికలలో అఖండ విజయం సాధించిన విషయంవల్ల పండిత నెహ్రూ, మతి సమస్య ఉన్నకూడా భాషాసమస్యచేత చాల ప్రధానంగా ప్రజల మనోభావాలు ప్రభావితం అవుతవని. గమనించడం జరిగింది. అప్పటికే ఆంధ్ర రాష్ట్రోద్యమం-శ్రీ పొట్టి శ్రీ రాములు ఆత్మార్పణతో 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించడం జరిగింది. ఈ రెంటి ప్రభావాల ఫలితంగా పండిత నెహ్రూ హుబ్లీలో అనుకుంటూ, భాషాధారక రాష్ట్రాల నిర్మాణ సంఘాన్ని వేస్తానని ప్రస్తావించారు. అది లోక సభలో 22-12-53న ప్రకటించారు ఫజాలాలీ అధ్యక్షతను 28-12-53న రాష్ట్రాల పునర్నిర్మాణ కమిషన్ నియమించారు.

నియంతృత్వ ప్రారంభం

ఈ అవామీ లీగు విజయం తర్వాత ఎన్నికలు మరపు తగలడం, ప్రజాస్వామిక పరిపాలన అంతం కావడం ఒక గవర్నరును తొలగించి మరొక గవర్నరును వేయడం, చివరకు గవర్నరు జనరల్‌ను తొలగించి రద్దుచేయడం, చివరకు శ్రీ అయూబ్‌ఖానే అధ్యక్షుడుగ, నియంతగ పరిపాలన సాగించడం అందరికీ తెలిసిందే. ప్రజా ప్రతినిధుల పరిపాలనను రద్దుచేయడమే కాకుండా అసలు భాషారాష్ట్ర ప్రాతిపదికమీద అప్పటికే యేర్పడిన రాష్ట్రాలవల్ల సింధీయులు, పఠానులు కోరుతున్న పఖ్తునిస్తాన్ ధైర్యంతో నిలిచి ఎన్నికలలో గెలిచి బుజువుచేసికున్న



ఇచ్ఛామతి నదిని దాటి భారతదేశం చేరుకున్న ఒక శరణార్థి కుటుంబం.


బెంగాలీల తూర్పు బెంగాలు నుండి బయట పడుటకు నియంతృత్వ విధానంతో కేంద్రీకృతమై యుండుటకు పాకిస్తాన్‌లో భాషా ప్రాతిపదికతో ఉన్నవే కాకుండా అసలు యీ వివిధ రాష్ట్రాలు రద్దుచేసి తూర్పు పాకిస్తాన్, పశ్చిమ పాకిస్తాన్‌గా రెండే రెండు ప్రాంతాలుగా పాలన సాగించారు. రెంటికి చెరొక గవర్నరును నియమించారు. బెంగాలు భాషపై ఉర్దూభాషను రుద్దటానికి కేంద్ర ప్రభుత్వం ఎంత విశ్వప్రయత్నం చేసిందో తరతరాలనుండి నరనరాంలో ఎక్కివున్న భాషా ప్రాతిపదిక పై యేర్పడిఉన్న దేశభక్తి దీక్షలు అంతగా స్థిరపడడం బలపడడం జరిగింది.

ప్రజాస్వామిక ఓటింగువిధానం తొలగించి 'బేసిక్ డెమోక్రసీ' అనే పేరుతో పంచాయతీలద్వారా ఎన్నికలు నిర్వహించారు. పంచాయతీలలో యాభై శాతం ప్రజలు ఎన్నుకుంటే యాభై శాతం ప్రభుత్వ ప్రతినిధులనునియమించి. వీరివల్ల ఎన్నికలు నేషనల్ ఎసెంబ్లీకి జరగాలె నన్నారు. అందులోకూడ సంతృప్తి లేక అదీ విఫలం అయింది. పైనుంచి నియంతృత్వంరావడంతో అసంతృప్తి పెచ్చుపెరిగింది. బెంగాలీలు తమకు మరింత అపచారం జరుగుతున్నదని అనుదినం గ్రహించసాగారు.

తూర్పు పాకిస్తాన్ (తూర్పు బెంగాల్)లో ఢక్కా, మైమిన్‌సింగ్, ఫరీదీపూర్, చిటగాంగ్, సిల్‌హెట్, అడవి ప్రాంతం రాజషాహి, దినాజ్‌పూర్, రంగపూర్, బోగ్రా, పబ్నా, కుస్తియా, జస్సోర్, కుల్నా, బాకర్‌గంజ్, అనేపదహారు జిల్లాలున్నవి. పశ్చిమ పాకిస్తాన్‌లో పెషావరు, డేరా ఇస్మాయిల్ ఖాన్, రావల్‌పిండి, సరగోదా ముల్‌తాన్, భావన్‌పూర్, ఖైరేపూర్, హైదరాబాద్ (సింధు), క్వెట్టా, కాలబీ, కరాచి — అనే పదకొండు జిల్లాలున్నవి.

ఈ రెండుప్రాంతాల జనసంఖ్యలోను, నైసర్గిక ప్రాంతీయ పరిసర వివరాలలోను తేడాలున్నవి. తూర్పుపాకిస్తాన్ (తూర్పు బెంగాల్)లో జనసాంద్రత అధికం. దాదాపు చ॥మై. కు 1360 వుంటుంది. సాగుచేయని భూమి అటూ లేనేలేదు. ముఖ్యంగా జనపనార 19 70,000 ఎకరాలలో 9,87,000 టన్నుల పంట ఉత్పత్తి అవుతుంది. వరిపంట మిక్కుటం. అసలు పంట వేయని ప్రాంతమే లేదనవచ్చు తూర్పు బెంగాల్ వైశాల్యం 55,126 చ॥ మైళ్ళు. 1,42,797 చ॥ కిలోమీటర్లు. పశ్చిమ పాకిస్తాన్ వైశాల్యం 310403 చ॥ మైళ్ళు (800408 చ. కిలోమీటర్లు) పాకిస్తాన్ వైశాల్యం 365 529 చ. మైళ్ళు. (9·6720 చ॥ కిలోమీటర్లు) ఇంక జనాభా అతి చేస్తే 1961 జనాభా ప్రకారం మొత్తం పాకిస్తాన్ జనాభా 93 720613 మంది. అందులో పశ్చిమ పాకిస్తాన్ 4,28,80,000 తూర్పు పాకిస్తాన్ (తూర్పు బెంగాల్) 50,840,000. అయితే 1970 జనాభా ప్రకారం మొత్తం పాకిస్తాన్ 12 కోట్ల డెబ్బై ఐదు లక్షలకు పెరిగింది. అందులో తూర్పుపాకిస్తాన్ (తూర్పుబెంగాల్) 5 కోట్లనుండి 2 కోట్ల యాభై లక్షలకు పెరిగింది. పశ్చిమ పాకిస్తాన్‌లో 4 కోట్ల ఇరువది లక్షలనుండి 5 కోట్ల 25 లక్షలకు పెరిగింది. పశ్చిమ పాకిస్తాన్‌లో 4 కోట్లనుండి పైన అదనంగా 96 లక్షలు పెరిగితే తూర్పు పాకిస్తాన్‌లో 5 కోట్ల 25 లక్షలనుండి పైన అదనంగా రెండుకోట్ల 50 లక్షలు పెరిగింది. 1971లో జనసాంద్రత అంతా పాకిస్తాన్‌కు చదరపు మైలుకు 313 వుంటే పశ్చిమ పాకిస్తాన్ 169 వుంది: తూర్పు పాకిస్తాన్ (తూర్పు బెంగాల్)లో 1360 వుంది.

ఈ రెండు ప్రాంతాలు ముస్లిమ్ అధిక సంఖ్య ప్రాతిపదిక మీదనే ఏర్పడ్డ సంగతి తెలిసిందే. అయినా ఈ తూర్పు, పశ్చిమ



శరణార్థుల నిమిత్తం భారతదేశం రోజుకు కోటిన్నర రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నది. శరణార్థులకు ఆహార, వైద్య, వసతి సౌకర్యం కల్పించడం భారతదేశపు మానవతాదృక్పథానికి చిహ్నం. ఈ చిత్రంలో అటువంటి శరణార్థి శిబిరాన్ని ఒక దానిని చూడవచ్చు

పాకిస్తాన్‌లలో మత ప్రాతిపదికమీద జనాభా చూస్తే ఈ విధంగా ఉంది. తూర్పు పాకిస్తాన్ (తూర్పు బెంగాల్)లో ముస్లిమ్‌లు 88.1 శాతం, షెడ్యూల్డు కులాలవారు 6.8 శాతం, సవర్ణ హిందువులు 0.85 శాతం, క్రైస్తవులు 0.4 శాతం, బౌద్ధులు 0.4 శాతం ఉన్నారు. పశ్చిమ పాకిస్తాన్‌లో 97.1 శాతం ముస్లిమ్‌లు షెడ్యూల్డు తరగతులు 1.1 శాతం, సవర్ణ హిందువులు 0.5 శాతం మాత్రం ఉన్నారు. బౌద్ధులున్నా వారిసంఖ్య, క్రైస్తవుల సంఖ్య లభించలేదు.

పశ్చిమ పాకిస్తాన్‌లో ఇంగ్లీషు అధికార భాషగా చలామణి అవుతున్నది. ఉర్దూ, సింధి, పంజాబి, పుష్తొ, బెంగాలీ భాషలు మాట్లాడేవారున్నారు. తూర్పు బెంగాలులో అంతా బెంగాలీ మాట్లాడేవారున్నా స్టేట్స్‌మన్ 1970–71 వార్షికసంచికలో బెంగాలులోని భాష వ్రాయనేలేదు. వ్రాసినా, వ్రాయకపోయినా బెంగాలీయే భాష.

తూర్పు (బెంగాల్) పాకిస్తాన్ రాష్ట్రాదాయం 1969–70లో 153 కోట్ల 34 లక్షలు. వ్యయం 152 కోట్ల 72 లక్షల రూపాయలు. పశ్చిమ పాకిస్తాన్ ఆదాయం 218 కోట్లు. వ్యయం 275 కోట్లు. అంటే రాష్ట్ర జనాభా తక్కువ, రాష్ట్ర ఆదాయ వ్యయాలు ఎక్కువ.

ఇక పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వ ఆదాయం 1969–70 లకు 753 కోట్ల 37 లక్షలు. వ్యయం 612 కోట్ల 3 లక్షలు. రక్షణ వ్యయం 245 కోట్లు, పరిపాలనా వ్యయం 52 కోట్లు, ఋణాల వడ్డీల క్రింద 63 కోట్లు అని స్టేట్స్‌మన్ 1970–71 వార్షిక సంచికలో ఉదహరింపబడినవి.

ప్రెసిడెంటుగా మిలటరీ నియంతృత్వంలో పరిపాలన సాగడం, దాని మిలటరీ కేంద్రాలలోని వారిలో వివాదాలు పెరగడం జరిగింది. ఉన్నత మిలటరీ అధికారంలోవున్న శ్రీ యాహ్యాఖాన్ తిరుగుబాటుచేసి ప్రభుత్వాన్ని వశపరుచుకొని తాను పాకిస్తాన్ సర్వాధికారిగా, ప్రెసిడెంటుగా ప్రకటించుకున్నారు. తాను ఉండవలెనని కొంత పెనుగులాట సాగించినా ప్రయోజనం లేనందున శ్రీ ఆయూబ్‌ఖాన్ ఇంగ్లండు వెళ్ళిపోయి అక్కడ నివాసం ఏర్పరుచుకున్నారు. అంతటితో పాకిస్తాన్ సర్వాధికారం యాహ్యాఖాన్ వశమైంది.


ఢక్కా కుట్రకేసు

అప్పటికే ప్రజలలో ముఖ్యంగా తూర్పు పాకిస్తాన్ విద్యార్థులలో పెల్లుబికిన ఆందోళన విశ్వవిద్యాలయాలలో, ప్రజాసముదాయములో 1966 నుండి తీవ్ర రాజకీయ పోరాటం జరిగింది. ఆనాటి పాకిస్తాన్ శ్రీ షేక్ ముజబూర్ రహమాన్‌పై 1967లో ఢక్కా కుట్ర కేసు పన్నడం—అందులో రెండు సంవత్సరాలు విచారణ జరగడం, చివరకు 22–2–1969లో ముజబూర్ రహమాన్ విడుదల కావడం కూడా జరిగింది. ఇది ఆయూబ్‌ఖాన్ రాజపాలనలో జరిగిందే. ఈ ప్రజాందోళన ఫలితంగా తరువాత జరిగిన ప్రజాభిలాష ప్రభావం వల్ల నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు ప్రకటించడం 1970 డిసెంబరులో జరపడం జరిగింది. శ్రీ షేక్ ముజబూర్ రహమాన్ నాయకత్వాన, అవామీలీగ్, భషానీ నాయకత్వానగల పార్టీలు తూర్పు బెంగాల్‌లో విజయం పొందాయి. అవామీలీగ్ ఆరు సూత్రాల ప్రాతిపదికపై ఎన్నికలలో నిలచింది. నేషనల్ అసెంబ్లీలో 319 సీట్లకు 167 సీట్లు, రాష్ట్ర అసెంబ్లీలో 310 సీట్లలో 288 సీట్లు గెలుచుకోగలిగారు. తూర్పు బెంగాల్‌లోవున్న నేషనల్ అసెంబ్లీ సీట్లలో 1 సీటు మాత్రము ఇతరులకుపోయింది వీరి షట్సూత్ర ప్రణాళిక ప్రజలు బలపరచారు.

అందులో ముఖ్యంగా తూర్పు బెంగాల్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాలని, తూర్పు బెంగాల్‌కు ప్రధాన మంత్రిత్వం ఉండవలెనని, దేశరక్షణ, విదేశ వ్యవహారాలు మాత్రమే కేంద్రానికి ఉండాలని, విదేశాలతో వ్యాపారం, రవాణా, పోలీసు, అన్ని అధికారాలు రాష్ట్రాలకు ఉండాలని, ముఖ్యంగా పూర్వ బెంగాలు స్వతంత్ర రాష్ట్రంగా వెలయవలెనని తమ ప్రణాళికలో ప్రకటించారు. పశ్చిమ పాకిస్తాన్‌లో శ్రీ భుట్టో నాయకత్వానవున్న పాకిస్తాన్ ప్రజాపార్టీ కేంద్ర ప్రభుత్వం దృఢంగా ఉండవలెనని ఎన్నికలలో ప్రచారం చేశారు. అక్కడ ఆ పార్టీకి మెజారిటీ వచ్చింది. ఎన్నికల ఫలితాలు ప్రకటింపబడిన అనంతరం 120 రోజులలోగా ఈ నేషనల్ అసెంబ్లీ ఒక రాజ్యాంగాన్ని తయారు చేయవలెనని, ఆవిధ



రోజుకు అరవై వేలకు పైగా శరణార్థులు తూర్పు బెంగాలు నుంచి భారతదేశానికి వస్తున్నారు. ఇచ్ఛామతి నదినిదాటి భారత భూభాగంమీద అడుగుపెట్టిన శరణార్థులు కొందరిని ఈ చిత్రంలో చూడవచ్చు.



తూర్పు బెంగాలోని కుస్తా జిల్లాకు చెందిన ఆసీమా ఖాతున్ అగర్తలా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

ముగా తయారు చేయకపోతే రద్దు చేయబడవచ్చునని ప్రెసిడెంటు యాహ్యాఖాన్ ప్రకటించారు.

ఈ నేషనల్ అసెంబ్లీ ఢక్కాలోనే జరుపవలెనని అధిక సంఖ్యాకులు ఇక్కడే ఉన్నవారని కరాచీలోగాని, ఇస్లామాబాదులో గాని జరుగ కూడదని అవామీలీగ్ నాయకులు ప్రకటించారు. భుట్టో ససేమిరా తను ఢక్కాకు వస్తే ప్రాణభీతి ఉన్నదని, ఢక్కాలో జరిపినట్లయితే తాను రాలేనని తెలిపాడు. అవామీలీగ్ వారు భషానీ నాయకత్వానగలపార్టీ ఢక్కాలోనే జరుగవలెనన్నారు. చివరకు 12–3–71న ఢక్కాలో నేషనల్ అసెంబ్లీ సమావేశాన్ని శ్రీ యాహ్యాఖాన్ ఆహ్వానించాడు

అసలు రాజ్యాంగం ఏ ప్రాతిపదికమీద రచింపబడవలెనో తేలందే చర్చలు అనే మీమాంస వచ్చింది. ఇది బహిరంగ చర్చకు దిగింది. అటు భుట్టో తన మైనారిటీ సంఖ్యతో నేషనల్ అసెంబ్లీలో ఉంటూ కూడా అసలు బలవత్తర కేంద్రం ఉండే ఆలోచన లేకపోతే తాను పాల్గొన బోనని శ్రీ అబ్దుల్ రహమాన్ తాను ఎన్నికలలో ప్రకటించిన ఆరు సూత్రాల ప్రాతిపదికమీదనే రాజ్యాంగ రచన జరగవలసి వున్నదని, అది అయితేనే తాను, తన తూర్పు బెంగాలు జనం పాల్గొనడం జరుగుతుందన్నాడు.

ఈలోగా ప్రజాందోళనకు భయపడి అప్పుడే యాహ్యాఖాన్ మిలటరీ పరిపాలనకు కావాల్సిన ఏర్పాట్లు తూర్పు బెంగాల్‌లో చేయసాగారు. 12వ తేదీ సమావేశం ఏర్పాటై జరగకుండా విఫలం అయింది. ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగి ఎన్నికలలో నియంతృత్వ పాలనలోవున్న అన్ని అవధులను ఏదుర్కొని ప్రజావాహిని బలంతో విజయం సాధించిన అవామీలీగ్‌కు రాజ్యాధికారం అప్ప చెప్పకుండాఉండే దురుద్దేశం బయటపడిపోయింది. మిలటరీ ఏర్పాటులతో తూర్పు బెంగాల్ నూతన దశను అందుకుంది.

అంతటితో అవామీలీగ్ అహింసాయుత సహాయనిరాకరణం ప్రకటించింది. పాకిస్తాన్ ప్రభుత్వంక్రింద ఉన్న మిలటరీగాని, పోలీసు, పౌరపాలనలోనున్నవారుగాని, ఎవరూ ఆఫీసులకు వెళ్ళ కూడదని, అహింసాయుత సహాయ నిరాకరణం అవలంబించాలని దేశమంతా ప్రకటించారు. ప్రజానీకం అండగా ఉంది. తూర్పు బంగ్లా ప్రజలు అంతా అమలు జరిపారు.


మిలటరీ పరిపాలన సాగించడానికి యాహ్యాఖాన్ మిలటరీ గవర్నరుగా టిక్కాఖాన్‌ను నియమించారు. గవర్నరుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు తాను ప్రమాణం స్వీకరించ వలెనని, అందుకు ఏర్పాటు చెయ్యమని కోరగా తూర్పు బెంగాల్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తూర్పు బెంగాల్ ప్రజాప్రతినిధి రాజ్యాధికారంగల శ్రీ ముజబూరు రహమాన్ ఆజ్ఞమేరకు ప్రమాణం స్వీకరించ జేయడానికి నిరాకరించారు. తూర్పు బెంగాల్‌లో పాకిస్తాన్ రాజ్యాధినేతల పాలన అంతరించి శ్రీ ముజబూర్ నాయకత్వాన ప్రజాపాలన సాగింది. వ్యాపారాలు, రవాణాలు అన్నీ సాగుతూనే వున్నవి. బ్యాంకులు లావాదేవీలు చేస్తున్నవి. కానీ పాకిస్తాన్ ప్రభుత్వ కార్యాలయాలు—పాలన సాగకుండా స్తంభించిపోయింది.

స్వాతంత్ర్య ప్రకటన

చివరకు ప్రెసిడెంటు యాహ్యాఖాన్ నేషనల్ అసెంబ్లీ సమావేశం ఢక్కాలోనే 25 మార్చి 1971న జరపదలచానని ప్రకటించాడు. మార్చి 15న మిలటరీ పరిపాలన ప్రకటించారు. ముజబూర్ రహమాన్ ప్రకటించిన సహాయ నిరాకరణం ధిక్కరించి పాకిస్తాన్ అధికారులు అందరూ తమ తమ స్థానాలలోచేరి తమ విధులు నిర్వహించవలసిందిగా ఆదేశించారు. కానీ ఎవరూ వెళ్ళలేదు. మిలటరీ పరిపాలన ప్రకటించిన వెంటనే 15–3–71న అబ్దుల్ రహమాన్ తమ ఆదేశాలను పాలిస్తున్న ప్రజల నుద్దేశించి తాను మిలటరీ అధికారుల నుండి రాజ్యాధికారాన్ని స్వీకరించానని బెంగాలు దేశ స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. రేడియో స్వాధీనం చేసుకున్నారు. బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని ఏర్పరుస్తూ, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు.

ఇండియాకు స్వాతంత్ర్యం ఇస్తామంటూ 1946లో వచ్చిన బ్రిటిష్ మంత్రివర్గ సూచనలలో విదేశాంగ వ్యవహారాలు, దేశ రక్షణ, రవాణా వాటికవసరమగు ద్రవ్యవనరులు కేంద్రానికి వుండ వలెనని, మిగతా అంశాలన్నీ రాష్ట్రాలకే ఉండాలన్నారు. 1946 కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలో దేశంలో వివిధ రాష్ట్రాలు స్వాతంత్ర్యం కలిగి ఉండాలని, అవి ఐచ్ఛిక ఫెడరేషన్‌గా ఉండ వలెనని అధికాధికారాలు రాష్ట్రాల జాబితాలోను, కొద్ది అధికారాలు కేంద్ర జాబితాలోను ఉండాలని, అట్టి రాజ్యాంగాన్ని సాధిస్తామని ప్రకటించారు. పాకిస్తాన్ స్వరూప స్వభావాలు నిర్ణయించుతూ 1940లో చేయబడిన లీహార్ తీర్మానంలో పంజాబు, సింధు, సరిహద్దు రాష్ట్రం, బెలూచిస్తాన్, తూర్పు ప్రాంతములోని ప్రాంతాలు కలిపి స్వాతంత్ర్య స్టేట్సు కావలెనని, అవి సార్వ భౌమాధికారం—స్వాతంత్ర్యం కలిగియుండవలెనని ముస్లింలీగ్ నిర్ణయించింది.

(సశేషం)



జులై ౭వ తేదీన వజ్రకరూరులో దొరికిన వజ్రాన్ని ముఖ్యమంత్రి పరిశీలిస్తున్న దృశ్యం

మనరాష్ట్రంలో వజ్రాల గనులు

దక్షిణ భారత దేశంలోకంతటికి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే వజ్రాల గనులు వున్నాయి. గోలకొండ రాజుల కాలంలో వజ్రాలు సమృద్ధిగా లభించేవని చరిత్ర చాటి చెబుతున్నది. కర్నూలు, అనంతపురం, మహబూబునగరం, గుంటూరు, వరంగల్లు, కృష్ణాజిల్లాల్లోనే ఎక్కువగా వజ్రాలు లభించేవి. వజ్రాల గనుల ప్రాంతాలు గోల్కొండ రాజ్యంలో అంతర్భాగంగా వుండినందువల్ల, వీటికి గోలకొండ పేరువచ్చింది. ఇవి గోల్కొండ వజ్రాలుగా వాసికెక్కినాయి.

భారత ప్రభుత్వ జియోలాజికల్ సర్వేవారు క్రమపద్ధతిలో ఒక పరిశీలన జరిపి వజ్రాలకు నెలవైన ప్రాంతాలను కనుగొన్నారు. ఇవి కడప ప్రాంతంలోనూ, వాటి పరిసరప్రాంతంలోనూ వ్యాపించి వున్నాయి. ఇక్కడి వజ్రాలు ముఖ్యంగా మూడురకాలుగా వున్నాయి. అనంతపురం జిల్లాలోని వజ్రకరూరు, లట్టవరంలో లభించే వజ్రాలు. ఇవి కింబర్లైట్స్ అనేరకానికి చెందినవి. రెండవరకం కర్నూలులోని బనగానపల్లి ప్రాంతాలు, కడప, మహబూబునగరం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లభించేవి వీటిని సెకండరీ డైమండ్ ఫారప్స్ అంటారు. కృష్ణా, తుంగభద్రా, పెన్నానదీ తీరప్రాంతాలలో లభించేవి మూడోరకానికి చెందినవి. వీటిని టెర్షియరీ డైమండ్ ఫారప్స్ అంటారు. వజ్రకరూరులోని అగ్నిపర్వత శిలల్లో వజ్రాలు లభించడమే కాకుండా ఇక్కడి పరిసర ప్రాంతాలలో కూడా అప్పుడప్పుడూ వజ్రాలు దొరుకుతూవుంటాయి. అంతేకాకుండా కర్నూలు జిల్లాలోని బనగానపల్లి, మునిమడుగు, రాయళ్లకోట–యెంబాయి ప్రాంతాలలోను, కర్నూలు–బొలారంల మధ్య తుంగభద్ర కృష్ణా నదీ తీరాల్లోనూ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పరిటియాల, కొల్లూరు ప్రాంతాలలోనూ వజ్రాలు లభిస్తాయి.

వజ్రకరూరు, లట్టవరంలలో అగ్నిపర్వత శిలాప్రాంతాలు నాలుగు వున్నాయని జియోలాజికల్ సర్వేవారు పరిశోధనలు చేసి 1961_63 లో కనుగొన్నారు. వాటిల్లోకెల్లా పెద్దది వజ్రకరూరులో వుంది. దీనిని పైప్‌రాక్ అని వ్యవహరిస్తారు. ప్రైవేటు కంపెనీలు కొన్ని లోగడ వజ్రాలు వెలికితీయడానికి కృషిచేసి విఫలమైనాయి. ఈ శిల 18 కిలోమీటర్ల పొడవు, 60 నుంచి 180 మీటర్ల వెడల్పు వుంది. ఇది చూడడానికి నలుపుమీదవున్న బూడిదరంగులో వుంటుంది. దక్షిణాఫ్రికాలోని కింబర్లైటును పోలివుంటుంది. ఇందులోని శిలల్లో ఇతర రాళ్లు, శిలలు వగైరా కూడా కలిసిపోయి వున్నాయి. వాతావరణ పరిస్థితులు మున్నగు కారణాలవల్ల అసలు శిలల తత్వం చాల వరకు మారిపోయింది.

ఇప్పటికి కూడా, వర్షాలు పడినతరువాత ఈ ప్రాంతంలో వజ్రాలు లభిస్తూవుంటాయని అప్పుడప్పుడూ మనం వింటూనే వుంటాము.

జియోలాజికల్ సర్వేవారు 1968 నవంబరు నుంచి వజ్రకరూరులోని ఈపెద్దశిలను శాస్త్రీయపద్ధతులలో క్షుణ్ణంగా పరిశోధన చేశారు. ఇక్కడ వజ్రాలు లభించే అవకాశాన్ని కనుగొనడానికి ఈ పరిశోధనలు చేయబడినాయి

1969 జనవరి నుంచి 1971 ఏప్రిల్ వరకు మొత్తం 1050 టన్నుల శిలను త్రవ్వి ఈ పదార్థాన్ని పరిశోధన చేయటం జరిగింది. ఈ శిలపైనగల నేల ప్రాంతాలలో కొన్ని గుంటలు కూడా త్రవ్వి 316 ఘ. మీటర్ల మట్టిని శుద్ధిచేయడం జరిగింది.

ఈ పరిశోధనల ఫలితంగా 1971 జూన్‌వరకు 11.82 కేరట్ల తూకంగల 18 వజ్రాలు వెలికితీయడం జరిగింది. దీనివల్ల ప్రతివంద టన్నుల శిలావస్తువులకు 1.5 కేరట్ల విలువగల వజ్రాలు లభించినట్లయింది.

ఒక గుంటలో నుంచి 85 టన్నుల మట్టిని శుద్ధిచేయగా 0.22 కేరట్ల తూకంగల వజ్రం లభించింది.

ఇక్కడ ఇంతవరకు లభించిన వజ్రాలు రత్నాల జాతికి చెందినవి. ఇక్కడ ఎంతవరకు వజ్రాలు లభిస్తాయో తెలుసుకొనడానికి ఇంకా భారీయెత్తున త్రవ్వకాలు జరిపి పరిశోధనలు జరుపవలసివుంది.

పైప్‌రాక్ నెం.1 లో వజ్రాలు లభిస్తాయని ధ్రువపడిన తరువాత వజ్రాలను వెలికితీసే కార్యక్రమాన్ని తీవ్రతరం చేయడానికి ఒక పథకాన్ని అమలు జరుపవలసి వుంది. అయితే జాతీయ ఖనిజ సంపద అభివృద్ధి సంస్థ ఈ పైప్‌రాక్ ప్రాంతాన్నంతటినీ స్వయంగా అభివృద్ధిపరచడానికి నిర్ణయించి నందువల్ల జియోలాజికల్ సర్వేవారు ఇకముందు పరిశోధనలు జరుపడానికి వీలులేకపోయింది. జాతీయ ఖనిజ సంపద అభివృద్ధి సంస్థ కొంతకాలంవరకు రాయల్‌కోట వజ్రకరూరు ప్రాంతాలలోని శిలలపైని మట్టిని శుద్ధిచేసిన పిమ్మట 70 కేరట్ల వజ్రాలను వేలం వేశారు. ఈసంస్థ ఈ ప్రాంతంలో పనులను ఆపివేసిందని తెలుస్తున్నది.

జియోలాజికల్ సర్వేవారు 1970 సెప్టెంబరులో పైప్‌రాక్ నెం. 1లో వజ్రాల ఉనికిని కనుగొనడానికి వజ్రకరూరు ప్రాంతంలో తమ కార్యక్రమాలను తీవ్రతరంచేశారు. ఇప్పుడు వారి కార్యక్రమం అమలుజరుతున్నది.

జియోలాజికల్ సర్వేవారు కృష్ణానదీ తీరం పొడుగునకూడా వజ్రాలు కనుగొనడానికి వజ్రకరూరు ప్రాంతంలో తమ కార్యక్రమాలను తీవ్రతరంచేశారు ఇప్పుడు వారి కార్యక్రమం అమలు జరుగుతున్నది. ఈ ప్రాంతం నుంచే ప్రపంచఖ్యాతి నార్జించిన కోహినూరు, రీజెంట్ పిటోవజ్రాలు లభించాయి. కర్నూలు నుంచి పరిటియాల వరకు కృష్ణానదీ తీరంలో రాళ్లను, మట్టిని పరిశీలించిన పిమ్మట ఇంకా తీవ్రపరిశోధనలు చేయడానికి కొన్ని ప్రాంతాలు ఎన్నిక చేయబడినాయి. కృష్ణానది వరదలమూలకంగా ఈప్రాంతాలలో బురదమట్టి పేరుకొని పోయినందువల్ల ఇక్కడి నల్లరేగడి భూమి అడుగున డ్రిల్లింగు ద్వారా లోతుగా త్రవ్వడానికి కృషి చేయబడు తున్నది. కృష్ణాజిల్లాలోని రామన్నపేట, వస్తాదుపల్లి ప్రాంతాలలో లభించడానికి అవకాశాలుగల శిలలు వగైరా కని పించాయి. ఇక్కడ వజ్రాలు లభించే అవకాశాలను కనుగొనడానికి ఈ ప్రాంతాలను ఇంకా క్షుణ్ణంగా పరిశీలించవలసివుంది.

మానవ సేవ కోసం

నాకు మోక్షం లేదు. వ్యక్తిగతంగా నేను ముక్తి పొందడం కాదు కావలసింది......
నాకు జన్మ రాహిత్యం వద్దు. నేను మళ్ళీ మళ్ళీ పుట్టాలి. అంతులేని కష్టాలను ఆనందంగా అనుభవించాలి. అన్ని జాతులలో, అన్ని దేశాలలో వున్న భగవంతుణ్ణి-దరిద్రులు పతితులు బాధితుల రూపంలో దర్శనమిచ్చే భగవంతుణ్ణి ఆరాధించడానికి నేను బహుజన్మ లెత్తుతాను.

—స్వామి వివేకానంద

మహాభారతము

తెన్నెగంటుల లక్ష్మణశాస్త్రి

48

ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు. ధర్మపరుడైన భీమునకు ధర్మతత్త్వమును బోధించెను. పిదప హతశేషులైన రాక్షసులు కుబేర సదనమునకుపోయి భీమసేనునివలన భీతావహులై బిగ్గరగా ఆర్తనాదము చేసిరి. వారి శరీరమంతయు నెత్తుటిలో మునిగియుండెను. వారు కుబేరునితో నిట్లనిరి. "మహారథులైన రాక్షసులందరు మానవుడగు భీమసేనునిచేత చచ్చిరి. అతడు ఈ పర్వతము అదరునట్లు త్రొక్కుచువచ్చి యింత ఘోర కర్మము చేసెను. హతశేషులము మేము వచ్చితిమి. ఈ యుద్ధములో మీ మిత్రుడగు మణిమంతుడు కూడ చచ్చెను." ఆ మాటలు విని కుబేరుడు మిక్కిలి కుపితుడై భీమసేనుడు చేసిన ఈ రెండవ అపరాధముచేత కోపించి అతనిపై దాడి వెడలుటకు రథముతెప్పించి అనేక యక్షరాక్షసులు తనవెంట సింహనాదము చేయుచు రాగా బయలుదేరి పోయెను. ఇట్లు వారు గంధమాదన పర్వతముచేరు సరికి వారిని పాండవులు చూచి సంతసించిరి. కుబేరుడు కూడ వారిని చూచి సంతసించెను, పరస్పర దర్శనముచేత సంతసించిన కుబేరుని, పాండవులనుచూచి యక్షులు దిగ్భ్రాంతితో నిలిచిపోయిరి పాండవులు కుబేరునకు నమస్కరించి తాము అపరాధము చేసినవారి వలె చేతులు జోడించుకొని అతని చుట్టు నిలిచిరి. అప్పుడు కుబేరుడు విశ్వకర్మనిర్మితమైన పుష్పకవిమానములో కూర్చొని యుండెను. అతనిచుట్టు పరివారము ఇంద్రుని చుట్టు దేవతల వలె కూర్చొని యుండిరి. భీముడు సువర్ణ మాలికను తలపై ధరించి ఆయుధ హస్తుడై కుబేరుని చూచెను. అతని శరీరము గాయపడినప్పటికిని కుబేరుని యెదుట గ్లాని చెందినట్లుగా లేకుండెను. అప్పుడు కుబేరుడు అట్లున్న భీముని చూచి ధర్మపుత్రునితో నిట్లనెను. "నీవు సమస్త భూతములకు హితమును కోరువాడవు. ఈ శైలాగ్రమునందు నీ తమ్ములతో నిర్భయముగా నివసించి యుండుము. భీముని పై నీవు కోపము వహించకుము. ఈ రాక్షసులు కాలవశాత్తు తొలుతనే చనిపోయినారు, భీముడు కేవలము నిమిత్తమాత్రుడు ఇతడు ఈ పని చేసినాడని నీవు లజ్జపడకుము. యక్షరాక్షసుల వధ దేవతలకు ఇష్టమైనదే, నీ యెడల నాకు కోపము లేదు. భీమునిపని నాకు సంతుష్టి కలిగించినది" అని చెప్పె

తరువాత కుబేరుడు భీమసేనునితో నిట్లనెను. "నాయనా! నీవు ఈ సాహస కృత్యమునకు చింతచేయకుము. ఇట్టి సాహసము ద్రౌపది కొరకు చేసితివి. నన్ను లెక్కచేయక యక్షరాక్షసులను సంహరించితివి. దానివలన నీ యెడల నాకు ప్రీతి గలిగినది. నేను ఘోరమైన శాపమునుండి విముక్తుడనైతిని." ఆ మాటలు విని యుధిష్ఠిరుడు నీ శాపకారణము తెలుపుమని యడిగెను. దానికి కుబేరుడు యిట్లు చెప్పెను. "రాజా! పూర్వము కుశవతీ నగరమునందు దేవతలు ఒక సభచేసిరి. దానికి నన్నుకూడ పిలచిరి. నేను మూడు వందల మహాపద్మ సంఖ్యగల యక్షగణముతో అచటికి పోయితిని. మార్గ మధ్యములో యమునా తీరమునందు తపస్సు చేయుచున్న అగస్త్య మహామునిని చూచితిమి. ఆ ముని ఆశ్రమము అనేక పక్షుల కిలకిలారావములు గల పుష్పవృక్షములతో శోభిల్లు చుండెను. అతడు ఊర్ధ్వ బాహువై సూర్యునికి అభిముఖముగా నిలచి మండు చున్న అగ్నివలె ప్రకాశించుచు తపస్సు చేయుచుండెను. రాక్షస రాజగు మణిమంతుడు నాకు మిత్రుడు అతడు అజ్ఞానముచేత, గర్వముచేత ఆకాశమునుండి నాతో కూడ పోవుచు ఆ మహాముని శిరస్సుపైన ఉమిసెను అపుడు కోపాగ్నిచేత సర్వ దిక్కులను దహించుచున్న ఆ మహాముని నన్నుచూచి దుష్టుడైన నీ మిత్రుడు నన్ను అవమానపరచెను అందువలన నితడు సైన్యముతో పాటు ఒక మనుష్యునిచేత వధింపబడగలడు. ఆ వధవలన దుఃఖించిన నీవుకూడ ఆ మనుష్యుని చూచి పాప విముక్తిని పొందగలవు. ఈ సైనికులలో నీ ఆజ్ఞను పాలించువారికి ఈ శాపమటందు. రాజా! పూర్వము అగస్త్యుడు నా కిచ్చిన ఈ శాపము భీమునివలన ఇప్పుడు నన్ను వీడిపోయెను.

"రాజా! ధైర్యము, సామర్థ్యము, దేశ కాలజ్ఞత, పరాక్రమము ఈ గుణములు లౌకిక కార్యసిద్ధికి కారణములగును. ఈ గుణములుగల మనుష్యులు కృతయుగమునందు ఉండిరి. ఇవి గలిగి, ధర్మమునుగూడ తెలిసిన క్షత్రియుడే భూమిని చాలకాలము ఏలగలడు. అన్ని పనులయందు ఈ విధముగా నడచుకొను పురుషుడు లోకమునందు కీర్తి గలవాడై సద్గతిని పొందగలడు ఈ విధముగా దేశకాలములను కనిపెట్టి, తన పరాక్రమమును చూపించిన యింద్రుడు స్వర్గరాజ్యమును పొంది సుఖించెను.

క్రోధమునకు వశుడై తన పతనమునకు దారితీయువాడు పాప మార్గమునే అనుసరించును. దేశకాలముల ననుసరించి తాను చేయు పనులను వివేచన చేయజాలని అవివేకి ఇహ పరలోకములలో కూడ నశించును. సాహస కృత్యములను చేయుచు ఇతరులను వంచించుచుండు దురాత్ములు చేయు సత్కర్మానుష్ఠానము ఇహ పరలోకములలో వ్యర్థమైపోవును. సమస్త సాంసారిక సౌఖ్యములను తన శక్తితోనే అనుభవింపదలచుట పాపపువని యగును. రాజా! యీ భీముడు ధర్మము నెరుగడు. ఇతనికి తన బలము నందు మాత్రమే అభిమానముగలదు. ఇతడు బాలబుద్ధితో వ్యవహరించుచు సర్వదా క్రోధముతో నిర్భయుడుగానుండును. అందువలన ఇతనికి నీవు సదుపదేశముచేసి నీవశములో నుంచుకొనుము. రాజా! యిక్కడినుండి నీవు రాజర్షియగు ఆర్ష్టిషేణుని ఆశ్రమమునకుపోయి యచట కృష్ణపక్షమంతయు భయశోకములను వీడియుండుము. అలకాపుర నివాసులందరు నిన్ను రక్షించుచుందురు. భీమసేనుడు ఇక్కడ చేసిన సాహసకృత్యములను తిరిగి చేయకుండ చూడుము. నేటినుండి ఈ వనములోని వారందరు మిమ్ములను రక్షించుచు సేవ చేయుచుందురు. నేను బంపు రుచికరములైన ఆహారములను నీకు తెచ్చి యిచ్చుచుందురు. నీ సోదరులను మీ తండ్రులు రక్షించుచున్నట్లే నేనుకూడ రక్షించుచుందెదను. ధర్మాత్ముడైన అర్జునుడు స్వర్గమునందు సుఖముగానున్నాడు. అతనికి స్వర్గ సుఖములన్నియు జనన కాలమునుండియే లభించియున్నవి. బలము, దానము శమ-దయాదులు, బుద్ధి, ధైర్యము, తేజస్సు ఇవి యన్నియు అతని యెడల స్థిరముగా నిలిచియున్నవి. నింద్య కర్మలను కాని అసత్య వాక్యములను కాని అతడు అనుసరించడు. దేవతలచేత గౌరవింపబడుచు స్వర్గమందు అస్త్ర విద్యను నేర్చుకొనుచున్నాడు. మీ ముత్తాతగారైన శాంతను మహారాజు స్వర్గమునందు అర్జునుని చూచుచు ప్రసన్నుడైయున్నాడు. శాంతను మహారాజు స్వర్గలోకమునందే తన పుణ్యకర్మ ప్రభావముచేత స్థిర నివాసమును సంపాదించుకొనియున్నాడు. అతడు మీ క్షేమమును గూర్చి నన్ను అడిగినాడు" అని చెప్పెను.

కుబేరుడు చెప్పిన మాటలువిని పాండవులు సంతసించి ఆయుధములను క్రిందబెట్టి అతనికి నమస్కరించిరి. అపుడు కుబేరుడు తనకు నమస్కరించిన భీమసేనునితో "నీవు శత్రువుల అభిమానమును మర్దించి, మిత్రుల ఆనందమును వర్ధింపజేయగలవు, మీరందరు సుఖముగా ఆశ్రమములోనుండుడు. త్వరలోనే అర్జునుడు అస్త్రవిద్యా సంపన్నుడై మీ కడకు రాగలడు." అని చెప్పి కుబేరుడు తన కైలాసగిరికి పోయెను. అతని పరివారము గూడ అతనిని అనుసరించి పోయిరి. యక్షులకు అగస్త్యుడిచ్చిన శాపాంతమునకు కూడ అదియే సమయము కనుక వారు శాప విముక్తులైరి. పాండవులు ఆ యాశ్రమములోనే ఆ రాత్రిని గడపిరి.

సూర్యచంద్రుల గమనము

మరునాడు సూర్యోదయమునందు ధౌమ్యాచార్యుడు ప్రాతఃకాల కృత్యములను నెరవేర్చుకొని ఆర్ష్టిషేణునితో పాండవుల కడకు పోయెను. పాండవులు ఆ యిరువురు మహాత్ములకు నమస్కరించి అచటి బ్రాహ్మణులను పూజించిరి. ధౌమ్య మహాముని యుధిష్ఠిరుని తన కుడిచేత పట్టుకొని దిక్కులను చూపుచు ఇట్లనెను.

"రాజా! ఆ యెదుట కనబడుచున్న మందర పర్వతము సముద్ర పర్యంత భూమండలమును ఆవరించియున్నది. సమస్త గిరికానన శోభితమైన ఈ పూర్వ దిక్కును ఇంద్ర కుబేరులు రక్షించుచున్నారు. ఈ దిక్కు ఆ యిరువురికి నివాసస్థానమని పెద్దలు చెప్పుచున్నారు. ఈ దిక్కున ఉదయించుచున్న సూర్యుని సమస్త ప్రజలు మునులు సిద్ధ సాధ్యులు ఉపాసించెదరు.

"సర్వ ప్రాణులపైన అధికారమును సాగించుచు ధర్మాత్ముడైయున్న యమరాజు ఈ దక్షిణదిక్కును ఆశ్రయించి ఉండును. ఈచోటికి మరణించిన ప్రాణులు మాత్రమే పోగలరు. ఈ ప్రేతరాజుయొక్క నివాసస్థానమునకు సంయమనము అనిపేరు. అనగా సంయమనపురి. ఈ స్థానము సర్వ సమృద్ధులుకల్గి అతి పవిత్రమైయున్నది. రాజా! యిచ్చోటికి సూర్య భగవానుడు చేరి సత్య ప్రతిష్ఠగలవాడగును. అదిగో ఆ పర్వతమునకు అస్తాచలమనిపేరు. ఈ పర్వతమునందు, సముద్రమునందును నివసించుచు వరుణరాజు సర్వ ప్రాణులను రక్షించుచుండును.

"ఇదుగో ఈ ఉత్తర దిక్కునందు ప్రకాశించుచున్నదే మహా మేరుపర్వతము. దీనిని చూడుము. దీనిపైకి బ్రహ్మవేత్తలు మాత్రమే చేరుకోగలరు. ఈ పర్వతము పైననే బ్రహ్మదేవుని సభ ఉన్నది. సమస్త ప్రాణులకు ఆత్మభూతుడైన ఆ బ్రహ్మదేవుడు స్థావర జంగమాత్మకమైన సర్వ ప్రపంచమును సృజించుచు ఎల్లప్పుడు ఇచట నివసించియుండును. 'బ్రహ్మ మానస పుత్రులు, వారిలో ఏడవవాడైన దక్ష ప్రజాపతి' ఆ యందరికిని రోగ-శోక రహితమైన ఈ మేరు పర్వతము నివాసస్థానము, ఇచ్చటనే ఏడుగురు దేవర్షులు అంతర్ధానమును, ప్రకాశమును పొందుచుందురు. రాజా! అదుగో అచట "విరజసము" అను మేరు పర్వత శిఖరమును చూడుము. అది అత్యుత్తమమైనది. రజోగుణము అందు సోకదు. అచట ఆత్మ సంతృప్తులైన దేవతలతో బ్రహ్మదేవుడు నివసించియుండును.

"ఈ బ్రహ్మలోకముపైన ప్రకాశించుచున్న స్థానమును చూడుము. స్వర్ణము కంకణమునకువలె, ఘటమునకు మృత్తువలెను అది పంచభూతాత్మకమైన ప్రకృతికి అవినాశ్యమైన ఉపాదాన కారణము. ఈ కారణ స్వరూపమునే జ్ఞానులు అనాది అనంతుడు దివ్య స్వరూపుడునగు శ్రీమన్నారాయణుడు అని వక్కాణించెదరు. దేవతలుగూడ ఆ మహాత్ముని సులభముగా దర్శింపజాలరు ఆ పరమాత్మ స్థానము సూర్యునికన్న అగ్నికన్న మిక్కిలి తేజస్విగానున్నది. దానిని ప్రకాశింపజేయుటకు మరియొక తేజస్సు అక్కరలేదు. అది స్వయంప్రకాశము. దేవదానవులు దానిని దర్శింపజాలరు.

"నాయనా! పూర్వదిక్కునందలి ఈ మేరు పర్వతమునందు శ్రీమన్నారాయణుని స్థానము విరాజిల్లుచున్నది. భగవంతుడైన

విష్ణువు తన తేజస్సుచేత సమస్త భూత ప్రపంచమును ప్రకాశింపచేయుచు విరాజిల్లుచుండును. ఎన్నియో తపశ్చర్యాది పుణ్యకర్మలు సలిపిన జ్ఞానులు, మహాత్ములు మాత్రమే ఆస్థానమును పొందగలరు. బ్రహ్మర్షులంతటివారు గూడ దానిని చేరజాలరనగా సామాన్య మానవులమాట చెప్పనక్కరలేదు. పాండునందనా! సంపూర్ణ జ్యోతిర్ఘనమైన మహాపదార్థముకూడ అచటికి పోయిన వెంటనే తన తేజస్సంతయు కోల్పోవును. అచట ఒక విష్ణు భగవానుడుతప్ప మరి యేవస్తువు ప్రకాశించదు. ఉత్తమ తపశ్శాలురు పుణ్యకర్మానుష్ఠాతలు, మోహజ్ఞాన రహితులైన యోగసిద్ధులు ఆ శ్రీమన్నారాయణుని స్థానమును చేరి తిరిగి సంసారమునకు రారు. వారు ఆ భగవంతునిలోనే లీనులై పోయెదరు. ఈ స్థానము శాశ్వతము. ఇట్టి శాశ్వతస్థానమునకు నీవు ఇచటి నుండియే నమస్కారము చేయుము. కురునందనా! ఈ స్థానము చుట్టు మేరుపర్వతము సూర్య చంద్రులు ప్రతిదినము ప్రదక్షిణముచేయుచుందురు. ఈ గిరి రాజమును అన్ని నక్షత్రములు చుట్టి తిరుగుచుండును. అంధకార నాశమును చేయు సూర్యభగవానుడు అన్ని నక్షత్రములను తనవైపు లాగుకొనుచు ఈ మేరుపర్వతమునకు ప్రదక్షిణము చేయుచుండును. ఆ పిదప సూర్యుడు అస్తగిరిని చేరి సంధ్యాకాలమును దాటి ఉత్తర దిక్కును ఆశ్రయించును అచటి నుండి అతడు తిరిగి పూర్వాభిముఖుడై పోవును.

ఈలాగే చంద్రుడుకూడ సమస్త నక్షత్రములతో మేరుగిరికి ప్రదక్షిణము చేయుచు పర్వసంధుల కాలమునందు వేరు వేరు నెలలను విభజించుచుండును. ఈ విధముగా అతి త్వరలో చంద్రుడు మేరుపర్వతమును దాటి సమస్త ప్రాణులను రక్షించుచు తిరిగి మందరగిరికి పోవును. నిర్బాధమైన ఈ మార్గములో సూర్యభగవానుడు తన కిరణములచే ప్రకాశించుచున్న సమస్త జగత్తును రక్షించుచు సర్వదా తిరుగుచుండును. అతడు శీతకాలమును సృష్టించుటకొరకే దక్షిణదిక్కునకు పోవును. ఆ కారణముచేతనే ఆ కాలములో సమస్త ప్రాణులు చలికి బాధపడుచుందురు. దక్షిణాయనానంతరము సూర్యభగవానుడు స్థావర జంగమాత్మకమైన ప్రపంచ తేజస్సును తన తేజస్సులో హరింపజేసికొనును. ఈ కారణముచేతనే ఉత్తరాయణ ప్రవేశానంతరము మానవులు చెమటబట్టి అలసిపోయి సోమరులై బాధలనుభవించుచుందురు. సర్వప్రాణులు ఈకాలమందు నిద్రించుటకు ఇచ్ఛయించుచుందురు. ఈ విధముగా ఈ యంతరిక్ష మార్గమును అవలంబించి యుండి సూర్యుడు ప్రాణులకు పుష్టి కలిగించుటకుగాను తిరిగి వర్షమును సృజించుచున్నాడు. వృష్టి వాయువు తాపము ఈ మూడింటి చేత చరాచర జగత్తుకు పుష్టి కలిగించుచు సూర్యుడు తన స్థానమునకు తిరిగిపోవును.

“మహారాజా! ఈ విధముగా సూర్యభగవానుడు అతి జాగరూకుడై సమస్త ప్రాణుల తేజస్సును తనయందు ఆకర్షించుకొని మరల వారికి ఆ తేజస్సును సందింపచేయుచు వారిని పోషించుచు సంచరించుచు కాలచక్రమును నడపుచుండును. సూర్యభగవానుని గమనము ఇట్లే నిరంతరము సాగుచుండును. అతడు ఎక్కడ గూడ ఒక్క క్షణకాలము ఆగి నడుపడు. అతడు సమస్త భూతలములలోని రసమయమైన తేజస్సును తాను గ్రహించి దానిని తిరిగి వర్షాకాలములో జగత్కల్యాణార్థమై కురియుచుండును. సూర్యభగవానుడు సర్వ ప్రాణులయొక్క ఆయుస్సును కర్మలను విభజించుచు రేయింబవళ్ళు మొదలగు కాల పరిమాణములను సర్వదా చక్రభ్రమణమువలె సృష్టించుచుండును.

గంధమాదన పర్వతమునందు అర్జునుని చూచుటకొరకు ప్రతీక్షించుచున్న పాండవుల మనస్సులో గొప్ప ఆనందము కలిగెను. వారి వద్దకు గంధర్వులు, మహర్షులు వచ్చుచుండిరి. ఆ పర్వతమునందలి వృక్షములు, పక్షుల మధురధ్వనులు, సుందర దృశ్యములు, వారికానందము గలిగించెను. అక్కడ కుబేరుడు నిర్మించిన ఉత్తమ సరస్సులో, క్రీడారంగములు శోభాయమానముగా నుండెను. ఆ పర్వతముయొక్క తేజస్సుచేతను, తేజోవంతములైన ఓషధులచేతను అచ్చట చీకటియే లేక రాత్రింబవళ్ళు సమానముగానుండెను. అచ్చట పాండవులు ధర్మానుష్ఠానములను సల్పుచు అర్జునాగమనమును ప్రతీక్షించుచుండిరి. అచ్చటనే అర్జున దర్శన హర్షమును పొందదలచిరి. ఈ ఉబలాటముతో వారు ఒక్కొక్క దినము ఒక్కొక్క సంవత్సరముగా గడపుచుండిరి. ఎప్పుడును అర్జునుని దలంచుచు దుఃఖించుచు ఒక నెల యచటనే అతి కఠినముగా గడపిరి.

అర్జునుని పునరాగమనము

ఇంద్రభవనమునందు అయిదు సంవత్సరములు గడపి అర్జునుడు ఇంద్రాది దేవతలనుండి అనేక దివ్యాస్త్రములను పొంది ఇంద్రునకు నమస్కరించి యుత్తరువు తీసికొని గంధమాదన పర్వతమునకు సంతోషముతో వచ్చెను. హరితవర్ణముగల అశ్వములు గట్టబడిన ఇంద్రరథమునందు అర్జునుడు గూర్చొని వచ్చుచుండగా నారథము మెఱుపువలె యాకాశమున ప్రకాశించెను. దానిని గాంచి పాండవులు పెన్నిధిని జూచినంతగా సంతసించిరి. ఆ రథము ఆకాశమును ప్రకాశింపజేయుచు మేఘముల మధ్యమున తోకచుక్కవలెను. ధూమములేని అగ్నిశిఖవలెను ప్రకాశించెను. పుష్పమాలలు, రత్నాభరణములు, ధరించిన అర్జునుడు వచ్చి రథమును దిగి తొలుత ఆచార్యుడైన ధౌమ్యునకు నమస్కరించి, తదుపరి, అన్నలకు పాదాభివందనముగావించి తమ్ముల వందనములను స్వీకరించి ద్రౌపదిని యాదరించి అన్నగారిపద్ద వినయముతో నిలిచెను. అర్జునునిచూచి వారికి, వారినిజూచి అర్జునునకు మహానందముగలిగెను. పాండవులు ఇంద్రరథమునకు ప్రదక్షిణము జేసి మాతలిని (ఇంద్రసారథి) సత్కరించిరి. మాతలివారికి నమస్కరించి తిరిగి స్వర్గమునకు వెడలిపోయెను.

అపుడు అర్జునుడు తనకు ఇంద్రుడొసంగిన దివ్యాభరణములను ద్రౌపదికిచ్చెను. పిదపవారి మధ్య గూర్చొని యర్జునుడు జరిగిన సంగతియంత వివరించి చెప్పెను. తాను ఇంద్రుని నుండి, వాయుదేవుని నుండి, పరమేశ్వరుని నుండి మరియు ఇతర దేవతల నుండి పొందిన అస్త్రముల వివరము సంగ్రహముగా వారికి తెలిపి నకుల సహదేవులతో ఆరాత్రి నిశ్చింతగా నిద్రించెను. మరునాడు ఉదయము ఇంద్రుడు సపరివారుడై పాండవులగాంచి

వారిని ఊరడించుటకు వారికడకు వచ్చెను. ధర్మరాజు సోదరులతో ఇంద్రునకు స్వాగత సత్కారములు జేసెను. అర్జునుడు ఇంద్రునకు నమస్కరించి భృత్యునివలె దగ్గర నిలుచుండెను. వారిరువురనుగాంచి ధర్మరాజు మిక్కిలి సంతసించెను. అట్లున్న యుధిష్ఠిరుని జూచి యింద్రుడు "రాజా! నీవు ఈ సమస్త భూమండలమును ఏలగలవు. నీకు శుభమగుగాక! తిరిగి కామ్యక వనమునకు పొమ్ము. సమస్త దివ్యాస్త్రములు అర్జునునకు లభించెను. మూడు లోకములలో నెవ్వరు కూడ అతనిని జయించ జాలరు" అని చెప్పి స్వర్గమునకు వెడలిపోయెను.

కుబేరుని భవనమునందు ఇంద్రునితో సమావేశము గలిగిన పాండవులయొక్క యీ కథను శ్రద్ధతో ప్రతిదినము చదువుచు నొక సంవత్సరము బ్రహ్మచర్యముతో గడపినవారికి ఏ బాధలు లేకుండ నూరు సంవత్సరములు సుఖమయిన జీవనము గల్గును.

తరువాత పాండవులు ద్రౌపది ఒకచోట కూర్చొనియుండగా ధర్మరాజు అర్జునుని యాత్రా వృత్తాంతమడిగెను. అప్పుడర్జునుడు తాను తపస్సునకు పోవునప్పుడు తనకు దారిలో బ్రాహ్మణుడు కనపడి యుపదేశించుట తాను శివుని గూర్చి ఘోరముగ తపస్సుచేయుట కిరాత వేషముతోవచ్చిన పరమేశ్వరునకు తనకు వరాహ నిమిత్తమై ఘోరయుద్ధము జరుగుట శివుడు ప్రసన్నుడై తనకు పాశుపతాస్త్రమునిచ్చుట, అచటినుండి యింద్రలోకమునకు పోవుట, ఇంద్రాదులు తనకు దివ్యాస్త్రములిచ్చి యాదరించుట, ఊర్వశికి తనకు గలిగిన వ్యవహారము ఈ మొదలగు వృత్తాంతము లన్నియు సమగ్రముగా సోదరులకు తెలిపి తనకు ఇంద్ర శత్రువులగు నివాతకవచాది దానవులతో జరిగిన యుద్ధ క్రమమును ఈవిధముగా చెప్పదొడగెను :—

నివాతకవచుల యుద్ధము

"సోదరులారా! ఇంద్రుడు సమస్త దివ్యాస్త్రములను నాకు ఉపదేశించి, నన్ను ఆశీర్వదించి 'నాయనా! నాకు పరమ శత్రువులగు 'నివాత కవచులు' అను దానవులను నీ విప్పుడు సంహరించవలెను. అదియే నీవు నాకిచ్చు గురుదక్షిణ. ఆ రాక్షసులు మూడు కోట్లు ఉన్నారు వారు సముద్ర గర్భమునందు కోట కట్టుకొని నివసించుచున్నారు. మూడుకోట్ల రాక్షసులు సమాన వయో బల పరాక్రమ సంపన్నులు" అని చెప్పి యింద్రుడు, నెమలి యీకెల వంటి వెంట్రుకలు గల గుఱ్ఱములు కట్టబడిన రథమును మాతలి యుక్తముగా నాకు ఇచ్చెను. ఇప్పుడు నేను ధరించిన ఈ కిరీటమును ఇంద్రుడు స్వయముగా నా శిరము పై నుంచెను. ఈ యభేద్యమగు కవచము, సర్వాభరణములు ఇంద్రుడప్పుడు నాకు తొడిగినవే యగును. అచ్ఛేద్యమగు అల్లె త్రాటినిగూడ నా గాండీవమున కతడు సంధించి యిచ్చెను.

"పిదప నేనా రథముపైన గూర్చొని వైభవముతో యుద్ధమునకు బయలు దేరితిని. పూర్వము ఇంద్రుడు, ఆ రథముతోనే వెడలి బలి చక్రవర్తి, శంబర, నముచి, బల, వృత్ర, ప్రహ్లాద, నరకాదులనే కాక అనేక కోట్ల రాక్షసులను సంహరించి యుండెను. అప్పుడు ఇతర దేవతలు 'దేవదత్తము' అను శంఖమును నాకు ఇచ్చిరి. అది సముద్రమునందు పుట్టి యింద్రాదుల నాశ్రయించి యున్న శంఖము. ఈ యన్నింటితోను, వీనికన్న శక్తిమంతము లగు దేవతాశీస్సుల బలముతోను నేను అతి భయంకరమగు దానవాలయమును ప్రవేశించుటకు బయలుదేరితిని.

"అట్లు పోవగా ముందర అతి గంభీరము, భయంకరము నగు సముద్రము కానవచ్చెను. సముద్రములో తెల్లని పెద్దపర్వతములుగా నున్న నురుగులు అలలపైన ఊగుచుండగా పర్వతములు జలముపైన నృత్యముచేయుచున్నట్లు సుందరముగా నాకు కనబడెను. అక్కడ వివిధ రత్నభరితములైన నౌకలు నాకు ఆకాశమునందు సంచరించుచు విమానములవలె గోచరించెను. తిమింగలాది పెద్ద పెద్ద జలజంతువులు నీటిలోనాకు జలనిమగ్నములైన పర్వతములవలె కనపడెను. నీటిలో తేలియాడుచున్న వివిధ రత్నములు నాకు పలుచని మేఘముల మధ్య మిణుకు మిణుకుమని వెలుగుచున్న నక్షత్రములవలె గోచరించెను అచట భయంకర చండవాయువు గూడ మార్గ భ్రష్టునివలె దిక్కుతోచక తిరుగుచుండెను.

"ఆ సమీపముననే సముద్రమునందు నివాతకవచ దానవుల ఆలయమును గూడ చూచితిని. అచట వెంటనే మాతలి రథము నుండి దిగి తిన్నగా పాతాళము వైపునకు తోలుకొనిపోయి రథము పైన తిరిగి కూర్చుండి అతి వేగముగా రథమును నడప జొచ్చెను. ఆ రథ ధ్వనికి దానవలోకమెల్ల చాల భయపడుచుండిరి. వారు నన్ను ఇంద్రునిగానే తలచిరి. వెంటనే భయముతో నందరును వివిధాయుధములను ధరించి పురద్వారములన్నిటిని బంధించిరి. పట్టణము వెలుపల నొక్కడును కానరాకుండెను. అప్పుడు నేను దేవదత్త శంఖమును పూరించితిని ఆ ధ్వనికి సమస్త జవరాసులు గగ్గోలుపడెను. అప్పుడు నివాతకవచదానవులు వివిధాయుధములతో యుద్ధసన్నద్ధులై నాపైబడిరి. వారితోనాకు జరిగిన యుద్ధమునుజూచి దేవర్షి, మహర్షి, బ్రహ్మర్షులెల్లరు అనేక విధములుగా నాయుద్ధచాతుర్యమును పొగడిరి.

"పిదప నివాతకవచులు బిగ్గరగా అరచుచు నన్ను చుట్టుముట్టి నాపై బాణ వర్షము కురిపిరి. వివిధాయుధములతో నన్ను కొట్టిరి. నేను ఆయాయుధములన్నింటిని వడివడి బాణములతో కొట్టివేసితిని. వారందరు పెడ మొగము బెట్టి పారిపోజొచ్చిరి. అప్పుడు మాతలి గుఱ్ఱములను వేగముగా నడలించుచు నన్నిదిక్కులకు నిరంకుశముగా రథముతోలెను. ఆ రథమునకు కట్టబడిన పదివేల అశ్వములను మాతలి అతి చాతుర్యముతో అల్పసంఖ్యములగు గుఱ్ఱములను తోలునట్లు అవలీలగా వానినివశమునందు నుంచుకొని తోలుచుండెను. అశ్వముల పాదతాడనముచేత, రథచక్రపునేమి మర్దనముచేత, నా బాణములచేతను నూర్లకొలది రాక్షసులు హతులగుచుండిరి. చనిపోయినవారిని వారి రథాశ్వములు ఈడ్చుకొని పోవుచుండెను. తక్కినవారు నన్ను పలుదిక్కుల నుండి చుట్టుముట్టి వివిధ శస్త్రముల చేత కొట్టిరి. అప్పుడు నా మనస్సు చాల వ్యథ చెందెను. వారు వేయు వివిధాయుధములను నేను గాండీవముక్త బాణములతో ధ్వంసము చేసితిని. అప్పుడు నా గాండీవము నుండి బాణములు వృక్షము నుండి తుమ్మెదలవలె గుంపులు గుంపులుగా బయలు వెడలుచుండెను. అది చూచి మాతలినన్ను మిగుల ప్రశంసించు

చుండెను. మద్బాణ ఖండితములగు వారి శరీరము నుండి రక్తధారలు, వర్షాకాలమునందు పర్వత శిఖరములనుండి ధాతు మిశ్రితములగు జలధారలవలె ప్రవహించుచుండెను. ఇట్లనేక విధముల పోరగా కొందరు ఖండిత దేహులైరి. మరి కొందరు హతులైరి. వారు వశముదప్పి చివరకు నాతో మాయా యుద్ధము చేయబూనిరి.

మాయా యుద్ధము

రాక్షసుల మాయచేత నాపై పాషాణ వర్షము కురిసెను. నేను ఆ పెద్దపెద్ద రాలను మహేంద్రాస్త్రముతో చూర్ణము చేసితిని పిదప వారు అగ్ని వర్షము నాపై గురియించిరి జల వర్షమును, సర్పముల వంటి సుదీర్ఘ ధారలతో గురియించిరి. వర్షధారలు, ఉరుములు మెఱపులతో దశదిశలు అలముకొని భూమ్యాకాశములు ఏకముగా గురియుచు నన్ను విభ్రాంత పరచెను. అప్పుడు నాకు పూర్వమింద్రుడుపదేశించిన 'విశోషణము'అను అస్త్రమును ప్రయోగించి ఆ వర్ష ధారలను శోషింపజేసితిని. సలిలాస్త్రముచేత అగ్ని వర్షమును ఆర్పితిని. వారు గురిపిన వాయు వర్షమునుగూడ శైలాస్త్రముచేత ఆపితిని.

ఆ పిదప రాక్షసులు వివిధ మాయలను పన్ని ఒక్కసారిగా పాషాణ, అగ్ని. జల, వాయు వర్షములను గురియించిరి. అవి నన్ను చకితుని జేసెను. మాయామయమగు నా వాన నన్ను చాల పీడించెను. ఆ తరువాత వారు నలువైపుల చీకట్లను గ్రమ్మజేసిరి. అంధకారములో నా రథాశ్వములు విముఖములయ్యెను. మాతలి తొట్రుపడుచుండెను. అతని చేతినుండి పగ్గములు, చబుకు జారి క్రిందపడెను. 'నీవెక్కడ నున్నా'వని నన్ను బిగ్గరగా పిలుచుచుండెను. అతడు స్మృతి తప్పుటను చూచి నేనుగూడ భీతిల్లితిని భయపడుచున్న నన్ను అతడు తడబడు మాటలతో నిట్లుపలుకరించెను. 'భరత వీరా! పూర్వము అమృతము కొరకు సురాసురులకు అతి ఘోరయుద్ధము జరిగెను. ఆ యుద్ధమును జూచితిని. శంబరాసురునితో జరిగిన యుద్ధములో గూడ నేనింద్రునకు సారథ్యముచేసితిని. వృత్రాసురునితోను, బలిచక్రవర్తితోను, ఇంద్రునకు జరిగిన సంగ్రామమునందు గూడ నేనతనికి సారథిగానుంటిని. ఏ యుద్ధములో గూడ నేను స్మృతిదప్పి యుండలేదు. నేటియుద్ధము జూడగా బ్రహ్మదేవుడిప్పుడు సమస్త ప్రజాసంహారమును తల పెట్టినట్లున్నది," ఆ మాట విని నేనిట్లంటిని :

"మాతలీ! నీవు భయపడకుము. నా భుజబలము జూడుమని నా శస్త్రాస్త్రముల మాయను సృజించి అసుర మాయను అణచితిని. నా మాయ చేత పీడింపబడుచున్న రాక్షసులు తిరిగి బహువిధ మాయలను సృజించిరి. వాటిచే జగత్తునందు కొంత సేపు చీకటి మరికొంతసేపు వెలుగు గలుగు చుండెను. ఒక్కొక్కపుడు జగమే నీటిలో మునిగినట్లు కనబడుచుండెను వెలుగు దోచినప్పుడు మాతలి రథాశ్వములను ముందుకు దోలుచుండెను. అప్పుడు నివాతకవచదానవు లొక్కసారిగా నన్ను చుట్టుముట్టి నాపైబడిరి. నేను సమయము జూచి వారిని క్రమముగా యమలోకమునకు పంపుచుంటిని. ఇట్లుండగా హఠాత్తుగా ఆ దానవులందరు మాయలో దాగుకొని నాకు కనపడక పోయిరి. దాగియుండియే వారు నాపై నాయుధములను ప్రయోగించి పోరుచుండిరి నేను గూడ అదృశ్యాస్త్రములతో వారిని కొట్టుచుంటిని.

"నా గాండీవముక్తములైన అస్త్రములు దానవులనందరిని వారున్నచోటనే హతమార్చుచుండెను. అప్పుడు నివాతకవచులు ఏమియు చేయజాలక తమ మాయను ఉపసంహరించుకొని, వెనుదిరిగి తమ నగరములో దూరిరి. తెరపియైన తరువాత యుద్ధరంగమంతయు రాక్షసుల శవములతోను హయరథాదుల అంగశకలములతోను నిండియుండుట చూచితిని. నా గుఱ్ఱములు ముందు అడుగులను ఉంచి నడచుటకు అవకాశము లేనందున, అవి స్వర్గీయములగుటచేత. అంతరిక్షమునందే నిలిచియుండెను.

(సశేషము)

ఈ సంచికలో రచయితలు

శ్రీ పి. యస్. గోపాల్, న్యూఢిల్లీ
శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, శాసనసభ్యులు, సత్తెనపల్లి
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, హైదరాబాదు
శ్రీ జె. వీరాస్వామి, న్యాయశాఖ కార్యదర్శి, హైదరాబాదు
డా. దివాకర్ల వేంకటావధాని, హైదరాబాదు
శ్రీ టి. ఎ. పద్మనాభరావు, నెల్లూరు
డా. అక్కిరాజు రమాపతిరావు, హైదరాబాదు
శ్రీ రాయప్రోలు సుబ్బారావు, సికిందరాబాదు
కుమారి వాసిరెడ్డి సీతాదేవి, హైదరాబాదు
శ్రీ డి వి. ఆర్. భాస్కరశాస్త్రి, రాజమండ్రి
శ్రీ ముదిగొండ వీరభద్ర మూర్తి, హైదరాబాదు
శ్రీ ఆవంత్స సోమసుందర్, పిఠాపురం

మన ప్రజాస్వామికం

జె. వీరాస్వామి

మనదేశంలో ప్రజాస్వామికమును గూర్చి తెలుసుకొనే ముందు ప్రజాస్వామికము అంటే ఏమిటి అనే విషయం విచారణకు వస్తుంది. ఆధునిక యుగంలో, ప్రజాస్వామికాన్ని గురించి, అందరకు తెలిసేవిధంగా చెప్పినవ్యక్తి Abraham Lincoin. ప్రజాస్వామికమంటే ప్రజలయొక్క ప్రజలచే, ప్రజలకొరకు నడుపు రాజ్యాంగ విధానమని ఆయన చెప్పారు ప్రపంచ వ్యాప్తంగా రాజ్యాధికారమే రాజులనుండి, నియంతలనుండి, ప్రజా ఉద్యమములద్వారా, ప్రజలు చేపట్టడం జరుగుతున్నది ప్రస్తుతం, అములులోవున్న రాజ్యాంగ విధానాలన్నిటిలోను. ప్రజాస్వామికానికే ప్రపంచంలో ఎక్కువ ఆదరణ లభిస్తోంది.

ప్రపంచ చరిత్ర పరిశీలిస్తే, భారతదేశంలోనే కాక, ఇతర దేశాలలోకూడా రాజ్యాధికారం శక్తినిబట్టి, వ్యక్తులను ఆశ్రయించినట్లు స్పష్టపడుతుంది. ఈ వ్యక్తిగతమైన హక్కు, క్రమేణ వంశపారంపర్యంగా మారినట్లు గోచరిస్తుంది. వంశాధిక్యతలో నుండి 'రాజత్వము ఈశ్వరదత్తము' అనే అహంభావ సిద్ధాంతం పుట్టినట్లు కనబడుతుంది, మతాచార్యులు, రాజ్యపరిపాలనాదక్షులైన రాజులమధ్య, ప్రజాధికారముకొరకు తగాయిదాలు తల ఎత్తినట్లు కన్పడుతుంది. ఈ పరిణామంలోనుంచే, ప్రజాస్వామిక సిద్ధాంతము, క్రమక్రమంగా వెలువడింది.

భారతదేశానికి సంబంధించినంతవరకు, ప్రజాస్వామికము ఏదోఒక రూపంలో, ప్రాచీనకాలములో గూడా అమలులో ఉన్నట్లు తెలుస్తుంది. కౌటిల్యుని అర్థశాస్త్రములోను, ఐతరేయి బ్రాహ్మణంలోను, ప్రజాస్వామికానికి దగ్గరగా ఉన్న పరిపాలనా విధానం గురించి, చెప్పబడినది. బౌద్ధవాఙ్మయంలోను, పాణిని వ్యాకరణంలోను, ప్రజాస్వామిక సంస్థలను గురించిన పదజాలములు, వివిగా వాడబడినవి 'సమితి', 'సభ' అనే పదాలు ఎక్కువగా కనిపిస్తాయి. గుప్త సామ్రాజ్యకాలములోను, మౌర్య పరిపాలనా విధానములోను, గ్రామసభలు పునాదులుగా, కొంత ప్రజాస్వామికము వర్ధిల్లినట్లు కనబడుతుంది. భారతీయ ప్రాచీన గ్రామీణ ప్రజాస్వామికమును, గ్రీకు నగర రాజ్యవిధానములతో, పోల్చవచ్చును. ప్రజారక్షణ న్యాయ నిర్ణయము, మొదలగు పరిపాలనా బాధ్యతలు, ఉమ్మడిగా ప్రజాసభల హస్తగతమై ఉండేవి, రానురాను ప్రజాస్వామికము, మనదేశ చరిత్రలో, కొంచము వెనుకంజ వేసినట్లు కనబడుతుంది, హిందూరాజుల పరిపాలనా కాలములోను, మొగలాయి సామ్రాజ్య కాలములోను ప్రజాస్వామికము అమలులో లేదనే చెప్పవలసి ఉంటుంది, అక్బరు, షాజహానుల కాలములో న్యాయ నిర్ణయాధికారము, స్వయముగా చక్రవర్తులే చేపట్టి, సామాన్యులకు సహితము న్యాయము చేకూర్చినట్లు తార్కాణము ఉన్నవి, రాజు ఎంత ఉదాత్తగుణ సంపన్నుడయినా, ప్రజాభీష్టముపై అతనిని మార్చుటకు వీలులేని పరిపాలనా విధానమును, ప్రజాస్వామికమని పిలుచుటకు వీలులేదు బ్రిటిషు పరిపాలనా కాలములో ఆధునిక పద్ధతులలో న్యాయస్థానములు, శాసనసభలు నెలకొల్ప బడినప్పటికి పూర్తి రాజకీయ అధికారము బ్రిటిషువారి హస్తగతమై ఉండుటచేత, ప్రజాస్వామికము భారతదేశములో రాణించలేకపోయింది.

ఈ మధ్య 'భారత దేశములో రాజకీయ విధానము' అనే గ్రంథంలో Pensylvanea కు చెందిన ఆచార్య Norman D. Palmer, "బ్రిటిషువారు భారతదేశాన్ని ప్రజాస్వామిక విరుద్ధంగా పరిపాలించారని, స్వదేశంలో ప్రజాస్వామిక విధానాన్ని, సంసలను, వృద్ధి పరచుకుంటూ వేరొక జాతిని పరిపాలించేటప్పుడు మాత్రం, సిద్ధాంతాలను వర్తింపజెయ్యలేదు" అని వ్రాశారు. దీనిని బట్టి, బ్రిటిషు పరిపాలనా కాలంలో, భారతీయ ప్రజాస్వామికము యొక్క తీరుతెన్నులు, పూరిగా అర్థమౌతాయి.

మనకు రాజకీయ స్వాతంత్ర్యము 1947లో లభించిన తరువాత, రాజ్యాంగ రచన కావించుకొని, పూర్తి ప్రజాస్వామిక విధానాన్ని, మనదేశంలో నెలకొల్పుకొనడం జరిగింది,

భారత రాజ్యాంగంలోని అత్యధిక భాగాలు 1950 సంవత్సరం, జనవరి 26వ తేదీనుండి అమలులోకి తేబడ్డాయి. అప్పటినుంచి భారతదేశం సంపూర్ణాధికారాలుగల ప్రజాస్వామిక గణతంత్రరాజ్యంగా అవతరించింది. మన రాజ్యాంగము యొక్క ఉపోద్ఘాతము (Preamble) పరిశీలిస్తే, రాజ్యాంగ సభవారు ప్రజాస్వామిక పునాదులను ఎలా పరిరక్షించాలని భావించారో, మనకు తెలుస్తుంది. ఉపోద్ఘాతంలో ముఖ్యమయిన విషయాలు ఏమిటంటే.—

1. సామాజిక ఆర్థిక, రాజకీయ రంగములలో పౌరులందరికి న్యాయము చేకూర్చడం;
2. ఆలోచన, భావ వ్యక్తీకరణ, నమ్మిక, విశ్వాసము, ఆరాధన విషయాలలో పౌరులందరికి స్వేచ్ఛ నివ్వడం;
3. పౌరులందరికి సమాన అర్హతలు, అవకాశాలు కల్పించడం;
4. పౌరుల వ్యక్తిత్వమును గౌరవమును కాపాడుచు, వారి సౌభ్రాతృత్వమును పెంపొందించుచూ, దేశ సమైక్యతను కాపాడడం.

ఇంతేగాక, రాజ్యాంగంలోని 38వ అనుచ్ఛేదములో ప్రజల సంక్షేమము వృద్ధి పరచుటకు సాంఘిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని పరిరక్షించే సాంఘిక వ్యవస్థ కొరకు ప్రభుత్వము ప్రయత్నించాలని, దేశంలోని అన్ని సంస్థలకు ఆదేశాలు యివ్వాలని పేర్కొనబడింది.

ఇలాంటి ఉత్తమ భావాలతో భారతీయ ప్రజాస్వామికం నిర్మింపబడింది. 21 సంవత్సరాలు వయస్సువచ్చిన భారత పౌరులందరకు, రాష్ట్రశాసన సభలకు కేంద్ర పార్లమెంటుకు జరుగు ఎన్నికలలో పాల్గొనడానికి కావలసిన ఓటు హక్కు ఇవ్వబడింది. దీనివలన, ప్రతి పౌరునకు శాసన నిర్మాణ కార్యక్రమంలో, పరోక్షంగా పాలుపంచుకొనే హక్కు సంక్రమించింది అదేవిధంగా 25 సంవత్సరాలు పైబడ్డ ప్రతిపౌరుడూ, విధాన పరిషత్తు, విధాన సభ, రాజ్యసభ, లోకసభ ఎన్నికలలో ప్రతినిధిగా నిలబడే హక్కు కూడా యివ్వబడింది. ఓటర్ల జాబితాలు తయారుచేయడం, పక్షపాత వైఖరి లేకుండా ఎన్నికలు జరిపి, ఎన్నికైన అభ్యర్థుల జాబితాలను ప్రకటించి, శాసనసభల నిర్మాణం చేయడం మొదలైన పనులు నిర్వహించడానికి ఎన్నికల కమిషను ఒకటి స్థాపించబడింది. ఎన్నికల విషయంలో అవకతవకలు జరిగినట్లు అనుమానించే పక్షంలో, న్యాయనిర్ణయం కొరకు అనువుగా హైకోర్టు. సుప్రీముకోర్టులకు, వెళ్లటానికి వీలుకల్పించారు .ఈ ఏర్పాటువలన ఎన్నికలు సరియైన వాతావరణంలో, న్యాయబద్ధంగా జరుగడానికి వీలుపడుతోంది. మన దేశంలో జరిగే ఎన్నికల తీరుపై ప్రపంచవ్యాప్తంగా పొగడ్తలు వచ్చాయి. Sri Toynbee ఒక ఆంగ్లేయ రాజకీయవేత్త - ఈ విషయంపై ప్రసంగిస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యము అమలులో ఉన్నపాశ్చాత్య దేశాలను, మినహాయిస్తే, ఆసియాలో రెండవ పెద్దదేశమైన భారత దేశంలో,పార్లమెంటరీ ప్రజాస్వామికము సత్ఫలితాలను ఇంతవరకు సాధించిందని ఒప్పుకున్నారు. ఆచార్య Finer తన గ్రంథంలో, ప్రజాస్వామ్యం. ప్రపంచంలో సుస్థిరత సాధించ గలదు అనేదానికి తార్కాణం, భారత దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామికం విజయం సాధించడమేనని వ్రాశారు. రాజ్యపాలనా విధానాల పరిశీలనలో గణుతికెక్కిన Paul appleby నాగపూరు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తు, ఈ శతాబ్దంలో పెద్ద ఎత్తున జరిగిన రాజకీయ పరిణామాలలో, భారతీయ ప్రజాస్వామికము ప్రపంచ చరిత్రలో, ఒకటని అభిప్రాయం వెలిబుచ్చారు విదేశీ విజ్ఞానవేత్తలు పై విధంగా అభిప్రాయం వెలిబుచ్చుతూ వుండగా, మన దేశంలోనే కొందరు మన ప్రజాస్వామికము యొక్క సుస్థిరతను శంకిస్తూ వచ్చారు వీరిలో శ్రీ Frank moraes విమర్శ చాల నిశితమయినది. మనది పూర్తి ప్రజాస్వామికముకాదని, అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామికము మాత్రమేనని. శక్తివంతమయిన ప్రతిపక్షము లేకుండా, ఏకపక్ష ప్రభుత్వముగల దేశము, ప్రజాస్వామికమును శాశ్వతముగా నిలుపుకొనలేదని, ఆయన వాదన.

ప్రపంచములో, ప్రజాస్వామిక పద్ధతి అనుసరిస్తున్న దేశాలలో, చాల వరకు ద్విపక్ష పద్ధతి అనుసరిస్తున్నారు. దీనివలన బాధ్యతాయుతమయిన, ప్రతిపక్షం పనిచేయుటకు అవకాశము కలుగుతుంది. అమెరికా, ఇంగ్లాండు, ఆస్ట్రేలియా, కెనడా, వంటి ప్రముఖ దేశాలలో, రాజకీయంగా ద్విపక్ష విధానం, అనుసరింపబడుతోంది. భారతదేశంలో ఇంతవరకు బలమయిన ప్రతిపక్షం పనిచేసే అవకాశం కలుగలేదు. దీనికి చారిత్రాత్మకమయిన కారణాలు వున్నాయి. మొదటలో, భారతీయ మేధావులందరూ, 1947 వరకు స్వాతంత్ర్యసాధనయే ముఖ్యముగ పరిగణించి కృషి చేసారు. అప్పటిలో, రాజకీయవాదులు ఏ పార్టీకి చెందినవారు, ఆ పార్టీయొక్క సిద్ధాంతములేవి, విధానములు ఏలాంటివి అనే దానికంటే వ్యక్తిగతంగా నాయకులు ఏలాంటి త్యాగములు చేశారు. విదేశపాలనము పోగొట్టడానికి వారి ప్రయత్నము. సహకారము ఎలాంటివి, అనే విషయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూవచ్చారు. అందుచేతనే, స్వాతంత్ర్యం సంపాదించిపెట్టిన పార్టీవారే, నిర్విరామంగా రెండు దశాబ్దములు, బలమైన ప్రతిపక్షం లేకుండానే, పరిపాలించడం జరిగింది. అడపాదడపా విమర్శలు, కొద్దిపాటి ప్రతిపక్ష వ్యక్తులు. పార్టీలద్వారా జరిగినా వాటికి దేశంలో ఆదరణ, శక్తి లభించలేదు. అందుచేతనే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో, జాతిపిత అయిన మహాత్మాగాంధీ స్వాతంత్ర్యము సంపాదించిన పార్టీని రద్దుపరచాలని, ప్రజాస్వామిక పరిపాలనా అవసరాలకు, అనుగుణంగా ఉండే పద్ధతిపై క్రొత్తగా పార్టీని ఒకదానిని రూపొందించాలని అభిప్రాయపడ్డారు. ఏదిఎట్లా వున్నా, మనదేశంలో క్రమంగా రాజకీయ పరిణామం వచ్చి నావా నేనా' అనే ద్విపక్ష రాజకీయ పద్ధతి రావలసి ఉంది. బలమయిన ప్రజాస్వామికానికి, ఇది గీటురాయి అనడంలో ఏ సందేహములేదు.

విద్యార్హతలు తక్కువగా వున్న మన దేశము పంట బాగా అభివృద్ధి చెందని దేశాలలో, అవకాశవాదులయిన కొందరు రాజకీయనాయకులు సిద్ధాంతములతో సంబంధం లేకుండ, పార్టీలు ఫిరాయించడం, జరుగుతున్నది. ఇట్టి ప్రవర్తన ప్రజాస్వామిక వ్యవస్థకు గొడ్డలిపెట్టు. అధికార దాహం, అవకాశవాదము దీనికి కారణాలు. ఎన్నికల సమయంలో ప్రతీ రాజకీయ పక్షమువారు, తమ సిద్ధాంతములను. అధికారములోనికి వచ్చిన పక్షంలో, తాము నెరవేర్చదలచిన ప్రజాహిత చర్యలను ప్రచారము చేస్తారు. ఎన్నికలు జరిగిన తరువాత వ్యక్తులు. పార్టీనుండి విడిపోవడం, ఇతర పార్టీలో చేరడం మొదలయిన పద్ధతులు గ్రహింపదగినవి. గత మూడు నాలుగు సంవత్సరాల నుండి, అసభ్యమయిన, ఈ పార్టీ ఫిరాయింపులు విరివిగా జరుగుతున్నవి. దీనికి సంబంధించిన శాసనసభ్యుల చర్యలు, ప్రజలలో ఆందోళన కలుగజేస్తున్నాయి. దీనిని అరికట్టడానికి, శాసనరూపమైన నిబంధనలు రూపొందించాలని, దేశవ్యాప్తముగ అభిప్రాయం రోజురోజుకు బలపడుతోంది. ప్రజాస్వామిక రక్షణకు ఈ విషయంలో శాసనము రూపొందించడం తప్పనిసరి అని చెప్పవచ్చు.

Independent సభ్యులు, ఎంత మేధావులయినా, గుణసంపద కలిగినవారయినా, నమ్మిన కార్యక్రమాలను అమలు జరుపు

టకు తగినశక్తి అవకాశము లేనివారగుటచేత, ప్రజాస్వామిక వ్యవస్థకు లాభించరు సర్వోదయ నాయకులు, శ్రీ జయప్రకాష్ నారాయణ, శ్రీ గోపరాజు రామచంద్రరావుగార్లు ప్రచారం చేస్తూవున్న పార్టీలేని ప్రజాస్వామికము ఎంతో అభివృద్ధి సాధించిన సమాజములో తప్ప, ప్రస్తుత పరిస్థితులలో అనుసరణీయముగాదని నా యభిప్రాయం. అందుచేత పార్టీ విధానమే, ప్రజాస్వామ్య సుస్థిరతకు శ్రీరామ రక్ష.

మన సమాజ వాతావరణంలో, రాజకీయపరంగా ఎన్ని లోపాలు కనిపించినప్పటికి, భారతపౌరులు నిర్వివాదంగా ప్రజాస్వామిక రాజ్యనిర్వహణకు తగియున్నారని చెప్పక తప్పదు. వర్గ కుల, మత, భాష, ప్రాంతీయాభిమానాలు వృద్ధిఅవుతున్న ఈ రోజులలో, అడపాదడపా తీవ్రవాదుల అమానుష చేష్టలు కొందరు అమాయిక ప్రజలను బలితీసుకొనుచున్న ఈ రోజులలో, స్నేహభావములేని, పొరుగు రాజ్యములుగల భారతదేశంలో, పటిష్టమైన కేంద్రప్రభుత్వాన్ని స్థాపించుటకు, కొద్ది రోజుల పార్లమెంటరీ లోకసభ ఎన్నికలు, తోడ్పడ్డాయంటే ప్రజాస్వామికపద్ధతి ఎటువంటి పునాదులు మనదేశంలో వేసుకున్నదో తెలుస్తుంది. ముఖ్యంగా పొరుగుదేశాలయిన పాకిస్తాన్, బర్మా వంటి దేశాలలో సైనికపాలన సాగుతుంటే, భారతదేశంలో, విదేశ దురాక్రమణను సైతం ఎదుర్కొని, ప్రజాస్వామికమును వృద్ధిచేసికొన్నామంటే ఎంతో సంతోషపడవలసిన విషయం. కాలక్రమమున, మన ప్రజాస్వామికము, మనదేశాన్ని అతి ఉన్నత స్థాయికి తీసుకొనిపోతుంది అని ఆశిద్దాం.

జ్ఞానపీఠమువారి లక్షరూప్యముల వార్షిక పారితోషిక మీయేడు ఆంధ్రమునకును, అందును ఆధునికాంధ్రకవి చూడామణులగు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారికిని, అందును వారి రచనలకెల్ల తలమానికమని చెప్పదగిన శ్రీమద్రామాయణ కల్పవృక్షమునకును లభించుట ఆంధ్రుల కందరికిని సంతోషకరమే కాక గర్వకారణముకూడ నైనది. శ్రీ సత్యనారాయణ గారియందు కవితాహేతువులైన ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములు మూడును సమ సమ్మేళనము పొందియున్నవి. ఆయన మహాకవి, గొప్పనవలా రచయిత, కథానికాకర్త, గేయకావ్య స్రష్ట, నాటకనిర్మాత, విద్వద్విమర్శకుడు, వాగ్మిశేఖరుడు–వేయేల ఆంధ్రమున ఆయన చేపట్టని సారస్వత ప్రక్రియ లేదు. చేపట్టి శిల్పకళా సుందరముగా తీర్చిదిద్దని సారస్వత ప్రక్రియలేదు. వారి సర్వతోముఖ ప్రతిభా పాండిత్యములకు మేరలులేవు.

విశ్వనాథ విశిష్టత

"నా సకలోహ వైభవ సనాథము
నాథకథన్ రచించెదన్"

దివాకర్ల వేంకటావధాని



శ్రీ విశ్వనాథ ఎంత మహాకవులో అంత విద్వచ్ఛేఖరులు. ఆంధ్రమున సమగ్ర వైదుష్యము సంపాదింపవలెనన్న సంస్కృత పాండిత్యముకూడ నవసరము. శ్రీ విశ్వనాథ వారియందా రెండును సంపూర్ణముగా సమకూడినవి. వారాంధ్రమున వలెనే సంస్కృతమందును సరస బంధురమైన కవిత్వము సాధింపగలరు. వారగస్త్యుఁడంభోధినివలె నాంగ్లసారస్వతము నంతను ఆపోశనము పట్టినారు. ఆంగ్లమున వారు పఠింపని యుత్తమ నవల లేదనుటలో నతిశయోక్తిలేదు. వారాంగ్లమునందలి యేనవలాకారుని గూర్చియైనను ప్రామాణికముగా నుపన్యసింపజాలుదురు. వారు తమ గురువులైన శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులవలెనే పలువురు శిష్యుల నాకర్షించి వారి హృదయపూర్వక భక్తిగౌరవములకు పాత్రులు కాజాలినారు.

ప్రథమకావ్యము

విశ్వనాథ కవి సమ్రాట్టు మొదటి కావ్య మాంధ్రప్రశస్తి. అందు పూర్వాంధ్ర మహత్త్వమును బ్రకటించునెనిమిది కమనీయ ఖండకావ్యములున్నవి. శృంగారవీథి రాధాకృష్ణుల ప్రణయమును, శ్రీ కృష్ణుని బాల్యమును సుందరముగా వర్ణించు చిన్నకావ్యము. తెలుగుదేశమున ప్రవర్తిల్లు ఋతుచక్రమును సహజ మనోహరముగా సాక్షాత్కరింపజేయు వారి తెలుగుఋతువు లాకృతిని చిన్నదయ్యు నందచందములందు మిన్నయై వారి వర్ణనా ప్రతిభను ప్రకృతి పరిశీలనమును వ్యక్తముచేయు మహాకావ్యము. శశిదూతము వర్ణనాభావవైవిధ్యమునందు కవికులగురువైన కాళిదాసుని మేఘసందేశముతో మేలమాడును. ఝాన్సీరాణి ఆ పేరుగల దేశభక్తినిధానమైనమహారాజ్ఞి వీరవిక్రమ విలాసమును వర్ణించు వీరకావ్యము. వల్లీకల్యాణము వల్లీ కుమారస్వాముల పరిణయము వర్ణించు సరసకావ్యము. మాస్వామి విశ్వనాథ వారి యిలవేల్పైన విశ్వేశ్వరునిగూర్చి వ్రాయబడిన భక్తి శతకరాజము. విశ్వనాథమధ్యాక్కర లనునది వారు వివిధ దైవములను గూర్చి మధ్యాక్కరావృత్తములలో రచించిన పదిశతకముల సమాహారము. శ్రీ విశ్వనాథవారి భక్తిశీలమును తాత్త్వికభావములను చక్కగా వివరించు నీకావ్యమునకు పది సంవత్సరములకు పూర్వము కేంద్ర ప్రభుత్వమువారి యెదువేల రూప్యముల జాతీయ బహుమానము లభించినది. గోపికా గీతములు గోపికలకు శ్రీకృష్ణుని

యెడగల భక్తి సంపదను వర్ణించు మధురకావ్యము. ప్రద్యుమ్నాభ్యుదయమను పేర వారిటీవల వెలయించిన ప్రబంధము కవితా సంపదయందును పద్యరచన వైభవమునందును పూర్వ ప్రబంధములతో పోటీ చేయజాలును. ఇంక వారి శ్రీమద్రామాయణ కల్పవృక్షము రచనాలోకవైభవ సనాథమైన మహాకావ్యము. ఇందు వాల్మీకి రామాయణమునందు వలెనే ఆరుకాండములున్నవి. ఇందలి కథ రామాయణకథయే యైనను ఇది సంస్కృత రామాయణమునకనువాదము కాని అనుసరణము కాని కాదు. దీనిని వాల్మీకి మహాముని రామాయణ కథా శిల్పరహస్యముల కొక విధముగా వ్యాఖ్యానమని చెప్పవచ్చును. ఇది సర్వకవితా గుణములకును రత్నాకరము. శ్రీ విశ్వనాథవారి కవితా ప్రతిభకెత్తిన వైజయంతికయై విరాజిల్లుచున్నది.

కిన్నెరసాని పాటలు

గేయకావ్యకర్తలుగా శ్రీ విశ్వనాథకుగల ప్రశస్తి అప్రతిమానమైనది. వారి కిన్నెరసాని పాటలు కోకిలమ్మ పెండ్లి అను గేయకావ్యములు సర్వాంధ్ర జన సుపరిచితములు. నర్తనశాల వేనరాజు, త్రిశూలము అనార్కలి మున్నగునవి, వారి పెద్ద నాటకములు. వేనకావ్య హరిశ్చంద్రములు, జగదంబ రాయబారము ఆంధ్రసారస్వత సౌందర్య సూచకములైన పది నాటికలు ఆకాశవాణినుండి ప్రసారితములై అనేకుల నలరించినవి.

నవలా కారుడుగా.....

ఆధునికాంధ్ర నవలాకర్తలలో నగ్రేసరులు శ్రీ విశ్వనాథ వారు. వారిరువదికిపైగా నవలలను ప్రచురించియుండిరి. ఏకవీర వారి మొదటి నవల. కొండబదియే వారి ప్రశస్త నవల అనియు చెప్పుదురు. అది యిటీవల చిత్ర రూపము నందినది. చెలియలికట్ట జేబు దొంగలు, బాణావతి, ధర్మచక్రము, బద్దన్న సేనాని మాబాబు, విహారకులుడు ఆరు నదులు మున్నగునవి వారి సుప్రసిద్ధ నవలలో కొన్ని. వారిటీవల పురాణవైర గ్రంథమాల అను శీర్షికతో పన్నెండు నవలలను పరంపరగా ప్రచురించి యుండిరి. హాహా, హూహూ, పరీక్ష, కడిమిచెట్టు అనునవి రూపమున చిన్నవైనను గుణమున మిన్నలైన వారి నవలా రత్నములు. శ్రీ శేషాచలం కంపెనీ వారు వారి క్రొత్త నవలలు కొన్నిటి నిటీవల "పోకెట్ సైజు" లో ప్రకటించియుండిరి. ఇందు క్రిందపోయిన చెక్కవానిలో నొకటి. చిన్నవైనను పెద్దవైనను వారి నవలలాంధ్రదేశమున నపార ప్రచారము పొందినవి. గుణమును బట్టియు పరిమాణమును బట్టియు కూడ వారి నవలలలోని కెల్ల మహత్తరమైనది వేయి పడగలు. అది యిటీవల 'సహస్రఫణ్' అను పేరుతో విద్యాశాఖా మాత్యులు శ్రీ పి. వి నరసింహారావు గారిచే హిందీ భాషలోనికనువదింపబడి విశేషప్రశస్తి నందుకొన్నది. అందు వేయి పుటలకు పైగా నున్నవి. దానిని వట్టి నవల యనుట కంటె ఆంధ్ర సంస్కృతి సర్వస్వమనుట యుచితము. అది ఆంధ్రవిశ్వ విద్యాలయము వారు నిర్వహించిన యొక పోటీ కొరకు వ్రాయబడి బహుమానమును బడసినది. తొలిసారి అది ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధమున పరంపరగా ప్రకటితమై పాఠకుల నుర్రూత లూగించినది. విశ్వనాథ వారి వలె నిన్ని యుత్తమ నవలలను పుంఖానుపుంఖముగా రచించి ప్రచురించిన వారాంధ్రదేశముననేకాదు భారత దేశమున కూడ లేరనిచెప్పుటలో నతిశయోక్తి లేదు.

విమర్శక శిఖామణి

విద్వద్విమర్శకులుగా శ్రీ విశ్వనాథ వారికున్న స్థానమున్నతమైనట్టిది. వారు సంస్కృతాంధ్ర సారస్వతములను చక్కగా పరిశీలించి యందలి కొన్ని కావ్యములలోని అనల్ప శిల్పవైభవమును గ్రంథముల రూపమున ప్రచురించి యుండిరి. నన్నయగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి, అల్లసాని వారి అల్లిక జిగిబిగి, అభిజ్ఞాన శాకుంతలము నందలి అభిజ్ఞానము మున్నగునవి అందు ముఖ్యములైనవి. అవి వారి పాండితీ శౌండీర్యమునకును, విమర్శన పాటవమునకును నిదర్శనములు. ఇవిగాక వారు వివిధ పత్రికలందును, విజ్ఞానకోశము లందును ప్రచురించిన విమర్శ వ్యాసములనేకములున్నవి. వారి దీర్ఘమైన యుపోద్ఘాతముతో గూడిన ఆది పర్వమును ఆంధ్రకావ్య సౌందర్య సంపదను ప్రకటించు కావ్యపరిమళమును, తెలుగు సామెతలను, ధాతుస్వరూపమణి దీపికను ఆం. ప్ర. సాహిత్య అకాడమి వారు ప్రకటించియుండిరి.

ప్రపంచమున ప్రసిద్ధికెక్కిన కవయితలనేకులున్నారు. కాని వారిలో పలువురికి వాగ్మితావైభవ ముండదు. శ్రీవిశ్వనాథ యెంతమహాకవులో అంత వాగ్మిశేఖరులు.


అక్షరాల విశ్వప్రఖ్యాతులు

శ్రీ విశ్వనాథవారు కొంతకాలమాంధ్రోపన్యాసకులుగాను కొంతకాలము కళాశాలాధ్యక్షులుగాను పనిచేసియుండిరి. వారు పొందిన గౌరవ సత్కారములనేకములు. ఆంధ్ర విశ్వవిద్యాలయము కళా ప్రపూర్ణ బిరుదమును, కేంద్ర ప్రభుత్వము పద్మభూషణ బిరుదమును, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము డి. లిట్ బిరుదమును కేంద్ర సాహిత్య అకాడమి విశిష్ట సభ్యత్వమును ఒసంగి వారిని గౌరవించినవి. కవిసమ్రాడ్బిరుదము వారికి సహజ సిద్ధము. వారు గ్రహించుటచే నీబిరుదము లన్నియు సార్థకములై యలరారుచున్నవి.

ప్రాత క్రొత్తల మేలుకలయిక

శ్రీ విశ్వనాథవారికి సంప్రదాయజ్ఞులన్న నెంత గౌరవమో నవ్యకవులన్న నంత వాత్సల్యము. నవ్యతా పురాతనతలు వారి యందు మేలుకలయిక నందినవి. వారికవితా ప్రతిభ అపారమైనది. విద్వత్త అనన్యసాధారణమైనది. విమర్శన పాటవమపూర్వమైనది. అట్టి మహనీయ సారస్వత మూర్తులు కొన్ని శతాబ్దముల కొక్క మారుదయించుచుందురు. వారాంధ్రులకు గర్వ కారణము. ఎంత గొప్పవారైనను చేయబడినను వారి ప్రతిభా పాండిత్యములకు తక్కువే. జ్ఞానపీఠమువారు తమ వార్షిక పారితోషికము నీ యేడు వారి కొసంగి తమ యౌచితీ పరిజ్ఞానమును గుణగౌరవమును ప్రదర్శించియున్నారు.

★


ఎక్కువ పంటలను
పండించుకోండి
బ్యాంక్ ఆఫ్ బరోడా
వ్యవసాయ పనులకు
అప్పులు యిస్తుంది
మంచి విత్తనములు, మంచి ఎరువులు, మంచి పనిముట్లు భూమిని పదును చేస్తాయి. మంచి పంటలను పండించుకొనుటలో మీకు కావలసిన వాటిని కొనుక్కొని....డబ్బు గడించుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా అప్పులను యివ్వగలదు.
సిరిసంపదలకు అక్షయపాత్ర
బ్యాంక్ ఆఫ్ బరోడా
హెడ్ ఆఫీస్: మాండ్వీ, బరోడా.
550 పైగా బ్రాంచీలతో భారతదేశములో దాదాపు ప్రతి స్టేటులోను సేవ చేస్తోంది. ఇంకా: యు.కె., తూర్పు ఆఫ్రికా, మారిషస్, ఫిజీ ద్వీపములు మరియు గియానాలలో బ్రాంచీలు కలవు.
BANK OF BARODA

హైదరాబాదులోని ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ఆధునిక యుగంలో సాధించిన విజయాలకు కొదువలేదు. అణుశక్తిని ప్రయోజనాత్మకంగా మలచుకోవడం, వ్యోమతలాన్ని పరిశోధించి ఎన్నెన్నో కొత్త రహస్యాల్ని కనిపెట్టడం-యివన్నీ ఆధునిక యుగంలో మనం సాధించిన విజయాలే ఈ విజయ సాధనలో ఎలక్ట్రానిక్స్ వహించిన పాత్ర ప్రత్యేకించి చెప్పుకో వలసి వుంటుంది నిజానికి ఎక్కడైనాసరే పారిశ్రామిక అభివృద్ధిని కొలవాలంటేఎలక్ట్రానిక్స్ ఒక కొలబద్దగా యీనాడు పరిగణింపబడతోంది. ఎలక్ట్రానిక్స్ తయారుచేసిన పరికరాలు యీనాడు వ్యవసాయం, వైద్యం, పరిశ్రమలు,ధన, విద్య, వాణిజ్య, యింకా ఎన్నో రంగాలలో ఉపయోగించబడుతున్నాయి

మనదేశం యిటీవలి కాలం వరకు ఎలక్ట్రానిక్స్ ప్రరిశ్రమ విషయంలో విదేశీ పరికరాలమీదా, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం మీదా ఆధారపడివున్నదల్లా యీనాడు స్వదేశంలోనే ఎలక్ట్రానిక్స్ పరికరాలను ఉత్పత్తి చేసే స్థితిలోకి వచ్చింది.

మన అణుశక్తి కార్యక్రమాలకు కేంద్రంగా వుంటూన్న బాభా అణుశక్తి కేంద్రం యీ ఎలక్ట్రానిక్స్ సాంకేతిక విషయ పరిజ్ఞానాన్ని దేశంలో వెదజల్లడంలో ఎంతో కృషి చేసింది. ఈ బాభా అణుశక్తి కేంద్రము విభాగం హైదరాబాదు వద్ద భారీ ఎత్తున ఎలక్ట్రానిక్స్ కాంప్లెక్స్ తలెత్తడానికి కారణమైంది. దీనికి ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అని పేరు. ఇది కేంద్ర ప్రభుత్వసంస్థ. ఇందులో వందలాది శాస్త్రవేత్తలు. ఇంజనీర్లు సాంకేతిక వేత్తలు పనిచేస్తున్నారు ఇది చాలాపెద్ద సంస్థ. అణుశక్తి కార్యక్రమాలలోనూ, కంప్యూటర్లలోనూ వినియోగించే అనేక రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను విడిభాగాలను ఇది తయారుచేయడం మొదలెట్టింది.

భారత ప్రభుత్వ అణుశక్తి శాఖ అధ్వర్యం క్రింద వ్యాపార వ్యవస్థగా ఇది 1967 ఏప్రెల్ 11న నెలకొల్పబడింది. ఈ కర్మాగారం హైదరాబాదు పొలిమేరల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యిచ్చిన 200 ఎకరాలలో స్థాపించబడింది.

వ్యవసాయం పరిశోధన, వైద్యం పరిశ్రమలు మొదలైన రంగాలలో ఉపయోగించడనికిగాను న్యూక్లియర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలను తయారుచేసి మనదేశం అణుశక్తి కార్యక్రమాలను అమలు పరచడంలో దోహదకారి కావడం యీ కర్మాగారం ప్రధాన లక్ష్యం. ఇక్కడ అసిలోస్కోప్‌లు పల్స్ జనరేటర్లు. అల్ట్రాసోనిక్ ప్లాడిటెక్టర్స్‌వంటీ జటిలమైన పరికరాలు తయారు చేయబడుతున్నాయి. ఈ పరికరాలను మనదేశం యిటీవలి కాలం వరకూ దిగుమతి చేసుటూకొంనే వచ్చింది.

రిపవర్ య్యాక్టర్ ఇనుస్ట్రుమెంటేషన్ విభాగం ఒకటి యిక్కడవుంది. దేశంలో నెలకొల్పబడుతున్న పవర్ రియాక్టర్లలో ఉపయోగించడానికై ఇనుస్ట్రుమెంటేషన్, కంట్రోల్ పేనల్‌లను యీ విభాగం తయారుచేస్తుంది. ఇక్కడవున్న మరోవిభాగం కంప్యూటర్ల విభాగం. విద్య, ప్రోసెస్ కంట్రోల్ పరిశ్రమ, శాస్త్రీయపరిశోధన రక్షణ రంగాలలో వాడడానికై ప్రెసిషన్ ఎన్‌లాగ్, డిజిటల్ కంప్యూటర్లు తయారుచేయబడతాయి. ఈ విభాగంలో తయారైన తొలి డిజిటల్ కంప్యూటర్ టి డి సి రకం నిజంగా యీనాడు మనకు కావలసిన రకం కంప్యూటర్. దీనిని బాబా అణుశక్తి కేంద్రం శాస్త్రవేత్తలే దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతోనే రూపకల్పన చేశారు. దీనిలో దిగుమతిచేసుకున్న విదేశీ భాగాల్ని సాధ్యమైనంత తక్కువగా వాడడం జరిగింది.

ఇక్కడ రూపొందించిన ఎనలాగ్ కంప్యూటర్‌లు ఒకేసారి అనేక లెక్కలను చేయడానికి తోడ్పడతాయి.

రెసిస్టర్లు. కెపాసిటర్లు తయారుచేసే విభాగం కూడా యిక్కడవుంది. ఈ విభాగం అనేక విషయాలలో ప్రథమంగా పేర్కొదగిన మెటల్‌ఫిల్మ్ రెసిస్టర్లు, టేంటలమ్. కెపాసిటర్లు, మల్టీటర్న్‌వైర్‌వౌండ్ పొటాన్షియో మీటర్లు యిక్కడే యీవిభాగంలో తయారు చేయబడ్డాయి. మెటల్‌ఫిల్మ్ రెసిస్టర్లు ఎక్కువగా శబ్దం చేయవు. నమ్మకంగా పనిచేస్తాయి, ప్రెసెషన్ మెషరింగ్ పరికరాలలోనూ, ఆసిలోస్కోప్స్ కంప్యూటర్లు, రక్షణ పరికరాలలో వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. సోలిడ్ టేంటలకు కెపాసిటేటర్లు వాటితో పోల్చిచూస్తే చిన్నసైజులో అందుబాటుగావున్నాయి. అధిక ఉష్ణోగ్రతని. మెకానికల్‌షాక్‌లను తట్టుకోగలవు. అన్ని ట్రాన్సిస్టరైజ్డ్ పోర్టబుల్ పరికరాలకు అమోఘంగా పనికి వస్తాయి.


సెమికండక్టర్స్ విభాగంలో జెనర్‌డయోడ్స్, ట్రాన్సిస్టర్ తయారు అవుతున్నాయి. వీటికి మంచి గిరాకి వుంది. జర్మేనియం సిలికన్‌స్ఫటికాలను తయారు చేసే పనిని కూడా యీ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ చేపట్టింది. లిథియం డ్రిఫ్టెడ్ జర్మేనియం డిటెక్టర్స్, గ్లాస్‌టు మెటల్ సీల థర్మో ఎలక్ట్రిక్ కూలింగ్ మాడ్యూల్స్‌ను తొలిసారిగా తయారు చేసిన ఘనత యీ విభాగందే.


సెర్వో కంట్రోల్ విభాగంలో సెర్వోమోటార్లు, సింక్రోస్ సాల్వర్లు ఎలక్ట్రోమెకానికల్ విడిభాగాలుతయారవుతాయి.

సెర్వో మోటార్లను మోటారైజింగ్ పొటన్షియోమీటర్లు, థియోస్టేట్స్ వేరియబుల్ -టో-ట్రాన్స్‌ఫార్మర్లు. వాల్వులు, డాంపర్లు, షట్టర్సు‌ట్రావెర్స్ మెకానిజంవెండింగ్, ఏసమేటెడ్‌సైన్ బోర్డులు, టేబిల్స్, టి.వి అంటెన్నాస్ రిమోట్ ట్యూనర్లు మొదలైన వాటిలో ఉపయోగిస్తారు.


ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్‌కు అన్ని హంగులూగల చక్కటి ప్రయోగశాల వున్నది దీనికితోడు ప్రతి విభాగంలోనూ క్వాలిటి కంట్రోల్‌డిపార్టు మెంటులు వున్నాయి. ప్రతిస్థాయిలోను ఉన్నత ప్రమాణాలను కాపాడడానికి యివి తోడ్పడుతుంటాయి.


ఎలెక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్





హైదరాబాదు పారిశ్రామికాభివృద్ధి
చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం









ఇండియా లిమిటెడ్, హైదరాబాదు

1. గేర్డ్ సర్వోమోటార్ పంచింగ్ స్టేటర్ లేమినేషను
2. మెటల్ ఫిల్మ్ రెసిస్టర్ల వేక్యూమ్‌కి డిపోజిషన్
3. మెటల్ ఫిల్మ్ రెసిస్టర్ల కొ ఎఫిషెంట్ మెజర్‌మెంట్
4. హైదరాబాదులోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారం వివిధ విభాగాలు
5. జిసిఎస్ 13 రకం జీగర్ కౌంటింగ్ యంత్రం
6. ప్యాయరింగ్ మెషిన్ కంట్రోల్





నడచి వచ్చిన మోహన రాముడు

త్యాగరాజు కుమార్తె సీతాలక్ష్మికి యుక్త వయసు వచ్చింది. వరుని కొరకు పాట్లు పడకుండగనే మంచి సంబంధమే కుదిరింది. ప్రక్కనే తిరువాది గ్రామంలోని కుప్పుస్వామి అయ్యర్ అనే విద్వాంసునికి కన్యాదానం చేశాడు. పెళ్ళికి జపేశయ్యను పెద్ద జేశాడు.

శిష్యులందరు గురువుగారికి వెలలేని కానుకలను సమర్పింప దలచి ప్రసిద్ధ చిత్రకారుడు. రాయవేలూరి ఎల్లయ్యచేత సీతరామ లక్ష్మణ రూపములను చిత్రముగా వ్రాయించి గురువుగార్కి ముఖ్య శిష్యుడు వాలాజాపేట వెంకట రమణయ్య చేత సమర్పించారు. వెంకటరమణయ్య భక్తితో పటమును గురువుగారికిచ్చి పాదాభివందన చేశాడు. త్యాగరాజు ఆ పటాన్ని తీసుకొని యెంతో సంతోషించి, తన శిష్యులు తన మనసెరింగి అద్భుత కానుకను యిచ్చారని వారిని ఆనందపరచవలెనని మోహనరాగంలో "ననుపాలింపగ నడచి వచ్చితివా నాప్రాణనాథ" అని హాయిగ గానం చేశాడు

త్యాగరాజు గురువు శొంఠి వెంకటరమణయ్య పంతులు ఆదృశ్యాన్ని తిలకించి ఆనంద బాష్పాలు రాల్చాడు. శరభోజిమహారాజు త్యాగరాజునికి యే కొరత లేకుండా సహాయపడాడు.

ఎందరో మహానుభావులు

త్యాగరాజు గానం విని ఆనందించడానికి, పరీక్షించడానికి, ఆశీస్సులొసంగడానికి ఎందరో మహాను భావులు త్యాగరాజు గృహాన్ని పావనం చేశారు.

రామ భక్తుడు కీర్తనలు వ్రాసి పండిత పామరులచే భక్తాగ్రగణ్యుడిగా పేరు గన్న గుంటూరు తూము నరసింహదాసు త్యాగరాజు గానంలోని భావప్రకటనను పరిశుద్ధాంతశ్శక్తిని గమనించి ధన్యుడయ్యాడు. త్యాగరాజును భద్రాచలం వచ్చి రామదాసు కట్టించిన ఆలయాన్ని జూచి రాముని దర్శించి గోదావరి తీర్థం సేవించమని ప్రార్థించాడు త్యాగరాజు సంతోషంతో దాని ఆహ్వానాన్ని స్వీకరించి తనకూ అట్టి అభిలాష వున్నదని తెలిపాడు.

కాశీనివాసి, ఔత్తరాహిక సంగీతంలో ప్రసిద్ధులైన గోపీనాథ భట్టాచార్యులు త్యాగరాజు ప్రతిభవిని తిరువయ్యూరు చేరి త్యాగరాజును దర్శించి తననానందింప చేయమని అర్థించాడు. కాశీలో నివసించుచూ విశ్వేశ్వరానుగ్రహము పొందిన విద్వాంసుని జూచి తన జన్మ సార్థకమైనదని, ఔత్తరాహికులకు ప్రియమయిన తోడిరాగమును, దాక్షిణాత్యులకు ప్రియమయిన శంకరాభరణ రాగమును రెంటిని మేళవించారు. కేశిరాగంగా సృష్టించి "ఆడమొడిగలదే రామయ్యా" అనే కీర్తనను గానంచేసి భట్టాచార్యుల్ని సంతోషపరిచారు

గోపాలకృష్ణ భారతి మధుర తమిళ కవి నందనార్ చరిత్ర ఆయన రచనలలో అగ్రగణ్యమైనది. బహుళ ప్రజానురంజక మయినది. అంతేగాదు స్వాతంత్ర్యగీతికలను ఆలాపించిన ప్రజాకవి. ప్రజల హృదయాలను ఆకర్షించి పెద్దల ఆశీస్సులు పొందిన భారతి. త్యాగరాజు ఆశీస్సులు పొందడం తన భాగ్యమని తలంచాడు. త్యాగరాజును దర్శించగానే పాదాభి వందన జేశాడు. త్యాగరాజును పాడమనిఅడిగే ధైర్యంలేదు. కాని త్యాగరాజే భారతిని ఒకకీర్తన వ్రాసిపాడమన్నాడు. త్యాగరాజుఆదేశం. కాని త్యాగరాజు భావనలతో తన భావనలు సరితూగ గలవా? ఆ శ్రీరామునిమీద భారం వేసి ఆభోగి రాగంలో సభాపతిక్కు వేరు దైవం. యనే గీతికను రచించి, పాడి త్యాగరాజు ఆశీస్సులు పొందాడు.

త్యాగరాజు కూడా భారతిని సంతోష పరచదలచి ధేనుక రాగంలో "తెలియ లేరు రామ భక్తి మార్గములను" అనే కీర్తన గానం జేశాడు. భారతి త్యాగరాజునకు మరొకమారు నమస్కరించి సెలవు తీసుకొన్నాడు.

స్వాతి తిరునాళ్ తిరువాన్కూర్ రాజు ప్రసిద్ధ కృతికర్త సంగీత సాహిత్యాభిమాని. కవులకు, పండితులకు, సంగీత కళాకారులకు. అయన ఆస్థానము కృష్ణ దేవరాయుని భువన విజయమునకు సమాన మయినది. స్వాతితిరునాళ్ ఆస్థానంలో పడివేలు ప్రముఖ సంగీత విద్వాంసులు. ఇటలీ దేశ వాద్యమయిన వాయులీనము (వయొలిన్) వాయించడంలో అతని కతనే సాటి. ఈ నాడు గాత్ర, వైణిక వేణువు విద్వాసులకు ప్రక్క వాద్యముగా సహక

రించు నట్లు జేసి భారతీయ వాద్యములలో ప్రముఖమైనదిగా చేసిన కీర్తి వడివేలుకే దక్కింది.

స్వాతి తిరునాళ్‌కు త్యాగరాజు గానం వినవలెనని, చూడ వలెనని మిక్కిలి కుతూహలముండెడిది. వడివేలును త్యాగరాజు నెటులైన తీసుకరమ్మని అర్థించాడు. కాని త్యాగరాజు గుణ గణాలు విన్న వడివేలు త్యాగరాజు అంగీకరిస్తాడా యనేది అను మానమయినా రాజాజ్ఞ మేరకు తిరువయ్యూరుకు పయన మయ్యాడు.

త్యాగరాజును ఎటులయిన తను ఆకర్షించుకొన వలెనని, కావేరికి సమీపంలో ఒక గృహము తీసుకొని విడిది చేశాడు.

త్యాగరాజు కావేరికి వచ్చే సమయానికి వయెలిన్ వాయిస్తూ గానం చేశాడు త్యాగరాజు ఆ గానానికి, వయొలిన్ పలుకు సంగ తులకు సంతసించి తనకు తెలియని యీ గొప్ప విద్వాంసుడెవరో నని అచ్చెరువునంది ఆ గానం నిలిచేంతవరకు తానూ వింటూ కాలాన్ని గడచేవాడు.

వరుసగా ఒక రెండు దినములు విని మూడవ నాడు ఆ మహా విద్వాంసుని జూడవలెనని యింటిలోనికి అడుగిడినాడు. మధ్య హాలులో కూర్చొని సాధన చేస్తున్న వడివేలు త్యాగరాజు రాక గమనించి, లేచి ఆహ్వానించాడు. త్యాగరాజు వడివేలుకు నమస్కరించాడు. "స్వామీ; మీ గానం నన్ను మైమరపించి మిమ్మల జూడ వలెనని మక్కువతో కాళ్ళీటు నన్నీడ్చుకొని వచ్చాయి తమ సాధనకు అంతరాయం కల్గించాను, క్షమించండని విన్నవించు కొన్నాడు.

వడివేలు సంతోషించి, రేపు నీ యింటికి వచ్చి నీ రాముని యెదట గానంచేసి నిన్ను సంతోషపరుస్తాను నన్నూ నీవు ఆనందింప చేయాలిసుమా అని నవ్వుతో చెప్పాడు. త్యాగరాజు అవశ్యం అంటూ నమస్కరించి యింటికి వచ్చాడు.

మరుదినం త్యాగరాజు వడివేలు రాకకై ఎదురు చూస్తుండి నాడు. వడివేలురాక త్యాగరాజుకెంతో సంతోషానిచ్చింది. శిష్యులు వడివేలుకు నమస్కరించారు. వడివేలు రామపంచాయతన విగ్ర హాలకు నమస్కరించి తన ధనుర్వీణ నందుకొని " వందే సదా పద్మనాభం'' అనే స్వాతి తిరునాళ్ కీర్తనను మధుర ధ్వనులతో వినిపించాడు.

త్యాగరాజు కూడా వడివేలు నానంద పరచదలచి ఖరహర ప్రియరాగములో "చక్కని రాజ మార్గముండగ సందుల దూరనేల ఓ మనసా "యనే కీర్తనను పాడి సంతోషపరచాడు. త్యాగరాజు గాన మాధుర్యానికి వడివేలు ముగ్ధుడైనాడు.

త్యాగరాజు మనస్సెరింగిన వడివేలు తన రాజు కోర్కె వెల్లడించడానికి జంకాడు. వడివేలు మనసులో యేదో కోరిక వుందని గమనించాడు. త్యాగరాజు మందహాసం జూచి చివరకు నా దొక విన్నప మన్నాడు వడివేలు. చెప్పండన్నాడు త్యాగరాజు.

"ఏమీ లేదు. స్వాతి తిరునాళ్ మాకు రాజయినా ఆయన ప్రసిద్ధ సంగీతికా రచయిత, పండితుడు కళాభిమాని. అనంత పద్మనాభస్వామి మీద ఆయన రచనలు మోఘమయినవి మీకు తెలియనిది కాదు. నేచెప్పబోయేది వారి కోరిక తమ రొక్కసారి మీరు—"అని చెప్పుచుండగనే "వడివేలు గారూ! నే తప్పక తిరు నాళ్ రాజు గారిని కలుస్తాను. కాని యిప్పుడుగాదు. వారు సేవించే పద్మనాభస్వామి, నే నారాధించే రాముడు ఒక్కరే. మాకు భేద మేముంది. ఎప్పుడో ఒకనాడు ఒకచోట మేము తప్పక కలుసు కొంటాము అని త్యాగరాజు ప్రత్యుత్తరమివ్వగానే హతాశుడైనాడు వడివేలు వడివేలు కోరిక రాజాజ్ఞ. మన్నించలేనందుకు క్షమించ మని కోరినాడు. వడివేలు చేసేదిలేక త్యాగరాజును చూచుటయే భాగ్య మని తలచి తిరుగు ముఖంపట్టాడు.

శరభోజికి త్యాగరాజు గానం వినడానికి అదృష్టముండినది. కాని స్వాతి తిరునాళ్‌కు ఆ అదృష్టం లభించలేదు. కారణం ఆనాటి బ్రిటిష్ వారి రాజకీయాలు. త్యాగరాజు కీర్తనలు మాత్రం గానం చేయగలిగాడు. 1846వ సంవత్సరం డిశంబర్ 25వ తేది శ్రీస్వాతి తిరునాళ్ విష్ణు సాయుజ్య మందినాడు. అదివినిన త్యాగరాజు తిరు నాళ్ మక్కువ తీర్చలేనందుకు బాధపడ్డాడు.

ముద్దుస్వామి దీక్షితార్ మరొక సంగీత వైతాళికుడు. వీరి రచనలు సంస్కృత పదజాలములో వుండేవి. వీణా పుస్తకధారిణి, మొదలైన కీర్తనలు ప్రసిద్ధములు. తిరువయ్యూర్‌లోని త్యాగరాజ స్వామి ఆలయాన్ని దర్శించి, సంకీర్తన గావించి త్యాగయ్య దర్శనం కూడా చేసి కొన్నాడు. అదివరకే యెరిగివున్న త్యాగయ్య దీక్షితర్‌కు వినయ పూర్వకంగా స్వాగతం పలికాడు. ఆ నాటి పూజాది కార్యక్రమంలో త్యాగయ్యతో బాటు దీక్షితర్ పాల్గొన్నాడు ''కాలువేయున్నాడె'' అనే కీర్తనను మధురంగా పాడి దీక్షితర్‌ను సంతోషపరిచాడు.

మరొక మహా విద్వాంసుడు శ్యామాశాస్త్రి. త్యాగరాజు, దీక్షితార్, శ్యామశాస్త్రి ముగ్గురూ ఒకే కాలంలో జీవించడం దాక్షిణా త్యుల అదృష్టమేనని చెప్పాలి. ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజ సల్పడం త్యాగరాజు కార్యక్రమాలలో ప్రధానమయినది. ఆ దినం ఎవ్వరో ఒక పెద్ద విద్వాంసుడు త్యాగరాజు యింటిని పావనంజేసి శ్రోతల ఆనంద పరచడమొక ఆచారం. ఒక శుక్రవారం శ్యామ శాస్త్రి త్యాగరాజు ఆహ్వానాన్ని మన్నించి శుక్రవారపు పూజ కార్య క్రమాల్లో పాల్గొని తన కత్యంత ప్రియమయిన బైరవిరాగ కీర్తన, యిష్టదేవతా స్తుతి గీతిక ''అంబ కామాక్షి అనుదినము మరువక యని గాన చేసి శ్రోతల ఆనందపరిచారు.

గోవింద మారార్ మరొక ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు ఈయన తంబురకు యేడు తంత్రులు. మందర స్థాయి తంత్రి, ఒకటి, మిగతా ఆరుతంత్రులు మూడు జతలుగా వుండేవి. (ఇటీ వలే కీర్తిశేషులైన ప్రసిద్ధ వయొలిన్ విద్వాంసుడు మైసూరు చౌడయ్యా వయొలిన్‌కు యేడు తంత్రులు.) తంబుర చివర విజయ పతాకం యెగురు చుండెడిది. గోవింద మారార్ వలె పాడేవారు

అప్పటి పరకు లేరని దాని భావము. ఎందు వలననగా మారార్ రాగా లాపనజేస్తూ ప్రథమ స్థాయినుంచి. ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ స్థాయిలు దాటి షట్కాలములో పాడే ప్రతిభ దక్షిణాదిలో ఒక్క మారార్‌కు యుండేది. అదే స్థాయిలో మన ఆంధ్రలో పాడేవారు షట్కాల నర్సయ్య గారు, ఆదిభట్ల వెంకట రమణదాసుగారలు. ఈ ముగ్గురికి షట్కాల త్రిమూర్తులని పేరు

గోవింద మారార్ ఏకదాశి పుణ్యదినాన త్యాగరాజు గానం వినవలెనని తిరువయ్యూర్ చేరాడు. త్యాగరాజు యింటిలో భజన సాగు చున్నది. త్యాగరాజు శిష్యుడు వాలజంపేట వెంకటరమణ భాగవతర్ '' రామాభి రామ, రమణీయ నామ, సామజరిపు భీమ'' యనే దర్బారు రాగ దివ్యనామ కీర్తన గానం చేస్తుండగా యితర శిష్యులు కూడా పల్లవిలో నందుకుంటూ తియ్యగా పాడుతున్నారు.

అట్టి శుభ సమయంలో మారార్ తన శిష్యులతో త్యాగరాజు యింటిలో కాలిడినాడు మారార్ త్యాగరాజు పరస్పరం అభినందించు కొన్నారు త్యాగరాజు కోరిక ప్రకారం మారార్ పతువరాళి రాగంలో జయదేవుని అష్టపది ''చందన చర్చిత నీల కళేబర పీత వసన వనమాలి'' యనే గీతికను పాడి తన ప్రతిభను కనబరిచి నాడు.

త్యాగరాజు అంతవరకు అంతటి మహత్తర భావ యుక్త, గానము వినలేదంటూ శ్రీరాగంలో ఎందరో మహానుభావులు అందరికీ వందనములు యనే మధుర పంచరత్న కీర్తన పాడి మారార్‌ను పెద్దలను సంతోషపజేశాడు.

తీర్థ యాత్ర

''చిరంజీవి త్యాగరాజూ! నీ తండ్రి రామబ్రహ్మం, నేను ప్రాణమిత్రులం. మీ తండ్రి దైవసన్నిధి చేరాడు. నేను చేరబోతు న్నాను. నీ తండ్రిని కలుసుకోబోయేముందు నాదొక చిన్నకోరిక నీ ప్రతిభా విశేషాలను రామబ్రహ్మానికి తెలియజేయాలి అందుకు నేను నీ గానం వినవలె నిన్ను ఆశీర్వదించవలె. నేను పెద్దవాడిని. వృద్ధుడను. నీదరికి రాలేని వాడను. నీవే నాదగ్గరకు రావలె. కంచి వరద రాజస్వామిని, కామాక్షిని, ఏకాంబరేశ్వరుని దర్శించు. నా కోరిక నెరవేర్చు నీ పితృ సమానుడు'' – ఉపనిషత్ బ్రహ్మం

లేఖ చదివాడు తాను తీర్థయాత్రలు చేయవలెననే కోరిక యెన్నాళ్ళనుంచో వున్నది. బ్రహ్మం గారి ఆజ్ఞ బొదల దాక్షిణ్యము కంచితో బాటు శ్రీ రంగం తిరుపతి మొదలయిన పుణ్య సీమలు దర్శించ వచ్చని ఒక శుభదినమున శిష్య బృందంతో పయనమయి నాడు.

చైత్రోత్సవానికి శ్రీ రంగం చేరాడు శిష్యగణంతో త్యాగరాజు. ఆ నాడు శ్రీ రంగడు నిండుగ అలంకరించుకొని వున్నాడు భక్తులకు పారవశ్యం కల్గిస్తున్నాడు లక్ష్మి, భూదేవి సమేతుడైన శ్రీ రంగని రథాన్ని ప్రజ అత్యంతోత్సాహంతో లాగుతుంటే పశ్చాత్తాపులైన భక్తులకు ఆశీస్సు లొసంగుతూ మందహాసంతో జేజేలందు కొంటున్నాడు.

త్యాగరాజు తనువిడిదిచేసిన యింటిఅరుగుపై నిల్చొని ఆదృశ్యాన్ని తిలకిస్తున్నాడు. తొక్కిడి విపరీతంవల్ల అరుగుపైన కూడా పెక్కుమంది నిలబడడం వల్ల కనులారా గాంచే భాగ్యం లభించడంలేదు నిస్పృహతో తొక్కిడి భరించ లేక కాస్త వెనుకంజ వేశాడు. తను వున్న యిల్లు దాటింది రథం. ఉన్నట్లుండి రథం నిలిచి పోయింది. చక్రాలు కదలలేదు భక్తులు యెంత లాగినా ఒక్క అడుగూ ముందుకు కదలడం లేదు. చెమటలు పట్టున్నాయి. రంగా శ్రీ రంగా అంటూ భక్తులు తమ బలాన్నంతా వినియోగించారు. రథచక్రాలు అటు యిటు కూడా కదలలేదు రథం మీద స్వామి వారికి చామరం వీస్తున్న బ్రాహ్మలు యెదో కీడు జరిగిందన్నారు జనంలో స్వామి వారికేదో అపరాధం జరిగిందని తలా ఒకమాట అనుకోసాగారు. రథం నిలిచి పోయింది కోలాహలం ఎక్కువైంది. ఎక్కడి వారక్కడ అవాక్కయి నిలచిపోయారు. స్వామివారికి దృష్టి దోషం తగిలిందన్నారు కొందరు. శ్రీ రంగనికి కోపం వచ్చిందన్నారు మరికొందరు.

ఈ వింతను త్యాగరాజు చూచి విస్తుపోయాడు. దిగులుతో నిలుచున్న చోటు నుండి కదలలేక పోయాడు. అంతలో ఒకభక్తుడు త్యాగరాజు విషణ్ణ వదనం చూచి ''స్వామీ మీరలా ఎందుకున్నారు.. మీకు స్వామి దర్శనం కాలేదా అని అడిగాడు తలపంకించాడు త్యాగరాజు. ఆభక్తుని మదిలో తళుక్కుమని భావనమెరిసింది వెంటనే త్యాగరాజు కాళ్ళమీద పడ్డాడు. అపచారం జరిగింది. తమవంటి భక్తులకు శ్రీరంగని దర్శనం కాకుంటే యిలాంటి అపచారములు జరుగవా? రథం కదలక పోవడమంటే స్వామి మీకు కనులారా దర్శనమివ్వక పోవడమే. మీకు దర్శన మివ్వడానికి రథం నిలచిపోయింది. రండి స్వామీ అంటూ జనాన్ని త్రోసుకుంటూ త్యాగరాజుని ముందుకు తీసుకువెళ్ళాడు. త్యాగరాజుని గుర్తించిన ప్రజ ఆయనకు నమస్కరిస్తూ త్రోవ యిచ్చారు. త్యాగరాజు రథంముందు నిలబడి శ్రీరంగని దర్శనం చేసుకొన్నాడు. తానూ రథాన్ని లాగాడు ప్రజలారా రండి! శ్రీ రంగని కనులారా సేవించి తరించండి రారాజు శ్రీరంగనాథుడో. ముక్కోటి దేవతలు పూజించే వైభోగ రంగని భక్తితో ప్రేమతో పూజించి ధన్యులుకండి.''

త్యాగరాజు రాజువెడలె చూతమురారె యని కీర్తన గావిస్తూ భక్తులకు పరమానందాన్ని కూర్చాడు.

మరురోజే శ్రీ రంగని ఆలయ అధికారుల వద్ద నుంచి ప్రత్యేకాహ్వానం అందింది దేవాలయానికి వచ్చి శ్రీరంగనికి స్వయంగా పూజలు సలుపమని త్యాగరాజు యీ ఆహ్వానం తన పుణ్య ఫల విశేషములలో నొకదానిగా భావించి శిష్యబృందముతో ఆలయం చేరుకొన్నాడు శ్రీరంగని స్వయంగా పూజించాడు. శిష్యబృందం కూడా మంత్రోచ్ఛారణలో పాల్గొన్నారు.

''ఓ రంగశాయీ! నీవు పిలచిన పలికే దైవానివి. వైభోగ రంగడివే కాదు ఆర్తరక్షణ పరాయణుడవు. నీవునిలచిన సీమ భూలోక వైకుంఠం నీ ప్రియ భామిని మహాలక్ష్మి హృదయ సీమలకు ప్రేమైక సామ్రాజ్యం. నీ ప్రేమను, కరుణను మాపై కూడా చిలకరించుడు అని గానం చేసి అందరిని సంతసింప జేశాడు. శ్రీ రంగని కనులారా గాంచిన త్యాగరాజు కంచి వరదరాజుని సేవించడానికి ప్రయాణం కట్టాడు. [సశేషం]

నల్లగొండజిల్లా సన్నకారురైతుల అభివృద్ధి

స్వాతంత్ర్యము సిద్ధించిన తర్వాత ప్రణాళికద్వారా దేశాభివృద్ధికై మన ప్రభుత్వము కృషిచేస్తూవున్నది వ్యవసాయ రంగంలో, పారిశ్రామిక రంగంలో, యింకా ఇతర రంగాలలో ఇంతవరకు సాధించిన ఫలితాలు ప్రశంసనీయమైనప్పటికీ ప్రణాళికల వల్ల చేకూరిన అభివృద్ధి లాభాలు, అందరి అందుబాటులో లేవని కొందరి విమర్శ. ధనికులు మరీ భాగ్యవంతులు అవుతున్నట్లు పేదవారి పరిస్థితులలో చెప్పుకోదగ్గ మార్పులు లేవని వీరి అభిప్రాయము.

దేశంలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిచేసేందుకు సన్నకారు రైతులు, వ్యవసాయకూలీలు, ఇతర బలహీన వర్గాల వారికి ఆర్థిక స్థోమతను చేకూర్చి సమాజిక సంక్షేమమును కల్గించే నిమిత్తమై భారతప్రభుత్వము వారు ఇటీవల కొన్ని పథకాలను రూపొందించియున్నారు. అందులో సన్నకారుల అభివృద్ధి పథకాలు పేదరైతుల వ్యవసాయ కూలీలు పథకాలు గ్రామీణ ప్రాంతాల పనుల కార్యక్రమాలు ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చును.

నల్లగొండ జిల్లా విస్తీర్ణము 5491 చ. మైళ్లు. గ్రామాలు 1151. సంవత్సర వర్షపాతము 25 అంగుళాలు. ఎక్కువగా చౌట నేలలు. మిట్ట పల్లాలు. ఆముదము, జొన్న, సజ్జ, వేరుశనగ, ముఖ్యమైన పంటలు. సాగుబడిక్రింద వున్న 24 లక్షల ఎకరాలలో 2 1/2 లక్షల ఎకరాలు మాత్రమే తరి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ క్రింద మిర్యాలగూడెం, హుజూర్‌నగర్, తాలూకాలకు మాత్రము నీటి పారుదల సౌకర్యములు ఏర్పడినవి. మూసీ ప్రాజెక్టుక్రింద సూర్యాపేట, నల్లగొండ తాలూకాలలో 35 వేల ఎకరాలు మాగాణి సేద్యముక్రిందవున్నది. మిగతా ప్రాంతాలలో ఆధారపడదగిన నీటి పారుదల వసతులు లేవు. అందుచేతనే మన రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలలో ఇది ఒకటిగా పరిగణింప బడుచున్నది.

యీ పరిస్థితుల దృష్ట్యా సన్నకారు రైతులకు వ్యవసాయము లాభదాయకంగా వుండాలనే సంకల్పముతో భారత ప్రభుత్వమువారు యీ జిల్లాకు సన్నకారు రైతుల అభివృద్ధి పథకము. 2. పేద రైతులు, వ్యవసాయ కూలీలు, యితర పారిశ్రామికుల పథకాలు మంజూరుచేసివున్నారు. యీ రెండు పథకాలు నాలుగు సంవత్సరాలకాలములో అమలు జరుపవలసి వుంటుంది. మొదటి పథకానికి 1 1/2 కోట్లు, రెండవదానికి ఒక కోటి రూపాయలు మంజూరు అయినవి. ఈ పథకాలు సన్నకారు రైతులు అభివృద్ధి సంస్థ అనబడే ఒక సహకార సంస్థద్వారా అమలుజరుపబడుతాయి.

భారత ప్రభుత్వపు ఆహార వ్యవసాయ శాఖవారు కార్యక్రమాల్ని అప్పుడప్పుడు సమీక్షించి తగిన సలహాలు యిస్తారు. సన్నకారు రైతుల అభివృద్ధి పథకమునకు సంబంధించిన కార్యక్రమాలనుగూర్చి తెలుసుకుందాం.

ఈ సంస్థ జిల్లా కేంద్రమయిన నల్లగొండలో ఏర్పడినది. దీనికి జిల్లా కలెక్టరు అధ్యక్షులు. భారత ప్రభుత్వపు ఆహార, వ్యవసాయ శాఖ ప్రతినిధి ఒకరు జిల్లా స్థాయిలో, జిల్లా పరిషత్తు అధ్యక్షులు, వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పశువైద్య అధికారి, భూ తనకా బ్యాంకువారు, భువనగిరి, నల్లగొండ. సహకార కేంద్ర బ్యాంకు ప్రతినిధులు ఇద్దరు సన్నకారు రైతులు ప్రాజెక్టు అధికారి సభ్యులు జిల్లా రెవెన్యూ అధికారి హోదాగల ఒక ఐ. ఎ. యస్. ఆఫీసరు ఇక్కడ ప్రాజెక్టు అధికారిగా వున్నారు. ఒక డిప్యూటీ ప్రాజెక్టు అధికారి ఇద్దరు సహాయ ప్రాజెక్టు అదికార్లు, యితర సిబ్బంది ప్రాజెక్టు అధికారికి సహాయంగా వున్నారు. కార్యక్రమాలకు సంబంధించిన జిల్లా అధికార్లు రెవెన్యూశాఖవారు మరియు బ్లాక్ డెవలప్‌మెంటు అధికారులు యీ పథకాలను అమలుజరిపే బాధ్యత స్వీకరించవలసి వున్నది.

అగ్రో ఇండస్ట్రీస్ కార్పరేషన్‌వారు జరిపిన భూగర్భ పరిశోధన ఫలితంగా సూర్యాపేట, నల్లగొండ, రామన్నపేట, తాలూకాలు వ్యవసాయపు బావులు త్రవ్వేందుకు అనుకూలంగా వున్నవని తేలినది. రహదారులు రవాణా సౌకర్యాలు వ్యాపార కేంద్రాలు అనుకూలంగా ఉన్నందున యీ జిల్లాలోని సూర్యాపేట, నల్లగొండ, రామన్నపేట తాలూకాలలో సన్నకారు రైతుల అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుపుటకు నిశ్చయింపబడినది. 5 ఎకరాలనుండి 10 ఎకరాలవరకు మెట్టభూమి లేదా 2 1/2 ఎకరాలనుండి 5 ఎకరాలవరకూ, మాగాణి భూమివున్న రైతులు సన్నకారు రైతులుగా పరిగణింపబడుతారు. వీరు 50 వేలవరకూ యీ జిల్లాలో వున్నారు. యీ అభివృద్ధి కార్యక్రమాలలో వ్యవసాయము, పశుపోషణ పథకాలకు ప్రాధాన్యము యివ్వబడినది.

రైతులకు యీ క్రింద వివరించిన సౌకర్యాలు లభిస్తాయి.

వ్యవసాయము స్వల్పకాలపు అప్పులు:

వితనములు, ఎరువులు, క్రిమి కీటక సంహారపు మందులు కొనగోలు చేసేందుకు స్వల్పకాలపు అప్పులు యివ్వబడును. వ్యవసాయ శాఖవారి అంచనామేరకు 1 ఎకరం తరి భూమికి 150 రూ లు కావలసివుండును. యీ పథకము అమలులోవుండే ప్రాంతాలలో 7,800 మంది సన్నకారు రైతులు 31 వేలు ఎకరాల మాగాణి సేద్యము చేస్తూ వున్నారు. స్వల్పకాలపు అప్పుల క్రింద కావలసిన 46 లక్షల 59 వేలరూపాయలు నల్లగొండ భువనగిరి, కేంద్ర సహకార బ్యాంకులు యిస్తాయి. అదేవిధంగా

మెట్ట వ్యవసాయానికి ఎకరానికి 50 రూ. లు చొప్పున 2 లక్షల ఎకరాలకు 1 కోటి రూపాయలు అప్పుగా యిచ్చేందుకు కేటాయించబడినది. రైతులు సహకార సంఘాలలో సభ్యులుగా చేరేందుకు కావలసిన శేరుధనము అప్పులు యిచ్చినటువంటి బ్యాంకులకు నష్టపూచి సన్నకారు రైతుల సంస్థ భరించగలదు.

దీర్ఘకాలపు ఋణాలు

సేద్యపు బావులు త్రవ్వుటకు వున్నవాటిని లోతుచేసి వాటి ఉపయోగము విస్తీర్ణముచేసేందుకు మరియు ఎలక్ట్రిక్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, కొనేందుకు దీర్ఘకాల రుణములు భూతనఖా బ్యాంకులద్వారా యివ్వబడును. వాణిజ్య బ్యాంకులు గూడా ఎలక్ట్రిక్ మోటార్లు, లేదా ఆయిల్ ఇంజన్లుకై కావలసిన అప్పులను యిచ్చేందుకు సంసిద్ధత తెలియబరిచినారు. ఒక వెయ్యి మూడు వందలు కొత్తబావులకు బావి ఒక్కంటికి 3,000 వేలు రూపాయలు చొప్పున యిచ్చుటకు 3,000 లు పాత బావులను లోతు చేయుటకు (బావి ఒక్కంటికి 2,000 రు లు చొ. న) 4,000 లు ఎలక్ట్రిక్ మోటార్లు లేక ఆయిల్ ఇంజను కొనుగోలు చేయుటకు మొత్తము ఒక కోటి ఇరువది లక్షలు కావలసివున్న దని అంచనా. ఇందులో నాల్గవ వంతు సబ్సిడిరూపేణా సన్నకారు రైతులసంస్థనుండి లభించును. అంటే రైతులకు 1,000 రూ. లు అవసరమైతే 750. రూ. లు. అప్పుగా 250 లు సబ్సిడిగా యివ్వబడును. క్రిమిసంహార నిమిత్తము కావలసిన స్ప్రేయర్లు,మిస్టుబ్లోయర్లు. యీ కార్యక్రమము అమలులోవున్న ప్రతి గ్రామ పంచాయతీకి ఒకొక్కటి చొప్పున 50. శాతము పద్ధతిని సబ్సిడిగాయిచ్చుటకు అంగీకరింపబడినది. మిస్టబ్లోయర్లు ఒకొక్కటి 1,000 లు. ఖర్చు అగును. మొత్తము 3,35,000 కావలసివుండును స్ప్రేయర్లు ఒక్కంటికి 250. లు చొప్పున 335 స్ప్రేయర్లుకు 83,750 రూ. లు కావలసివుండును. వ్యవసాయపు పద్దుక్రింద ఖర్చు యీ విధముగా వుండును.

1.	స్వల్పకాలపు అప్పులు	3,80,00,000
2.	దీర్ఘకాలపు అప్పులు	1,20,00,000
3.	కొత్తసేద్యపు బావులకు,	40,00,000
4.	పాత వాటికి	60,00,000
5.	మిస్టుబ్లోయర్లు, స్ప్రేయర్లు	4,18,750

మొత్తము 6,04,187,50. ఇందులో యీసంస్థనుండి 14, లక్షలు సబ్సిడీ రూపేణా రైతులకు లభించును.

రైతులు సహకార సంఘాలలో సభ్యులుగా చేరేందుకు కావలసిన శేరుధనము అప్పులు ఇచ్చిన బ్యాంకులకు నష్టపు పూచీ క్రింద మొత్తము 89. లక్షలు యీ సంస్థ ఖర్చు చేయును. బావులకు ఒకొక్క బావికి 500. రూ. లు. చొప్పున యిచ్చుటకు 1 లక్షకేటాయించబడినది.

పశుపోషణ

భువనగిరి, రామన్నపేట తాలూకాలలో పశుపోషణ పాల సరఫరా పథకాలు అమలులోవున్నవి. వాణిజ్యబ్యాంకులు ముఖ్యముగా కెనరాబ్యాంకు, స్వంత హామీ మీద పాడిపశువులు కొనేందుకు రైతులకు అప్పులుయిస్తూవున్నది. నల్లగొండ తాలూకా చిట్యాలలో ఒక పాలసేకరణ కేంద్రము నిర్మాణములోనున్నది. జూలైనాటికి యీ పని ప్రారంభించవచ్చును. సూర్యాపేటకు ఒక బిల్డింగు సెంటర్ మంజూరయి పని ప్రారంభదశలోవున్నది. యీ కేంద్రాల ఆధారంగా గ్రామాలలో పాలసరఫరా సంఘాలు ఏర్పాటు చేయబడును. కనీసము 2,000 వేలరైతులకు పాడిపశువులను యివ్వాలని నిర్ణయించబడినది. పశువులను కొనేందుకు కావలసిన మొత్తము అప్పుగా వాణిజ్యబ్యాంకుల నుండి యివ్వబడును. అందులో నాలుగవ భాగము సబ్సిడిగా యీ సంస్థనుండి రైతులకు లభించును. యిందుకు 30,00,000 లక్షలు ఖర్చు అగునని అంచనా పశువులకు కావలసిన కొత్తరకము లైన నెపియర్ ప్యారా, మొదలయిన గ్రాసములను 1000 ఎకరాలలో వేయుటకు తీర్మానించ బడినది ఇందుకు కావలసిన 2 1/2 లక్షల రూపాయలు అప్పుగా రైతులకు యివ్వబడును

కోళ్ల పెంపకము

4 సంవత్సర కాలములలో దాదాపు 1000 మంది సన్నకారు రైతులకు కోళ్ళ పెంపకము లాభ దాయకముగా వుండేందుకు వీలుగా కోళ్ళ పెంపకమునకు కావలసిన ఏర్పాట్లు చెయబడినవి. ఒకొక్క రైతుకు 500.లు రూపాయలు అప్పురూపేణా యివ్వబడును, కోళ్ళకు కావలసిన పాకలను అధునిక పద్ధతులలో నిర్మించేందుకు మూడు మాసములనుండి ఆరుమాసములకోడిపిల్లలను కొనుటకు యిది వినియోగింపబడివలసియున్నది. ఇందుకు మొత్తము 5. లక్షల రూ॥ లు వాణిజ్య బ్యాంకులద్వారా ఏర్పాటు చేయబడినది. కోడి గ్రుడ్లను విక్రయించుటకు ఒక పథకము త్వరలోనల్లగొండలో ఏర్పాటు కానున్నది. కోళ్ళ రోగ నివారణకు తగిన చర్యలు గ్రుడ్లను విక్రయముచేసే ఏర్పాట్లు "పౌల్ట్రి మార్కెటింగు సెంటర్" వారు చేస్తారు.

బాతులు

యీ జిల్లాలో బాతులపెంపకము గూడా కలదు. 1000 మంది సన్నకారురైతులకు ఒకొక్కరైతుకు 100 బాతులు యివ్వవలసి వున్నది బాతులు కొనుగోలు చేయుటకు 1000 రూ లు అప్పుగా యివ్వబడును గుడ్లు కొనుగోలు ద్వారా యీ అప్పులు తీర్చుటకు ఏర్పాటు చేయబడును. బాతుగ్రుడ్లకు బొంబాయి, కలకత్తా, పట్టణాలలో చాలాగిరాకివున్నది.

గొర్రెల పెంపకము

గొర్రెలపెంపకానికి 1000 మంది రైతులకు సహాయము చెయుటకు యీ పథకము క్రింద ఒకొక్కరైతుకు 30 గొర్రెలను, ఒక నెల్లూరు పొట్టేలను యిచ్చుటకు అంగీకరించబడినది. యిందుకు 22 లక్షల రూపాయలు కావలసివుంటుంది పై మొత్తములో నాల్గవ

వంతు సబ్సిడి రూపముగా యివ్వబడును అప్పు లిచ్చిన బ్యాంకులకు నష్టపు హామీగా 1,48,500 వేలు గూడా యీ సంస్థనుండి యివ్వబడును. పశుపోషణ పద్దు క్రింద మొత్తము 64, లక్షల రూపాయలు ఖర్చు చేయబడును. దాదాపు 14 లక్షలు సబ్సిడిగా రైతులకు చెందును. మిగతా మొత్తము వాణిజ్య బ్యాంకుల నుండి అప్పుగా ఏర్పాటు చేయబడును.

గిడ్డంగులు, గోదాములు

సన్నకారు రైతులు పండించే ధాన్యము నిలువ చేయుటకు ప్రతి సమితి కేంద్రాలలో గిడ్డంగులను నిర్మించుటకు తీర్మానించనైనది. యిందుకు 3 లక్షలు కావలసి వుండును. 75, వేలు మేరకు యీ సంస్థ భరించును. 2,25,000 రూ.లు జాతీయ సహకార అభివృద్ధి కార్పరేషన్‌వారు యివ్వగలరు. రైతులకు 25 శాతము సబ్సిడితో ధాన్యము నిలువచేసి కొత్త రకములైన పుసా గోదాములు నిర్మించుటకు 4 లక్షలు వెచ్చింపబడును. 1 లక్ష యీ సంస్థ భరించును.

పరిశ్రమాభివృద్ధి

గ్రామీణ పరిశ్రమలు కుటీర పరిశ్రమలు ప్రోత్సాహించుటకు 5 లక్షల రూపాయలు కేటాయించబడినది. వడ్రంగి పని వారికి చర్మకార పని వారలకు ఇతర వెనుకబడిన వర్గాలకు లాభించే పథకాలు అమలు జరుపబడును. యీ పథకము అమలు జరుపబడే నాలుగు సంవత్సరాలకు కాలములో సూర్యాపేట, రామన్నపేట, నల్లగొండ తాలూకాలలో అదనంగా 15 వేల ఎకరాలు మాగాణి సేద్యము క్రింద రాగలవు. 6 కోట్ల రూపాయలు వ్యవసాయాభివృద్ధికి 64 లక్షలు పశుపోషణకు, 5 లక్షలు పరిశ్రమలకు 3 కోట్లు యింకా ఇతర కార్యక్రమాలకు మొత్తము 10 కోట్ల రూపాయలు ఖర్చు చేయబడును. భారత ప్రభుత్వము వారికిచ్చిన 1½ కోట్ల రూపాయలతో 10 కోట్ల రూపాయలు అప్పుగా సేకరించి సన్నకారు రైతుల అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయబడును. కార్యక్రమాల ప్రగతిని అప్పటికప్పుడు సమీక్షించి రైతులకు బలహీన వర్గాలకు అవసరయ్యే యితర కార్యక్రమాలను యీ సంస్థ చేపట్టేదుకు సంసిద్ధముగా వున్నది. యీ పథకము విజయవంతముగా అమలు జరిగి అనుకున్నా లక్ష్యాలు సాధించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకొనవలసి వుంటుంది.

సన్నకారు రైతులను అతని నిజమైనఅవసరాలను గుర్తించడము ముఖ్యమైన విషయము. ప్రాజెక్టు అధికారులు రెవిన్యూశాఖ వారు గ్రామాలకు వెళ్ళి సన్నకారు రైతులను కలుసుకొని మరి పరిస్థితులను విచారించి వారికి నిజముగా ఏ సహాయము కావలసి వుంటుందో అ సహాయము యివ్వవలసి వుంటుంది. వ్యవసాయదారులకు తగిన ప్రోత్సాహమిస్తూ, అది లాభదాయకంగా లేనటువంటి వారికి అనుభవము ఆశక్తి అవసరాన్నిబట్టి పాడి పశువులు. గొర్రెలు, కోళ్ళ పెంపకానికి కావలసిన సహాయము చేయవలసి వుంటుంది. అదే విధముగా ఎలక్ట్రిక్ మోటార్లు, అయిల్ ఇంజన్లు, సేద్యపు బావులలో గల నీటి ఉత్పత్తిని అనుసరించి ఇచ్చుట. ఉచితము లభించిన సహాయము సద్వినియోగము కావాలి. ఇది ప్రధాన అవసరము. సహకార బ్యాంకులు వాణిజ్య బ్యాంకులు రైతులకు అప్పులు యిచ్చేందుకు సిద్ధముగా వుండాలి. జాతీయము చేయబడిన బ్యాంకులు యీ పథకాన్ని ఒక విధిగా ప్రోత్సాహించాలి దురదృష్టావశాత్తు యీ జిల్లాలోని సహకార బ్యాంకులు కేంద్ర సహకార బ్యాంకులు భూతనఖా బ్యాంకులు తెచ్చుకున్న అప్పులు సకాలములో చెల్లించక అప్పు తెచ్చుకొనే అర్హతను కోల్పోయినవి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు బ్యాంకుల దుస్థితిని గ్రహించి వాటిని పటిష్టం చేయడానికి ప్రత్యేకమైన కృషి చేస్తున్నారు. యీ బ్యాంకులను ఆర్థికంగా ఉత్తేజ పరచటానికి యీ సంస్థ కూడా ప్రయత్నము చేస్తూ వున్నది. తగినంత శ్రద్ధ తీసుకొని సద్వినియోగ పరచె రైతులకు అప్పులు యితర సహాయము ఇవ్వ గలిగితే యీ పథకముయొక్క ఆశయము తప్పక నెరవేర గలదు. కావలసిన సహాయము పొందటానికి సన్నకారు రైతులు సమీపములో వున్న బి. డి. ఓ లను, తహసీలు దార్లను. రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్లను లేదా ప్రాజెక్టు అధికారిని సంప్రదించవచ్చును.


ఉత్పత్తి పెంచి ఆర్థిక స్తోమతను పెంపొందించేందుకు యీ పథకము సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకముగా వుంటుంది. నల్లగొండ జిల్లాలోని సన్నకారు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుననుటలో సంశయలో లేదు.

వాడుక భాష

ఏ భాషలో మనం సహజంగా మాట్లాడుకొంటున్నామో, మన కోపతాపాలు, సుఖదుఃఖాలు, ప్రేమాభిమానాలు ప్రకటించు కుంటున్నామో, దానికి మించిన భాష మరొకటి లేదు. ఆ మాటలతీరు, ఆ నుడికారము, ఆ భావప్రకటనారీతినే మనం అనుసరించాలి, వాడుక భాషకు గల భావప్రకటనా శక్తి, ముక్తసరిగా, ఘాటుగా సూటిగా చెప్పగల నేర్పు మరే కృత్రిమ భాషకు రాదు.

—స్వామి వివేకానంద

ప్రజాకవి జాషువా నిర్యాణము



తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగం విజయాల నాటకాల తర్వాత నిజంగా సామాన్య ప్రజల దగ్గరకి వెళ్ళిన పద్యకవిత రాసిన ఘనత కీ. శే. జి. జాషువా గారికి దక్కుతుంది. అయితే నాటకం ప్రజల దగ్గరకు వెళ్ళడం వేరు; శ్రవ్య కావ్యం వెళ్ళడం వేరు గదా. భాగవతంలోని కొన్ని పద్యాలు ఎలా సామాన్య తెలుగు ప్రజల నోళ్లలో ఆడుతుంటాయో, అలాగే జాషువా గారి కొన్ని పద్యాలు చాలా మందికి కంఠతఃవచ్చు. కవికోకిల, కవితావిశారద వంటి ఎన్ని బిరుదులతో ఆయన్ను తెలుగు ప్రజలు అభిమానించినా ఆయనకు నిజమైన బిరుదు "ప్రజాకవి" అనేదే. హరిశ్చంద్ర నాటకంలో కాటికాపరిగా నటిస్తున్న హరిశ్చంద్ర పాత్రధారి జాషువా గారి "శ్మశానం" పద్యాలు చదవనిదే ప్రేక్షకులు వదలిపెట్టే వారు కారు ఆ రోజుల్లో.

సంప్రదాయ ఛందస్సులలో కవిత్వం రాసే వారిలో సమకాలీన కావ్య వస్తుస్వీకరణ, సమాజిక పరిస్థితుల స్పృహ ఉండడం చాలా తక్కువనే చెప్పాలి. దీనికి జాషువాగారు అపవాదం. ఆయన ఏమి రాసినా అందులో సమకాలీన సమాజ పరిస్థితి తొంగిచూస్తూనే వుంటుంది. ఒక విధంగా చెప్పాలంటే, తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవితాయుగం పుట్టకముందు వెలిసిన అభ్యుదయ కవి జాషువా గారు. "గబ్బిలం" వంటి ఆయన కావ్యాలు దీనికి నిదర్శనము. "కసరిబుసకొట్టు నాథనిగాలి సోక నాల్గుపడగల హైందవ నాగరాజు" వంటి కవితా చిత్రాలు ఆయన యీ ప్రతిభకు నిదర్శనం.

'ఫిరదౌసి' జాషువాగారి ప్రథమ కావ్యం. దానితోనే ఆయన తెలుగుజాతి హృదయంలో సుప్రతిష్ఠితుడైనాడు. కరుణరసాన్ని సమర్థతతో నిర్వహించగల "తెలుగు భవభూతి" గా స్థిరపడి పోయాడు. జాషువా గారి దొక ప్రత్యేకమైన శైలి. అది అనన్య సాధ్యం. తెలుగు పలుకును ఆయన పలికించినట్లుగా ఆధునిక యుగంలో మరెవరూ పలికించలేకపోయారంటే అతిశయోక్తి కాదు. ఈ పద్యం ఎవరిదై వుంటుందని అడిగితే జాషువాగారిది కావచ్చునని వూహించగలిగినంత స్పష్టమైన స్వీయమైన శైలిని ఆయన సాధించుకోగలిగాడు. సరళ సంస్కృతశబ్ద ప్రపంచమంతా ఆయనకు దాసోహమన్నది. ఆయన పదహారణాల "తెలుగు కవి"; తెలుగు జాతీయ కవి". వినుకొండలో ఆయనవద్ద చదువుకుంటున్న రోజుల్లో, "ఫిరదౌసి" ప్రథమశ్రోతల్లో ఒకణ్ణి కావడం నిజంగా నా అదృష్టం.

జాషువా గారికి ఆంధ్రాభిమానం మెండు. ఆంధ్రులన్నా, వారి ఆచార వ్యవహారాలన్నా, ఆంధ్రభాషఅన్నా, ఆంధ్రదేశమన్నా ఆయన ఆవేశపూరితుడవుతాడు. ఆయన ప్రసంగాలో సాధారణంగా యీ ఆవేశపూరితమైన ఆంధ్రాభిమానం తప్పనిసరిగా వుంటూ వుండేది. "మడమ త్రిప్పని ఆంధ్రవీరుడు" ఆయన.

నిజానికి జాషువా గారు పెద్ద పండితుడేమీకాదు. ఆయన సహజకవి. పాండిత్యమంటే సంస్కృత పాండిత్యమనే యిప్పటికీ మన అర్థం. తెలుగుపలుకుబడి నిశితత్వం తెలిసినవాడికి, తెలుగుజాతీయం సొంతం చేసుకున్నవాడికి, తెలుగుప్రజల హృదయము ఎరిగినవాడికి. తెలుగుకవిత రాయడానికి పెద్దగా సంస్కృత పాండిత్యం అవసరం లేదని జాషువా గారు ఋజువు చేశారు.

"ఖండకావ్యం" అనే ప్రక్రియకు జాషువాగారి ద్వారా తెలుగు పాఠకలోకంలో విశేషప్రాచుర్యం లభించింది.

జాషువాగారికి జరిగినన్ని సన్మానాలు తెలుగుదేశంలో మరే కవికీ జరుగలేదంటే అతిశయోక్తి కాదు. ఆయనను సన్మానించని పట్టణంగానీ, పల్లెగానీ తెలుగుదేశంలో లేదేమో అనుకుంటాను. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు విజయవాడలో జరిగిన ఒక మహాసభలో జాషువాగారికి స్వర్ణకంకణం తొడిగారు. భారతప్రభుత్వం యిటీవలనే ఆయన్ను ''పద్మభూషణ'' బిరుదుతో సత్కరించింది. జాషువాగారి 'క్రీస్తుచరిత్రకు' కేంద్ర సాహిత్యఅకాడమీ బహుమతి లభించింది. ఆయనను రాష్ట్రప్రభుత్వం శాసనమండలి సభ్యుడుగా నియమించి గౌరవించింది. జాషువాగారిని యిటువంటి బిరుదులతో గౌరవాలతో సన్మానించడం తెలుగుజాతి తనను తాను సన్మానించుకోవడమే. ఆయనకు వచ్చిన బిరుదులు, బహుమతులు అన్నీ ఒక ఎత్తు! ఆయనకు తెలుగు ప్రజల హృదయాలలో లభించిన శాశ్వతస్థానం ఒక ఎత్తు.

జాషువాగారు గుంటూరులో జులై 24 వ తేదీన కన్నుమూశారు. ఆయన అస్తమయంతో తెలుగు సాహిత్యంలో ఒక తీరని కొరత ఏర్పడింది. ఆయన స్థానాన్ని ఆక్రమించగలవారు ప్రస్తుతానికి ఎవరూ లేరు.

– కుందుర్తి

నా జీవితానుభవాలు

చెప్పినది : కోలవెన్ను రామకోటేశ్వరరావు
వ్రాసినది : అక్కిరాజు రమాపతిరావు

త్రివేణి సంపాదక వర్గంలోని సలహాసభ్యులందరూ గౌరవ సభ్యులుగా మాత్రమే వుండేవారు. పత్రిక నిత్యకృత్యాలతో వారికి విశేష సంబంధంలేదు. భారతీయ భాషలన్నిటా రూపురేఖలు దిద్దుకొంటున్న నవ్య రీతులన్నిటికీ ప్రాతినిధ్యంవుండేది త్రివేణిలో. ఆయాభాషల్లోనికథా, ఖండ కావ్యం. సాహిత్య విమర్శ, సంగీత నాట్యరీతులు, సారస్వత పునర్జీవనం విషయ భూతంగా, సాధికారమైన రచనలను ఆయా ప్రాంతాల పండితులు, కవులు, పరిశోధకులు పత్రికలో వెలయింప చేస్తూ వుండేవారు. అంటే ఆయా అనువాదాలను, ఆయా సాహిత్యరీతులను, వాళ్ళు త్రివేణిలో ప్రచురించే వారన్నమాట

కన్నడ భాషా సాహిత్య సంబధులుగా మాస్తి వేంకటేశయ్యగార్, డి. వి. గుండప్ప, గోకర్ ప్రభృతి విద్వాంసులు, త్రివేణిలో రచనలు చేస్తుండేవాళ్ళు. తమిళానికి సంబంధించి చంద్రశేఖరన్ కె. యస్. వెంకటరమణి రచనలు చేస్తుండేవారు. సంగీతాన్ని గూర్చీ నాట్యాన్ని గూర్చీ, శ్రీ కె వి. రామచంద్రన్ వ్రాశారు. మంజేరీ ఎస్. ఈశ్వరన్, విద్యార్థిదశముగించుకొని వచ్చి స్వయంగా తనను తానుపరిచయంచేసుకొన్న తదాదిగా త్రివేణిపట్ల గాఢమైన ఆదరాభిమానాలువ్యక్తం చేశాడు. బెంగాల్ నుండి ప్రేమేంద్రమైత్రా, కాళీ పాదముఖర్జీ, అరవిందాశ్రమంలో వుంటున్న నళినకాంతగుప్త, చాలారచనలు వెలయింపచేశారు. వంగదేశంలో రూపమ్ అన్నలలితకళాపత్రికను నిర్వహిస్తూన్న ఓ.సి.గంగూలీ, చిత్రలేఖనం శిల్పం మొదలైనవిషయాలపైన చాలా రచనలు త్రివేణిలో వెలయించారు. మహారాష్ట్రనుంచి మాధవపట్వర్ధన్, ఫడ్కే, ఒరియా నుండి కాళిందీ చరణ పాణిగ్రాహి, మాయాధర్ మానసింహ, మలయాళం నుండి శంకరకురూప్, కె. యం. పణిక్కర్, కుణ్ణన్ రాజా; పొట్టెకాట్ వ్రాసేవారు. అప్పుడు క్రిస్టియన్‌కాలేజీలో సంస్కృత భాషాధ్యాపకులుగా ఉన్న యు.వి.కృష్ణారావు సంస్కృతంలోని రస సిద్ధాంత స్వరూపాన్ని త్రివేణిలో ప్రకటించారు. అస్సామి సాహిత్యాని గూర్చి ప్రఫుల్లదత్త గోస్వామి వ్రాసేవారు. హిందీసాహిత్యాన్ని గూర్చి శ్రీప్రకాశ వ్రాస్తుండేవారు, తెలుగు సాహిత్యాన్ని గూర్చి సంస్కృతినిగూర్చి ఆచార్య ఖండవల్లిలక్ష్మీరంజనం, రాయప్రోలుసుబ్బారావు, తణికెళ్ళ వీరభద్రుడు వ్యాసాలు వ్రాస్తుండేవారు.

వై. యస్. ఆర్. చంద్రన్, బాపి రాజుగారి కథలను పరిచయం చేసారు. మల్లవరపువిశ్వేశ్వరరావు, బాపిరాజుకథ నొకదానిని అనువదించి ప్రకటించాడు. శ్రీ శ్రీ. తెలుగులోని చిన్న కథపైన ఒక వ్యాసం ప్రకటించాడు గోఖలేహాలులో త్రివేణి ఆఫీసు, ఒక గది అద్దెకు తీసుకుని పెట్టుకున్నాము. వివిధప్రాంతాల నుండి త్రివేణి పట్లగాఢమైన ఆదరాభిమానాలు వ్యక్తమవుతూవుండేవి. త్రివేణికి దేశంలోని విద్వాంసులు సాహితీపరులు తమతమరచనల ద్వారా గొప్పప్రోత్సాహాన్ని కలగ చేస్తూవుండేవారు.

జవహర్‌లాల్ నెహ్రూ తమ స్వీయానుభవాలను గూర్చి త్రివేణిలో రెండు వ్యాసాలు వ్రాశారు. రాజగోపాలాచారిగారు, ఒకసారి వొకథను ఇంకోసారి నాటిరాజకీయాలనుగూర్చి వ్రాశారు. భారతీయ సాంస్కృతిని గూర్చి గూడ కొన్ని వ్యాసాలు వ్రాసారు. బి. శివరావుగారు, బర్మా ఇండియా నుంచి విడిపోవడం, విషయంపై వొకవ్యాసం వ్రాశారు. ఆర్ అర్. దివాకర్, పి. కోదండరావు, సంపత్‌గిరిరావు,నవరత్నరామారావు, కె.ఎమ్.మున్షీ మొదలైన సుప్రసిద్ధవిద్వాంసులు పాత్రికేయులు రాజకీయవేత్తలు సంస్కృతీ పరులు త్రివేణిలో వివిధ విషయాలపై రచనలు వెలయింపచేస్తూ వుండేవాళ్ళు. 1932, 33 సంవత్సరాల ప్రాంతంలో ఎమ్. చలపతిరావుగారు, చెన్నపట్నంలో లా కాలేజీలో విద్యార్థిగా వుండేవారు వారిచేత నండూరి ఎంకి పాటలపై వొక వ్యాసం రచింపజేసి త్రివేణిలో ప్రకటించటం చాలా సంతోషకరమైన విషయం. ఆరోజుల్లో, ఇతర రాజకీయ విషయాలు కూడా వీరు మరికొన్ని వ్రాశారు.

1930 వ సంవత్సరంలో భారత దేశంలోని కొన్ని ప్రాంతాలు పర్యటించాను. కలకత్తా, శాంతినికేతన్, కాశీ విద్యాపీఠ్ సందర్శించాను. ఇంకొక పర్యాయం బొంబాయి, పూనా. మొదలైన ప్రదేశాలు దర్శించాను. ఆ ప్రదేశాల్లోని ప్రముఖ సాహితీపరులను పరిచయం చేసుకొనటం, త్రివేణిని, పరిచయం చేయటం. ప్రయోజనాలుగా ఆశించి ఆయా ప్రాంతాలు పర్యటించాను. అప్పుడు విద్వాంసులూ, సాహితీప్రియులూ త్రివేణి పట్ల గాఢమైన ఆదరాభిమానాలు చూపారు. త్రివేణి పట్ల ఘన గౌరవాన్ని వ్యక్తం చేశారు. 1934 వసంవత్సరంలో కొంతవిశ్రాంతి అనుభవించవలెనని స్వగ్రామంచేరుకున్నాను జాతీయకళాశాల నుండి మళ్ళీ వచ్చి నన్ను చేరమని అభ్యర్థనవచ్చింది. ఆ సందర్భంలోనే మహాత్ముడు, హరిజనోద్ధరణోద్యమాన్ని తీవ్రతరంచేయటానికీ, సహాయనిరాకరణోద్యమాన్ని ప్రజలకు బోధించటానికీ, స్వాతంత్ర్య కాంక్షను, తత్సాధనకు అవలంబించవలసిన కార్యక్రమాన్ని ప్రజలకు ఎరుకపరచే ఉద్దేశంతోనూ దేశపర్యటనలో వొక భాగంగా, ఆంధ్రదేశపర్యటనకు వచ్చారు. అప్పుడే బందరు విచ్చేశారు. జాతీయకళాశాలకు మహాత్ముడు వేంచేసినప్పుడు అక్కడ వారిని నేను దర్శించాను. ఆ సందర్భంలో బాపూజీ నన్ను త్రివేణినిగూర్చి

ఆప్యాయంగా అడిగి ఒనుక్కున్నారు. త్రివేణిని తాము విడువకుండా చూస్తూవున్నామనీ. ఉన్నత ప్రమాణాలు ఉత్తమాదర్శాల వేదికగా వుందని ప్రశంసించారు. త్రివేణిపట్ల మహాత్ముడు వెలువరించిన ప్రశంస చాలా ఉత్తేజం కలిగించిందినాకు. దేశవ్యాప్తంగా త్రివేణి మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొన్నది. దీనికి కారణం ఎన్ని ఒడిదుడుకు లనుభవించినా ఉన్నత ప్రమాణాలు, ఉత్తమాదర్శాలు త్రివేణి ఏమరలేదు. విదేశాలలోకూడ త్రివేణి మంచి ఆదరాన్ని పొందింది. రాజమండ్రి కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం చేసి రిటైరై స్వదేశానికి వెళ్ళిపోకముందే దొర ఇంగ్లండు నుంచి కొన్ని రచనలు త్రివేణిలో ప్రకటించారు. దామెర్ల రామారావుగారి చిత్రలేఖనా నైపుణ్యాన్ని గూర్చీ, ఇంకా భారతీయ చిత్రలేఖనంలోని వైశిష్ట్యాన్నీ, వివిధరీతులనూ గురించి కూడ్రే కొన్నివ్యాసాలు త్రివేణికి వ్రాశారు. ఇంగ్లండునుండి వెలువడుతుండిన లండన్ టైమ్స్. స్పెక్టేటర్ పత్రికలు త్రివేణిని సమీక్షిస్తూ శ్లాఘించాయి. 1932వ సంవత్సరంలో చెన్నపట్నంలో మాదగ్గరే వుంటూ మాఅమ్మగారు మరణించారు. ఈమెగారి చివరి రోజులు అనారోగ్యాది క్లేశాలేకాకుండా ఆర్థికమైన ఇబ్బందులు కూడా ఈమెను బాధించాయి. మాతల్లిగారు పావన చరిత్ర. చాలాకష్టాలు అనుభవించింది.

ఈవిధంగా 1927 డిసెంబరులో ప్రారంభమై త్రివేణి ఒడిదొడుకులనుభవిస్తూ పద్దెనిమిది సంవత్సరాలు ద్వైమాస పత్రికగా వెలువడింది. మాసపత్రికగా చేసేనూ, ఇంకా ఉత్సాహాన్ని చూపిస్తేనూ. ఇంకాప్రాముఖ్యాన్ని పొందుతుందనీ, బాగా ఆకర్షిస్తుందనీ తలచి 1936,37 లలో త్రివేణిని మాసపత్రికగా చేసి నాలుగు సంవత్సరాలు ప్రచురించాం. కాని తగినంత ఆర్థిక స్తోమత లేనప్పుడు విశేషమైన ఉత్సాహం కార్యకారి కాదనీ, అనుకున్నట్లుగా కలిసిరాదనీ, నాకిప్పుడు అనిపిస్తూ వుంటుంది. శక్తికి మించిన శ్రమచేయటం. ఆర్థిక స్థోమతకి మించిన ఆశయాలు పెట్టుకొనటం, కొంత నన్ను దుర్బలుణ్ణి చేశాయేమోననీ అనిపిస్తుంటుంది. ఇటువంటి పొరపాట్లు, త్రివేణిపట్ల వుండే గాఢమైన మమకారంతో. రెండు మూడుసార్లు చేశాననిపిస్తూ వుంటుంది. ఇంకా అభివృద్ధినీ ఇంకా సుస్థితినీ నెమ్మదినీ, నిలకడనూ, వాంఛించి మద్రాసునుంచి బెంగుళూరు, మళ్ళీ మద్రాసు. బందరు, హైదరాబాదులకు త్రివేణిని మార్చటం జరిగింది. ఎక్కడనుంచి వెలువడుతున్నా పత్రిక రూపురేఖలకు సంబంధించి కానీ, ప్రమాణాలకు సంబంధించి కానీ లోపంచేయలేదు అది వొక్కటే ఇప్పటికీ ఆత్మ తృప్తిని చేకూరుస్తూ వుంటుంది. త్రివేణిని నా జీవితంలో అంతర్వాహినిగా చేసుకొన్నాను. ఆదర్శాలూ, ఆశయాలూ, ఆరాధనా, నా జీవితంలో త్రివేణిగా సంగమించాయి.

1936,37 ప్రాంతాలలో ఆంధ్రప్రభ దినపత్రికగా ఆవిర్భవించనున్నప్పుడు, సంపాదకత్వం వహించవలసిందన్న వొక కోరికను, ఆ పత్రికా యజమానులు నా ముందుంచారు. అయితే వారి ఉద్దేశంలో త్రివేణి పత్రికా సంపాదకత్వ భారం నన్ను కొంత విడిచిపెడితే బాగుండునన్నట్లుగా వున్నదని నాకు తెలిసింది.

అప్పటికి శ్రీ బుర్రా వి. సుబ్రహ్మణ్యంగారు. ఇంగ్లండూ అదీ వెళ్ళివచ్చి. మద్రాసులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వీరు మంచి ఉపజ్ఞకలవారు. ఉత్సాహశీలి. త్రివేణియందు మిక్కుటమైన ఆదరాభిమానాలు కలవారు త్రివేణిని వీరికప్పగించి, ఆంధ్రప్రభ సంపాదకత్వం స్వీకరించవలెనా, అన్న యోచన చేయసాగాను. కాని ఏవో కొన్ని కారణాలవల్ల ఆంధ్రప్రభ సంపాదకత్వం నేను స్వీకరించలేదు. స్వీకరించకపోయినప్పటికీ, శ్రీ బి. వి. సుబ్రహ్మణ్యంగారి సహాయ సహకారాలను, అభిలషించి, వారిని సహాయ సంపాదకుణ్ణిగా ఆహ్వానించాను. వారంగీకరించారు. అప్పటినుంచీ వారు త్రివేణి విషయంగా అభిమానం చూపుతూవచ్చారు అప్పటినుంచి త్రివేణిని నాలుగు సంవత్సరాలు మాసపత్రికగా నిర్వహించాము. ఆరోజుల్లో కొంతకాలం అంటే 1933 వ సంవత్సరాంతంనుండి, 1934 వ సంవత్సరాంతందాకా. బందరులో జాతీయ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నాను కాటూరి వేంకటేశ్వరరావుగారుకూడా జాతీయ కళాశాలలో వుండేవారు. అందువల్లనే ఈ ప్రిన్సిపాల్ పదవిని అంగీకరించాను. ఈ కాలం ఉత్సాహభరితంగానే గడిచిపోయింది. అయితే ఈ కాలంలోకూడా త్రివేణికి సంబంధించిన పనినికూడా చూసుకుంటూనే వుండేవాణ్ణి. 1935 వ సంవత్సరంలో త్రివేణిని అభివృద్ధికి తీసుకొని రావాలనీ. త్రివేణికి నా సర్వశక్తులు వినియోగించాలనీ, జాతీయ కళాశాల ప్రధానాధ్యాపక పదవి విడిచిపెట్టాను. ఈవిధంగా కొంత స్థలచలనం ఎప్పటికప్పుడు నా స్వభావంలో వొక భాగమైపోయిందేమోనని అనిపిస్తూ వుంటుంది బందరునుంచి మళ్ళీ మద్రాసుచేరాను. మద్రాసులో శ్రీ బి. వి. సుబ్రహ్మణ్యంగారు త్రివేణి పనిచూస్తున్న రోజులలో, మా స్వగ్రామమైన నరసారావుపేటలో కొంతకాలం గడుపుతూ వుండేవాణ్ణి. 1937 లో మద్రాసులో రేడియోస్టేషన్ వెలసింది. మొట్టమొదటి తెలుగు ప్రసంగం గిడుగు రామ్మూర్తి పంతులుగారు చేశారు. రెండో ప్రసంగం నాది. ఇళ్ళూ-అందచందాలూ-అంటే గృహాలంకరణకు సంబంధించిన వొక ప్రసంగం, ప్రసారంచేశాను.

1939 లో నా జీవితంలో వొక కొత్త ఘట్టం ప్రారంభమైంది. ఆ సంవత్సరం మా ప్రాంతంలో జరిగిన ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా నన్ను ఎన్నికచేశారు. అది ఉపఎన్నిక కాబట్టి, ఆ ఎన్నిక ఫలితంపై రాష్ట్రంలోని నాయకులంతా, విశేషమైన శ్రద్ధాసక్తులు కనపరచారు. రాష్ట్ర నాయకులలోని పెద్దలందరూ మా ఊరికివచ్చారు. ఆ ఎన్నికలో శాసనసభకు నేను ఎన్నికైనాను. కాసు వెంకటరెడ్డిగారి మృతివల్ల యీ ఉపఎన్నిక జరిగింది. వీరు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారి సోదరులు. ఈ ఎన్నికలో నేను ఎన్నికైన తరువాత, చెన్నపట్నంలో శాసనసభా సమావేశాలకు, ఒక్కసారిమాత్రమే హాజరుకావడం తటస్థించింది ఎన్నిక కాగానే శాసన సభా సమావేశానికి వెళ్ళాను. ఆ తరువాత ఆ సమావేశం వాయిదాపడింది. అటు తరువాత రెండోసారి సమావేశం కావలసిన పరిస్థితులలో యుద్ధంవచ్చింది. సి. రాజగోపాలాచారిగారు ముఖ్యమంత్రిగా ఉన్న మంత్రివర్గం ప్రభుత్వంపట్ల సహాయ నిరాకరణదృష్టితో రాజీనామాచేసింది. కనుక నా శాసన సభాసభ్యత్వం

స్వీకారానికే పరిమితమైంది. అప్పుడే వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభమైంది. ఆ సందర్భంగా వ్యక్తి సత్యాగ్రహ సంబంధమైన సిద్ధాంతాలూ, కార్యక్రమమూ, ప్రజలకు బోధించే బాధ్యతను కొంత పైన వేసుకున్నాను. కొంతలో కొంత దానిని నిర్వహించాను. ఆ సందర్భంగా 1940 నవంబరు, డిసెంబరు ప్రాంతాలలో నాకు కారాగారవాసం సంప్రాప్తమై, ప్రభుత్వంవారిచే వేలూరు జైలులో శిక్ష ననుభవించాను. ఆ సందర్భంగా దేశ నాయకు లందరినీ వేలూరు జైలులో నిర్బంధించటం వొక విశేషం. రాష్ట్ర నాయకులందరూ, సి. ఆర్. పట్టాభి, ప్రకాశంగారూ, గోపాలరెడ్డి, గిరి, విశ్వనాథం ప్రభృతులందరూ వేలూరు జైలులో నిర్బంధంపొందారు. కలచవీడు వేంకటరమణాచార్యులుగారు, పప్పూరి రామాచార్యులుగారు రాయలసీమ ప్రాంతం నుండి వచ్చిన నిర్బంధితులు. వీరిలో కలచవీడు వేంకటరమణాచార్యులుగారు మహాభారతం పద్దెనిమిది పర్వాలు ఆ కారాగృహవాసంలో చదివి వినిపించారు. ప్రకాశం పంతులుగారివద్ద సంస్కృతంలో రామాయణమంతా కొందరు పండితులు చదివి వినిపించేవారు. మొదటిసారి నిర్బంధంలో ఒక సంవత్సరం కారాగారవాసం చేశాను. కొన్నాళ్ళు వేలూరు జైలులో గడిపిన తరువాత, తిరుచినాపల్లి జైలుకు నిర్బంధితులందరినీ తీసుకవెళ్ళారు. అక్కడి నుండి 1941 అక్టోబరు నెలలో మేమంతా విడుదలైనాము. కారాగారవాసంలో వున్న రోజుల్లో చెన్నపట్నంలో శ్రీ వి. వి. సుబ్రహ్మణ్యంగారు త్రివేణిని నిర్వహిస్తూండేవారు. యుద్ధంవల్ల సంభవించిన ఆర్థికమాంద్యమూ విపరీత పరిస్థితులవలన 1940వ సంవత్సరంలో త్రివేణిని త్రైమాస పత్రికగా చేయవలసి వచ్చింది. ఎన్నికలలో పోటీచేసినకాలంలోనూ, కారాగృహంలో గడిపిన రోజుల్లోనూ చెన్నపట్నంలో శ్రీ వింజమూరు గోవిందరాజాచార్యులవారు త్రివేణిపట్ల అనేక విధాల అభిమానం వ్యక్తంచేశారు. శ్రీ సుబ్రహ్మణ్యంగారికి 'త్రివేణి' విషయమై బాగా తోడ్పడ్డారు.

శ్రీ వింజమూరు గోవిందరాజాచార్యులవారు సుప్రసిద్ధ న్యాయవాది. తరువాత హైకోర్టు జడ్జి అయినారు. వీరు గొప్ప పండితులు. మేధావి. వీరేకాక చంద్రశేఖరన్, బాలసుబ్రహ్మణ్య అయ్యర్‌గారలు కూడా త్రివేణిపట్ల గాఢమైన అభిమానం చూపారు. ఈ చంద్రశేఖరన్ బాలసుబ్రహ్మణ్య అయ్యర్లు, శ్రీ వి. కృష్ణస్వామయ్యర్‌గారి కొమారులు. శ్రీమతి కె. సావిత్రమ్మాళ్‌గారు కూడా కృష్ణస్వామయ్యరుగారి సంతానమే. వీరందరకీ త్రివేణిపట్ల అత్యంతాభిమానం వున్నది. శ్రీమతి సావిత్రీ అమ్మాళ్ త్రివేణిలో చాలా మంచి రచనలెన్నో చేశారు. శ్రీ బాలసుబ్రహ్మణ్య అయ్యర్, చంద్రశేఖరన్‌గారలు చెన్నపట్నంలో న్యాయవాదులు. వీరి తండ్రి శ్రీ వి. కృష్ణస్వామయ్యర్‌గారు హైకోర్టు జడ్జి పదవి నలంకరించి లా మెంబరుగా పనిచేసి గొప్ప కీర్తిప్రతిష్ఠ లార్జించారు. ఈయన మహా ప్రతిభాశాలి. వీరి యశస్సును వీరు స్థాపించిన మైలాపూర్ సంస్కృత కళాశాల శాశ్వతంగా చాటుతూవుంటుంది. ఈ సోదరులు త్రివేణిపట్ల, నాపట్ల చూపిన ఆదరాభిమానాలు, స్నేహం మరువలేనివి. జైల్లో వుండగానే మా మామగారు చనిపోయిన వార్త తెలిసింది. జైలునుండి విడుదల కాగానే చెన్నపట్నంవచ్చి చంద్రశేఖరన్ అతిథిగావుండి, అటు పిమ్మట బరంపురం వెళ్ళాను. నా భార్యనూ, అత్తగారినీ, బావమరిదినీ పరామర్శించాను. నా భార్య శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ చాలా నెమ్మది, అణకువ, దైవభక్తిగల సాధు చరిత. మా కుటుంబానికి సంభవించిన వొడిదుడుకులన్నిటా అచంచలమైన ఆత్మవిశ్వాసంతో, మిక్కిలి ఓర్పుతో నాకు చేదోడు వాదోడుగా వున్నది.

1941వ సంవత్సరం డిసెంబరు నెలలో చెన్నపట్నంలో ఆంధ్ర మహాసభ రజతోత్సవం జరిగింది. "ఆర్ట్సు లవర్స్ మీటింగ్"కు నన్ను అధ్యక్షుణ్ణి చేశారు. బాపిరాజు మొదలయిన మిత్రులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆ రోజుల్లో తీవ్రమైన కాగితపు కరువు ఏర్పడింది. యుద్ధంవల్ల వచ్చిన అనేక విషమ పరిస్థితులు ఎదురుగా వున్నాయి. ఆ సమావేశాలలోనే ఆత్మీయులమైన మిత్రులందరమూ కలిసి అదీ ఇదీ మాట్లాడుకుంటున్నప్పుడు త్రివేణి భవిష్యత్తును గూర్చిన సమస్య కూడా చర్చకు వచ్చింది. ఏం చేయాలి? ముందున్న సమస్య ఎదురైంది. పత్రికను నిర్వహించటం చాలా కష్టమనితోచింది. ఆ సందర్భంలో శ్రీ కల్లూరి సుబ్బారావుగారు, త్రివేణి కార్యస్థానాన్ని చెన్నపట్నం నుంచి బెంగుళూరుకు మార్చవచ్చనీ, అట్లామారిస్తే కాగితం విషయమూ, ప్రచురణ విషయమూ, ఇంత విషమసమస్యలుగా వుండబోవనీ, ధైర్యం చెప్పారు. ఈ సలహా యుక్తంగానే తోచింది. ఈ ప్రయత్నాలు ఫలించినా ఫలించకపోయినా, బెంగుళూరులో ఆప్తులైన, ఆత్మీయులైన మిత్రులనైనా చూడ వచ్చును కదా అని బెంగుళూరు వెళ్ళాను. అక్కడ నా ప్రయత్నాలు ఫలించాయి. వసుదేవుడు కారాగారంనుండి కృష్ణుణ్ణి నందవ్రజం చేర్చినట్లుగా, దైవికంగా నేర్పుగా, త్రివేణిని మద్రాసు నుంచి, బెంగుళూరు చేర్చాను. బెంగుళూరు నుంచి మొట్టమొదటి సంచికను ప్రకటించినప్పుడు చిన్న ప్రారంభోత్సవం జరిగింది. శ్రీమతి సోఫియావాడియా తమ స్వగృహంలో ఒక సభ, విందు ఏర్పాటుచేసి, ఇండియన్ పి. ఇ. ఎన్. తరఫున త్రివేణికి స్వాగతం పలికారు. ఈ ఉత్సవసభలో మాస్తి వెంకటేశయ్యంగార్, సంపద్గిరిరావు, ప్రభృతులందరూ పాల్గొని నాకెంతో ఆనందోత్సాహాలు కలిగించారు. త్రివేణి గూర్చి ఆనందోత్సాహాలు, ఆత్మతృప్తి మనసునసందడించాయి. అటు తరువాత నరసారావుపేట వచ్చాను. అప్పుడే 'క్విటిండియా' ఉద్యమం రూపురేఖలు దిద్దుకొంటున్నది. ఈ ఉద్యమం ఆరంభమయ్యేవరకూ, మా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా మా ప్రాంతంలో జిల్లా బోర్డు ప్రెసిడెంటైన శ్రీ కల్లూరి చంద్రమౌళిగారితో కలిసి పర్యటిస్తూ, కాంగ్రెస్ ధ్యేయాలను ప్రచారంచేశాను. ఈ ఉద్యమ సందర్భంగా 1942 సెప్టెంబరు నెలలో నన్ను శ్రీ బ్రహ్మానందరెడ్డినీ నిర్బంధించి వేలూరు జైలుకు తీసుకొని వెళ్ళారు. అటు తరువాత నిర్బంధవాసాన్ని తంజావూరుకు మార్చారు. రెండోసారి ఇరవై నెలలు నిర్బంధంలో వుండవలసి వచ్చింది. రెండోసారి, క్విటిండియా ఉద్యమంలో పాల్గొని, నేను నిర్బంధంలో వున్నప్పుడు, బెంగుళూరు మిత్రులు, త్రివేణి పట్ల మిక్కుటమైన అభిమానం చూపి, నిర్వహించారు.

(సశేషం)

అహల్య

రాయప్రోలు సుబ్బారావు

గౌతముండు ప్రఖ్యాత మునీంద్రుడు.
న్యాయ దర్శనము చేయు దీక్షతో
తపసియై మహాదండ కాటవిని
నడుపుచుండె వానప్రస్థంబును.

పూయని తీగెలు కాయని తరువులు,
పాడని పులుగులు. ఆడని నెమళులు,
లేవచ్చట. ఎల్లెడలను పచ్చని
పచ్చిక తోడను పారుచు నుండును.

భీతిలేక పసిబిడ్డల పగిదిని
తిరుగుచుండు బిత్తరి లేళ్లెపుడును,
మెత్తని పచ్చిక మేసి, తులసి తో
టల కావల నీవల మురిపెంబుగ,

ఇంటపుట్టి యీడేరిన తోబు
ట్టువులట్టుల, బంధువుల పగిది; సహ
చరుల చాయ, నచ్చటి జంతు శకుం
తములు మెలగు నెయ్యము తియ్యంబుగ.

నిర్మల జలములు, నిండిన చెరువులు
పగలు రేలు శోభాయమానమగు
కమలంబులతో కలువలతో; హం
సలు వెన్నెల తెప్పల వలె తేలగ.

ఆ మహర్షి కర్ధాంగి యయ్యెను అ
హల్యాదేవి. హిమాచల కన్యక
ఫాలాక్షునకును పత్నియైన గతి;
వహ్నిని వలవదె స్వాహా భగవతి.

అంగ సౌష్టవము, మంగళముఖ వ
ర్చస్సును, కన్నుల చక్కన. తనులా
వణ్య కాంతు లగపడవింకెచటను;
చక్కదనాలను చక్కపఱచె విధి.

ఆయమ నడచిన ఆశ్రమ భూములు
కుంకుమ ముగ్గుల నంకితంబులగు
ఆయమ పదముల నంటిన పలుగురా
లాణి ముత్తియములయి రాణించును.

త్రిజగన్మోహన దేవత ఆ సతి,
పలికిన వేదస్వరములు వినబడు,
శారద వీణయు, నారదు తంబుఱ
మేళనంబయిన లీలలు తోచును.

సిద్ధ తపోరోచిష్మతి, ఆయమ
మనసున తలపోసిన మాత్రముననె,
చండాలుండును చందమామ యగు,
నల్లని త్రాచును మల్లెదండ యగు.

కోవెల కొఱుకని మావిచిగురు, శుక
తుండము తాకని దొండపండు, ర
క్తము చిందక రక్తచ్ఛాయ మిగులు,
సుదతి పెదవి పల్కుదురుల దాచుచు.

కిలకిలలాడును కాటుక కన్నులు
దొప్పగిలిన నునఱెప్పల కురులన్,
అరవిచ్చిన తామర పువ్వులు కే
సర పుంజముతో మురువు కొలుపు గతి

మంకెన పువ్వుల కుంకుమ వన్నెల
సకల భాగ్య లక్షణ రేఖలతో,
తరుణారుణ సుందర చరణంబులు
అర్చన యోగ్యములయి భాసించును.

కాంతిరూప మంగల్య అహల్యా
దేవి ఆశ్రమము తీర్చిదిద్దు: వా
త్సల్యముతో లలిత ప్రసన్న వా
చాలాలనల ప్రశాంతి వర్ధిలగ,

2

గౌతముడు తపోజ్యోతిర్ముఖమున
భాసించిన 'తత్త్వము' దర్శించెను:
"దేహబద్ధుడయి తిరుగు జీవున క
తీతుడై వెలయు ఈశ్వరుం"డనెను.

"నిత్యసుఖ" మనుట నిజముకాని నుడి,
"దుఃఖ బంధముక్తుడె సుఖి" యనదగు:
"ముక్తుడె సుఖి" యని బోధించును శ్రుతి.
అని ప్రకటించెను "న్యాయ దర్శనము"

3

అచట, స్వర్గలోకాభ్యంతరముల,
రాజమార్గముల, రచ్చల, నందన
వనవీధుల, నలుగడ, వినవచ్చెను త
ప్పెట్ల సందడులు విపరీతముగా.

పూలు కోయకుడు, పాలు పిండకుడు,
ఆపివేయుడు విహార వినోదము
లింటి పండుగలు, జంటల క్రీడలు
కట్టిపెట్టు డెక్కడివక్కడ నిక.

కామధేనువును కదలనీయకుడు,
కల్ప వృక్షముకు కంచెలు కట్టుడు.
మలయానిలముల మసలనీయక బి
గించుడింక దక్షిణదిగ్ద్వారము.

చందన గంధము చాది నూఱకుడు,
పచ్చ కప్పురము పాతర పెట్టుడు,
నింపరాదు పన్నీరు తొట్లలో
కేళాకూళులకీ లెడలింపుడు.

గొంతులు నొక్కుడు కోకిల మూకల,
చిలుక మందలకు చిక్కములుంచుడు,
కాళ్లుకట్టుడు శిఖండి తండముల;
ఆడక పాడక అలిసి కుప్పతిల.

4

ఇటు చాటించిరి ఇంద్రుని యాజ్ఞలు;
విస్తుపోయి నిర్విణ్ణులయిరి బృం
దారకులందఱు, తారుమారగుచు
గుంపుకూడి, గుసగుసలో పడిరి.

కాళ్ళకు గజ్జెలు కట్టదు ఊర్వశి,
కాశె బిగించదు కాముని హరిణి, ఘృ
తాచి నొసట దిద్దదు తిలకంబును,
మాసిన చీరెను మార్చదు రంభయు.

జలకములాడదు చాన మేనక, వ
రూధిని వీణా సాధన మానెను;
అందచందముల కాటపాటలకు,
సాము గరిడియగు స్వర్గలోకమున.

అమరలేమలు నిరాభరణలై, అటు
పకపక నవ్వక, చెకపికలాడక
చిన్నపోయి నిలిచిరి కళవళమున
వలవంతల చింతలు వేధించగ.

పూలతోటలో పుట్టిన తీగెలు
చిగిరించవె, పుష్పించవె. మధుమా
సోత్సవ లీలల నుపలాలింపవె
వల్లకాదనుట చెల్లునె ? సరసమె?

అమృతము త్రాగిన అమరులిట్లు భో
గోపవాసముల తీపుల కోర్తురె?
పరమ తాపసుల పట్టి యీడ్చు మా
పచ్చివయసుతో పని లేదోయిక !

ఎన్నడెరుగ మీ సన్న్యాసుల బ్రతు
కెంత దుర్భరమనిచ్ఛాకర్మము ?
ఓపజాలమని యూర్పులు విడుచుచు
తల్లడిలిరి సురతరుణులు తహతహ

ఆద్యమయిన సత్యంబు శివంబయి
మంగళార్థముగ మనిచెను జగతిని,
శివమయమగు రోచిస్సు సుందరం
బయి రూపొందె ననంత కళలతో.

5

అకలంక మనోహర మంగల్య అ
హల్య : ఆయమ మహా సౌందర్యము
నాకొన సమకొనె పాక శాసనుడు,
ఇష్టా రిష్టము లెఱుగక, మసకొని.

సుశ్లోకుండగు సురపతి అది మొద
లంధుడయి అహల్యా మోహంబున,
అంగలార్చు కామార్తి నంగభవ
కోదండోగ్ర క్షోభల మతిచెడి

చింత నిప్పుకలు చెరిగి నట్లు, హా
లాహలకీలలు లంకించిన గతి,
మనసిజాత హింసా పీడనబడి
దుర్మన స్తపనతో పలవించును.

పసు పాడిన లావణ్యము, చిలికిన
శృంగార రసము శ్రీ అహల్య !
సుందరి పజ్జన సుఖియింపని, నా
బ్రతుకెందులకని విల విల లాడును.

కాంచన పర్వత గర్భ ధాతువులు
పాల సముద్రపు పచ్చి వెన్నతో
మెఱుపుల మూసల కరిగి తేర్చెను, వి
ధాత అహల్యా తారుణ్యంబును.

పుట్ట లేదు మును భువనంబులలో,
పుట్ట బోది కెప్పుడును అహల్యను
పోలిన రూపవతీ లలామ, ఆ
యమ పొందొకటె మహా స్వారాజ్యము.

నాల్గు వేదములు నన్ను స్తవించును,
అగ్ని తెచ్చు హవిరన్నము నాకయి,
చింతామణి నా చేత కలదు! నా
కోరిక యెట్టులు తీరక పోవును.

అర్థ భోగముల ననుభవించితిని
నిశ్శేషముగా నిరవధికముగా,
అవి కేవల బాహ్యములు, స్థూలములు,
అంతఃకరణము నంటి రమింపవు.

అఖిలేంద్రియ పూర్ణాప్యాయమునకు,
సమ్యగ్భోగమె సాంత్వన సాధన;
సాంగ సమగ్రం బగు సంయోగము
నందె పొసగు బ్రహ్మానంద స్థితి.

అనుచు యోగ భోగాంతరములు మీ
మాంసించును కామాతురుడై దే
వేంద్రు డహల్య నపేక్షించి, మనో
జ విషజ్వర దోషము తలకెక్కగ.

కను తెప్పలు విచ్చినను వాల్చినను
అగపడు నతని కహల్యా ప్రతిమయె,
మనన ధాన స్మరణలలో ఆ
దేవి నామమే. నుతించు జపించును.

చిన్న వోయెను శచీ శుద్ధాంతము,
కన్ను మూసె సుర కరి శుక్లాంగము,
వైజయంతము కవాటము మూసిరి.
ఋషులు బయలుదేరిరి ప్రవాసమున.

6

కలకల మంచును పులుగులు లేచెను
కోడి కూసె, దోగాడె పిల్లప
య్యెరలు లోకమున నెల్ల ప్రాణుల
మేలు కొలుపుటకు వోలె తపోవని.

పచ్చి దర్భలను పచ్చని యాకులు
పఱచిన శయ్యను పండుకొన్న గౌ
తముడును లేచి యథా ప్రకారముగ
నదికేగెను షఃస్నానార్థంబుగ.

అంత లోపల అహల్యయు మేల్కొనె
మేఘునితోడో మెఱుపు తీగవవె,

ఆశ్రమ మందు సమస్త చేతనా
చేతంబులు లేచెను ప్రశాంతముగ.

నిదుర లోపలన్ చెదరిన కురులను
కుదురు పఱచుకొని, కోక కొంగులన్
గూడ కట్టుగా కుదిచు చుట్టుకొని.
బొట్టు పెట్టి గోముఖము చూచె సతి.

ప్రాచితీర్చి, ఆశ్రమ కుటీరమును
శుభ్రము చేసి, పసుపు కుంకుమ దొ
ప్పలు పుచ్చుకొని తపస్విని వెడలెను,
ఏటి దారి బడి యేకాకిని యై.

పవనుడు నతుడై వలగొని మసలెను,
దారి మెత్తపడె తల్లి దాదివలె,
భువన మాత వలె వోవుచునున్న అ
హల్యా గతి గమనార్థం బప్పుడు.

7

అంతంత విహాయసము నుండి దిగె
సర్ప గతిని ఆశ్రమములో నొకవి
మానము చీకటి మసకల మాటున;
పిట్ట లేని పసి పట్ట లేని వడి,

దిగి విమానమును దేవ నాయకుడు
దుర్మోహ భరాతురుడై, పసమఱి,
ఎగ్గు తలంచక సిగ్గు విడిచి, నయ
భయములకె డబడి, బయసి మాలిత మి

త్రిభువన జనయిత్రీదాక్షిణ్య
ప్రతిమ అహల్యా భగవతి; ఆయమ
కట్టెదుటంబడి కామ భిక్షనడి
గెను! ఘనీభవించెను చైతన్యము.

అధర్మ దురత్యయ నిర్ఘాతక
హల్యా పంచ ప్రాణంబు లవిసి
స్తంభించెను, నిశ్చల పాషాణ
ప్రతిమ యొకటి అద్భుతముగ నిలిచెను.

శ్రద్ధాంజలి

చిన్నాబత్తిని మైకేల్ కవి

కన్నుమూసినావ? కవి చక్రవర్తి! జా
షువ కవీంద్ర! మమ్ము శోకసాగ
రంబునందు ముంచి-బెంబేలు వడెగదా
తెలుగువాణి మోము వెలుగుదఱిగి.

గబ్బిలమును గూడ కావ్య నాయిక జేసి
అంటరానితనము మంట గలుప
దెబ్బతీసినావు—తీండ్రించు కుల మత
మత్త చిత్త జాతి మనసు మార్చ!

"స్వయము వరము"నందు స్వార్థపరాధమ
దుష్టవర్గ మెల్ల తుళ్ళిపడగ
పాప చర్యలన్ని వారింప సమకట్టి
దుయ్యబట్టి నట్టి ధూర్వహుడవు!

శస్త్రమైన శుద్ధ "క్రీస్తు చరిత్ర" లో
రసము రంగరించి, పసగుదిర్చి
భృశము యశము గాంచి, పెనుఢిల్లిన గరాన
ఐదువేల రూకలంది తాహ!

పిఱియత దెలుగు విశ్వ విద్యాలయము వారు
శ్రీ "కళాప్రపూర్ణ" హే! కవీశ!
అని పొగడువరకును ఆనంద సందోహ
మాగలేదు వారి కాంధ్రి సుకవి!

ఆంధ్రదేశమందు అన్యసీమలయందు
పేరుకెక్కినీదు చారు కవిత
"పద్మ భూషణ" నుచు భారతాధ్యక్షుండు
బిరుదునిచ్చి మెచ్చె, భేష! జాష్వ!

బెడగు తెనుగునందు నుడికారములతోడ
కలము జార్చి నట్టి కైతల్లి
సర్వదీనజనుల సందేశ ధుర్యమై
వీపుతట్టినావు భీతిమాన్ప

గజమునెక్కినావు - గండపెండారంబు
పిలిచి తొడిగె చెళ్ళ పిళ్ళ సుకవి
ఘనముగాను జరిగె కనకాభిషేకంబు
భళిరె! భేష! జాషువా కవీంద్ర!

సీరియల్

తిరస్కృతి

— వాసిరెడ్డి సీతాదేవి

జరిగిన కథ

సత్యం, సూర్యం అన్నదమ్ములు. మేనమామ కూతురు సరళకు తన తమ్ముడు సూర్యం అంటే ఇష్టమని తెలిసి సత్యం వూరు విడిచి వెళ్ళి శాంతినికేతనంలో చిత్రకళ అభ్యసించి హైద్రాబాద్ చేరుకున్నాడు. చిత్రకళను నేర్చుకొచ్చిన తర్వాత సత్యానికి చిన్ననాటి గురువుగారి కుమార్తె విమలతో స్నేహం వృద్ధి అయ్యింది తనంటే ఆమెకు అభిమానమని తెలుసుకున్నాడు. అయితే తన మిత్రుడు మాధవరావుకు విమలంటే విపరీతమైన ప్రేమ, గౌరవం అని గుర్తించాడు. విమలను అతనికి యిచ్చి పెళ్ళి చేస్తే బాగుండుననుకున్నాడు. ఒక ఆప్త మిత్రునిగురించి తను యీ మాత్రం త్యాగం చెయ్యక తప్పదు. మాధవరావు తల్లి ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తోంది. ఓ రోజు సత్యాన్నీ, మాధవరావును కబురెట్టి పిలిచింది రాజమణీ దేవి.

తను అనుకున్నది నిజమే! సత్యం విమల్ని ప్రేమిస్తున్నాడు .అందుకే ఈ విషయం ఏదో తేల్చుకోవాలను కొంటున్నాడు అనుకొన్నాడు మాధవరావు.

“సరే! అమ్మా! నీ కోరికనెందుకు కాదనాలి? ఎవర్నయినా సరే నీకు నచ్చిన పిల్లను చేసుకుంటాను.” అంటూ సత్యంకేసి చూస్తూ ఆదోలా నవ్వాడు

మాధవరావు ఊహించినట్టు తన సమాధానం విన్న సత్యం కళ్ళు సంతోషంతో మెరవలేదు. తెల్లబోయి చూస్తున్నాడు.

“బాబూ! నిజంగానా? ఎంత సుదినం ఈ రోజు. నా కెంతో ఆనందంగా వుంది బాబూ!” రాజమణీదేవి కళ్ళలో ఆనందాశ్రువులు సుళ్ళు తిరిగాయి.

విమల ఎక్కడో చూస్తూ ఆలోచిస్తుంది.

నిజంగా మాధవ్ ఎంత త్యాగమూర్తి తనను ఎంత ప్రమాదం నుంచి రక్షించాడు?

“అమ్మా ఒక షరతు! సత్యాన్ని కూడా నువ్వు నీ పెద్ద కొడుకులాగే చూసుకుంటున్నావు గదా? సత్యం పెళ్లి గురించి ఎందుకమ్మా ఆలోచించవు?” అన్నాడు మాధవరావు.

రాజమణీ దేవి ముఖం సిగ్గుతో వాలిపోయింది.

“నిజమే బాబూ......సత్యం పెళ్లికూడా......”

“మాధవ్!” సత్యం గట్టిగా అరిచి మాధవరావు చెయ్యి పట్టుకొని గబగబా గదిబయటకు లాక్కెళ్లాడు.

మరుక్షణంలో ఆ గదిలో ఏదో టైంబాంబు ప్రేలబోతున్నట్టూ, ఆ ప్రమాదం నుంచి రక్షించటానికే మాధవ్‌ని లాక్కెళ్లుతున్నట్టూ లాక్కెళ్లాడు సత్యం.

సత్యం వెంటవెళుతూ, తెల్లబోయి చూస్తున్న విమలకేసి చూసి ఆదోలా నవ్వాడు మాధవ్.

రాజమణీదేవి వాళ్లిద్దరూ వెళ్ళిన వైపే చూసి ఏదో తట్టగా తనలో తనే ముసి ముసిగా నవ్వుకుంది.

“నిజమే! సత్యం వివాహం కూడా మాధవ్ వివాహంతో జరిపించాలి. నాకు ఆ ఆలోచనే ఇంతవరకూ రానందుకు సిగ్గు పడుతున్నాను.” అన్నది రాజమణీదేవి విమలకేసి చూస్తూ.

విమల ఇరుగ్గా కదిలింది.

లక్ష్మి తెచ్చిన కాఫీతాగుతూ ఇద్దరూ తమ తమ ఆలోచనల్లోకి జారిపోయారు.

* * *

డ్రాయింగ్‌రూంలోకి మాధవ్ చెయ్యిపట్టుకొని బరబరా లాక్కొచ్చాడు సత్యం. గదిలోకి వచ్చాక మాధవ్ చెయ్యివదలి ఏదో ప్రమాదంనుంచి బయటపడ్డట్లు గట్టిగా గాలిపీల్చుకున్నాడు గుండెల నిండుగా.

“ఏమిటిరా సత్యం? ఎందుకిలా నన్ను ఏదో జరగబోతున్న ప్రమాదం నుంచి రక్షించటానికన్నట్లు లాక్కొచ్చావ్?” అన్నాడు కలిగిన ఆశ్చర్యం నుండి పూర్తిగా బయటపడకుండానే మాధవ్.

ప్రమాదంలేదూ ఏమీలేదూ కాని—నువ్వలా కూర్చో. ఒక ముఖ్య విషయం మాట్లాడాలి;” అంటూ సత్యం ఒక కుర్చీలో కూర్చున్నాడు.

మాధవ్ ప్యాంట్‌జేబులోనుంచి సిగరెట్‌పెట్టెతీసి తెరిచి ఒక సిగరెట్‌తీసి దాన్ని తిప్పి పెట్టెమీద కొడుతూ ఆలోచనలోపడ్డాడు.

‘‘సందేహంలేదు. సత్యం విమల్ని ప్రేమిస్తున్నాడు. నేను చూచిందీ, ఊహించిందీ అక్షరాలా నిజం. సత్యం తను అతనికి అడ్డువస్తాననుకున్నాడా? అమ్మ దగ్గర తను విమల్ని చేసు కుంటానని చెబుతాననుకొన్నాడా? సత్యం తనను అంతేనా అర్థం

చేసుకుంది?_ఓ క్షణంకాలంపాటు విరిగిన పాలలాంటి నవ్వొకటి మాధవ్ పెదవులమీద కదిలింది.

మాధవ్‌నే తదేకంగా చూస్తున్న సత్యానికి మాధవ్ ఎందుకు తనలో తానే ఎందుకలా విరక్తిగా నవ్వుకొన్నాడో అర్థంకాలేదు.

మాధవ్ సిగరెట్ వెలిగించుకొని సత్యానికి ఎదురుగావున్న కుర్చీలో యాధాలాపంగానే కూర్చున్నాడు. సిగరెట్ పొగఊది. చుట్టలు చుట్టుకుంటూ పైకిలేస్తున్న పొగనేచూస్తూ ఆలోచిస్తున్నాడు.

''మాధవ్?'' సత్యం కంఠం దృఢంగా పలికింది

మాధవ్ మాట్లాడకుండా సత్యంకేసిచూశాడు చెప్పమన్నట్లు

''నిజం చెప్పు! నువ్వు: అమ్మ చూసిన ఏ పిల్లనైనా చేసుకోవటానికి సిద్ధంగా వున్నావా?''

''నీకా సందేహం ఎందుకు వచ్చిందో చెప్పు'' చిరునవ్వుతో అడిగాడు మాధవ్.

''నువ్వెవర్నీ ప్రేమించటంలేదా?'' అడిగాడు సత్యం.

''లేదు'' నిదానంగా అంటూ సత్యం కళ్ళలోకి గుచ్చి చూశాడు మాధవ్.

తన సమాధానం సత్యం కళ్ళలో కాంతిరేఖల్ని కదిలిస్తుందనుకొన్న మాధవ్‌కి నిరాశే కలిగింది

''అబద్ధంఆడకు మాధవ్. నాకు తెలుసు నువ్వు విమల్ని ప్రేమిస్తున్నావు. ఆ విషయాన్ని బయటపెట్టటానికి ఎందుకు జంకుతున్నావో నాకు అర్థం కావడంలేదు!'' అన్నాడు సత్యం కొంచెం ఆవేశంగా.

మాధవరావు పక పకా నవ్వాడు ఆ నవ్వు సహజంగా లేదు. తెచ్చిపెట్టుకొన్నటే వున్నది.

"నువ్వు అలా నవ్వినంత మాత్రంచేత నేను మోసపోతాననుకోకు ఆ నవ్వెంత పేలవంగా, బోలుగావుందో నీకు తెలియక పోవచ్చు!"

''ఏమిటోయ్ నీ గొడవ. నాకు అలాంటిదేమీలేదు బాబూ అంటే బలవంతంగా నాచేత ఒప్పిస్తావా ఏమిటి?'' మాధవరావు కొంచెం విసుగ్గా అన్నాడు.

''పోనీయ్ అలాగే అనుకుందాం. కాని నువ్వు విమల్ని చేసుకో. ఏ పిల్లనైనా చేసుకుంటానన్నావుగా? అమ్మకు విమలంటే ప్రాణం. ఆమెతో నేను మాట్లాడుతాను."

మాధవ్ చేతిలో సిగరెట్ కిందపడిపోయింది కాలుతున్న సిగరెట్‌ని బూటుకాలుతో నలుపుతూ ఆలోచిస్తున్నాడు.

సత్యం విషయంలో తాను పొరపాటు పడ్డాడా! కాని విమలకు తనను వివాహం చేసుకోవడంఇష్టం లేదు. విమలకు సత్యం అంటే ఇష్టం. ఆనాడు తన కళ్ళతో చూశాడు_సత్యం విమల్ని----తన కోసం ఇంత త్యాగానికి సిద్ధపడ్డాడు. ఒకసారి తమ్ముడికోసం తను ప్రేమించిన అమ్మాయిని వదులుకొన్నాడు. ఇప్పుడు రెండోసారి తన ప్రాణ స్నేహితుని కోసం తనను ప్రేమించిన అమ్మాయిని వదులు కోవడానికి సిద్ధ పడుతున్నాడు. సత్యం మామూలు మనిషి కాడు. అతనిలో దైవత్వం ఉంది

మాధవ్ కళ్లు చెమ్మగిల్లాయి. సత్యంమీద అంతులేని జాలి, గౌరవభావం కలిగాయి.

"ఏమిటోయ్ ఎంతసేపు ఆ సిగరెట్టును నలుపుతావ్? నువ్వెంత దాచినా నీ మనస్సులోకి నేను చూడగలను." అన్నాడు సత్యం.

"నీ తలకాయ! ఏమిటి చూసేది. విమలంటే నాకు ఇష్టం లేదు నాకు చాలా అందమైన అమ్మాయి కావాలి! బాగా డబ్బూ, హోదాగల పిల్లకావాలి. అమ్మకు కూడా అదే ఇష్టం. ఇంతకాలం ఎదురు చూసింది విమలలాంటి అతిసాధారణమైన యువతి కోసం అనుకుంటున్నావా? విమల్ని నేను చేసుకోవటం ఏమిటి?" గబగబా పాఠవల్లించినట్లు అనేశాడు మాధవరావు.

సత్యం కళ్ళప్పగించి మాధవ్‌ను చూస్తూ వుండిపోయాడు. మాధవ్ మాటల్ని ఎంతనమ్మాలన్నా నమ్మకం కలగకుండావుంది.

"అయితే నువ్వు అమ్మ చూసిన అమ్మాయిని మనస్ఫూర్తిగా చేసుకుంటావా?" సత్యం మాధవ్ కళ్ళల్లో దేన్నో చదవటానికి గుచ్చిచూశాడు.

"ఏమిటోయ్ అలా చూస్తావు? నమ్మకం కలగటం లేదా? నీ దగ్గర నాకు దాపరికం ఏమిటి?" అంటూ మరో సిగరెట్టు తీసుకొని ముట్టించాడు

మాధవ్ ఆ మాటలంటున్నప్పుడు సత్యం తన కేసి చూడకుండా ఉండేందుకే తలవంచుకొని సిగరెట్టు తీస్తున్నాడని గమనించాడు సత్యం.

"కాని నేను వివాహం చేసుకోవడం, చేసుకోకపోవడం అనేది నీ మీదనే ఆధారపడివుంది?" అంటూ మాధవ్ సిగరెట్ పెదవుల సందుని ఇరికించుకున్నాడు.

"నా మీదా?" ఆశ్చర్యంగా చూశాడు సత్యం.

"అవును నీ మీదే" తాపీగా సిగరెట్ పొగ ఊది అన్నాడు మాధవ్.

"నీ వివాహం తరువాతే నా వివాహం జరగాలి." మళ్లీ మాధవే అన్నాడు.

ఆలోచిస్తున్న సత్యం చివ్వున తలెత్తి చూశాడు. కుర్చీలో నిలువుగా కూర్చున్నాడు అంతలోనే పకపకా నవ్వేశాడు సత్యం.

సత్యం అంతపెద్దగా నవ్వడు సాధారణంగా. ఆ నవ్వులో అతని పగిలిన గుండె బోలుగా మోగినట్లనిపించింది మాధవ్‌కు.

"ఎందుకలానవ్వుతావ్. నేను నిజమే చెబుతున్నాను. నా పట్టుదల సంగతి నీకు తెలిసిందేగా!" మాధవ్ కుర్చీలో ముందుకు వంగుతూ అన్నాడు.

"నాకు పెళ్ళేమిటోయ్ అవిటి వాణ్ణి!" ఆ మాట అంటున్నప్పుడు సత్యం ముఖం గంభీరంగా మారింది.

"ఏం నీ కేం తక్కువ! నా కంటే నువ్వు అదృష్ట వంతుడవు."

సత్యం చివాలున తలెత్తి మాధవ్‌కేసి చూశాడు. చిరునవ్వు నవ్వాడు. "నువ్వెంత జాగ్రత్తగావున్నా దొరికావులే." అన్నట్లుంది ఆ నవ్వు.

మాధవ్ మాటజారానని తెలుసుకున్నాడు.

"నీకేమోయ్ కళాకారుడివి, అందగాడివి నాకేముంది డబ్బు తప్పితే" అన్నాడు మాధవ్ మళ్ళీజారిన మాటను దిద్దుకొనే ప్రయత్నంలో.

"నీకంటే నేనదృష్టవంతుణ్ణి అన్నావు. ఎందులో చెప్పు." నిగ్గదీసినట్లు అడిగాడు సత్యం.

"అదే చెప్పానుగా! నువ్వు అందగాడివీ..."

"అబద్ధం! నిజంచెప్పు! నువ్వన్న ఉద్దేశ్యం వేరు. మాట మారుస్తున్నావు." సత్యం స్వరంలో పట్టుదల కన్పించింది.

"చెప్పమంటావా?"

"ఊఁ! చెప్పమనేగా"

"నిన్ను ప్రేమించేవాళ్ళు ఉన్నారు."

"అవును. ఉన్నారు. ఆ విషయంలోనే నేను అదృష్ట వంతుణ్ణి."

సత్యం అంత త్వరగా అంగీకరిస్తాడని ఆశించని మాధవ్ ఆశ్చర్యంగా సత్యంకేసి చూశాడు.

"ఎవరని అడగవేం!" రెట్టించాడు సత్యం.

మాధవ్ సత్యం ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు.

"అమ్మా, నువ్వూ, నన్ను ఎంత ఆదరించి ప్రేమిస్తున్నారో నాకు తెలుసు." సత్యం నిదానంగా అన్నాడు. కంఠం అర్ద్రమైంది.

మాధవ్ పక పకా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావ్?"

"నువ్వుమాత్రం మమ్మల్ని ప్రేమించడం లేదూ? ప్రేమంటే ఆ ప్రేమ కాదోయ్?"

"ఓహో! అయితే అమ్మాయిల ప్రేమా?"

"అవును"

"అవిటివాణ్ణి నన్నెవరు ప్రేమిస్తారోయ్. చిన్నప్పటినుండి ఒక చోటే ఆకుమొగ్గగా పెరిగిన నా ఆరాధ్యదేవతే నన్ను తిరస్కరించింది" ఎలాంటి ఉద్వేగం లేకుండా అన్నాడు సత్యం.

"విమల నిన్ను ప్రేమిస్తుందని నీకు తెలియదూ? ఎందుకు నా దగ్గర దాస్తావు."

సత్యం మాధవరావు ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు. తను ఊహించింది నిజమేనా? మాధవ్ ఎలా గ్రహించాడు ఆ విషయం. ఇవ్వాళ తన గదిలో విమల ఉండటంచూసి ఊహించుకొని ఉంటాడు విమల్ని తను హృదయానికి హత్తుకోవడం చూశాడేమో? తను ఏనాడూ ఉద్రేకాలకు లొంగిపోలేదు. ఆవ్వాళ అలా జరిగిందేమిటి? మాధవ్ చూసేవుంటాడు. అందుకే తన వివాహం మరొకరితో అంగీకరించాడు. సందేహం లేదు. మాధవ్ విమల్ని ప్రేమిస్తున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" నొసలు ముడిచి ప్రశ్నించాడు మాధవ్.

"నీ కలాంటి భ్రమకలగడానికి కారణమేమిటా అని ఆలోచిస్తున్నాను." అన్నాడు సత్యం ఒక్కొక్క శబ్దాన్ని తూచినట్లు విసురుతూ.

"నాది కేవలం భ్రమే నంటావా?" సత్యం కళ్ళలోకి లోతుగా చూస్తూ ప్రశ్నించాడు మాధవరావు.

సత్యం కళ్ళలో ఏ ప్రభావమూ కనబడలేదు.

"అవును. ముమ్మాటికీ భ్రమే. ఆ అమ్మాయి నన్ను చిన్నప్పటినుండి ఎరుగును. నేనంటే ఒక విధమైన అభిమానం వున్న మాట నిజమే. అంత మాత్రంచేత నువ్వు ఇలా వూహించటం అన్యాయం" అన్నాడు సత్యం.

మాధవ్‌రావు ముందుకు జరిగి సత్యం చెయ్యి పట్టుకొని అన్నాడు–

"మనిద్దరం రక్త బాంధవ్యమున్న అన్నదమ్ముల కంటె ఆత్మీయులుగా వున్నాం. ఏ దైవసంకల్పమో మనిద్దర్నీ ఇంతటి సన్నిహితుల్ని చేసింది. శరీరాలు రెండైనా మన మనసులు ఒక్కటే! అవునా?" మాధవ్ కంఠం ఒణికింది. అతని చేతిలో వున్న సత్యం చేయి కంపించిపోయింది. మాధవ్ కళ్ళలోకి చూస్తూ సత్యం మంత్రముగ్ధుడిలా అయిపోయాడు.

"మాట్లాడవేం సత్యం!"

సత్యం మాధవ్ భుజాల మీద తన చేయివేసి "ప్రపంచంలో ఏ శక్తీ మనల్ని విడదీయలేదురా మాధవ్. ఇది ముమ్మాటికి నిజం! నిజం!" అంటుండగా దేవుడి గదిలో నుంచి గంటలు మోగాయి

"పద. అమ్మగారి పూజ పూర్తయింది. వెళ్ళి ప్రసాదం తీసుకొందాం అని సత్యం మాధవ్‌ని తీసుకొని పూజ గది కేసి నడిచాడు.

రాజమణీదేవి అప్పుడే పూజ ముగించి హారతి ఇచ్చిన పళ్ళెంతో దేముడి గదిలో నుంచి బయట కొచ్చింది. ఎదురుగా నమ్రతగా నిలబడ్డ సత్యాన్నీ, మాధవ్‌ని ఎగాదిగా చూసింది.
"ఏమిట్రా! అలా వున్నారూ ?" అంది.

ఇద్దరూ కలవరపడ్డారు. ఒకరిముఖాలు ఒకరు చూసుకొన్నారు.
"ఎలా వున్నాం బాగానే ఉన్నాంగా అమ్మా!" అన్నాడు మాధవ్.
"అవునమ్మా, ఏం జరగలేదే! మామూలుగానే ఉన్నాం" అన్నాడు సత్యం. "మరి మీ ముఖాలు వేరే చెప్తున్నాయే! ఊ ఇంద పట్టండి!" అంటూ రాజమణిదేవి ప్రసాదాన్ని అందించింది.

* * *

సత్యం సంగతి ఏమయినా తెలిసిందా? రాజమణిదేవి అన్నం ముందు కూర్చుంటూ కొడుకుని అడిగింది

"లేదమ్మా" తలవంచుకొని అన్నం కలుపుకుంటూ అన్నాడు. కలిపేకలిపే అన్నం వదిలేసి రాజమణిదేవి మాధవ్ కేసి తీవ్రంగా చూసింది.

"ఇప్పటికి ఐదు రోజులైంది ఎక్కడికి పోయివుంటాడంటావ్! ఏనాడైనా నన్ను చూడకుండా ఇన్ని రోజులున్నాడా?"

"అదేనమ్మా నాకు అర్థం కావడం లేదు."

"నీకేది అర్థం అవుతుంది కనుక! ఇది అర్థం కావడానికి?" అన్న తల్లి గొంతులోని తీవ్రతను గ్రహించిన మాధవ్ తల ఎత్తి చూశాడు.

"సత్యం తెలిసిన వాళ్ళందర్నీ అడిగాను ఎన్నో చోట్ల వెదికాను. అంతకంటె నన్నేం చేయమంటావు?"

"నేను చెప్పింది నీవు ఎప్పుడు చేశావు గనుక? ఈనాడు చేయటానికి?

"అమ్మా"

"అవును మాధవ్! ఆ రోజు గుర్తుందా? మీ ఇద్దరి ముఖాలు చూసి అప్పుడే అనుమానించాను మీ ఇద్దరి మధ్య యేదో జరిగి వుంటుందని. నా నుంచి దాస్తున్నావ్?"

"ఏం జరిగిందమ్మా! సత్యానికి బాధ కలిగించే పని నేను తెలిసి ఏదీచేయలేదు. వాడెందుకు మాట మాత్రమయినా చెప్పకుండా వెళ్ళిపోయాడో నాకూ అర్థం కావడం లేదు."


మాధవ్ తన నుంచి ఏవో దాస్తున్నాడన్న బాధ ఆమె గుండెల్ని పట్టి నులిమివేయసాగింది. తినే అన్నం వదిలేసి చివాలునలేచి నిలబడింది. నరాలు పట్లు పీడి తెగిపోయినట్లయి వెనక్కు విరుచుకొని తూలిపడింది. మాధవ్ లేచి వెళ్ళి తల్లిని పట్టుకొన్నాడు.

రాజమణీదేవిని మంచంమీద పడుకోబెట్టి డాక్టర్‌కి ఫోన్ చేశాడు మాధవ్.

మళ్ళీ ఆమెకు ఫిట్ వచ్చింది. ఈ మధ్య కొన్ని రోజులుగా ఆమె ఆరోగ్యం బాగుండి ఆ రోజు సత్యాన్ని తననూ ఆ స్థితిలో చూసినప్పటినుంచి ఆమెలో ఏవో బాధ ద్యోతకమవుతూనే వుంది. దానికితోడు సత్యం ఇంటినుంచి వెళ్ళిపోవడం అగ్నిమీద ఆజ్యం పోసినట్లయింది. అన్నిటికంటె తను ఏదో తల్లినుంచి దాస్తున్నాడన్న అనుమానం ఆమెను తీవ్రంగా బాధిస్తోన్నట్లుగా వుంది. విమలను తనూ, సత్యమూ ఇద్దరూ ప్రేమిస్తోన్నట్లు, అకారణంగా తామిద్దరూ అనుభవిస్తోన్న మానసిక సంక్షోభం తల్లికి తెలియకుండా చూడటం మంచిదనే ఉద్దేశ్యంతోనే తను ఆమె అడిగినప్పుడల్లా మౌనం వహిస్తున్నాడు. కాని అదే మరో రకంగా ఆమె మానసిక స్థితిమీద దెబ్బ తీసింది. అసలు విషయం చెపితే? ఆమె అసలు కోలుకోవడంకూడా జరగదేమో? ఓ! గాడ్! నా కెలాంటి విషమ పరిస్థితి కల్పించావ్? మధ్యలో దేముడేం చేశాడు? ఇదంతా ఆ సత్యం చేసిందే? అనుకోకుండానే అతడు తమ జీవితంలో ప్రవేశించాడు తన తల్లికి వాడు తనయుడులా అయిపోయాడు వీళ్ళిద్దరి అనుబంధం ఏపాటిదో? ఇది పెంచిన ప్రేమా కాదు. కన్న ప్రేమా కాదు కాని అంతకు మించిన యీ మమకారం ఆమెలో ఎలా ప్రవేశించిందో? ఆమె మానసిక స్థితి తెలిసికూడా సత్యం ఇంత దారుణంగా ఎలా ప్రవర్తించగలిగాడు? అతనికీ విమలకూ వున్న అనురాగానికి తను అడ్డు కానని ఎంత వివరంగా చెప్పాడు అంతకంటే తను ఇంకేం చెప్పగలడు? విమలను తను మర్చిపోవడానికి తను చేసిన ప్రయత్నం అంతా వ్యర్థం చేసిపోయాడు. సత్యంకోసం తన హృదయాన్నే తనే గాయపర్చుకొన్నాడు కాని ఆ సత్యమే తన తల్లి గుండెల్లో విచ్చు కత్తులు దించిపోయాడు! నిర్మలమైన స్నేహానికి ఇదా ప్రతిఫలము? స్వార్థ త్యాగానికీ అనురాగానికీ ప్రతిఫలం ఇదేనా? సత్యం ఇంతటి కఠిన హృదయుడని ఇంత కాలం తను తెలుసుకోలేకపోయాడు. మాటల్లో చేతల్లో లాలిత్యం, నమ్రతా ఉట్టి పడుతూంటే ఆ కఠినాత్ముని హృదయంలో కిరాతం ఎలా మొలిచాయో? ఫిట్ వచ్చి మెలికలు తిరిగిపోతూన్న తల్లి చేతులు పట్టుకొని, తల్లి ప్రక్కనే మంచంమీద కూర్చున్న మాధవ్‌కు ఇక సత్యాన్ని గూర్చి ఆలోచనలు ముందుకు సాగలేదు. మాధవ్ తల్లి ముఖంలోకి చూశాడు ఆమె పళ్ళు బిగించి వున్నాయి పెదవులు మెలితిరిగిపోతున్నాయి అనూహ్యమైన బాధ ఏదో ఆమె ముఖంలో ద్యోతకమవుతూవుంది మాధవ్ కళ్ళు చెమ్మగిల్లాయి.

(సశేషం)

నగర వార్తాచిత్రాలు



3

1



1 హైదరాబాదులోని మలక్ పేట కాలనీలో సూపర్ బజార్ బ్రాంచికి ముఖ్య మంత్రి ప్రారంభోత్సవంచేశారు (జులై 29)

2 హైదరాబాదులోని అజామాబాద్ కార్మికసంక్షేమ కేంద్రంలో కార్మిక శాఖ మంత్రి శ్రీ జి సంజీవరెడ్డి పిల్లల వ్యాధి నిరోధక చర్యల కార్యక్రమానికి ప్రారంభోత్సవంచేశారు (జులై 27)


3 దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి సమాచార పౌర సంబంధ శాఖ మంత్రి శ్రీ అక్కిరాజువాసుదేవరావు సర్టిఫికెట్లు ప్రసాదించారు (జులై 27)

4 ప్రభుత్వ హోంశాఖ కార్యదర్శి శ్రీ ఇ వి రాంరెడ్డి సీతాఫల్ మండిలో ఉచిత సంస్కృత బోధన తరగతులను ప్రారంభించారు (ఆగస్టు 1)

2



4





4

నగర వార్తా చిత్రాలు

1 ఉభయ శాసన సభల సంయుక్త సమావేశంలో గవర్నరు ప్రసంగించారు· (జులై 17)


2 హైదరాబాదులోని ఆగాపురాలో, శ్రీ సంక్షేమ, యాత్రిక శాఖ మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ వరద బాధితులకు రొక్కపు సహాయం అందజేశారు (జులై 16)


3 హైదరాబాదులోని జుబిలీ హాల్లో పరిశ్రమల శాఖాధికార్ల సమావేశానికి ముఖ్య మంత్రి ప్రారంభోత్సవంచేశారు (జులై 22)

4 రుమేనియా విదేశ వ్యాపార శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ ఇ. ఎన్. నికోలియా నాయకత్వాన 6గురు సభ్యులు కల ప్రతినిధి వర్గం ముఖ్య మంత్రిని కలుసుకున్నారు (జులై 30)

5 హైదరాబాదులోని నల్లగుంటలో ముఖ్య మంత్రి గుడిశెలలో నివసిస్తున్నవారికి యిండ్ల స్థలాల పట్టాలు పంపిణీచేశారు(జులై 25)


5






1

2



3



దేవత పలికింది

చిన్నకథ

డి. వి. ఆర్. భాస్కరశాస్త్రి

తొంభై రూపాయలు లెక్కపెట్టుకోకుండానే జేబులో పెట్టుకున్నాడు యాదగిరి. "లెక్క పెట్టుకోండి, యాదగిరిగారూ!" అని రామారావు హెచ్చరిస్తున్నా వినిపించుకోకుండా. "నేనింతకు ముందు ఎప్పుడైనా లెక్కపెట్టుకున్నా కనకనా, ఈ సారి లెక్కపెట్టుకోడానికి" అన్నాడు యాదగిరి నవ్వుతూ. ఆమాట రామారావుకీ తెలుసు. ప్రతినెలా జీతం తీసుకోగానే, అద్దె ఇచ్చి వేయడం రామారావుకి అలవాటు అయితే, ఈ సారి డబ్బు ఇస్తూ, "జాగ్రత్త సుమండీ, ఈ నెల సినిమాలకి వెళ్ళడానికి వీలులేదు." అని హెచ్చరించాడు: "ఏం?" "మావూరు రావాలి మీరు. ప్రయాణంమాట మరచి పోయారా?" "ఓ! అదా! మర్చేపోయా!" అన్నాడు యాదగిరి.

యాదగిరి మీద రామారావుకటువంటి స్వతంత్రం వుంది. కేవలం రామారావు కిరాయికి ఆ ఇంట్లో ఉంటున్నట్టు ఊరుకోక, వాళ్ళ కష్టసుఖాలలో కలసిపోయాడు. ఎప్పుడు ఖర్చులు యాదగిరికి రాబోతున్నా, ముందు అట్లా హెచ్చరించడం యాదగిరికి అలవాటు. పది రోజులనాడే యాదగిరితో చెప్పాడు రామారావు సతీ సమేతంగా తన ఊరు రావాలని, రామారావు చెల్లెలు పెళ్ళి జరుగుతుంది మండపాకలో. తనతోకూడా, తన చెల్లెలు పెళ్ళికి, యాదగిరి కుటుంబం రావలసిందే.

యాదగిరికి రామారావంటే మంచి గౌరవం. నలభై రూపాయల అద్దెకి ప్రవేశించాడు రామారావు తన ఇంట్లో పదేళ్ళ నాడు. చిక్కడపల్లిలో అన్ని ఇళ్ళకీ అద్దెలు పెరిగినట్లే తన ఇంటికీ అద్దెపెరిగింది, ఈ పదేళ్ళలోను. రామారావుకూడా ఈలోగా యల్.డి.సి. దగ్గరనుంచి సెక్షన్ ఆఫీసర్‌దాకా వచ్చాడు. డబ్బు మాట అట్లా ఉంచి యాదగిరి తల్లి పోయినప్పుడూ, తండ్రిపోయినప్పుడూ, దిక్కులేని వాడుగా విలవిలా ఏడుస్తూ కూచుంటే ఆదుకున్నది రామారావు కుటుంబమే యాదగిరి ఆ రోజులు ఎప్పటికీ మరచిపోలేడు

రామారావు సాయం వల్లే, తండ్రి పోయిన కొద్దిరోజులకే హుస్సేన్‌సాగర్ థర్మల్ స్టేషన్‌లో ఉద్యోగం దొరికింది యాదగిరికి. తర్వాత రెండేళ్ళకి తల్లిపోయినప్పుడు యాదగిరికి ఆ ఉద్యోగంకూడా ఊడిపోయింది. అందువల్ల ఇప్పటిదాకా యాదగిరికి ఇంటిమీద వచ్చే కిరాయిలు గతి అయ్యాయి పొట్టగడవడానికి. రామారావు సలహా మీదఅప్పటినుంచీ ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలో తన పేరు రిజిష్టరుచేసి, విసుక్కోకుండా, ఓపికగా రెన్యూచేస్తూనే ఉన్నాడు: కాని ఉద్యోగం రాలేదు: యాదగిరికి ఈమధ్య ఇంటి పన్ను కట్టలేదని నోటీసువస్తే రామారావే కట్టాడు. డబ్బు ఉంటే మాత్రం అవసరానికి ఆదుకునే వాడెవరు ఈరోజులలో? యాదగిరి మరిచి పోలేడు రామారావు చేసే ఇట్లాంటి సహాయాలు,

కమలమ్మ సందేహించింది మొట్టమొదట రామారావు కుటుంబంతోపాటు బయలుదేరడానికి. పెళ్ళికి చేతులు ఊపుకుంటూ వెళ్ళడం కమలమ్మకిష్టంలేనిపని. భర్తకి ఉద్యోగం లేకపోవడమూ దీనికి తోడు. ఇంట్లో మరోవాటాలో ఉన్నవాళ్లు బాడుగ సరిగా ఇవ్వక ఇబ్బంది పెడుతూ ఉండడం కమలమ్మకి మరీబాధ కలిగించాయి. అయినా ఊరుకోలేక పెళ్ళికూతురికీ ఇవ్వడానికి యథాశక్తి ఒక రవికగుడ్డ మాత్రం తెప్పించింది యాదగిరిచేత. యాదగిరి ఏరి ఏరి జరీ బార్డరు ఉన్న తోపు రంగు గద్వాల చేనేతరకం తెచ్చాడు.

రామారావు సకుటుంబంగా మండపాక బయలుదేరాడు. అక్కడ ఈ పాటికి అన్నగారు అన్ని యేర్పాట్లుచేసే ఉంటాడు చెల్లెలి పెళ్ళికి. రామారావు, భార్య, తన ముగ్గురు పిల్లలకే కాకుండా యాదగిరికీ కమలమ్మకీకూడా బస్ టిక్కెట్స్ తానేతెచ్చాడు. తెలుగునాటి నడి బొడ్డున ఉన్న హైద్రాబాద్‌ను కోస్తాలో కొసన ఉన్న నరసాపురానికి కలిపే బస్‌మీద బయలుదేరారంతా.

రాత్రంతా బస్‌లో యాదగిరికి సరిగా నిద్రపట్టలేదు. అంతకు ముందు అప్పుడప్పుడు చెల్లెలుగారింటికి విజయవాడదాకా వెళ్ళివచ్చేవాడు కాని ఆ పైన బస్ ఎటుపోతుందో, ఏ ఊళ్లు వస్తాయో ఎరుగడు. నిద్రకళ్ళతో మధ్యమధ్య బయటికి చూస్తున్నాడు యాదగిరి. ఏలూరు వచ్చింది. బస్‌లోంచి పది మందిదాకా దిగారు. ఇద్దరు ముగ్గురు ఎక్కారుకూడా. తెల్లవారవచ్చింది. గడియారం నాలుగైంది. బస్ మళ్లీ బయలుదేరింది. తెల్లవారుఝాము ఆ చల్లగాలికి కునుకు పట్టింది యాదగిరికి. పక్కన కమలమ్మ తూలుతూ తూలుతూ నిద్రపోతూనే ఉంది, బస్ బయలుదేరినప్పటినుంచీ. మళ్లీ బస్ ఆగేటప్పటికి మెలకువ వచ్చింది యాదగిరికి. తెల్లవారిపోయింది. రామారావూ భార్యాకూడా లేచారు. పిల్లలు నిద్రపోతూనే ఉన్నారు. "ఏం, యాదగిరిగారూ, ఎక్కడ ఉన్నాం ఇప్పుడు?"

అన్నాడు రామారావు నవ్వుతూ లేచినుంచొని. "ఇక్కడ దిగాలా, మనం?" అడిగాడు యాదగిరి అమాయకంగా. "హూఁ హూ, ఇది తాడేపల్లిగూడెం, ఇంకొక్క అరగంట అన్నాడు రామారావు. కొందరు పాసింజర్లు కాఫీలకి పోయివచ్చారు. తాడేపల్లిగూడెం పెద్ద బిజినెస్ సెంటరని వెనక వినడమేకాని యాదగిరి చూడలేదు.

వెలుతురు వచ్చేసింది. అటూ ఇటూ పచ్చని పంటచేలు. బస్ ముందుకు పోతోంది. చెఱుకు తోటలు కనిపిస్తున్నాయి మిస మిస లాడుతూ. యాదగిరి దిక్కులు చూస్తున్నాడు మాట్లాడకుండా. రామారావు మనసు మధురస్మృతులతో ఉల్లాసపడింది, తాను చిన్నప్పుడు మసలిన ఆ తణుకు రోడ్లని చూస్తుంటే. బస్ ఆగగానే "లేవండి, యాదగిరిగారూ, ఇంక దిగుదాం." అన్నాడు రామారావు తానులేస్తూ. బయటనుంచి "దిగండి రా, రాముడూ!" అనేకేక వినిపించింది.

బస్ స్టాండ్‌కి రామారావు అన్నగారు ప్రసాద్ వచ్చాడు, తమ్ముణ్ణి, పిల్లల్ని ఇంటికి తీసుకువెళ్ళడంకోసం. గూడుకట్టిన తన రెండెడ్లబండిని రోడ్డుమీద పక్కగా ఆపి, ప్రసాద్ పెద్దపాలేరుని తీసుకొని స్టాండ్‌లోనుంచొని ఉన్నాడు, బస్ వచ్చేటప్పటికే: బస్ దిగగానే, రామారావు యాదగిరిని, కమలమ్మని ప్రసాద్‌కి పరిచయం చేశాడు. "రండి, రండి. ప్రతీ ఉత్తరంలోనూ మావాడు రాస్తూనే ఉంటాడు మిమ్మల్ని గురించి. మా చెల్లెలు పెళ్ళికి మీరంతా వచ్చినందుకు చాలా సంతోషం. అటురండి, మన బండిమీద పోదామింటికి" అన్నాడు. ప్రసాద్. రామారావు పిల్లలకి ఇదంతా కొత్తగాఉంది.

తొట్టెలోంచి చిన్న ముక్కాలిపీట తీసుకువచ్చి పాలేరు బండి దగ్గర పెశాడు కమలమ్మతో సహా అంతా తేలికగా బండి ఎక్కారు. తొట్టెలో కూచుని ప్రసాద్ 'హరి' అనగానే బండి పరుగు మొదలు పెట్టింది. గిత్తలమెళ్ళో మువ్వలు గల్లుగల్లు మంటున్నాయి. వాటి ముక్కుతాళ్ళు పట్టుకొని పాలేరు ముందు నడుస్తున్నాడు, గబగబా పరుగెడుతున్నట్టు. పిల్లలకి ఒక్కసారి తొట్టెలో కూచుందామనిపించింది కాని పెత్తండ్రి దగ్గరగా కూచోడమంటే భయమేసింది. యాదగిరికీ కమలమ్మకీ మరోప్రపంచంలో పడ్డట్టు ఉంది. బస్ స్టాండ్‌నుంచి బయలుదేరి రైలు కట్టలుదాటి పైడిపర్రు వంతెన దగ్గరకి వచ్చాక, మెలికిరోడ్డు మీదికి ఎడమ పక్కకి తిరగడంకోసం, బండిజోరు తగ్గింది. పైడిపర్రు దాటగానే కాలవగట్టురోడ్డు. చక్కగా సిమెంటురోడ్డును మించిపోయి ఉంది. యాదగిరి ఆశ్చర్యపోయాడు మండపాక పంచాయతీ వేయించిన రోడ్డుచూసి. మునిసిపాలిటీలుకూడా అంతబాగా పనిచేస్తే ఎంత బాగుండునో అనిపించిందతనికి.

చూస్తుండగానే బండి మండపాక గ్రామంలో ప్రవేశించింది పది నిముషాలలో. ఆ బండి మువ్వలు అందరికీగుర్తే. రోడ్డు మొగలో నుంచొని పన్నుకర్రమీద మొగం ఆన్చుకొని కబుర్లు చెప్పుకునే ఊరి పెద్దలతో సహా అందరూ తప్పుకుంటారు ఆ రవళికి. దారిలో కొందరు "దణ్ణం బాబూ!" అనడం, "బాగున్నారా?" అని ప్రసాద్ పలకరించడంకూడా యాదగిరి గమనించాడు.

బండి ఆగేటప్పటికి "రండిరా, రాముడూ, పిల్లలేరీ— ఆ వచ్చారా!" అంటోంది అప్పుడే వాళ్ళ అమ్మ గుమ్మందగ్గర నుంచొని. ఇంతలో బండిలోంచి యాదగిరీ, కమలమ్మా, దిగారు. వాళ్ళని చూసి ఆవిడ "రండి నాయనా, రండి." అని స్వాగతం చెప్పింది. ఏనాడో చనిపోయిన తన తల్లి జ్ఞాపకంవచ్చి యాదగిరి మనస్సు అదోలా అయింది ఒక్కక్షణం. మళ్ళీ తాను తమాయించుకున్నాడు. తన ఇంటిని ఏడాదినాడు మరిచి పోయినట్లు అనిపించింది కమలమ్మకి ఆ పెళ్ళివారి ఇల్లుచూస్తుంటే.

ఇంక రామారావు చెల్లెలు పెళ్ళి రెండురోజులుంది. పనులన్నీ జోరుగా సాగుతున్నాయి. ప్రసాద్ అంగబలం చూస్తే యాదగిరికి ఆశ్చర్య మేసింది! బోడి డబ్బు. డబ్బుకాదు ఈ బలానికి కారణమనిపించింది యాదగిరికి. వెనకటి రోజులలో ఎమ్. ఎ. పాస్ అయ్యాడు ప్రసాద్. అయినా ఉద్యోగ ప్రయత్నం చేయకుండా, తండ్రి తర్వాత తానుకూడా ఉమ్మడి ఆస్తినీ, స్వంత వ్యవసాయాన్నీ చూసుకోవడం మొదలు పెట్టాడు. తమ్ముళ్ళు అన్నగారు గీసిన గీత దాటరు. కలిసి ఉంటేనే కలదుసుఖం అనే సిద్ధాంతం. వాళ్ళది. ఆ ఐకమత్యం చూస్తే లోకం తన కళ్ళలో నిప్పులు పోసుకోవడం అందరికీ తెలుసు. తను ఉద్యోగంలో చేరక పోవడం వల్ల ఆ ఉద్యోగం మరొకరికి వచ్చిందని ప్రసాద్ నమ్మకం. తాను చదువుకున్న వాడవడం వల్ల వ్యవసాయంలో సులువులూ బరువులూ కొత్త కొత్త పంటలూ పద్ధతులూ తెలుసుకుంటున్నాడు. తను గ్రామంలో రైతులందరికీ అన్ని విషయాలూ తెలియజెప్తూ ఉంటాడు. సంప్రదాయ పద్ధతులవసరాన్ని బట్టి మార్చడానికి ఆ గ్రామం వెనుదీయడం మానేసి చాలకాలమైంది. తన భూమిలో కొంత ప్రయోగాలకీ, వ్యవసాయశాఖ సహాయంతో తాను అధిక రాలుబడి వంగడాలు పండించడానికీ, కేటాయించాడు ప్రసాద్. కొన్ని తెగుళ్ళ చేలకి తగలకుండా మొదటినుంచీ ఏమరపాటు లేకుండా జాగ్రత్తపడి, మిగిలిన వాళ్ళకి మెలకువగా ఉండడం నేర్పేడు ప్రసాద్, ఇవన్నీ ఒకఎత్తు, ప్రసాద్ గ్రామస్థులకి చేసే ఉచిత హోమియో వైద్యమొక ఎత్తును, తల నొప్పి దగ్గరనుంచి చేలో పురుగు ముట్టుకోవడం దాకా ప్రసాద్ చెయ్యి దాటి పోలేవు. ఆయన హస్తవాసి మంచిదంటా రంతా.

యాదగిరి ఇవన్నీ ఊళ్ళో విన్నాడు. అంచేతే రామారావుకి కూడా అన్నగారి పోలికలు వచ్చాయి. రామారావు మాత్రం తనకెంత సాయం చేయడంలేదు ? తనకి ఉద్యోగం కూడా మళ్ళీ దొరికితే ఎంత బావుండును ? తన స్థితి చూసుకుంటే యాదగిరి మనస్సుకు బాధకలిగింది ఒక్కసారి. ఆ రాత్రి భోజనం దగ్గర ప్రసాద్ ఎన్నాళ్ళశలవు పెట్టారని అడిగాడు యాదగిరిని. ప్రస్తుతం ఏమీ ఉద్యోగం లేదన్నాడు యాదగిరి. ''పోనీ, మావూరు వచ్చేయండి. ఏ ఎరువుల ఏజన్సీయో తీసుకోవచ్చు. మాతో పాటు హాయిగా ఉండవచ్చు.'' అన్నాడు ప్రసాద్. యాదగిరికి సంతోషమైంది ప్రసాద్ ఔదార్యానికి. హైదరాబాద్‌లో తన వాటా కూడా అద్దెకిచ్చి వేయవచ్చు.యాదగిరి మనస్సు కదోరకం తృప్తి కలిగింది. యాదగిరి కష్ట సుఖాలన్నీ రామారావు అన్నగారికి—

చెప్పాడు వివరంగా. ''ఆలోచించండి యాదగిరి గారూ నేనన్న మాట.'' అన్నాడు ప్రసాద్ మరోసారి.

ప్రసాద్ బంధువులంతా వచ్చారు. మద్రాసులో ప్రొఫెసర్‌గా స్థిరపడ్డ తమ్ముడూ, కలకత్తాలో చదువు కుంటున్న తమ్ముడూ అంతావచ్చారు. పెళ్లివారు నిజామాబాద్ నుంచి వచ్చారు. పెళ్లి కొడుకు వెటర్నరీ కోర్సు చదువుతున్నాడు. పెళ్లివారు వచ్చాక యాదగిరి వాళ్లు దూరపు బంధువులని మాటల్లో తెలిసింది. రామారావుతో ఇంతకు ముందున్న స్నేహం కొంత బంధుత్వంగా కూడా మారినందుకు యాదగిరి సంతోషించాడు.

వివాహం వైభవంగా జరిగింది. కమలమ్మకి ముందు చిన్నతన మేసింది. తను పెళ్ళి కూతురి కోసం రవికెల గుడ్డ మాత్రమే తెచ్చినందుకు. తర్వాత ఎవ్వరూ తీసుకురాని కొత్త రకం తెచ్చినందుకు గర్వపడింది. ఆ గ్రామానికి తలలో నాలుక లాంటి వాడు ప్రసాద్ అవడం వల్ల, వద్దన్నా వధూవరులకు కానుకలూ కట్నాలూకోకొల్లలుగా రావడం చూశాడు యాదగిరి.

మర్నాటి ఉదయం ఎల్లారమ్మ పూజకి వెళ్లారంతా. మొట్ట మొదట వియ్యాలవారు సావకాశంగా చేయించ వచ్చుకదా అన్నారు. కాని అక్కడి పద్ధతి ప్రకారం సాధ్యమైనంత తొందరలో ఆ దేవీ పూజ నూతన వధూవరులు జరిపించ వలసిందే. అనుభవంలో అక్కడ అందరికీ ఆ దేవత ప్రత్యక్ష దైవం. యాదగిరి కమలమ్మ కూడా వెళ్ళారు పూజకి.

ఊరు చివర ఉంది ఆ చిన్న దేవాలయం. లోపల ప్రశాంతంగా ఉంది. కంచి కామకోటి పీఠాధిపతులు స్వయంగా అర్చించిన ఆ సాత్విక దేవతామూర్తి ఎంత ప్రసన్నంగా ఉందో అనుకున్నాడు యాదగిరి. వధూవరుల పేరున పూజారి యధావిధిగా అర్చన చేశాడు. అందరినీ బయటకి వెళ్లమని ఆచారం ప్రకారం మహా నైవేద్యం పెట్టాడు యెల్లారి తల్లికి. అందరికీ పూలు యిచ్చి మంత్ర పుష్పం చదివి ఆ పూలన్నీ పళ్ళెంలోకి తీసుకున్నాడర్చకుడు. అందరూ చేతులు జోడించి నుంచున్నారు. ఎల్లారి తల్లి శిరస్సున ఉన్న గంధం గిన్నెలాంటి వెండి పద్మం మీద ఆ మంత్ర పుష్పం పూలు అన్నీ పూజారి ఉంచాడు. దేవికి దూరంగా నుంచొని వింజామర నెమ్మదిగా లాంఛనంగా వీస్తూ, అర్చకుడు రోజూ చదివే ఎల్లారమ్మ దండకాన్ని చదివాడు శ్రావ్యంగా. "తల్లీ ప్రసాదింపు, దేవీ ప్రసాదింపు! ప్రసాదింపవే" అనీ అనగానే ఎల్లారి తల్లి శిరస్సున ఉంచిన ఆ పూలు కొన్ని జలజల కిందికి జారాయి. "ఆహా! ఆహా! తల్లి ప్రసాదిస్తోంది. చూడండి చూడండి!" అంటున్నారు చూస్తున్న వాళ్లంతా. యాదగిరి ఎప్పుడూ ఇట్లా ప్రత్యక్షంగా నిదర్శన మిచ్చే ఏ దేవతనూ చూడలేదింత వరకు. తెల్లబోయి చూస్తున్నాడు ఆవింత. ఆనందం ఆపుకోలేకపోయాడు ప్రసాద్. "ఎల్లారి తల్లికి మా బంగారు తల్లి మీద పూరాగా ఉంది అనుగ్రహం!" అన్నాడు, చెల్లెలి కేసి చూసి నవ్వుతూ కొత్త కొత్తగా చూస్తున్నాడు బావ గారిదంతా.

బయటికి వచ్చి కూచుని ప్రసాదం తీసుకుంటూ, యాదగిరి "కిరీటం మీద కుప్పగా పెట్టిన పూలు క్రిందికి జారకేం చేస్తాయి?" అన్నాడు రామారావుతో. ప్రసాద్ వెంటనే, "తప్పు. అట్లా అనకండి ఇంకెప్పుడూ. మీలాంటివాళ్లు మా ఎల్లారి తల్లిని రక రకాలుగా పరీక్షించారు వెనక, ఆమె గారు కూడా వాళ్లని చాలా పరీక్షలు చేసి మరీ విడిచి పెట్టింది. ఆ తల్లికి మన మీద అనుగ్రహం పూర్తిగా ఉంటేనే పుష్పాలు జారతాయి కాని లేకపోతే ఇంకో బుట్టెడు పూలు పెట్టినా ఒక్క పువ్వు కూడా ఆమె శిరస్సు మించి కదలదు యాదగిరిగారూ! ఇది ప్రత్యక్ష నిదర్శనం. మీరు పరీక్షించుకోవచ్చు." అన్నాడు గంభీరంగా. యాదగిరి మనస్సులో సంశయం మెదులుతూనే ఉంది.

ఆ రాత్రి గ్రామస్థులందరికీ విందు జరిగింది. ఎవరికే విధంగా వడ్డించాలో ఎవరినేవిధంగా మర్యాద చేయాలో ప్రసాద్ స్వయంగా చూసుకున్నాడు. ఆ పద్ధతులన్నీ యాదగిరికి బాగా నచ్చాయి. ఆమర్నాడు యాదగిరి తన పేరుతో కూడా ఎల్లారమ్మ పూజ చేయించాడు. రామారావు కూడా వెళ్లాడు పూజకి. పూజ పూర్తి అయ్యాక, దండకం చదివేటప్పుడు ఎల్లారి తల్లి కిందటి రోజున లాగే మళ్లీ ప్రసాదించింది. కిరీటం నుంచి పూలు జల జలా జారాయి. రామారావు చాలాసంతోషించాడు. ఎల్లారమ్మకి ఆ దంపతుల మీద దయ ఉన్నందుకు.

ఆ నాటి సాయంత్రమే యాదగిరి, భార్యా తిరిగి హైద్రాబాద్ బయలుదేరారు. రామారావు "రెండు రోజులాగండి' కలిసి పోదాం" అన్నాడు, కాని యాదగిరికి ఆగ బుద్ధిలేదు, "మనుగుడుపులు అవి చూసుకొని మీరు నిదానంగా రండి. మేం వెళ్ళి వస్తాం" అన్నాడు యాదగిరి. ఆ నాటి సాయంత్రం బస్‌కు బయలుదేరారు ఇద్దరూ.

యాదగిరి, కమలమ్మ ఇంటికి పొద్దునే ఆరున్నరకల్లా జేరుకున్నారు. దర్వాజా తీసి లోపల అడుగు పెట్టగానే యాదగిరి కాలికి కవరొకటి తగిలింది. వాళ్ళు ఊళ్ళో లేనప్పుడు పోస్ట్‌మాన్ లోపల పడవేసి వెళ్ళిన ఉత్తరమది. ఎలక్ట్రిసిటీబోర్డ్‌లో యాదగిరికి మళ్ళీ ఉద్యోగం వచ్చింది ఇన్నాళ్లకి. కమలమ్మ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. "మండపాక ఎల్లారమ్మ పూజ చూశావా, ఎట్లాంటి ఫలితం చూపెట్టిందో!" అంది కమలమ్మ యాదగిరితో. "ఔనౌను. ఈ వేళే జాయిన్ అయి ప్రసాద్‌గారికి వ్రాస్తా నీ శుభవార్త. సంతోషిస్తారంతా." అన్నాడు యాదగిరి, ఆర్డరు చేతో పట్టుకొని. ఎల్లారి తల్లి కిరీటం మించి పువ్వులు జల జలా తన ఎట్టెదుట జారుతున్నట్టే అనిపించింది యాదగిరికి మరోసారి!

"వందేమాతరం"

(కావ్యంనుండి)

("హైదరాబాదు" ఖండములోని తు బాజుఖాన్ ఘట్టమునుండి)

ముదిగొండ వీరభద్రమూర్తి

క॥ ఖానులలో తుఱ్ఱేబాజ్
ఖానను మౌల్వీలలో నొకం డల్లావు
ద్దీనున్ బేర్కొనదగువా
రీ నగరీశౌర్యమూర్తి కిరు బాహువులై.

క॥ ఆ సమయము స్వాతంత్ర్యమ
హా సంయచ్చంద్రహాస సమయము 'నా
నాసాహెబు' 'బహదూర్షా'
లా సమరము నందుకో బిలచి రిచటి ప్రజల్

శా॥ ఢిల్లీ నుండి నవాబు కందినవి నాడే నాల్ జతల్
గాజు సీ
యల్లా మెచ్చిన యుద్ధరంగమున నో రబ్బీ
యరబ్బీల్ దుముల్
చల్లన్ బోరి ఫరంగి నేయుము కలేజా లేదో
కాన్కన్ కరాం
చల్లీలమ్మగ దాల్పు మంచు బహదూర్షా పంచె
నా జాబులో.

ఉ॥ గోడల పైని లిక్కు లివిగో యన నొప్పిన
యక్కరమ్ము లె
గ్గాడుచు పారతంత్ర్య మున కాంగ్లనికార
నిరోధి దేశి కుం
డేడో తదన్వయమ్మున ని కేడు న కేడు
తరాలు నారకుల్
వాడు బజారు లూడ్చు సచివాగ్రణి యైన
నటంచు ఘోషిలెన్

గీ॥ హూణులను పంపివేయుట కొప్పదో న
వాబు తత్పరి నుంతును వాని బాబు
మరియొకం డని యా వ్రాత మరియు భేరి
వేసె పురమందు పాదుషా శాసనముగ.

గీ॥ కదలబాఱె మౌల్వీకి నా ఖానునకును
మనసు, వలచేతి గిలక కిఱ్ఱనుచు మ్రోయ
వీధి వీధి మేల్కొల్పిరి వేకువన్ ప
కీళ్లు దేశభక్తిని గేయ కీర్తనమున

గీ॥ కనులు విచ్చి ఖాన్ మౌల్వీలు కలియజూచి
రొక్కడు వచ్చి 'తాంత్యా' లిఖితోత్తరమున
తిరుగబడెడి సైనికులకు నురి తగిల్చె
నాంగ్లదణి వికారాబాద నని వచించె.

ఉ॥ చించెను ఖాను ఖడ్గమున చేరువ వ్రేలు
పటమ్ము నొండు, గ
రించె నిజాము కా దతని సేసయు కాదుకదా!
సమస్త కా
ష్ఠాంచలవల్లి తాంగ్లబల మడ్డిననున్ పవలింట
నేడు కా
వించెద భస్మసాత్కృతము నీ రెసిడెన్సిని
తన్ని వాసినిన్

క॥ ఏమన్నా యని, మౌల్వీ
యే మన్నావో యనినావు హితులను భటులన్
సోమింపింపుము శస్త్ర
స్తోమములతో కవచ మూనితో డైతి ననెన్

గీ॥ పట్టుదల గండుచీమల పగిది గలరు
రోహిలా లైదు వందలు రోహితాక్షు
లరుగుదెంచి రప్పటికపు డాయుధికులు
కాకిచే కబురంపెనో ఖాను లేదొ

గీ॥ తనదు మౌల్వీ హయము చిఱుతపులి వన్నె
ఖాను తేజి వాసవ నీలకళ విరాజి
పావురముల రంగులు వోలె వఱలు తక్క
వారి వావురముల రంగు లారజములు.

మ॥ ధృత శీర్షణ్యతనుత్ర మై కటిత టీ దీవ్యద్వి
నిస్త్రింశ మై
జతగుం డ్లేయు తుపాకు లొప్ప పరితో జందెంచె
నా విక్రమి
ద్వితయం బశ్వల జోతు లారతులుగా వేలాది
నారీ నరుల్.
నుతియింపన్ రెసిడెన్సి ఢాంకృతుల నాందోళింప
గుల్బాగునన్.

సాహస హాసం

సోమసుందర్

పగటి సూర్యుని ప్రతిభలన్నీ విగతమై విరమించినప్పుడు
స్ఫీత శీతలమైన సాయం సంధ్య భూముల మరసినప్పుడు
నగము చివరల చెట్ల చిగురుల కడిమ రోచులు మెరిసినప్పుడు
చరమ కిరణానీకమున మృదు స్పర్శ దిన కరుడద్దినప్పుడు

పగటి తెల్లని వెలుతురున కనిపించి దుర్భరభవము ప్రిదివెను
విగత సుఖ సంసార సాగర శోక బంధుర జీవనాదము
సంజ నేలను సమీపించ ఉలూక ఘోరదరవాలు వినుచును
రాత్రి నిర్భయ నిద్రగా భ్రమపడకు పడకల వెదుక చూడకు

రాత్రి ఆగమనాభిరతితో తోషహ్వాది నర్తించరాదిక
దేశమా అవిరామ సాహసహాసమా నిదురించరాదిక
దూర తీర దిగంతముల శిశు హృదయములు రోదించుచున్నవి
సమరభార మహా దరిద్రా స్ఫోటనము-ప్రాగ్రక్త వక్త్రిము

గతము నిద్రా ముద్రితము. ఒక పీడకల, ఉష్ణము నెరుంగదు
గతము ఛిద్రిత హీన చరితము అంధ హృదయాస్ఫాలజాలము

తూర్పు సాగర మడలెనో పశ్చిమ తమస్సుల శిబిరమో, దు
ర్వార హైన్య పరాక్రమము మన చెలిమి కలుముల మ్రింగెనో?

సిగ్గు నెరుగని జాతి హీనము ఆత్మగౌరవ మరయదెప్పుడు
ఊపిరే బ్రతుకన్న భ్రమతో మూక సంఘముగా ప్రవర్తిలు
రోగమో దుఃఖమో చంపని జాతి సర్వసు-నిద్రికెరయై
జీవ చైతన్యోత్సవము కోల్పోవునని తర పురుషకారము.

కారు చీకటి నిశల మెరిసే తారకాని వహమ్ము తీర్చదు
గుండెలో ఒణికించు పిరికితనాల చవి. జవతల నిడుల్చదు
ఆత్మ గౌరవ రహితమగు నరజాతి మిత్రుడు మృత్యు దేవత!
సాహసుని హృదయానగల దరహాస చంద్రిక శాంతి వీగదు.

దేశమా అవిరామ సాహస హాసమా నిదురించరాదిక
నాశనోత్సుకమైన అవమానతల తలల సహించరాదిక....
ప్రౌఢ యౌవన చైత్ర పరిమళ దీధితుల నెలకొల్పు తరుణము
సుప్తమై శీర్ణమై గడచిన కలుగునే మంగళా చరణము?

సుమరథ్య

సోమసుందర్

ఈ అనంతధ్వాంత
మే దీపముల మలగు?
ఈ అమానుష క్రౌర్య
మే కర్మలను తొలగు?

'జాజి పూజాతరలు
లోక దుర్గంధాల
చీల్చునే-కొనసరించు
తాప వీచిక బుసలు?

'పాలు వొలికిన పిదప
ఏల దుఃఖించెదవు?
కాలమే గత జలము
ఏలరా సేతువిక?'

-నైరాశ్య వాణిలో
సంశయాత్మల రుతము
వ్యసన సంకటమై
భావ సంకుల రవము

గతకాల మిసుమంత
గడచి పోయినయంత
భావి స్వర్ణారుణో
జ్జ్వల ధౌత కలశమ్ము ...

గతము మన భావనా
భవన పీఠము. బలము
ఆ గతము-శక్తిమయ
మానవోత్సవ కృతము

ఈ యథార్థము తల్లి-
విశ్వాసమే తండ్రి
వర్తమానము పడతి-
పురుషకారము విభుడు.

యజ్ఞవాటిక భూమి
ఋత్విజుడు మానవుడు
సామాజికులు సోమ
పీథులు శుభంకరులు!

యత్న సాఫల్యము-
భావి జీవన సుఖము
భవ మరణముల మధ్య
విరియవలె సుమరథ్య!

గ్రంథసమీక్ష

రా

[కావ్యసంకలనం: కవి: శ్రీ భైరవయ్య: ప్రతులకు: స్పందన డిస్ట్రిబ్యూటర్స్–1–8–17/2 చిక్కడపల్లి, హైదరాబాదు–20: 84 పేజీలు : వెల రూ. 2–50]

దిగంబర కవిగా ప్రఖ్యాతిపొంది విప్లవ రచయితగా పరివర్తన చెందిన శ్రీ 'భైరవయ్య' గారి వచన కవితా గీతికల సంపుటి యిది–తమ కవితా ఖండికలను వచన కవిత అననివ్వమనీ 'దిక్'లనే పిలవవలెననీ తమ పూర్వకవితాసంకలనాలలో పేర్కొన్నారు. ఏ పేరుతో పిలిచినా వీరు వ్రాస్తున్నది వచన కవితయే. ఇటీవల దేశంలో చెలరేగుతున్న అరాచక శక్తులను సమర్థిస్తూ, పోలీసులచేతిలో మరణించినవారిపట్ల తమ సానుభూతిని ప్రకటిస్తూ, చెదురు మదురుగా జరుగుతున్న హత్యలను ప్రజాపోరాటాలుగా అభివర్ణిస్తూ, యువతరాన్ని "దీర్ఘకాలిక పోరాటానికి" సంసిద్ధులు కమ్మని ఆహ్వానిస్తూ, 'రా' రమ్మని పిలుస్తున్నారు. ప్రగతివాద శక్తుల ప్రజాకవితలో 'పదండి ముందుకు' అని పురికొల్పటం యీనాటిది కాదు. 'రా' అనే పిలుపు సరికొత్తగా విప్పించినా యీ పద్ధతి పాతదే ముక్కుపచ్చలారని యువకులు, చదువుల్ని వదిలేసి పట్టలేని ఆవేశంతో అడవులకురికి, నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దవలసిన తరుణంలో ఆయుధాలను చేతపట్టి, 'తన కోపమె తన శత్రువు' అన్నట్లుగా ప్రాణాలను బలియిచ్చి, వారిపై ఆశలు పెట్టుకున్న ఆప్తులనేకాక, దేశ ప్రజలందరినీ విషాదంలో ముంచెత్తుతున్నారు. "అలజడి మా జీవితం; ఆందోళన మా ఊపిరి; తిరుగుబాటు మా వేదాంతం" అనే పద్ధతిలో కవులు రచనచేస్తూ, అరాచకాన్ని మాత్రమే సృష్టించి "ఏ దేశంలో ఏ విప్లవం వచ్చినా సాహిత్యం ద్వారానే వచ్చింది"–అని తాము వ్రాస్తున్న కవితలతోనే విప్లవం వస్తుందని ఆశిస్తున్నారు వీరు. "స్తబ్దంగావున్న తెలుగు సాహితీరంగంలో చైతన్యం కలిగించి సాహిత్యం ప్రజల సమస్యల్ని పట్టించుకునేట్టు చేసి, మత్తుగా పడివున్న యువతరాన్ని మేల్కొలిపి అక్రమాల్నీ దౌర్జన్యాన్నీ ఎదుర్కొనేట్టుచేసింది" దిగంబర కవిత్వమంటున్నారు శ్రీ భైరవయ్య.

దౌర్జన్యాన్నీ అక్రమాన్నీ ఎదుర్కోవటానికి అహింసా పద్ధతి పనికిరాదని వీరు తలంచి "అహింసని బోధించమంటావా బాపూ"అని పూజ్య బాపూజీని ప్రశ్నించి నీ అనుయాయులు గోముఖ వ్యాఘ్రాలనీ, వారి చేతుల్లో అమాయక ప్రజలు బలియౌతున్నారని ఆక్రోశించి వారికి అహింసను బోధించటం పాతకమని వీరు పేర్కొన్నారు. తాము మార్క్సిస్టు సిద్ధాంతాలు నమ్ముతున్నట్లుగా ప్రకటించుకొని దానిలోగూడ తీవ్రవాద సిద్ధాంతాలను మాత్రమే నమ్ముతూ...

"మానవతకి తప్ప మరే మతానికీ తావులేని
మహోన్నతలోకాన్ని సృష్టించుకోటానికి
బలంగా అడుగు ముందుకు వేద్దాం పద–రా"

అని చెప్తున్నారు.

ఇటువంటి తీవ్రవాద సిద్ధాంతాల బలమెంతో విజ్ఞులైన పాఠకు లెరుగకపోరు. హత్యలూ, దోపిడీలతో సాగుతున్న యీ పోరాటం కొంతవరకు ఆంధ్రప్రదేశంలో సమసిపోయినట్లుగా కానవస్తున్నది. ఏమైనప్పటికీ దిగంబర కవులుగానైనా, విప్లవ కవులుగానైనా వీరు ప్రతిపాదించిన నూతన సామాజికవ్యవస్థ స్వరూపమేమిటో పాఠకులకు సుస్పష్టం కావటంలేదు. ఆ వ్యవస్థ స్వరూపమేమిటో తెలియకుండా విధ్వంసననూ, అన్ని విధాల దౌర్జన్యకాండను ఆమోదించటమూ, పులిమీద పుట్ర అన్నట్లు వీరి పేరుతో దుష్టశక్తులు విజృంభించటాన్ని చూస్తూ ఉండటమూ మేఘాన్ను చూచి చెరువుగట్టు తెగగొట్టుకోవటమే అవుతుంది నిస్పృహతో వేసారిపోయిన యువతరం ఆత్మహత్యా సదృశమైన ప్రయత్నాలను కోరి వరించటమే కాగలదు, వీరి కవిత్వాన్ని నిజమైన కవిత్వంగా ఎంచటమంటే.

శ్రీ భైరవయ్య తనకు "ప్రపంచంలోకి ప్రస్థానం ఇష్టం. గుండెలో అగ్ని పర్వతాలు బద్దలైనా నవ్వడం మరీ ఇష్ట"మని చెప్పుకున్నారు. అయోమయంలో లయమవుతున్న యీ ప్రపంచం మారాలంటే ప్రతి మనిషీ ఒక అగ్నికణం కావాని వీరి హెచ్చరిక. 'ఎముకల కేకలు' అనే గీతంలో మనిషీ–మానవతా నిగమాగమ ఋషీ–మేలుకోమని చెప్పి: కనీసపు కోర్కెలకై ఆందోళన చెయ్యటమూ, కరువుభత్యం పెరగాలని కోరటమూ వృథాప్రయాస అని మందలిస్తూ కరువుబిచ్చము వేసినంత మాత్రాన ఆకలి తీరదనీ, అది "కొండచిలువ నోట్లోకి ఈగపిల్ల దూకటమే" నంటారు. 'షష్టిపూర్తి' అనే గీతంలో సంఘంలో ఎందరో దగాకోరులకు ఉత్సవాలు జరగటాన్ని అపహేళన చేశారు. ఇందులో దూషణ ఉన్నంతగా కవిత్వంలేదు 'నరమాంసం రుచిమరిగి' అనే గీతంలోను 'పుర్రేయ్ వెధవయ్యా' అనే గీతంలోనూ, యింకా మరి కొన్నింటిలోను చదువరులనుతిట్టి, బూతుమాటలని రోషం తెప్పించి వారి వారి దుస్థితిని తెలియజెప్పి, తిరుగుబాటు చెయ్యవలసిందిగా పురికొల్పారు

ఈ కావ్య సంకలనం చదివిన తరువాత యీ కవి ప్రతిభావంతుడని తోస్తుంది. చెప్పదలచుకొన్నదానిని నంగి మాటలు లేకుండా చక్కగా చెప్పగలిగిన శక్తి ఉన్నట్లనిపిస్తుంది. తన కవితలో సంప్రదాయపు ప్రతీకలు కనబడటమనేది సాంప్రదాయపు వాతావరణ ప్రభావమని చెప్పి, సంప్రదాయాన్ని విడనాడటం తన కోర్కెగా వెల్లడించారు. కొత్తగా చెప్పటం మంచిదే కావచ్చు గాని వెన్నెలను "కొడిగట్టిన చుట్టనుసిలా ముసుగేసుకున్న విధవలా అలముకుంది వెన్నెల" అని జుగుప్సాకరంగా చెప్పనక్కరలేదు. తాను దర్శించిన సత్యాన్ని అందించటానికి చదువరులను బూతులు తిట్టి చెప్పనక్కరలేదు. దిగంబర కవులు విప్లవ కవులుగా మారిన తరువాత అశ్లీల పదములను ప్రయోగించటం కొంతవరకు తగ్గినట్లు కన్పిస్తున్నది.

ఈ కావ్యాన్ని మనిషిలో ఇంకా చావకుండా మిలిగివున్న నిజాయితీకి తిరుగుబాటు తత్వానికీ— అంకితమిస్తున్నారు శ్రీ భైరవయ్య. శ్రీ శీలా వీర్రాజు వేసిన ముఖచిత్రం చక్కగా భావగర్భితంగా ఉన్నది.

'జుగుప్స' అనేది స్థాయీ భావములలో ఒకటి అని చెప్పి, బీభత్స రసాన్నే కావ్యమంతటా నింపివేసి, దేశంలో విప్లవం రావటానికిది మంచి మార్గమని వీరు తలంచటం; హింసను మాత్రమే తరుణోపాయంగా బోధించటమూ వింతగా తోస్తున్నది.

—రామమోహన రాయ్

సాహితీ జగతి

కాటూరి హనుమంతరావు, వెల : రు. 5—00 లు. ప్రతులకు : కె. వి. శేషుబాయి, డి. యు. బి. (యఫ్.) యూనివర్సిటీకాంపస్, హైద్రాబాద్.

సాహిత్య విమర్శనాత్మకమైన పది చక్కని వ్యాసాల సంపుటి యీ రచన. సాహిత్య చర్చ, భాస నాటకచక్రము, తిరుపతి వేంకటకవుల మహాభారత నాటకాలు, దేవులపల్లి వేలూరి వార్ల కవితా వైశిష్ట్యము మొదలగు విషయములు ఇందు నిశిత విమర్శన దృష్టితో వివరింపబడినవి. రావుగారు సంస్కృతాంధ్రాంగ్ల గ్రంథాలు బహుళముగా తరచినవారు. సాహిత్యామృత పిపాసకు తోడుగా సత్యజిజ్ఞాస, సాహితీ దీప్తి సముద్ధరణ దీక్ష వారియందు నిండియుండుటచే ఈ రచనకు నవ్యత, స్వతంత్రత సిద్ధించినవి. సహృదయత, విమర్శన పటిమ, భావస్ఫోరకమైన భాషాప్రౌఢిమ వారి వ్యాసాలకు వన్నె చేకూర్చినవి. హనుమంతురావుగారు చేపట్టినది సైన్సు డిగ్రీయైనను వారి చూపు నెక్కువగా ఆకర్షించినవి కావ్యభావాలు. లోకోపకారమైన అక్షయసుధాభాండము సాహిత్యమే యని, దాని యుత్తమస్థానము జగతు గుర్తించి ఉదాత్తముగా ఆస్వాదించాలనీ వారి భావన. సాంఘిక రాజకీయ ప్రభావాల సుదీర్ఘ వర్ణనలతో సాగు నేటి సాహిత్య విమర్శలను, సమీక్షలను ఆక్షేపించుచు సాహిత్య ప్రయోజన సారమును రచయిత చక్కగా వడపోసినారు. "మానవునిలోని మానవత్వాన్ని పెంచే దోహదం, మానవ మనస్సులను ఏకం చేసే స్నేహద్రవ్యం సాహిత్యం. శాశ్వతమైనది, స్థిరమైనది, సార్వజనికమైనది సాహిత్యం. ఇది సర్వమతాలకూ సకల శాస్త్రాలకూ అతీతమైనది. ఇటువంటి మహాప్రయోజనంకల సాహిత్యాన్ని అల్పమైన తాత్కాలిక సంఘ ప్రయోజనానికి మాత్రమే ఉద్దేశించాలనడం దేవుడు ప్రత్యక్షమైతే మోక్షం కోరుకోనకుండా నూరు రూపాయల నోటు ఇమ్మని అడగడం వంటిది."

రావుగారి సాహిత్య చర్చ పెక్కు గంభీర విషయములతో నిండి గ్రంథమున దాదాపుగా అర్ధభాగ మాక్రమించుకొని యున్నది. "కవిత్వమంటే ఏమిటి" అను ప్రశ్నతో వ్యాసము సమారంభమైనది. రచయిత భారతీయ పాశ్చాత్య సాహిత్య శాస్త్రజ్ఞుల కవిత్వ నిర్వచనాలను వివరించి కవిత్వ మూలతత్త్వము వేని వలన వ్యక్తమగుటలేదని తేల్చినారు. ప్రాచీనాలంకారికుల సిద్ధాంతములను స్వతంత్ర దృష్టితో కూలంకషముగా చర్చించినారు. ఆనంద వర్ధనాదులు స్థిరపరచిన రసధ్వని సిద్ధాంతమును గూడ గంభీర విమర్శనకు గురిచేసి క్రొత్త సిద్ధాంతములుకొన్ని ప్రతిపాదించినారు. అవి యీ విధముగా నున్నవి "కావ్యస్యాత్మాధ్వనిః అన్న ధ్వని కారుని వాదం యుక్తమని తోచదు. అభిధాలక్షణావ్యంజనలు శబ్దార్థ బోధకములైన శక్తులు కవిత్వం ఈ మూడిటిలోనూ ఉంటుంది." "దుఃఖకర సాహిత్యం మనలో ఆనందాన్నికాక దుఃఖమునే జనింప జేస్తుందనడం సమీచీనం".— "రమణీయార్థమును ప్రతిపాదించు శబ్దము కావ్యముఅన్న పండితరాయల కావ్యలక్షణము అయుక్తంగా ఉన్నది." —సాహిత్యానికి భావమే ప్రధానం. భావం పాఠకుడి మనస్సుకు లగ్నం కాకుండా ప్రతిరోధం కల్గించేవి మాత్రమే కావ్యదోషాలు."— "సాహిత్యం ద్వారా సంఘాన్ని హఠాత్తుగా మార్చివేయాలను కొనడం ఊక అమ్మగా వచ్చే డబ్బుతో కూతుళ్ళకి పెళ్లి చెయ్యదలచడం వంటిది."

పాండితీభావనోజ్జృంభితమైన నిశితపరిశీలన దృష్టికల రావుగారి యీ విమర్శనాంశాలు పండితుల యాలోచనలను కదలించునట్టివి.

రావుగారు సాహిత్య పరమార్థమును గుర్తించిన సహృదయ శేఖరులు. హేతువాదములు నడిపిన భారతీయ సాహిత్య శాస్త్రజ్ఞులు, వాఙ్మయతత్త్వ కళాప్రయోజనములను సంపూర్ణముగా గ్రహించిన ప్రజ్ఞారసధునులు. ఆ ఘనులు మహోదాత్తములగు నాశయములతోపర బ్రహ్మ పదార్థ నిభమైన కవిత్వతత్త్వమును (కవి= ఆత్మ ఋస్సు; బ్రక = పరమాత్మ, వి = కన్ను.) విశ్లేషించుటలో కొన్నిదారులు చూపినారు. ఆధునిక విమర్శనల వలయములో భ్రమించుచు అధిగమించ గోరు రచయిత ఆ దారులను దూరుచు సుదీర్ఘముగా చర్చించినారు. "భాష—వ్యాకరణము" అను వ్యాసములో రచయిత ప్రకృష్టమగు భాషా పరిశోధన పాటవము ప్రదర్శించినారు. వారు "వ్యాకరణ నియతి లేని భాష పెరుగుదల కేన్సరు పెరుగుదల వంటి"దను దృఢాశయముతో భాషాపారిశుద్ధ్యమును సాధ్యమైనంత వరకు రచయితలు పరిరక్షించవలయునని సూచనచేసిరి, ఇది యెల్లరామోదింపదగినది. కాని పసందై ప్రౌఢమైన యీ రచనమున కాలానుగుణ పరీత విలక్షణ భాషయే వాడబడినది.

భాస మహాకవిని గూర్చియు, ఆధునిక కవి శేఖరులను గూర్చియు రచయిత యొనర్చిన సమీక్ష కడుంగడు హృదయంగమమై తన్నిశిత పరిశీలన పాండితీభావనలను వ్యక్తము చేయుచున్నది.

కవిత్వ మొక దివ్యకళ. అది ధర్మతేజస్సులందు ప్రభవించును. ధర్మక్షీరము నీరుగామారు నేటి కాలమున కవిత్వ మూలతత్త్వమును సంగ్రహించుట అసాధ్యము. పెక్కాకుల నడిమినుండు వృక్ష శిఖాగ్రవాసికి చెట్టువేరు దృగ్గోచర దూరమగుట సహజము. లోకసంస్కరణేచ్ఛకల ధర్మావతారుని కళావాక్కే కవిత్వము. నిండు హృదయము నుండి వెలువడు కళావాక్కు స్వపరధర్మ సంస్కారములకు దగినట్లుగా శక్తిని వెలయించుచు లోకమును సంస్కరించును. అనగా అందరును కవులు కాజాలరు.

సాహిత్యమునకు భావము ప్రధానమని యనుచో ప్రతి పౌడి పద బంధము సాహిత్యమేయగును. భావాలోతెంచి పరిగణించుచో నట్టిది కావ్యాకారంగమున ధ్వనియే యగును తోడిన కొలది ఊరు భావములు కలదే కవిత్వము అట్టిది వేయిమారులు చదివినను తనివి తీరదు.

మొత్తముమీద ఈ సాహితీ జగతి గంభీర భావామోదము వెదజల్లు ఉత్తమ విమర్శన గ్రంథము విజ్ఞాన తృష్ణ, సద్భావన కల హనుమంతురావుగారి కలము తెలుగు వెలుగు విలువలను పైకెత్తుటలో సదా సఫలము కాగలదు.

—శిలాక్షరి డా॥ తంగిరాల

వేకువ

సాహిత్య త్రైమాస పత్రిక. 1–8–17/2, చిక్కడపల్లి. హైదాబాద్–20. ప్రారంభ సంచిక (జనవరి–మార్చి 1971) డెమ్మీసైజు 112 పేజీలు. వెల : రూపాయి. సంపాదకుడు : కె. శివారెడ్డి ఎం. ఎ. (లిట్) గౌరవ నిర్వాహకుడు: గుత్తికొండ సుబ్బారావు.

స్థూలంగా పరిశీంచినప్పుడు ఇది సాహిత్యంలో ఆధునిక యుగమైతే, మరికొంత విశ్లేషించి చూస్తే ఇప్పటికే ఈ యుగాన్ని మూడు స్కంధా (వారము)లుగా విభజించ వచ్చును. రాయప్రోలు దేవులపల్లి – ఆ పద్ధతి వారిది సరస స్కంధం. శ్రీశ్రీతో ప్రారంభమై మొనమొన్నటిదాకా అరస స్కంధం. ఆతరువాత యిప్పుడంతా విరసస్కంధం. అంటే రాజకీయాల్లో మితవాద, మధ్యేవాద, అతివాదా లెలా స్పష్టరూపం ధరించాయో, సాహిత్యం కూడా తద్భిన్నంగా ఉండరాదనుకొన్న తీరున మూడుమార్గాలైంది.

ఈ 'వేకువ' సాహిత్య త్రైమాస పత్రిక మధ్యేవాద సాహిత్య స్కంధావారానికి చెందిందిగా తోస్తోంది. మితవాదాన్ని నిరసించడం, అతివాదాన్ని అవలభించక పోవడం ఈ మధ్యే వాద సాహిత్యానికి లక్షణం. అయితే, ఆధునిక వచన రచనోద్యమ ప్రభావితులైన యువతరం వారు పాతఛందాన్ని పరిహరించడంలో చూపుతున్న ఔత్సుక్యాన్ని నూత్నప్రక్రియను నిర్దుష్టం, పరిపుష్టం చేయడంలో చూపలేక పోతున్నారన్న ఆరోపణకు ఈ సంచికలో ప్రచురించిన కవితా ఖండములు అపవాదాంగా మాత్రం లేవు. ముఖ్యంగా ఈ నూత్న ప్రక్రియ ఈ ఆరోపణకు దూరం కాలేక పోవడానికి ప్రధానకారణం, కవితా వస్తువులోని నిరాకార లక్ష్యమే ననిపిస్తుంది. సాధారణ క్రమంలో నిరాకారోపాసనకు సాకారోపాసన ఒక మార్గమైనట్లుగా కవితా రంగంలో కూడా "అభ్యుదయం" అనే నిరాకార లక్ష్యాన్ని వస్తువుగా పెట్టుకొని మహోన్నత రచనలు చేసి పాఠకులకు అవగాహన పరచడానికి ఏదో ఒక వస్తులక్ష్యం ఉంచుకొని వ్రాయడం అవసరమనిపిస్తుంది. విప్లవంకానీ, కార్మిక శ్రేయస్సుగానీ, ప్రజాస్వామ్యం గానీ, సోషలిజంగానీ ఏ వస్తువైనా పరవాలేదు. వస్తునిర్దేశం లేకపోతే కవితారంగంలో అస్పష్టత ఎక్కువవుతుంది. ఏ రచనా ప్రక్రియకైనా స్పష్టత జీవలక్షణం కాబట్టి సరసమైనా, అరసమైనా, విరసమైనా స్పష్టతను సంతరించుకున్ననాడే నాలుగు కాలాలపాటు నిలుస్తుంది. కవి నిలుకడకు అతని రచనలోని స్పష్టతయే సక్రమమైన మానదండం.

అధునిక రచనల్లో ఒక విశిష్టత ఉంది, ద్విపదో త్రిపదో చతుష్పదియో . ఏదో ఒక చమక్కును తళుక్కును స్ఫురింపజేస్తున్నప్పటికీ కవితా ఖండిక మొత్తంమీద ఒక ఆకృతి కట్టదు. ఆ కట్టనితనంవల్ల పాఠకుని రచన ఆకట్టుకోలేక పోతుంది. సరసానికిది కాలంకాదనీ సరసానికి కాలదోషం పట్టిందనీ ఘంటాపథంగా చెప్పవచ్చు అభ్యుదయం కోరినా, విప్లవం కోరినా అర్థమయ్యేట్లు కోరాలి. సరసం ఆత్మాశ్రయమైంది కాబట్టి ఇతరులకు కొంత అవగాహన లేకపోయినా ఇబ్బందిలేదు. అభ్యుదయంగాని విప్లవంగాని పూర్తిగా సమాజపరమైంది కాబట్టి అర్థమయ్యేట్లు ఒక రూపు కట్టి నిర్దిష్టమైన వస్తువును చెప్పి కవిత అల్లడం చాలా అవసరం. రాజకీయ సిద్ధాంతాలూ, నూతనంగా చెప్పాలనే తపన, అభ్యుదయాన్ని ఆరాధిస్తున్నా ననిపించుకోవాలన్న కాంక్ష, లోకం పోకడతోపాటు నడిచే వైఖరి – ఇవన్నీ ఆ అవసరాన్ని క్రమ్ముకుంటున్నాయి.

ఈ నేపథ్యంలో వెలువడిన "వేకువ" సంచికలో 'ఏది ప్రజా కవిత ?' అను శ్రీ నూతలపాటి గంగాధరం వ్యాసం, 'వర్తమాన సాహిత్యంలో వక్రరేఖలు' అను శ్రీ సోమసుందర్ విమర్శ, 'రచన ఎవరికోసం' అను నిఖిలేశ్వర్ సిద్ధాంతవాదం, 'ఏది అభ్యుదయ కవిత' అను శ్రీ అద్దేపల్లి రామమోహనరావు మీమాంస, 'నేనూ నారచనా' అను శ్రీ కుందుర్తి సశేష వచన పద్యోద్యమ చరిత్ర. 'రా', 'త్రివేణి' అను గ్రంథాలపైని సమీక్షలూ – కొత్త సమాజాన్ని సృష్టించడానికి కవిత ఆదించాలన్న ధోరణివే. అయితే ఒక్క నిఖిలేశ్వర్ వ్యాసం తప్ప మిగిలినవన్నీ మధ్యేవాద స్కంధావారానికి చెందినవి. 'రా' పై సమీక్ష దిగంబర కవులను తూర్పారబట్టింది. మిగతా వ్యాసాల్లో అతివాద రచనా దోరణులు నిరసించబడ్డాయి. ఇక కవితల్లో శ్రీ మిరియాల రామకృష్ణ వంటి నియోక్లాసిసిస్టులు; భైరవయ్యా, నగ్నముని వంటి దిగంబరులూ; శ్రీ పరిగి రాధాకృష్ణవంటి కవితా వాదులూ; శ్రీ శివారెడ్డి, శ్రీ గుత్తికొండ సుబ్బారావువంటి మధ్యేవాదులూ, దాశరథి వంటి సిద్ధహస్తులూ, శ్రీ పి. లక్ష్మినారాయణ శ్రీ ఎన్.గోపి, శ్రీ సుగం బాబు, శ్రీ సూర్యప్రకాశ్ శ్రీ సురేష్, శ్రీ బి. శివవంటి నవ్యులూ ఈ "వేకువ"లో తమ కవితా కిరణాలు ప్రసారించారు. మామూలు పాఠకులు కోరుకునే పద్ధతికి ప్రాతినిధ్యంగా శ్రీ శీలావీర్రాజు "తూకం రాళ్ళు" కథ తూకంగా పడింది మొత్తంమీద సరస, అరస, విరస స్కంధావార రచనలనూ ముందుంచి 'ఎంచుకోండి,' అని పాఠకులమీద ఒక బాధ్యత పెట్టిన సంచిక ఈ 'వేకువ'.

చీకటిలోంచి అరుణోదయం, అందులోంచి సూర్యోదయాన్ని స్ఫురింపచేస్తూ మూడు రంగుల్లో ముద్రించిన ముఖపత్రం పేరును నిలబెట్టింది. తొలిసంపాదకీయంలో ఉన్న ఘాటుదనం ముందు సంచికల్లో పరివ్యాప్తమౌతుందేమో చూడాల్సి ఉంది.

-పి. యస్. ఆర్



జిల్లాల్లో

కరీంనగర్ సహకార నూలు మిల్లు

ఉప ముఖ్యమంత్రిచే ప్రారంభోత్సవం

ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు కరీంనగర్ జిల్లా పెద్దపల్లి తాలుకాలో రామగుండం దగ్గిరగల అంతర్‌గోన్‌లో జూలై7వ తేదీన సహకార నూలుమిల్లుకు ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంలో ఉపముఖ్యమంత్రి ప్రసంగిస్తూ సుమారు 30 సంవత్సరాల క్రితమే హైదరాబాదు ప్రభుత్వం గోదావరి లోయ పారిశ్రామిక, వ్యవసాయిక అభివృద్ధి పథకాన్ని ఒకదానిని తయారు చేసిందనీ, 'ఆ పథకం నిర్మాత కల్నల్ స్లాటర్ యీ ప్రాంతంలో 18 పరిశ్రమలు నెలకొల్పాలని సూచించారనీ, వాటిలో థర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రం. సిమెంటు ఫ్యాక్టరీ నెలకొల్పబడినవనీ అన్నారు. ఇంకా రూ. 75 కోట్ల ఖర్చుతో ఎరువుల ఫ్యాక్టరీకి కేంద్ర పరిశ్రమల రంగంలో శంఖుస్థాపన జరిగింది. యిప్పుడు నూలుమిల్లు ఏర్పాటు అయింది. ఇంకా రావలసిన పరిశ్రమలు; బొగ్గు ఉత్పత్తులు, సిమెంటు, ఇనుము, కొయ్య ఉత్పత్తులు. యింజనీరింగు వస్తువులు. పిండి మరలు, నూనె మిల్లులు, అద్దకం పనులు, అగ్గిపెట్టెలు. పొగాకు సిగిరెట్లు పెయింట్లు మొదలగునవి అని ఉపముఖ్యమంత్రి వివరించారు.

ఈ మిల్లుకు పెట్టుబడి ఖర్చు రూ. 78 లక్షలు, మిల్లు యిక్కడి పట్టణం కలిసి రూ. 116 లక్షలు అవుతుంది, ఈ మొత్తాన్ని కేంద్రప్రభుత్వం భరిస్తున్నది.


కరీంనగర్ జిల్లాలో పండే పత్తి, అమెరికా ఈజిప్టు దేశాల నుండి దిగుమతి చేసుకున్న పత్తివంటి నాణ్యత గలదని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. పత్తిపంట అధికం చేయడంవల్ల విదేశీ మారకద్రవ్యం మిగుల్చుకోవచ్చు, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో పండేపత్తి అంతా కొనడానికి మిల్లు సంసిద్ధంగా వుండడంవల్ల రైతులు చాలా ఉత్సాహంగా వున్నారని ఉపముఖ్యమంత్రి హర్షం వెలిబుచ్చారు. సాలుకు మిల్లుకోసం రూ. 60, 70 లక్షల విలువ గల ప్రత్తి కొంటారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ పరచుకోవాలని ఉపముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమలు నెలకొల్పి తద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి సౌకర్యాలు అదనంగా కల్పించడం అవసరమని ఆయన సూచించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రామీణ అభివృద్ధి

ఇటీవల మహబూబునగర్ జిల్లా కలక్టరు అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో గ్రామీణ అభివృద్ధి పనుల ప్రగతి గురించి జిల్లా కలక్టరు శ్రీ యం. అసదుల్లా సయ్యద్ సమీక్షచేశారు. ఈ సందర్భములో ఆయన ప్రసంగిస్తూ కేంద్రం ప్రతిపాదించిన ఉద్యోగ పథకాలు ఉత్పత్తి పథకాలవల్ల కొంతమందికి ఉద్యోగాలు దొరకడమే కాకుండా జిల్లాలో కరువు పరిస్థితులుకూడా తొలగిపోగలవని అన్నారు.

1971_71 సంవత్సరానికి రూ. 35 లక్షలు ఖర్చుగాగల పథకం మంజూరు చేయబడినదనీ, మహబూబునగరం, కొడంగల్ తాలూకాలలో మినహా మిగతా తాలూకాలలో యీ పథకం అమలు జరుగుతున్నదనీ, 1971 మార్చి ఆఖరివరకు రూ. 12.78 లక్షలు ఈ పథకంపైన ఖర్చుఅయిదనీ. తలపెట్టిన పథకంలో యింతవరకు 37 శాతం పని పూర్తిఅయినదనీ కలెక్టరు చెప్పారు.

1970_71 సంవత్సరములో 143 చిన్న నీటిపారుదల పథకాలను అమలు పర్చడానికి సంకల్పించబడినది. ఐతే ఇందులో 68 పథకాలు మాత్రమే చేపట్టడం జరిగింది. వీటిపైన 71 మార్చి వరకు రూ. 4.12 లక్షలు మాత్రమే ఖర్చుచేయ బడినాయి. 52 రోడ్ల పనులకు గాను 27 రోడ్ల పనులు పూర్తిచేయ బడినవి. వీటి



వరంగల్లులో ఒక బ్రహ్మాండమైన బహిరంగ సభలో జులై 18 వ తేదీన ముఖ్య మంత్రి ప్రసంగించారు.



జులై 12వ తేదీన నెల్లూరు జిల్లా మానె గుంట పాడులో సివిల్ సరఫరాల శాఖ మంత్రి శ్రీ ఎ. సంజీవరెడ్డి, కొత్తగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు.

పైన రూ. 6.88 లక్షలు ఖర్చు అయినాయి. భూసార పరిరక్షణ కార్యక్రమం 1691 ఎకరాలకు వర్తింప చేయబడింది. అనికూడా కలెక్టరు వెల్లడించారు.

కలెక్టరు యింకా ఇలా అన్నారు. 1971–72 సంవత్సరానికి గాను సుమారు 69 లక్షలు ఖర్చుకాగల ముసాయిదా ప్రణాళిక తయారు చేయబడింది తాత్కాలిక ప్రాతిపదికపైన ప్రథమ దశ కొరకు ప్రభుత్వం రూ. 35 లక్షలు మంజూరు చేసింది. సంబంధించిన శాఖల అవసరాన్ని బట్టి 50 శాతం ఖర్చుమేరకు ఈ డబ్బు వినియోగించ బడుతుంది పని పూర్తికాకుండా మిగిలి పోయిన 100 అభివృద్ధి పనులతో పాటు కొన్ని క్రొత్త పథకాలు కూడా ఈ ముసాయిదా ప్రణాళికలో ఉంటాయి. 8,69,150 మనిషిపని రోజులు కల్పించగల పథకాలు ఆరంభించ బడుతాయి అప్పుడే ఈ పథకాల క్రింద రూ 3.63 లక్షలు ఖర్చు చేయబడినాయి

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె కె. రెడ్డి పనుల గ్రామీణ పనుల ప్రత్యేకాధికారి శ్రీ యం మజురుద్దీన్ కూడా ఈ సమావేశానికి హాజరైనారు

భూములు లేనివారికి పట్టాల పంపిణి

ఒంగోలు జిల్లా కలెక్టరు శ్రీ కె. చంద్రయ్య వెలిగుండ్ల పంచాయతీ సమితిలోని 12 గ్రామాలలో భూములులేని బీద రైతులకు హరిజనులకు 183 పట్టాలు పంచిపెట్టారు మొత్తం 600 ఎకరాల భూమి పట్టాల క్రింద పంచబడినది

రచనలలో సాంఘిక మార్పులు ప్రతిబింబించాలి

కేంద్ర సమాచార ప్రసారశాఖా స్టేట్ మంత్రి, శ్రీమతి నందినీ శతపథి, ఒంగోలులో జరిగిన జిల్లా రచయితల సమావేశంలో ప్రసంగిస్తూ రచనలలో సాంఘిక మార్పులు ప్రతిబింబించాలనీ, సోషలిష్టు సమాజ నిర్మాణంలో రచయితలు పాల్గొనాలని సమాజంలోని లొసుగులను విమర్శించాలనీ అన్నారు

సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర కంపెనీ వ్యవహారాల స్టేట్ మంత్రి శ్రీ కె. వి. రఘునాధరెడ్డి ప్రసంగిస్తూ సాంఘిక విషయాలపై ఎక్కువ శ్రద్ధ వహించాలని అన్నారు.

అంతకుముందు ఒంగోలు మునిసిపాలిటీ కేంద్ర మంత్రులకు పౌర సన్మానం జరిపింది. ప్రముఖ ఆంధ్ర రచయితలు శ్రీ దాశరథి, డా. సి. నారాయణ రెడ్డి గార్లకు కూడా సన్మానం జరిపారు. కేంద్ర మంత్రి శ్రీమతి నందినీ శతపథి ఒంగోలు మార్గంలోని కొణకని గ్రామంలో భూమి లేనివారికి 88 ఎకరాల భూమి పట్టాలను పంపిణీ చేశారు.

కడప జిల్లాలో వ్యవసాయ క్షేత్రాల అభివృద్ధి పథకాలు

వ్యవసాయ శాఖ 1971–72 సంవత్సరంలో వ్యవసాయ అభివృద్ధికి సంబంధించి రూ. 2.25 లక్షల ఖర్చుతో ప్రత్యేక పథకాలను అమలు జరుపుతున్నది. రాయలసీమ ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా యీ ప్రత్యేక పథకాలను అమలు జరుపుతారు.

వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ వెంకటాచలం యీ పథకాల విశేషాలను గూర్చి వివరిస్తూ యీ జిల్లాలో ప్రప్రథమంగా రూ. 40,000 ల ఖర్చుతో సేద్యపు నీరు చిమ్ము పద్ధతిని అమలు జరుపుతున్నారని అన్నారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు రూ. 8,000 ల చొప్పున ఖర్చులో 10 చిమ్ముడు గొట్టాల యూనిట్లను సరఫరా చేస్తారు. తేలిక రకం అల్యూమినియం గొట్టాలను రైతుల క్షేత్రాలలో నెలకొల్పి వాటిని ఆయిల్ యింజనులకు గానీ. విద్యుచ్ఛక్తి మోటార్లకు గానీ కలుపుతారు. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా నీటిపారుదల క్రింద రైతులు తమ క్షేత్రాల రెండింతల విస్తీర్ణానికి నీటిపారుదల సౌకర్యం కల్పించగలుగుతారని ఆయన అన్నారు.



స్త్రీ సంక్షేమ, యాత్రిక శాఖల మంత్రిణి శ్రీమతి రోదామిస్త్రీ ఆదిలాబాదు జిల్లా ఇచ్చోడలో జులై 13వ తేదీన మహిళామండలికి ప్రారంభోత్సవము చేశారు.



జులై 22 వ తేదీన, నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ శీలం సిద్ధారెడ్డి నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ తాలూకాలోని చింత్రియాల మేజర్ కెనాల్‌లోకి నీరు విడుదలచేశారు.

చింత్రియాల మేజరు కాలువకు ప్రారంభోత్సవం

నీటిపారుదల శాఖామంత్రి. శ్రీ ఎన్. సిద్ధారెడ్డి హుజూరు నగర్ (నల్లగొండ జిల్లా) సమీపంలో—చింత్రియాల మేజరు కాలువకు నీరు విడుదల చేయడం ద్వారా ప్రారంభోత్సవం చేశారు. ఈ కాలువ ద్వారా నాగార్జున సాగర్ ఆయకట్టు ఎగువలోని 25,700 ఎకరాల బీడు భూమికి నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. సమాచార శాఖా మంత్రి శ్రీ అక్కిరాజు వాసుదేవరావు ఈ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మేళ్లచెర్వు గ్రామంలో జరిగిన బహిరంగ సభలో శ్రీ సిద్ధారెడ్డి ప్రసంగిస్తూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి యింతవరకు రూ. 170 కోట్లు ఖర్చు చేశారనీ నిర్మాణం పూర్తిచేయడానికి మరో రూ. 60 కోట్లు అవసరమవుతాయనీ అన్నారు. రూ. 220 కోట్ల ఖర్చుతో నిర్మించ బడుతున్న ప్రపంచంలోని బృహత్తరమైన యీ ప్రాజెక్టు ద్వారా 30 లక్షల ఎకరాలకు పైగా భూమికి నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. ఆహార స్వయం సమృద్ధి సాధనలో ఆంధ్రప్రదేశ్ లోనేగాక యావద్భారత దేశంలోనే యీ ప్రాజెక్టు అత్యంత ప్రాముఖ్యత వహించింది.

సమాచార శాఖామంత్రి శ్రీ వాసుదేవరావు ప్రసంగిస్తూ హుజూరు నగర్ భూమి తనఖా బ్యాంకు దీర్ఘకాలిక ఋణాలుగా రూ. 2.5 కోట్లు పంపిణీ చేసిందని అన్నారు. ప్రభుత్వ సహాయాన్ని పూర్తిగా వినియోగించుకుని ఆయకట్టును అభివృద్ధి పరుస్తూ తద్వారా అధికోత్పత్తికి కృషి చేయాలని రైతులను కోరారు.

ఈ కాలువ క్రింద 843 పంట కాలువలు ఉన్నాయి. వాటి పొడవు మొత్తం 400 మైళ్లు ఉంటుంది. హుజూరునగర్ తాలూకా లోని 18 గ్రామాలలో 25,700 ఎకరాలకు దీని ద్వారా నీటిపారుదల సౌకర్యం లభిస్తుంది.


నాగార్జున సాగర్ ప్రత్యేక కలక్టరు శ్రీ లక్ష్మారెడ్డి కాలువ చీఫ్ ఇంజనీరు శ్రీ టి. సి. కృష్ణారావు ప్రసంగించారు.

నిడదవోలులో చింతపండు పరిశ్రమ

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి రాష్ట్రంలో రోజు కొక పరిశ్రమ కాక రోజుకు రెండు పరిశ్రమలు స్థాపించే విశ్వయము లో అత్యంత శ్రద్ధ వహిస్తున్నారు. జులై 7వ తేదీన ఆయన పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో రెండు పరిశ్రమలకు ప్రారంభోత్సవం జరిపారు.

నిడదవోలుకు ఆరు మైళ్లదూరంలో తాడిమళ్ళ అనే గ్రామం వద్ద రూఫింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ అనే సంస్థ ఒకటి ఏర్పాటు చేయబడింది. ఇంటి పై కప్పులకు ఉపయోగపడే కర్రుగేటెడ్ షీట్లను ఇది ఉత్పత్తి చేస్తుంది. ఈ షీట్లు అస్ఫాల్టిక్‌తో తయారు చేయబడుతాయి. మెక్సికో దేశంలో ఇవి మొట్టమొదట రూపొందించబడినాయి. వీటి వాడకం ఇప్పుడు అనేక దక్షిణ అమెరికా దేశాలలో బహుప్రచారంలో వుంది. మన దేశం వంటి ఉష్ణదేశాలలో కూడా దీనిని లాభసాటిగా ఉపయోగించవచ్చు.

కాగితంముక్కలు. పేవింగ్ అస్ఫాల్ట్ అనే ముడి పదార్థాలతో ఈ షీట్లు తయారుచేయబడుతాయి. వీటిపైన అల్యూమినియం రంగు పూసినట్లయితే ఇవి చూడడానికి ఆకర్షణీయంగా వుంటాయి. ఈ ఫ్యాక్టరీలో రోజుకు 60 మంది పనిచేయడానికి



నెల్లూరు జిల్లా, సుళ్లూరుపేట పంచాయతీ సమితి ప్రథమ సమ్మేళనానికి జులై 13 వ తేదీన ముఖ్య మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

అవకాశం వుంది. పరోక్షంగా మరొక వెయ్యి మందికి పనులు లభిస్తాయి. మద్రాసులోని పారిశ్రామిక సాంకేతిక సేవా సంస్థ వారి సాంకేతిక సహకారంతో రూ. 14.5 లక్షల పెట్టుబడితో తాడిమళ్ళలో ఈ ఫ్యాక్టరీ నెలకొల్పబడింది. సైజు, మందం తూకం, చాలాకాలం మన్నిక విషయాలలో సాంకేతజ్ఞుల సలహా ప్రకారం అస్ఫాల్టిక్‌షీట్లు ఉత్పత్తి చేయబడుతాయి.

గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగ సమస్యను నివారించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ లఘుపరిశ్రమల అభివృద్ధి సంస్థ ఇస్తున్న ఆర్థిక సహాయంతో ఈ రెండు పరిశ్రమలు ఏర్పాటు చేయబడుతున్నాయి. ఉజ్వల భవిష్యత్తుకు ఇటువంటి ఫ్యాక్టరీలు నెలకొల్పబడడం గ్రామీణ నిరుద్యోగులకు ఆశాకిరణాల వంటివి.


అప్పర్ ప్రాథమిక పాఠశాలకు ప్రారంభోత్సవం

రివిన్యూ శాఖామంత్రి, శ్రీ పి. తిమ్మారెడ్డి, జూలై 4వ తేదీన అనంతరాజుపేటలో అప్పర్ ప్రాథమిక పాఠశాలకు ప్రారంభోత్సవంచేస్తూ ప్రభుత్వం ఉచిత విద్యా సౌకర్యాన్ని కల్పించడానికి పాఠశాలలలోని ప్రతి పిల్లవానికి రూ. 15 నుండి రూ. 20ల చొప్పున ఖర్చు చేస్తున్నవనీ, యీ డబ్బునంతా పిల్లల తల్లిదండ్రుల నుండి పన్నుల రూపంలో వసూలు చేసినదేననే సత్యాన్ని గ్రహించాలనీ, తమ పిల్లల భవిష్యత్తు విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ వహించని తీరున విద్యపై చేస్తున్న ఖర్చు అంతా వృధా అవుతుందని అన్నారు.


తమ అలవాట్లు, నడవడిక విషయంలో విద్యార్థులకు మార్గదర్శకం కావాలని మంత్రి ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

శ్రీ పి. పట్టాభిరామిరెడ్డి యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

ప్రజలు విరాళంగా యిచ్చిన రూ. 1,116 లను మంత్రి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ చెంగయ్యకు సమర్పించారు.



ఏలూరులో జులై 16వ తేదీన ఉపముఖ్య మంత్రి శ్రీ జె. వి. నరసింగ రావు వ్యాపారస్థుల సంస్థ కల్యాణ మందిరానికి శంఖు స్థాపనచేశారు.



జూన్ 27 వ తేదీన చిట్యాల పాలశీతల కేంద్రం ప్రారంభోత్సవ సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య ప్రసంగించారు.

చిట్యాలలో పాలశీతల కేంద్రానికి ప్రారంభోత్సవం


వ్యవసాయ శాఖామంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం జూన్ 27 వ తేదీన నల్లగొండ తాలూకాలోని చిట్యాలలో 2,000 లీటర్ల ఉత్పత్తి శక్తిగల పాల శీతల కేంద్రానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ సమాజంలో బలహీన వర్గాలకు, హరిజనుల ప్రగతికై ప్రభుత్వం అనేక విధాలుగా కృషిచేస్తున్నదని చెప్పారు. నల్లగొండ జిల్లాలో చిన్నకారు రైతుల అభివృద్ధి పథకం అమలు పర్చబడింది. నాల్గవ ప్రణాళికలో ఈ పథకంపైన రూ. 1.50 కోట్లు ఖర్చుపెట్టబడుతుంది. ప్రభుత్వ పాల శాఖ వారు గత రెండేండ్లలో సాధించిన కృషి ప్రశంసనీయమైనది. యిప్పుడు దాదాపు అన్ని జిల్లాలలో ఒక పాలశీతల కేంద్రమున్నదని మంత్రి చెప్పారు.

ఈ సందర్భములో ఏర్పాటైన సభలో చిన్న నీటిపారుదల శాఖామంత్రి శ్రీ వి. పురుషోత్తమరెడ్డి ప్రసంగిస్తూ నల్లగొండ జిల్లాలో మరొక మూడు పాలశీతల కేంద్రాలను నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. చిట్యాలలో దాణామిశ్రమ యంత్రాన్ని స్థాపించడానికి స్థానిక వ్యాపారవర్గం ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

జిల్లా కలెక్టరు ప్రసంగిస్తూ నల్లగొండ జిల్లాకు పశుగణాభివృద్ధి పథకాన్ని మంజూరు చేయవలసిందని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

పెద్దవాగు వంతెనకు ప్రారంభోత్సవం

నీటి పారుదల శాఖామంత్రి శ్రీ ఎస్. సిద్ధారెడ్డి యిటీవల గోదావరి దక్షిణకాలువపైన పెద్దవాగు వంతెనకు ప్రారంభోత్సవం జరిపారు. ఇది 74 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించబడింది. దీని నిర్మాణం $2\frac{1}{2}$ సంవత్సరములలో పూర్తి అయింది. ఆంధ్రప్రదేశ్ కాంగెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పి. నర్సారెడ్డి యీ ఉత్సవానికి



జులై 18వ తేదీన నల్లగొండ జిల్లా సూర్యాపేటలో పాలశీతల కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి శంఖుస్థాపనచేశారు.

అధ్యక్షత వహించారు. ఛీఫ్ యింజనీరు శ్రీ పి. తిరుపతిరెడ్డి యీ సందర్భంలో ప్రసంగిస్తూ రైతులు నీటిపారుదల పద్ధతికి నష్టం కల్గించరాదని విజ్ఞప్తి చేశారు. సకాలంలో తగిన ప్రమాణంలో జలాలు విడుదల కాగలవని అయన హామీయిచ్చారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ. 30 కోట్లు ఋణం సేకరించడానికి చర్యలు జరుగుతున్నాయనీ ఋణం లభించిన తర్వాత పోచంపాడు ప్రాజెక్టు పూర్తి కాగలదని ఆయన చెప్పారు.

ఖమ్మంలో సంక్షేమ సంస్థ భవనానికి శంఖుస్థాపన

మహిళా సంక్షేమం, యాత్రా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ, జూలై 3వ తేదీన ఖమ్మంలోని మామిళ్ల గూడెం ప్రాంతంలో బాలవాడికి శంఖుస్థాపన చేశారు. దాని నిర్మాణానికి రూ. 17,000లు ఖర్చు అవుతుందని అంచనా. జిల్లా కలెక్టరు సతీమణి శ్రీమతి ప్రేమ పార్థసారథి యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

నరసింహస్వామి దేవాలయం సమీపంలో రూ. 60,000ల ఖర్చుతో నిర్మించబడే బాలల గృహానికి కూడా మంత్రి ప్రారంభోత్సవం చేశారు. జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. పార్థసారథి యీ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఆ తర్వాత నయాబజారు ఉన్నత పాఠశాల సమీపంలో రూ. 25,000లతో నిర్మించబడే ఓనోటిఫైయిడ్ గిరిజనుల హాస్టల్ భవనానికి కూడ ఆమె శంఖుస్థాపన చేశారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఆర్. భువనసుందరరెడ్డి యీ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఆ తర్వాత మంత్రి ఖమ్మంలోని మహిళల సంక్షేమ సంస్థలను తనిఖీచేశారు.

హరిజన గృహాలకు ప్రారంభోత్సవం


హోం శాఖామంత్రి శ్రీ జె. వెంగళరావు, జూన్ 29వ తేదీన శ్రీకాకుళంజిల్లా కోటబొమ్మలి పంచాయతీ సమితిలోని జార్‌గంజీలో హరిజన గృహాల కాలనీకి ప్రారంభోత్సవంచేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ప్రసంగిస్తూ హరిజనులు, గిరిజనులు, సమాజంలోని యితర బడుగు వర్గాల సంక్షేమానికి కృషిచేయడానికి ప్రభుత్వం కట్టుబడిఉందని అన్నారు. బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు జరుపుతున్న వివిధ పథకాల విషయంలో ప్రజలు తమ పూర్తి సహాయ సహకారాలను అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు సమితి అధ్యక్షుడు శ్రీ ఆర్. సత్యనారాయణ మంత్రికి స్వాగతం చెబుతూ కాలనీలో నిర్మించబడిన 18 గృహాలలో ఒక్కొక్కదానికి రూ. 900 వందలు ఖర్చు అయినాయని, దానిలో ప్రభుత్వం రూ. 600లు గ్రాంటుగా యిచ్చిందనీ పంచాయతీ సమితి రూ. 150లు గ్రాంటుగాను మరో రూ. 150లు ఋణంగాను యిచ్చిందని అన్నారు.


నెల్లూరులో ప్రత్తి ఉత్పత్తిదార్ల సమావేశం

నెల్లూరులో యిటీవల నెల్లూరు జిల్లా ప్రత్తి ఉత్పత్తిదార్ల మహాసభ జరిగింది. జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎం. గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. బుచ్చిరెడ్డిపాలెం పంచాయతీ సమితి అధ్యక్షుడు, శ్రీ ఎం. బాలకృష్ణారెడ్డి ప్రత్తి ఉత్పత్తిదార్లకు స్వాగతం చెబుతూ ప్రస్తుతం ఉత్పత్తి వినియోగంలో ఉన్న వ్యత్యాసం దృష్ట్యా ప్రత్తిని అధికంగా ఉత్పతి చేయాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కిచెప్పారు.

శ్రీ ఎం. గోపాలకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ జిల్లాలో ప్రత్తి సేద్యం గూర్చి విపులంగా చర్చజరగాలని సూచించారు.



వరంగల్లు పర్యటనలో ముఖ్య మంత్రి జులై 18వ తేదీన వ్యాయామ శాలకు ప్రారంభోత్సవంచేశారు.




జూలై 13వ తేదీన ముఖ్యమంత్రి శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని సందర్శించారు.

కరీంనగర్‌లో వృత్తికళాకారుల వర్క్‌షాపుకు టూరిజం మంత్రి ప్రశంస

మహిళా సంక్షేమం, యాత్రిక వ్యవహారాల శాఖామంత్రి, శ్రీమతి రోడామిస్త్రీ యిటీవల కరీంనగర్ జిల్లా, మల్యాల సమితి లోని కొడిమియాల్‌లో ఇత్తడి పనివారల సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. ఆమె వర్క్‌షాపును, విక్రియ శాలను కూడా చూచారు. విక్రియశాలలో ఇత్తడి సామాగ్రిని, వస్తువులను పరిశీలించారు. సభ్యుల పనితనాన్ని ప్రశంసించారు.

గృహ నిర్మాణానికి సహాయం

ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు యిటీవల ఆదిలా బాదు జిల్లాలోని లక్సెట్టిపేట పంచాయతీ సమితిని సందర్శించినపుడు చింతగూడా, రోటిగూడా గ్రామాలలోని 115 మంది హరిజనులకు యిండ్ల నిర్మాణం కొరకు ఒక్కొక్కరికి రూ. 100లు చొప్పున



గుంటూరు జిల్లా గడ్డిపాడులో జూన్ 23వ తేదీన ఉపముఖ్యమంత్రి హరిజనుల రోటరీనగర్‌కు ప్రారంభోత్సవంచేశారు.

రూ. 11,500లు పంపిణీ చేశారు. లోగడ రెవెన్యూశాఖ, పంచాయతీ సమితి అధికారులు యీ హరిజనులకు యిండ్ల స్థలాలను కేటాయించారు. కేటాయించిన స్థలాలలో యిండ్లు నిర్మించుకో వలసిందని ఉపముఖ్యమంత్రి హరిజనులకు సలహా యిచ్చారు.

కృష్ణనీటిని సద్వినియోగ పర్చాల్సిన ఆవశ్యకత

కలకత్తాకు చెందిన అమృతబజార్ పత్రిక సంపాదకులు శ్రీ తుషార్‌కాంతి ఘోష్, జూన్ 20వ తేదీన నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టును గూర్చి ప్రస్తావిస్తూ "ఇది అద్భుతమైన ప్రాజెక్టు" అని వర్ణించారు. తూములద్వారా ప్రవహిస్తున్ననీరు నయనానందకరంగా ఉంటుందని ఆయనఅన్నారు.

కృష్ణ నీటి వనరులను గరిష్ఠ పరిమితిలో వినియోగించు కుంటూ నదికి యిరువైపుల ఉన్న భూములను సస్యశ్యామలం చేయ డానికి యితోధికంగా కృషి జరగాలని ఆయన అభిప్రాయ పడినారు.

హరిజన ఇండ్ల కాలనీకి ప్రారంభోత్సవం


హోంశాఖామంత్రి శ్రీ జె. వెంగళరావు, జూన్ 30వ తేదీన పార్వతీపురంలో, నరసీపురం హరిజన గృహాల కాలనీకి ప్రారంభోత్సవంచేస్తూ హరిజనులకు యిండ్లస్థలాల కేటాయింపు, యితర సంక్షేమ పథకాల నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్నదని, హరిజనులు యీ సదవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని అన్నారు.

హరిజన సంక్షేమ నిధులను సద్వినియోగం చేయాలని అధికార అనధికారులను మంత్రి ఉద్బోధించారు.

పంచాయతీఘర్‌కు ప్రారంభోత్సవం

హోంశాఖామంత్రి శ్రీ జె. వెంగళరావు శ్రీకాకుళం జిల్లా రణస్థలం పంచాయతీ సమితిలోని తాళ్ళవలస గ్రామములో యిటీవల పంచాయతీ ఘర్‌కు ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఏర్పాటయిన సభకు లోక్‌సభ సభ్యులు శ్రీ కె. నారాయణరావు అధ్యక్షత వహించారు. హోంమంత్రి ప్రసంగిస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విషయంలో పంచాయతీరాజ్‌సంస్థలు అత్యంత కీలకపాత్ర వహిస్తున్నవని చెప్పారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ జి. శ్రీరాములునాయుడు ప్రసంగిస్తూ పంచాయతీ ఘర్‌ను సత్వరంగా నిర్మించిన యింజనీరు సిబ్బందిని అభినందించారు. సమితి అధ్యక్షులు శ్రీ జి. సూర్యనారాయణ నాయుడు అతిథులకు స్వాగతం చెప్పారు. అంతకుముందు హోంమంత్రి వడ్రాజుల గ్రామంలో గిరిజన కాలనీని సందర్శించారు. గిరిజనుల సంక్షేమాభివృద్ధికై కృషి చేస్తున్న అధికారులతో సహకరించవల సిందని ఆయన గిరిజనులకు విజ్ఞప్తి చేశారు.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISIM ANDHRA PRADESH, HYDERABAD
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD




Reg. No. H. 133